

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 313

గురువారం 27-7-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



వరల్డ్‌కప్ దిశగా సన్నాహకం..

నేడు భారత్, వెస్టిండీస్ తొలి వన్డే..
జోరుమీదున్న టీమిండియా - 12లో



రిలయన్స్ రిటైల్‌లో భారీ పెట్టుబడి

రూ.8,200 కోట్ల విలువైన వాటా
కొనుగోలుకు 'ఖతార్' ఆసక్తి - 13లో



భారత మండపం రెడీ

జీ–20 సదస్సు కోసం ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో ఆధునికీకరించిన ఐఈసీసీ (భారత మండపం)ను ప్రధాని మోదీ ప్రారంభించారు.

వివరాలు 6లో ▸



అవసరమైతే గీత దాటతాం

భారత్ తన గౌరవ ప్రతిష్టలను కాపాడుకోవడానికి నియంత్రణ రేఖను దాటేందుకు సిద్ధంగా ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ అన్నారు.

వివరాలు 6లో ▸



ఈడీ డైరెక్టర్‌ను కొనసాగిస్తాం

ఈడీ డైరెక్టర్ సంజయ్‌కుమార్ మిశ్రా పదవీ కాలాన్ని అక్టోబర్ 15 వరకు పొడిగించేందుకు కేంద్రం సుప్రీంకోర్టు అనుమతి కోరింది.

వివరాలు 6లో ▸



నెదర్లాండ్స్ నౌకలో అగ్ని ప్రమాదం

నెదర్లాండ్స్‌లోని ఉత్తర సముద్రంలో సరుకు రవాణా చేసే ఒక నౌకలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. 3 వేల కార్లు దగ్ధమయ్యాయి.

వివరాలు 6లో ▸

ఏది నిజం?



తెస్తున్నా ఏడుపేనా?

- రూ.పది వేల కోట్లకుపైగా రెవెన్యూ లోటు నిధులను రాబట్టింది ఎవరు?
- చేతులెత్తేసిన చంద్రబాబు.. ఉడుంపట్టుతో కేంద్రం నుంచి సాధించిన సీఎం జగన్
- పోలవరం తొలి దశకు రూ.12,911.15 కోట్లు మంజూరుకు కేంద్రం ఓకే
- 2013–14 ధరలను పక్కన పెట్టి తాజా ధరల మేరకు నిధులిచ్చేందుకు గ్రీన్ సిగ్నల్
- రాష్ట్ర విభజన హామీలపై ఈనాడు వక్రభాష్యం

4లో

రాష్ట్రమంతా కుండపోత

విస్తారంగా కురుస్తున్న వర్షాలు

శ్రీకాకుళం నుంచి గుంటూరు వరకు ఎడతెరిపి లేకుండా వాన

- ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో తీవ్రం
- శ్రీకాకుళం జిల్లా తామాడలో అత్యధికంగా 21.8 సెంటీమీటర్ల వర్షం
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం
- విశాఖలో కోతకు గురైన ఆర్కే బీచ్
- కొనసాగుతున్న బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడన ప్రభావం
- నేటి వరకు 10 జిల్లాలకు రెడ్ అలర్ట్
- మరో 3 రోజులు వర్షాలు.. సహాయక చర్యలకు ఎస్డీఆర్ఎఫ్ సన్నద్ధం



ఏలూరు జిల్లా ఏపులపాడు సమీపంలో రహదారి మీదుగా ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

సాక్షి, అమరావతి/సాక్షి, నెట్‌వర్క్: కుండపోత వర్షాలతో రాష్ట్రం తడిసి ముద్దయింది. ప్రధానంగా కోస్తా జిల్లాల్లో ఆకాశానికి చిల్లు పడినట్లు ఎడతెగని వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. మిగిలిన జిల్లాల్లోనూ విస్తారంగా వానలు పడుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి తీవ్ర అల్పపీడనంగా మారడంతో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇది వాయుగుండంగా మారే అవకాశం ఉందని మొదట భావించినా తీవ్ర అల్పపీడనంగా కొనసాగుతోంది. అయినా దీని ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా సగటున 2.8 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఉత్తరాంధ్ర, గోదావరి, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ప్రజలు బయటకు వెళ్లే అవకాశం లేకుండా వర్షాలు పడుతున్నాయి. ఏలూరు జిల్లా వ్యాప్తంగా బుధవారం

మిగతా 3వ పేజీలో ▶

అవిశ్వాసానికి అనుమతి

- చర్చకు సమయం ప్రకటిస్తానని స్పీకర్ ఓంబిర్లా ప్రకటన
- కేంద్రంపై అవిశ్వాస తీర్మాన నోటీసులిచ్చిన కాంగ్రెస్, బీఆర్ఎస్
- బీఆర్ఎస్ అవిశ్వాస తీర్మానంపై సంతకం చేసిన ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ.. మణిపూర్ అంశంపై కొనసాగిన ఆందోళనలు
- ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఎంపీలకు విప్ జారీ



- వివరాలు 6లో

మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండ



- వివరాలు 6లో

మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతోంది. అల్లరిమూకలు దాదాపు 30 ఇళ్లు, దుకాణాలను తగులబెట్టారు. పలుచోట్ల బస్సులకు నిప్పుపెట్టారు. అల్లరి మూకను అదుపు చేయడానికి భద్రతా దళాలు కాల్పులు జరిపాయి. మరోవైపు సహాయక శిబిరాల్లో ఉంటున్న వారి కోసం తాత్కాలిక ఇళ్ల నిర్మాణం పూర్తి కావస్తోందని సీఎం బైరన్ సింగ్ చెప్పారు. త్వరలోనే వారందరినీ అక్కడికి తరలిస్తామని తెలిపారు.



అర్హతే ప్రామాణికంగా విద్యుత్ సబ్సిడీ

14లో


అబద్ధాన్ని ప్రచారం చేస్తే నిజమైపోతుందనే భ్రమలో ఉన్న ఈనాడు 'ఎస్సీ, ఎస్టీల బతుకుల్లో కారు చీకట్లు' అంటూ అసత్య కథనాన్ని అచ్చేసింది. కానీ జగన్ పాలనలోనే ఎస్సీ, ఎస్టీల జీవితాల్లో విద్యుత్ వెలుగులు ప్రసరిస్తున్నాయని డిస్కంలు పేర్కొన్నాయి.



మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ

6లో

వరుసగా మూడోసారి కూడా ప్రధానమంత్రి పదవిని చేపడతానని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు తన పాలనలో మెరుగైన వృద్ధిరేటుతో భారతదేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని చెప్పారు.



క్యాన్సర్ బాధితులకు 'ఆరోగ్యసిరులు'

2లో

క్యాన్సర్ బారినపడిన పేద, మధ్యతరగతి ప్రజలకు ఆరోగ్యశ్రీ కొండంత అండగా ఉంటోంది. 2019 నుంచి ఇప్పటివరకు 2.64 లక్షల మంది బాధితులకు జగన్ ప్రభుత్వం ఈ పథకం ద్వారా ఉచితంగా చికిత్స అందించింది. ఇందుకోసం రూ.1,801 కోట్లు ఖర్చుచేసింది.

నకిలీలకు 'అగ్రి' పరీక్ష

కల్తీ, నాసిరకం విత్తనాలు, ఎరువులకు చెక్

- వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లలో పరీక్షలు
- నాణ్యత లేదని తేలితే విత్తన కంపెనీలపై కేసులు
- ఫలితాలు తారుమారు కాకుండా ల్యాబ్‌లో ఆటో మిషన్



సత్తెనపల్లిలోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్

సత్తెనపల్లి: విత్తనం మంచిదైతే పంట బాగా పండుతుంది. దిగుబడికి దిగులుండదు. ధరలు అనుకూలిస్తే రైతులకు తిరుగుండదు. అంతా సవ్యంగా జరగాలంటే సాగుకు మేలు రకం విత్తనాలు కావాలి. అందుకే రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లాలో నియోజకవర్గానికి ఒక సమగ్ర వ్యవసాయ పరీక్ష కేంద్రం (వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్) మంజూరు చేశారు. జిల్లాలోని నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, పెదకూరపాడు నియోజక వర్గంలోని క్రోసూరు, గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్లలో ఇప్పటికే ల్యాబ్‌లు ప్రారంభమయ్యాయి. తాజాగా సత్తెనపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వెనుక రూ.97.36 లక్షలతో నిర్మించిన ల్యాబ్‌తోపాటు, మాచర్లలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.107.66 లక్షలతో నిర్మించిన ల్యాబ్‌లను మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఈ నెల 8న ప్రారంభించారు. ఇవి రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఈ ల్యాబ్‌లలో పైసా ఖర్చు లేకుండానే ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల నమూనాలను పరీక్షిస్తున్నారు. నాణ్యమైనవి కావా అనేది తేల్చేస్తున్నారు.

టెస్టింగ్ ప్రక్రియ ఇలా..

ఎరువులు, పురుగు మందులు, విత్తనాల నాణ్యత పరీక్షలను పారదర్శకంగా చేపట్టేందుకు అమరావతిలో ప్రభుత్వం ప్రాంతీయ కోడింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ లక్ష్యాల మేరకు వ్యవసాయ అధికారులు ఎరువులు, విత్తనాల దుకాణాల్లో శాంపిల్స్ సేకరించి ప్రత్యేక యాప్ ద్వారా బ్యాచ్ నంబర్ కోడింగ్ చేసి రీజినల్ సెంటర్లకు పంపిస్తారు. ఆ శాంపిల్స్‌ను రీజినల్ సెంటర్ల నుంచి ఆయా నియోజక వర్గాల్లోని అగ్రి ల్యాబ్‌లకు పంపి పరీక్షలు చేయిస్తారు. విత్తనాల మొలక శాతం, తేమ శాతం, విత్తన నాణ్యత ప్రమాణాలు పరిణాలమాలపై పరీక్షలు నిర్వహించి నివేదికలు ఇస్తారు. నకిలీలని తేలితే సంబంధిత షాపులు, విత్తన కంపెనీలపై చర్యలకు సిఫార్సు చేస్తారు. కేసు నమోదు చేయించి కోర్టులో నిలబెడతారు. ఎరువులు, విత్తనాలు, మందులు నకిలీలని తేలితే రీ–అనాలసిస్ (తిరిగి పరీక్ష) చేసేందుకు షాపులో ఉన్న సరకు సీజ్ చేస్తారు. కేసు పెట్టి జాయింట్ కలెక్టర్ కోర్టుకు హాజరు పరుస్తారు. నకిలీల ఆట కట్టిస్తారు.

అగ్రి ల్యాబ్‌లో చేసే పరీక్షలు ..

విత్తన మొలక, తేమ శాతం, విత్తనం స్వచ్ఛత పరీక్ష, యూరియా, నత్రజని, భాస్వరం, పొటాష్, జింక్, బోరాన్, సల్ఫేట్, సింగిల్ సూపర్ పాస్ఫేట్ (ఎస్ఎస్‌పి), డై అమ్మోనియం ఫాస్ఫేట్ (డీఏపీ) కాంప్లెక్ ఎరువుల పరీక్షలు చేస్తారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



నాణ్యత ప్రమాణాలతో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించడమే వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ప్రధాన ఉద్దేశం. న విత్తనం కొన్న రైతు అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించి అగ్రి ల్యాబ్లో విత్తన పరీక్ష చేయించుకోవాలి. విత్తన పరీక్షలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా కోడింగ్ పద్ధతిన పరీక్ష చేస్తారు. అగ్రి ల్యాబ్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎస్.శ్రీధర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు, సత్తెనపల్లి

రైతులకు పరీక్షలు ఉచితం ..

రైతులు విత్తుకు ముందు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులపై అనుమానం ఉంటే అగ్రి ల్యాబ్‌కు వెళ్లి ఉచితంగా పరీక్ష చేయించుకోవచ్చు. ఇందుకు వ్యవసాయ అధికారులు సహకరిస్తారు. కంపెనీలు, ప్రైవేటు డీలర్లు పరీక్ష చేయించుకోవాలంటే మాత్రం ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించాల్సి ఉంటుంది. సీడ్, కెమికల్ ఫెర్టిలైజర్, బయో, ఆర్గానిక్ ఫర్టి లైజర్ పరీక్షల కోసం రూ.1000 నుంచి రూ.3,500 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం రైతులకు సమీపంలోనే ల్యాబ్‌లు అందుబాటులోకి రావడం, అధునాతన సాంకేతికతతో పరీక్షలు నిర్వహిస్తుండడంతో కర్షకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అగ్రిల్యాబ్‌లకు ఇన్‌చార్జ్‌గా వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) ఉంటారు. ఇద్దరు ఏఓలు, ఒక ల్యాబ్ టెక్నీషియన్ పరీక్షలు నిర్వహిస్తారు. ల్యాబ్‌లో నమూనా పరీక్ష కోసం ప్రత్యేకంగా ఆటోమేటెడ్ క్వాలిటీ కంట్రోల్ యాప్ అందుబాటులో ఉంచారు. ఫలితాలు తారుమారు కాకుండా వీల్లేని రీతిలో ల్యాబ్‌లో ఆటోమేషన్ ఏర్పాటు చేశారు. టెస్టింగ్ చేసిన ప్రతి ఒక్కటి రికార్డు కావడంతోపాటు వాటంతట అవే సిస్టంలో నమోదవుతాయి.



వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ లోపల ఏర్పాట్లు

గౌతమిపై మరో మణిహారం

- రోడ్డువంతెనకు కసరత్తు
- కోటిపల్లి–ముక్తేశ్వరం రోడ్డు వంతెన
- ఉమ్మడి 'తూర్పు' మధ్య అనుసంధానం
- తగ్గనున్న దూరాభారం
- రూ.750 కోట్లతో ప్రతిపాదనలు
- కేంద్రానికి లేఖ రాసిన సీఎం జగన్



సాక్షిప్రతినిధి, కాకినాడ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజల మధ్య దూరాభారాన్ని తగ్గించే ఒక బృహత్తర ప్రాజెక్టు మొగ్గ తొడిగింది. కోనసీమ, కాకినాడ జిల్లాల ప్రజల మూడు దశాబ్దాల కల ఇది. కోట్ల విజయభాస్కరరెడ్డి సీఎంగా ఉండగా అప్పటి జిల్లా మంత్రి దివంగత కుడుపూడి ప్రభాకరరావు ప్రయత్నం చేశారు. ఇన్నేళ్ల తరువాత నాటి ప్రతిపాదన మరోసారి తెరపైకి రావడంతో ఉమ్మడి జిల్లాల ప్రజల్లో ఆశలు చిగురించాయి. కోటిపల్లి–ముక్తేశ్వరం మధ్య గౌతమి గోదావరిపై ప్రజలు, వాహన రాకపోకలకు అనువైన వంతెన నిర్మించాలనేది ఏనాటి నుంచో పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదన. తాజాగా మన ప్రజాప్రతినిధులు ఈ వంతెన నిర్మాణం కోసం రూ.750 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధంచేసి కేంద్ర స్థాయిలో ప్రయత్నిస్తున్నారు.

ఎంపీలు.. మంత్రులు సమన్వయ కృషి

తీర ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగుపర్చాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ బృహత్తర ప్రాజెక్టు పట్టాలెక్కించాలనే ప్రయత్నం రూపుదాల్చింది. ఇటువంటి భారీ ప్రాజెక్టులకు ఉదేశించిన 'కేంద్ర గతిశక్తి పథకం'లో ఈ ప్రాజెక్టు సాకారం చేసుకోవాలనే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దీనిపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న ముగ్గురు ఎంపీలు పిల్లి సుభాష్‌చంద్రబోస్, చింతా అనురాధ, వంగా గీతవి గట్టి పట్టుదలతో ఉన్నారు. ప్రాజెక్టు ఆవశ్యకత,కలిగే ప్రయోజనాలను పలు సందర్భాల్లో మన ఎంపీలు, మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఇటీవల వేర్వేరు సందర్భాల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. కోటిపల్లి–నరసాపురం రైల్వే లైన్ నిర్మాణం జరుగుతున్నా అంతకు మించిన ప్రయోజనం ఈ రోడ్డు వంతెన వల్ల కలుగుతుందని వివరించారు. ప్రాజెక్టు ప్రతిపాదనలను పరిశీలించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. తగిన సహాయ, సహకారాలు అందించాలంటూ కేంద్రప్రభుత్వానికి ఇటీవల సీఎం లేఖ కూడా రాశారు.

నితిన్‌తో భేటీ

ముగ్గురు ఎంపీలు ఇప్పటికే రెండు దఫాలు ఢిల్లీలో కేంద్ర రవాణా శాఖా మంత్రి నితిన్‌గడ్కరీని కలిసి వంతెన ప్రాధాన్యతను వివరించారు. కేంద్ర గతిశక్తి పథకం ద్వారా చేపట్టేందుకు అవకాశం ఉందని కేంద్ర మంత్రి మన ఎంపీలకు వివరించారు. ఈ పథకంలో చోటు కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టికి తీసుకువెళ్లాలని ఎంపీలకు గడ్కరీ సూచించారు. ఈ క్రమంలో ప్రాజెక్టు ప్రతిపాదనలను ప్రధాన మంత్రికి వివరించేందుకు ఆయన అపాయింట్‌మెంట్ కోరినట్లు ఎంపీలు 'సాక్షి'కి తెలియచేశారు.

మధ్య గౌతమి నది పొడవు 3.5 కిలోమీటర్లు. కాకినాడ, డాక్టర్ బీఆర్అంబేడ్కర్ కోనసీమ జిల్లాల మధ్య ఉన్న గౌతమినదిపై ప్రాణాలు అరచేతపట్టుకుని కోటిపల్లి రేవుపై పంటు దాటాల్సిందే. గౌతమి మీదుగా రూ.2893 కోట్లతో నరసాపురం వరకు రైల్వే లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇది పూర్తి అయినా నేరుగా రెండు జిల్లాల మధ్య ప్రజలు, వాహనాలు రాకపోకలకు అవకాశం దక్కదు. ఈ నేపథ్యంలో గౌతమిపై రోడ్డు వంతెన నిర్మించడానికి జరుగుతోన్న ప్రయత్నాల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

కలిసొచ్చే దూరం.. కాలం



కాకినాడ నుండి అమలాపురానికి యానాం, ఎదుర్లంక, ముమ్మిడివరం మీదుగా వెళ్లాలి. బస్సు, వ్యక్తిగత వాహనాల్లో 65 కిలోమీటర్లు రెండు గంటల ప్రయాణించాలి. అదే కాకినాడ–రామచంద్రాపురం రోడ్డులో పెనుగుదురు నుంచి గొర్రిపూడి, గొల్లపాలెం, ద్రాక్షారామ, కె.గంగవరం ప్రధాన గ్రామాలు మీదుగా కోటిపల్లి 30 కిలోమీటర్లు. కోటిపల్లి రేవు నుంచి అమలాపురం నల్లవంతెనకు 10 కిలోమీటర్లు దూరం. ఈ వంతెన సాకారమైతే 25 కిలోమీటర్లు దూరం, గంట ప్రయాణం కలిసి వస్తుంది. ఈ వంతెనతో కాకినాడ, కోనసీమ జిల్లా పరిధిలోని గోదావరికి ఇవతల ఉండే రామచంద్రపురం, మండపేటతో పాటు తూర్పుగోదావరి జిల్లాలోని రాజానగరం, అనపర్తి, రాజమమహేంద్రవరం రూరల్ నియోజకవర్గాల్లోని గ్రామాలకు కోనసీమ మధ్య 40 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.వీటి పరిధిలో 300 గ్రామాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది.

చిరకాల కోరిక తీరినేట్లే

కోటిపల్లి నుంచి ముక్తేశ్వరం వరకు రోడ్డు బ్రిడ్జి నిర్మించడం అంటే చిరకాల కోరిక తీరినట్టే. జిల్లాలు విడిపోయాక ప్రస్తుతం జిల్లా కేంద్రం వెళ్లడానికి ప్రమాదకరమైన పంటు ప్రయాణం తప్పడం లేదు. గోదావరికి వరద వస్తే పంటు నిలిచిపోతుంది. అలాంటప్పుడు అమలాపురం వెళ్లడానికి యానాం మీదుగా సుమారు 60 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుంది. బ్రిడ్జి నిర్మాణం వల్ల 12 కిలోమీటర్లతో జిల్లా కేంద్రం చేరుకోవచ్చు.

– ఎ.నారాయణస్వామి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు,కోటిపల్లి

వంతెనతో కష్టాలు తొలగుతాయి



పూర్వకాలం నుంచి ముక్తేశ్వరం–కోటిపల్లి వంతెన ప్రతిపాదన ఉంది. చాన్నాళ్ల తర్వాత దీనికి ప్రణాళిక రూపొందించడంతో ఆనందంగా ఉంది. అయినవిల్లి నుంచి కాకినాడ, రామచంద్రపురం వెళ్ళాలంటే చుట్టు తిరిగి వెళ్ళాల్సి వచ్చేది. గోదావరి చాలా వరకు తిప్పలు వేయడంతో పంటు సమయం కూడా ఎక్కువే పడుతుంది. వర్షాకాలంలో పంటు కూడా తిరగని పరిస్థితి. ఈ బ్రిడ్జి నిర్మాణం జరిగితే ప్రయాణ భారం తగ్గి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

– ముద్రగడ వీరేశ్వరరావు, మాజీ సర్పంచ్, వీరవల్లిపాలెం, అయినవిల్లి.

ఈ ప్రయత్నం చాలా సంతోషం



ఈ వంతెన కోసం నాడు మంత్రి కుడుపూడి ప్రభాకరరావు హయాంలో ప్రయత్నిస్తుంటే చాలా సంతోషపడ్డాం. రాష్ట్ర స్థాయిలో ఆయనతో పాటు జిల్లా నేతలు పెద్ద ప్రయత్నమే చేశారు. రెండు వందల కోట్లు అవుతుందని లెక్కలేశారు. ఇంత కాలానికి మరోసారి ఈ వంతెన కోసం మన ఎంపీలు, మంత్రులు ప్రయత్నిస్తున్నారని తెలిసింది.నిజంగా వంతెన ఫలిస్తే ఈ ప్రాంత వాసులు తరతరాలుగా గుర్తుండిపోతుంది.

– పీకే రావు, సీనియర్ నాయకుడు అంబాజీపేట.

క్లుప్తంగా...

రూ.4.69 కోట్లతో విశాఖలో మ్యూజియం

- సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సీఈవో జయరామిరెడ్డి

సాక్షి, అమరావతి: ఏపీలో అధునాతన సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం ప్రాజెక్టుకు కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. 'మ్యూజియం గ్రాంట్ స్కీమ్'కింద సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రాజెక్ట్‌ను మంజూరు చేసింది. రూ.4.69 కోట్ల ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా రూ.3.75 కోట్లు కేటాయించగా, మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినట్టు సైన్స్ సిటీ ఆఫ్ ఏపీ సీఈవో కె.జయరామిరెడ్డి బుధవారం తెలిపారు. విశాఖలోని కైలాసగిరిలో అడ్వాన్స్‌డ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

'సాహితీ ఫార్మా' బాధితులకు బాసటగా..

- ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున అందజేసిన ప్రభుత్వం



బాధితులకు చెక్కులు అందజేస్తున్న మంత్రి గుడివాడ తదితరులు

తుమ్మపాల (అనకాపల్లి జిల్లా): ఎస్ఈజెడ్ సాహితీ ఫార్మాలో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఆరుగురి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున అందజేసినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం బాధితులతో ఆయన సమావేశం నిర్వహించారు. మంత్రితో పాటు కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు చెక్కులు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రమాద విషయం తెలిసిన వెంటనే సీఎం జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని, బాధిత కుటుంబాలకు తక్షణమే సాయం అందించాలని ఆదేశించారని తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు ఆరుగురు మృతుల కుటుంబాలకు రూ.1.50 కోట్లు అందజేసినట్లు తెలిపారు. ఒక్కో కుటుంబం నుంచి ఒకరికి చొప్పున ఆ కంపెనీలో ఉద్యోగం కల్పిస్తామన్నారు.

పారిశ్రామిక పార్కుల్లో ఎల్ఈడీ వెలుగులు

- ఎల్ఈడీ దీపాల ఏర్పాటుకు టెండర్లు పిలిచిన ఏపీఐఐసీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పారిశ్రామిక వాడలను ఆహ్లాదంగా, అత్యాధునికంగా తీర్చిదిద్దే పలు అభివృద్ధి పనులకు ఏపీఐఐసీ శ్రీకారం చుట్టింది. కృష్ణా జిల్లా మల్లవల్లి పారిశ్రామిక పార్కు, మధురవాడ ఐటీ సెజ్, అచ్యుతాపురం సెజ్, విశాఖ పెదగంట్యాడ పారిశ్రామిక పార్కు, కియా ఆటోమొబైల్ పార్కుల్లో ఆకర్షణీయమైన ఆకృతులతో కూడిన ఎల్ఈడీ వీధిదీపాల ఏర్పాటు చేపట్టింది. సుమారు రూ.1.69 కోట్ల విలువైన పనులకు ఏపీఐఐసీ టెండర్లు పిలిచింది. మల్లవల్లి పారిశ్రామిక పార్కులో 60 వాట్ల 154 ఎల్ఈడీ వీధిదీపాలను రూ.79.22 లక్షలతో ఏర్పాటు చేయనుంది. అలాగే వేగంగా అభివృద్ధి చెందుతున్న మధురవాడ హిల్ నంబర్-3లోని ఐటీ సెజ్‌లో ప్రస్తుతం ఉన్న 150 వాట్ల ఎస్వీ ల్యాంప్స్ స్థానంలో 90 వాట్ల ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేయనుంది.

ఉద్దానంలో సురక్షిత నీటి పరవళ్లు

- ప్రాజెక్టు ట్రయల్ రన్‌ను ప్రారంభించిన మంత్రి అప్పలరాజు



ప్రాజెక్ట్ ద్వారా నీరు శుద్ధి అవుతున్న దృశ్యం

హిరమండలం/మెళియాపుట్టి: అనేక ఏళ్లుగా కిడ్నీ వ్యాధులతో సతమతమవుతున్న శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో బుధవారం సురక్షిత నీరు పరవళ్లు తొక్కింది. హిరమండలంలోని వంశధార రిజర్వాయర్ వద్ద ఉద్దానం సమగ్ర రక్షిత మంచినీటి పథకం(మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు) ట్రయల్ రన్‌ను మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు ప్రారంభించారు. ప్రాజెక్టు నుంచి సురక్షిత జలాలు భూగర్భ పైపులైన్ల ద్వారా విజయవంతంగా ముందుకు కదిలాయని అధికారులు చెప్పారు.

స్పెషల్ రైళ్ల పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: వారానికోసారి నడిచే కొన్ని స్పెషల్ రైళ్లను మరికొంత కాలం పొడిగించారు. ప్రతి గురువారం నడిచే హైదరాబాద్- తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ను ఆగస్టు 31 వరకు, శుక్రవారం నడిచే అదే రైలు తిరుగుప్రయాణ సర్వీసును సెప్టెంబరు 1 వరకు, శనివారం నడిచే గోరఖ్‌పూర్-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబరు 2 వరకు, సోమవారాలు నడిచే అదే రైలు రిటర్న్ సర్వీసును సెప్టెంబరు 4 వరకు, బుధవారం నడిచే విశాఖ-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబరు 27 వరకు, గురువారాల్లో నడిచే అదే రైలు తిరుగు ప్రయాణ సర్వీసును సెప్టెంబరు 28 వరకు, మంగళవారాల్లో నడిచే విశాఖపట్నం-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబరు 26 వరకు, బుధవారాల్లో నడిచే అదే రైలు రిటర్న్ సర్వీసును సెప్టెంబరు 27 వరకు పొడిగించారు.

క్యాన్సర్ బాధితులకు 'ఆరోగ్యసిరులు'

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద అన్ని రకాల క్యాన్సర్లకు ఉచిత వైద్యం



ఈ ఫొటోలో మంచంపై ఉన్న మహిళ పేరు కె. సువార్త. ఈమెది పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం అల్లూరివారిపాలెం గ్రామం. పొదుపు సంఘాల ఆర్పీగా పనిచేస్తోంది. భర్త ఆటో డ్రైవర్. కొద్దినెలల క్రితం గొంతులో సమస్య మొదలైంది. క్రమంగా ఆ సమస్య తీవ్రమై ఆహారం తీసుకోవడానికి ఇబ్బందిగా మారింది. దీంతో వైద్యులను సంప్రదిస్తే.. గొంతు క్యాన్సర్‌గా నిర్ధారించారు. ఉన్నంతలో సంతోషంగా జీవించే ఆ కుటుంబంలో ఆందోళన మొదలైంది. ఇంతలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద క్యాన్సర్‌కు ఉచిత వైద్యం లభిస్తుందని తెలియడం రాజేశ్‌కు ఎంతో ఊరటనిచ్చింది. దీంతో విజయవాడలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి భార్యను తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో రాజేశ్ మాట్లాడుతూ.. ''ఇప్పటివరకూ నా కుటుంబానికి సీఎం జగన్ ప్రభుత్వం అనేక పథకాలు అందించింది. ఇప్పుడు నా ఇల్లాలు క్యాన్సర్‌తో బాధపడుతుంటే ఉచిత వైద్యం కూడా అందిస్తోంది. ఆరోగ్యశ్రీ పథకం లేకుంటే ఈ రోజున నా భార్యను బతికించుకునేందుకు నేను ఎన్ని కష్టాలు పడాల్సి వచ్చేదో''.. అని అంటున్నాడు.



\- సాక్షి, అమరావతి

ఇలా సువార్తలాగే క్యాన్సర్ బారినపడ్డ పేద, మధ్యతరగతి ప్రజలకు ఆరోగ్యశ్రీ పథకం కొండంత అండగా ఉంటోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ పథకం పరిధిని సీఎం జగన్ విస్తరించారు. టీడీపీ ప్రభుత్వంలో 1,059గా ఉన్న ప్రొసీజర్స్‌ను ఏకంగా 3,257కు పెంచారు. అలాగే, టీడీపీ హయాంలో 200లోపు మాత్రమే క్యాన్సర్ ప్రొసీజర్లు ఉండగా ప్రస్తుతం 400కు పైగా క్యాన్సర్ ప్రొసీజర్లు పథకం పరిధిలోకి వచ్చాయి. లుకేమియా (బ్లడ్ క్యాన్సర్) బాధితులకు నిర్వహించే అత్యంత ఖరీదైన బోన్ మ్యారో స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను ఆరోగ్యశ్రీ కింద చేస్తున్నారు. అలాగే, రూ.10 లక్షలు, ఆపైన ఖర్చయ్యే ఈ ప్రొసీజర్‌ను పూర్తి ఉచితంగా చేస్తున్నారు. ఇలా ఏ తరహా క్యాన్సర్‌కైనా ఆరోగ్యశ్రీలో ఉచితంగా చికిత్స లభిస్తోంది.

- 2019 నుంచి ఇప్పటివరకు 2.64 లక్షల మంది బాధితులకు చికిత్స
- రూ.1,801 కోట్లు ఖర్చుచేసిన సీఎం జగన్ ప్రభుత్వం
- టీడీపీ హయాంలో 1,059గా ఉన్న ఆరోగ్యశ్రీ ప్రొసీజర్స్ ఏకంగా 3,257కు పెంపు
- క్యాన్సర్ ప్రొసీజర్లు కూడా 200 నుంచి 400కు పెరుగుదల

2.64 లక్షల మందికి వైద్యం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఆరోగ్యశ్రీ కింద 2,64,532 మంది క్యాన్సర్ బాధితులకు ఉచితంగా వైద్యం అందించారు. ఇందుకోసం ప్రభుత్వం ఏకంగా రూ.1,801.30 కోట్లు ఖర్చుచేసింది. ఇదే 2014–19 మధ్య టీడీపీ హయాంలో క్యాన్సర్ చికిత్సకు కేవలం రూ.751.56 కోట్లు ఖర్చుచేశారు. అంటే.. నాలుగేళ్లలోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం టీడీపీ కంటే రూ.1,049.74కోట్లు అదనంగా ఖర్చుచేసింది.

ఒక్క క్యాన్సరే కాకుండా..

క్యాన్సర్‌కే కాక.. హృద్రోగాలు, కిడ్నీ, లివర్ ఇలా వివిధ రకాల చికిత్సలు ఆరోగ్యశ్రీ ద్వారా బాధితులకు ఉచితంగా అందుతున్నాయి. అదే టీడీపీ హయాంలో ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేయడంతో అప్పట్లో పేదలు పడ్డ కష్టాలు అన్నీఇన్నీ కావు. కానీ, ఆ తర్వాత ఆరోగ్యశ్రీకి పూర్వ వైభవం తీసుకొస్తూ సీఎం వైఎస్ జగన్ తీసుకున్న చర్యలతో పేద, మధ్యతరగతి ప్రజలకు భారీ మేలు చేకూరుతోంది. ప్రొసీజర్లను 3,257కి పెంచి 2019 నుంచి ఇప్పటికి 40 లక్షల మందికి ఉచిత వైద్యం అందించారు. చికిత్స అనంతరం విశ్రాంత సమయానికి ఆరోగ్య ఆసరా కింద కూడా అండగా నిలుస్తున్నారు. ఇలా ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా కోసం 2019 నుంచి ఇప్పటికి రూ.10వేల కోట్లకు పైగా జగన్ సర్కార్ ఖర్చుచేసింది.

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద క్యాన్సర్‌కు చికిత్స వివరాలు.. (రూ.కోట్లలో)

సంవత్సరం	బాధితులు	ప్రొసీజర్స్	ఖర్చు
2019-20	46,263	1,32,566	217.12
2020-21	48,332	1,45,768	313.31
2021-22	60,741	2,11,960	479.85
2022-23	78,872	2,79,924	625.30
2023-24	30,324	82,459	165.71
మొత్తం	2,64,532	8,52,677	1,801.29

- మరోవైపు.. టీడీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.630 కోట్ల బకాయిలుండగా వాటిని జగన్ సర్కారే తీర్చింది. బాబు బావమరిది, టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ నడిపే బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి సైతం చెల్లించని బకాయిలను చెల్లించారు.

ప్రభుత్వమే నా మనవరాలిని బతికించింది..



నా మనవరాలికి బ్లడ్ క్యాన్సర్. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి మాది. మమ్మల్ని ఆరోగ్యశ్రీ పథకం ఆదుకుంది. ఒకరోజు జీవచ్ఛవంలా పడిపోయిన పాపను ఎత్తుకుని విజయవాడలోని హెచ్‌సీజీ ఆస్పత్రికి వెళ్లాం. అక్కడ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా పాపకు వైద్యం మొదలుపెట్టారు. ప్రస్తుతం వైద్యం కొనసాగుతోంది. ఈరోజు నా మనవరాలి ప్రాణాలను సీఎం జగన్ ప్రభుత్వం కాపాడింది. – శాంతకుమారి, విజయవాడ

ఆరోగ్యశ్రీ లేకపోయి ఉంటే..



మా నాన్నకు గొంతు క్యాన్సర్ వచ్చింది. ఆయన కౌలు రైతు. వ్యవసాయం మీద వచ్చే ఆదాయంతో వాళ్లు జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో క్యాన్సర్ చికిత్సకు సొంతంగా ఖర్చుపెట్టే స్తోమత లేదు. ఆరోగ్యశ్రీ పథకం మా నాన్నను ఆదుకుంది. పథకం లేకపోయి ఉంటే ఎంతో కష్టంగా ఉండేది. ఈ మేలును ఎప్పటికీ మరువలేం.
– ప్రశాంతి, శృంగవృక్షం గ్రామం, పశ్చిమ గోదావరి జిల్లా

పూర్తి ఉచితంగా వైద్యం..



అన్ని రకాల క్యాన్సర్‌తో పాటు, రూ.వెయ్యి వైద్యం ఖర్చు దాటే ప్రతి ప్రొసీజర్‌ను ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చింది. అర్హులైన లబ్ధిదారులకు ఉచితంగా వైద్యం అందేలా చూస్తున్నాం. చికిత్స అనంతరం రోగుల నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నాం. మెజారిటీ శాతం సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు పథకాన్ని మరింతగా మెరుగుపరచడానికి నిరంతరం కసరత్తు చేస్తున్నాం. – ఎంఎన్ హరేంధిరప్రసాద్, సీఈఓ, డా. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ

నేడు జగనన్న విదేశీ విద్యా దీవెన అమలు

- అర్హులైన 357 మంది విద్యార్థులకు రూ.45.53 కోట్లు
- నేడు బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: పేద విద్యార్థులు సైతం ప్రపంచంలోని అగ్రశ్రేణి యూనివర్సిటీల్లో ఉన్నత విద్య అభ్యసించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కానున్నాయి. సీఎం జగన్ గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు రూ.1.25 కోట్ల వరకు, ఇతరులకు రూ. కోటి వరకు 100% ఫీజు రీయింబర్స్‌మెంట్ అందుతుంది. ఈ విడతలో అర్హులైన 357 మంది విద్యార్థులు రూ.45.53 కోట్లు అందుకోనున్నారు.

గత చంద్రబాబు ప్రభుత్వంలో..

గత చంద్రబాబు ప్రభుత్వంలో విదేశాలకు వెళ్లి చదువుకొనే విద్యార్థులకు చేసిన ఆర్థిక సాయం అరకొరే. ఎస్సీ, ఎస్టీలకు కేవలం రూ.15 లక్షలు, ఇతరులకు రూ. 10 లక్షలు మాత్రమే ఇచ్చారు. కుటుంబ వార్షిక ఆదాయ పరిమితి రూ. 6 లక్షలుగా నిర్ణయించడంతో కొద్ది మందికే ప్రయోజనం కలిగింది. లబ్ధిదారుల ఎంపికలోనూ అవినీతి, సిఫార్సులకే పెద్దపీట వేశారు. ఈ కాస్త ఫీజునూ చెల్లించకుండా చంద్రబాబు ప్రభుత్వం విద్యార్థులకు ఎగనామం పెట్టింది. 2016 – 17 సంవత్సరం నుండి 3,326 విద్యార్థులకు రూ.318 కోట్ల ఫీజులు ఎగ్గొట్టి, ఆ తర్వాత పథకాన్నే ఎత్తివేసింది. ప్రమాణాలు లేని, పేలవమైన ర్యాంకులున్న సంస్థలను ఎంపిక చేయడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందని దుస్థితి నెలకొంది.

వైఎస్ జగన్ ప్రభుత్వంలో..

సీఎం వైఎస్ జగన్ సంతృప్త స్థాయిలో అర్హులైన విద్యార్థులందరికీ పూర్తి ఫీజులు అందేలా 'జగనన్న విదేశీ విద్యా దీవెన' పథకాన్ని తీర్చిదిద్దారు. ప్రతి ఏడాది 2 సీజన్లలో విదేశీ విశ్వవిద్యాలయాల్లో అడ్మిషన్లు పొందిన వారికి లబ్ధి చేకూరుస్తున్నారు. సంబంధిత శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీల నేతృత్వంలోని రాష్ట్ర స్థాయి ఎంపిక కమిటీ ద్వారా పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా నగదును నేరుగా లబ్ధిదారులైన విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. నాణ్యమైన విద్యకు పట్టం కడుతూ క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్, టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్ ప్రకారం ఎంపిక చేసిన 21 కోర్సుల్లో టాప్ 50 యూనివర్సిటీలకు ఎంపికైన విద్యార్థులకు ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. విద్యార్థులు కోర్సు పూర్తి చేసుకునేలా వారి చదువులు ఒక్కో మెట్టూ ఎక్కేకొద్దీ 4 వాయిదాల్లో స్కాలర్‌షిప్స్ మంజూరు చేస్తున్నారు. ఇమ్మిగ్రేషన్ కార్డు (ఐ–94) పొందాక తొలి వాయిదా, మొదటి సెమిస్టర్ ఫలితాల తర్వాత 2వ వాయిదా, 2వ సెమిస్టర్ ఫలితాల తర్వాత 3వ వాయిదా, 4వ సెమిస్టర్ విజయవంతంగా పూర్తి చేసి మార్క్స్ షీట్ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశాక చివరి వాయిదా చెల్లిస్తున్నారు. కుటుంబ వార్షిక ఆదాయ పరిమితిని రూ. 8 లక్షలకు పెంచడం ద్వారా ఎక్కువ మందికి ప్రయోజనం చేకూరుస్తున్నారు. ఈ పథకం పూర్తి వివరాలను https://jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచారు. పథకానికి సంబంధించి సహాయం, ఫిర్యాదుల కోసం 'జగనన్నకు చెబుదాం (1902 టోల్ ఫ్రీ నంబర్)'లోనూ సంప్రదించవచ్చు.

ఇదీ పథకం

క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్, టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్ ప్రకారం ఇంజనీరింగ్, మెడిసిన్, లా, జర్నలిజం తదితర 21 ఫ్యాకల్టీల్లో టాప్ 50 ర్యాంకుల్లోని విదేశీ కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు ఈ పథకానికి అర్హులు. దీని ద్వారా ప్రపంచంలోని 320కి పైగా ఉత్తమ కళాశాలల్లో ఉచితంగా చదువుకొనేందుకు మన రాష్ట్ర విద్యార్థులకు అవకాశం కలుగుతుంది. గడచిన 6 నెలల్లో 'జగనన్న విదేశీ విద్యా దీవెన' కింద అందించిన ఆర్థిక సాయం రూ.65.48 కోట్లు.

రూ.1,600 కోట్లతో 'మాండలీజ్ చాక్లెట్స్' విస్తరణ

తాజా విస్తరణతో క్యాడ్‌బరీకి ప్రపంచంలోనే అతిపెద్ద ప్లాంట్‌గా శ్రీసిటీ

- 57 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో కొత్తగా మూడు ఉత్పత్తి లైన్ల అభివృద్ధి
- ఏడాదికి 2.20 లక్షల టన్నుల కోకో వినియోగ సామర్థ్యం



సాక్షి, అమరావతి: ప్రపంచంలోనే అతిపెద్ద చాక్లెట్ తయారీ సంస్థ మాండలీజ్ రాష్ట్రంలో భారీ విస్తరణ ప్రణాళికలను ప్రకటించింది. శ్రీసిటీలో ఇప్పటికే రూ.2,078 కోట్లతో 133 ఎకరాల విస్తీర్ణంలో ప్లాంట్ ఏర్పాటు చేసిన మాండలీజ్.. ఆ యూనిట్‌లోనే రూ.1,600 కోట్లతో విస్తరణ చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ విస్తరణ ద్వారా 57 వేల చదరపు మీటర్ల మేర అభివృద్ధి చేయనున్నామని, తద్వారా ఏటా 2.20 లక్షల టన్నుల కోకోను వినియోగించుకునే సామర్థ్యం వస్తుందని మాండలీజ్ ఇండియా సప్లై చైన్ వైస్ ప్రెసిడెంట్ వెంకట్ మానేపల్లి తెలిపారు.

కొత్తగా మూడు ఉత్పత్తి లైన్లు

విస్తరణలో భాగంగా కొత్తగా మూడు ఉత్పత్తి లైన్లను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఈ యూనిట్‌లో 400 మంది పనిచేస్తుండగా.. విస్తరణ తర్వాత ఉపాధి లభించే వారి సంఖ్య 973కు చేరనుంది. అలాగే.. ఈ యూనిట్ ద్వారా 18 వేల మంది కోకో రైతులకు ప్రయోజనం లభించనుందని కంపెనీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. మూడు సంవత్సరాల్లో ఈ విస్తరణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ సందర్భంగా వెంకట్ మానేపల్లి మాట్లాడుతూ.. 'భారతదేశంలో 75 సంవత్సరాల చరిత్ర కలిగిన సంస్థగా మా వృద్ధికి అనుగుణంగా దేశంలో పెట్టుబడులు పెట్టడం కొనసాగించటం పట్ల సంతోషంగా ఉన్నాం. కీలకమైన శ్రీ సిటీ తయారీ యూనిట్ కార్యకలాపాలను విస్తరిస్తూ పెట్టుబడులు పెట్టడం ఆనందంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరంతరం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు. రాష్ట్రంలో మరిన్ని విజయాలను నమోదు చేస్తాం' అని పేర్కొన్నారు. మాండలీజ్ శ్రీసిటీ యూనిట్ ద్వారా క్యాడ్‌బరీ, బార్న్‌విటా, ఓరియో వంటి బ్రాండ్స్‌కు చెందిన చాక్లెట్లు, కన్ఫెక్షనరీ ఉత్పత్తులను అందిస్తోంది.

ఏపీలో ప్రకృతి సాగు భేష్

ప్రపంచంలోనే వ్యవసాయ పర్యావరణానికి అతి పెద్ద పరివర్తన

- దిగుబడి, జీవనోపాధి, ఆరోగ్యం అన్నిటికీ శ్రేయస్కరం
- ఆర్థిక, సామాజిక, ఆరోగ్య రంగాలపై ప్రభావితం
- సరైన లాభసాటి ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానం
- ప్రకృతి సాగులో 11 శాతం అధిక దిగుబడి, 49 శాతం అధిక లాభం



ప్రకృతి ఉత్పత్తులతో గిరిజన మహిళ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయ విధానం ఆదర్శనీయమని ప్రపంచ ప్రసిద్ధి చెందిన గ్లోబల్ ఇన్ఫర్మేషన్ షేరింగ్ టూల్‌కిట్ (జిస్ట్) ఇంపాక్ట్ సంస్థ ప్రకటించింది. వైఎస్ జగన్ ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్రంలో పెద్ద ఎత్తున అమలవుతున్న ప్రకృతి వ్యవసాయం ప్రపంచంలోనే వ్యవసాయ పర్యావరణానికి (అగ్రో ఎకాలజీకి) అతి పెద్ద పరివర్తన (మార్పు) అని తెలిపింది. ప్రకృతి వ్యవసాయం ప్రస్తుత వ్యవసాయ విధానాలకు సరియైన లాభసాటి ప్రత్యామ్నాయ విధానమని వెల్లడించింది. అధిక దిగుబడి, అత్యున్నత జీవనోపాధి, సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రకృతి వ్యవసాయం ఎంతగానో దోహదపడుతుందని తెలిపింది. ప్రపంచ స్థాయి సంస్థల కూటమి (గ్లోబల్ అలయన్స్ ఫర్ ది ఫ్యూచర్ ఆఫ్ ఫుడ్) మద్దతుతో జిస్ట్ ఇంపాక్ట్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన అధ్యయన ఫలితాలను బుధవారం వెల్లడించింది. భావితరాలను దృష్టిలో ఉంచుకొని ప్రపంచ స్థాయిలో ఆహార వ్యవస్థల్లో పరివర్తన తేవడానికి ఈ సంస్థలు కలిసి పనిచేస్తున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలోని మూడు విభిన్న ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయ ఫలితాలను నిశితంగా పరిశీలించారు. కోస్తా, రాయలసీమ, ఏజెన్సీ ప్రాంతాల్లో అధ్యయనం చేశారు. 2020 – 2022 మధ్య ఎంపిక చేసిన 12 గ్రామాల్లో ఇంటింటా సమగ్ర ప్రాథమిక సర్వే చేశారు. విస్తృత ప్రయోజనాలతో నిర్వహించిన ఈ అధ్యయనంలో పలు అంశాలు వెలుగు చూశాయి.

వ్యవసాయ పర్యావరణ మార్పునకు దోహదం

ఇతర విధానాలతో పోల్చితే సంప్రదాయ జీవ ఎరువులతో చేస్తున్న ప్రకృతి వ్యవసాయంలో అధిక దిగుబడి వస్తోంది. ఈ విధానంలో పంట వైవిధ్యత చూపితే 11% అధిక దిగుబడి వస్తుంది. ఇది పెరుగుతున్న జనాభాకు సరిపడే ఆహారాన్ని ఉత్పత్తి చేస్తుంది. తద్వారా 49% అధిక లాభం చేకూరడంతో ప్రకృతి వ్యవసాయ కుటుంబాల్లో ఆనందం వెల్లి విరుస్తోంది. ఆ రైతుల కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. రైతు వ్యవస్థ బలంగా తయారవుతోందని వెల్లడించింది.

ప్రకృతి సాగులో మహిళా శ్రామిక శక్తి అధికం


మహిళా సంఘాల సభ్యులు భాగస్వామ్యం పెరుగుతుండడంతో ప్రకృతి సాగులో మహిళా శ్రామిక శక్తి అధికంగా కనిపిస్తోందని జిస్ట్ ఇంపాక్ట్ పేర్కొంది. మహిళలు క్రియాశీలక పాత్ర పోషిస్తుండడంతో కుటుంబాల మధ్య ఐక్యత, అన్యోన్యత పెరుగుతున్నాయి. తద్వారా సామాజిక పెట్టుబడిలో పెరుగుదల స్పష్టంగా కన్పిస్తోంది. ఇతర పద్ధతుల్లో వ్యవసాయం చేసే రైతులతో పోలిస్తే ప్రకృతి సాగు చేసే రైతుల్లో 33%తక్కువ పని దినాలతోనే అనుకున్న లక్ష్యాలను సాధిస్తున్నారు. సంప్రదాయ పద్ధతుల్లో వ్యవసాయం చేసే రైతులు మితిమీరి వినియోగిస్తున్న రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల ఉత్పాదకత నష్టాలతోపాటు అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రకృతి సాగులో ఆ పరిస్థితి కన్పించడంలేదు. గ్రామీణ జీవనోపాధి, పౌష్టికాహారం, జీవ వైవిధ్య నష్టం, వాతావరణ మార్పు, నీటి కొరత, కాలుష్యం వంటి బహుళ అభివృద్ధి సవాళ్లను ప్రకృతి సాగు చేస్తున్న రైతులు అధిగమిస్తున్నారని అధ్యయనంలో గుర్తించినట్టు ఆ సంస్థ తెలిపింది.

భవిష్యత్ ప్రణాళికకు ఇదొక బ్లూ ప్రింట్



మా పరిశోధన వాతావరణ పర్యావరణ అనుకూల వ్యవసాయ అభివృద్ధికి ఒక నమూనా (బ్లూప్రింట్)గా ఉపయోగపడుతుంది. ఏపీని స్ఫూర్తిగా తీసుకొని ప్రకృతి వ్యవసాయంలో ముందుకెళ్లాలని భాగస్వామ్య దేశాలకు సిఫార్సు చేస్తాం.
– పవన్ సుఖ్‌దేవ్, జిస్ట్ ఇంపాక్ట్, సీఈవో

ప్రభుత్వ కృషి ప్రశంసనీయం



ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతుల జీవితాలు, సమాజంలో మార్పుకు కృషి జరుగుతున్నట్టు గుర్తించాం. సంప్రదాయ వ్యవసాయం నుంచి రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయం.
– లారెన్ బేకర్, డిప్యూటీ డైరెక్టర్, గ్లోబల్ అలయన్స్ ఫర్ ది ఫ్యూచర్

అంతర్జాతీయంగా గుర్తింపు



భవిష్యత్‌లో ఎదురయ్యే ఆహార సంక్షోభ పరిస్థితులకు ప్రకృతి వ్యవసాయం ఒక్కటే చక్కటి పరిష్కారమని జిస్ట్ ఇంపాక్ట్ సర్వే స్పష్టం చేస్తోంది. రెండేళ్లపాటు శాస్త్రీయ పద్ధతిలో చేసిన ఈ అధ్యయనం ఫలితాలు రాష్ట్రంలో ప్రకృతి సాగుకు అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చేందుకు దోహదపడతాయి.
– టి.విజయ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్, రైతు సాధికార సంస్థ

గ్రామ, వార్డు సచివాలయాల్లో కారుణ్య నియామకాలు

- కోవిడ్‌తో మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం
- ఇప్పటివరకు 1,488 కుటుంబాల్లోని వారికి ఉద్యోగాలు
- పెండింగ్‌లో ఉన్న 1,149 దరఖాస్తుదారులకు పోస్టింగ్‌లు
- ఆగస్టు 17 లోగా దరఖాస్తుల పరిశీలన..
- 24లోగా నియామక ఉత్తర్వులు
- శాఖలు, కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు



సాక్షి, అమరావతి: కరోనా మహమ్మారితో మృతిచెందిన ప్రభుత్వోద్యోగుల కుటుంబాల్లో కొందరికి ఇప్పటికే కారుణ్య నియామకాలు కల్పించగా ఇంకా మిగిలిపోయిన కుటుంబాల్లో ఒకరికి చొప్పున ప్రభుత్వ ఉద్యోగాలివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలో ఇలా మృతిచెందిన ప్రభుత్వోద్యోగుల కుటుంబాల్లోని వారికి ఇప్పటివరకు 1,488 మందికి ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించింది. మిగిలిన 1,149 మంది దరఖాస్తుదారులకూ ఇప్పుడు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు కల్పించేందుకు ఉత్తర్వులు జారీచేశారు. వీటిల్లో మొత్తం 13,026 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిల్లో ఆ 1,149 దరఖాస్తుదారుల్లో అర్హులైన వారికి కారుణ్య నియామకాల కింద ప్రభుత్వోద్యోగాలు ఇవ్వాల్సిందిగా సీఎస్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ విషయంలో విద్యార్హతలు, రిజర్వేషన్ రోస్టర్ పాయింట్లను పాటించాలని సంబంధిత శాఖాధిపతులు, కలెక్టర్లను ఆయన ఆదేశించారు.

ఖాళీగా ఉన్న పోస్టులివే..

గ్రామ, వార్డు సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, సంక్షేమ విద్యా అసిస్టెంట్, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్, గ్రామ, వార్డు రెవెన్యూ కార్యదర్శి, గ్రామ సర్వేయర్, వార్డు పరిపాలన కార్యదర్శి, వార్డు విద్యా కార్యదర్శి, వార్డు సంక్షేమ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులకు అనుగుణంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, శాఖాధిపతులు, కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు.

పోస్టుల భర్తీకి టైమ్‌లైన్..

ఇక ఈ కారుణ్య నియామకాల భర్తీకి ప్రభుత్వం టైమ్‌లైన్‌ను కూడా నిర్దేశించింది.

- దరఖాస్తుల పరిశీలన ఆగస్టులోగా పూర్తిచేయాలి.. అర్హులైన వారికి నియామక పత్రాలను ఆగస్టు 24లోగా జారీచేయాలి.
- సమ్మతి నివేదికను సెప్టెంబర్ 30లోగా ప్రభుత్వానికి సమర్పించాలి.
- మృతిచెందిన ఉద్యోగికి మైనర్ పిల్లలు ఉంటే వయస్సు, విద్యార్హతల ఆధారంగా జీవిత భాగస్వామికి ఉద్యోగం ఇవ్వడానికి ప్రాధాన్యత ఇవ్వాలి.
- ఉద్యోగ నియామక పత్రం జారీచేసిన 30 రోజుల్లోగా ఉద్యోగంలో చేరాలి.
- గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులను విద్యార్హతలు, సాంకేతిక అర్హతలు ఆధారంగా భర్తీచేయాలి.

క్లుప్తంగా...

విద్య, వైద్యానికి పెద్దపీట వేశాం: పెద్దిరెడ్డి



పలమనేరు(చిత్తూరు జిల్లా): ప్రజలకు అత్యంత ముఖ్యమైన విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని రాష్ట్ర విద్యుత్, అటవీ, మైనింగ్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. పలమనేరు నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి, వీకోట మండలాల్లో రూ.4.10కోట్లతో నిర్మించిన పీహెచ్‌సీ, ఆర్‌బీకేలు, సచివాలయాలు, పీఏసీఎస్ భవనాలను బుధవారం ఆయన ప్రారంభించారు. తోట కనుమలో సబ్‌స్టేషన్ పనులకు భూమి పూజ చేశారు. బైరెడ్డిపల్లిలో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు చాలా ముఖ్యమైంది వైద్యం కాబట్టే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాలనపై చంద్రబాబు ఎన్ని తప్పుడు ఆరోపణలు చేసినా జనం నమ్మరన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ, పార్లమెంటు సభ్యుడు ఎన్ రెడ్డెప్ప, డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఫైబర్‌నెట్ ద్వారా వెబ్‌సిరీస్‌లు

ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ఇప్పటికే విడుదల రోజే కొత్త సినిమాలను కుటుంబసభ్యులంతా కలిసి ఇంట్లోనే చూసే సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చిన ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ లిమిటెడ్(ఏపీఎస్‌ఎఫ్‌ఎల్).. త్వరలో వెబ్‌సిరీస్‌లు, షార్ట్‌ఫిల్మ్‌లను కూడా అందించనుంది. మరో వారంలో ఫైబర్ నెట్ వేదికగా నేరుగా వెబ్‌సిరీస్‌లు, షార్ట్‌ఫిల్మ్‌లు ప్రారంభించనున్నట్లు ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ చైర్మన్ డా.పి.గౌతమ్‌రెడ్డి తెలిపారు. 'కాస్ట్‌లీ కోరికలు' సినిమా విడుదల సందర్భంగా ఆ చిత్ర బృందంతో కలిసి బుధవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేవలం రూ.40తో కుటుంబసభ్యులంతా కలిసి 'కాస్ట్‌లీ కోరికలు' చిత్రాన్ని వీక్షించవచ్చన్నారు. కార్యక్రమంలో కాస్ట్‌లీ కోరికలు హీరో జువ్వనపూడి సుభాష్, డైరెక్టర్ సాయికుమార్‌రాజు, ప్రొడ్యూసర్ ఝాన్సీ లక్ష్మీ, బ్లాక్ స్పేస్ ప్రొడక్షన్ సభ్యులు వంశీ, వరుణ్, గౌతమ్, సాయిరామ్, మణికంఠ, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనతో బీజేపీ పొత్తు కొనసాగుతుంది

సీఎం అభ్యర్థి నేనా, పవనా అనేది అధిష్టాన నిర్ణయం: పురందేశ్వరి



సాక్షి, రాజమహేంద్రవరం: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జనసేనతో తమ పార్టీ పొత్తు కొనసాగుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. ముఖ్యమంత్రి అభ్యర్థి తానా, పవన్‌కళ్యాణా అనేది పార్టీ అధిష్టానం నిర్ణయిస్తుందన్నారు. అప్పటి వరకు ఉమ్మడిగా ప్రజల సమస్యలపై పోరాడతామని పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆవ భూములను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. పేదలకు అనువైనచోట ఇంటి నిర్మాణాలు చేపట్టడం లేదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం ఇవ్వాల్సిన నిధులన్నీ ఇచ్చేసిందని చెప్పారు. సర్పంచ్‌లకు అందాల్సిన 14వ ఆర్థికసంఘం నిధుల్ని దారి మళ్లిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆమె చెప్పారు.

ఎర్ర పుస్తకంలో పేర్లు రాసుకుంటున్నా: లోకేశ్



ఒంగోలు సబర్బన్: ''నేను అసలే మూర్ఖుడిని. ఎవరి మాటలు వినేవాడిని కాదు. టీడీపీ కార్యకర్తలను, నాయకులను ఇబ్బందిపెట్టిన అధికారుల పేర్లు ఎర్ర పుస్తకంలో రాసుకుంటున్నాను. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఆ అధికారుల, వైఎస్సార్‌సీపీ నాయకుల ఒక్కొక్కరి అంతుచూస్తా. ఎవరినీ వదిలిపెట్టను'' అని యువగళం పాదయాత్రలో లోకేశ్ హెచ్చరించారు. యువగళం పాదయాత్ర బుధవారం ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి ఒంగోలు నియోజకవర్గంలోకి వచ్చింది. ఇక్కడ ముంగమూరు రోడ్డులోనే ఇరుకు సందులో వాహనాన్ని నిలిపి ప్రసంగించారు. మోటార్లకు మీటర్లు బిగిస్తే రైతులు పగులగొట్టాలన్నారు.

పవన్‌కళ్యాణ్‌కు బీసీలంటే చిన్నచూపు: మారేశ్



సాక్షి, న్యూఢిల్లీ: బీసీల పట్ల అనుసరిస్తున్న విధానం, జనసేన నాయకులు చేస్తున్న విమర్శలు చూస్తుంటే పవన్‌కళ్యాణ్ బీసీ వ్యతిరేకి అని స్పష్టం అవుతున్నదని ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు ఎస్.మారేశ్ అన్నారు. సీఐ అంజుయాదవ్, మంత్రి విడదల రజిని, మంత్రి జోగి రమేశ్‌పై జనసేన నాయకులు తీరు సరిగా లేదని చెప్పారు. బుధవారం ఢిల్లీలో మారేష్ మీడియాతో మాట్లాడారు. పవన్‌కళ్యాణ్ వైఖరి మార్చుకోకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ఆగ్రహం చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

విదేశాలకు వెళ్లాలనుకుంటున్నారా?.. అయితే ఎలాంటి వీసా లేకుండా కేవలం భారత పాస్‌పోర్టుతో 57 దేశాలకు వెళ్లిపోవచ్చు. తాజాగా లండన్‌కు చెందిన హెన్లీ పాస్‌పోర్టు ఇండెక్స్ ర్యాంకుల్లో భారత్ 80వ స్థానంలో నిలిచింది. మనతోపాటు సెనెగల్, టోగోలకు కూడా 80వ ర్యాంక్ లభించింది.

వీసా లేకుండానే 57 దేశాలకు!



మన పాస్‌పోర్టుతో వెళ్లేందుకు అవకాశం

- మెరుగుపడ్డ భారత ర్యాంకింగ్
- హెన్లీ పాస్‌పోర్టు ఇండెక్స్‌లో 80వ స్థానం
- టాప్ ర్యాంక్‌లో సింగపూర్
- రెండో స్థానంలో జర్మనీ, ఇటలీ, స్పెయిన్
- మూడో స్థానంలో జపాన్, ఆస్ట్రియా, ఫిన్లాండ్, ఫ్రాన్స్, తదితర దేశాలు
- ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్న అమెరికా
- ఆఫ్ఘనిస్థాన్, ఉత్తర కొరియాలకు జీరో

గత ఐదేళ్లుగా భారత్ ర్యాంకు మెరుగుపడుతుండటం విశేషం. 2022లో భారత్ 87వ స్థానంలో నిలిచింది. కాగా ఈ ఏడాది అగ్రస్థానంలో సింగపూర్ నిలిచింది. ఈ దేశానికి చెందిన పాస్‌పోర్టుతో 192 దేశాలకు వెళ్లే అవకాశం ఉంది. ఈ క్రమంలో సింగపూర్ గతేడాది ర్యాంకుల్లో ముందున్న జపాన్‌ను అధిగమించింది. ఇక జర్మనీ, ఇటలీ, స్పెయిన్‌లు రెండో స్థానంలో నిలిచాయి. ఈ దేశాల పాస్‌పోర్టులతో వీసా లేకుండా 190 దేశాలకు వెళ్లొచ్చు. జపాన్, ఆస్ట్రియా, ఫిన్లాండ్, ఫ్రాన్స్, లక్సెంబర్గ్, దక్షిణ కొరియా, స్వీడన్ మూడో స్థానం దక్కించుకున్నాయి. ఈ దేశాల పాస్‌పోర్టులతో 189 దేశాలకు వెళ్లే అవకాశం ఉంది. బ్రిటన్ నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది.

– సాక్షి, అమరావతి

చెత్త పాస్‌పోర్టు గల దేశాల్లో పాకిస్థాన్

హెన్లీ పాస్‌పోర్టు ఇండెక్స్ ర్యాంకింగ్స్‌లో పాకిస్థాన్ నాలుగో చెత్త పాస్‌పోర్ట్ కలిగిన దేశంగా నిలిచింది. పాక్ పాస్‌పోర్టుతో వీసా లేకుండా కేవలం 33 దేశాలకు వెళ్లడానికి మాత్రమే వీలుంది. ఇక ఆఫ్ఘనిస్థాన్, ఉత్తర కొరియా, పపువా న్యూ గినియా, తుర్కిమెనిస్థాన్ దేశాలకు జీరో ర్యాంక్ లభించింది. అంటే ఈ దేశాల ప్రజలు వీసా లేకుండా పాస్‌పోర్టుతో ఏ దేశంలోకి ప్రవేశించలేరు.

- దాదాపు పదేళ్ల క్రితం వరకు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న అమెరికా ఎనిమిదో స్థానానికి పడిపోయింది. ఈ మేరకు ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) డేటా ఆధారంగా తాజాగా వీసా లేకుండా ప్రయాణించే దేశాలకు హెన్లీ పాస్‌పోర్టు ఇండెక్స్ ర్యాంకులను ప్రకటించింది.

వీసా లేకుండా వెళ్లగలిగే దేశాలు

బార్బడోస్, భూటాన్, బొలీవియా, బ్రిటిష్ వర్జిన్ దీవులు, బురుండి, కంబోడియా, కుక దీవులు, కేప్ వెర్డే దీవులు, కొమెరో దీవులు, జిబౌటి, డొమినికా, ఎల్ సాల్వడార్, ఫిజీ, గబాన్, గ్రెనడా, గినియా–బిస్సావు, హైతీ, ఇండోనేషియా, ఇరాన్, జమైకా, జోర్డాన్, కజకిస్థాన్, లావోస్, మకావు, మడగాస్కర్, మాల్దీవులు, మార్షల్ దీవులు, మారిటానియా, మారిషస్, మైక్రోనేషియా, మోంట్సెరాట్, మొజాంబిక్, మయన్మార్, నేపాల్, నియు, ఒమన్, పలావు దీవులు, ఖతార్, రువాండా, సమోవా, సెనెగల్, సీషెల్స్ దీవులు, సియర్రా లియోన్, సోమాలియా, శ్రీలంక, సెయింట్ కిట్స్ అండ్ నెవిస్, సెయింట్ లూసియా, సెయింట్ విన్సెంట్, టాంజానియా, థాయిలాండ్, తైమూర్–లెస్టే, టోగో, ట్రినిడాడ్ అండ్ టొబాగో, ట్యునీషియా, తువాలు, వనటు, జింబాబ్వే.

కదలివస్తున్న కృష్ణమ్మ

- పశ్చిమ కనుమల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలు
- నేడు ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల గేట్లు ఎత్తివేసే అవకాశం
- రెండు రోజుల్లో ఎగువ నుంచి శ్రీశైలానికి వరద నీరు
- తుంగభద్ర డ్యామ్‌లోకి 1.13 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- ఖమ్మం, కృష్ణా జిల్లాల్లో విస్తారంగా వర్షాలు
- ప్రమాదకర స్థాయిలో మున్నేరు, కట్టలేరు ప్రవాహం
- ప్రకాశం బ్యారేజ్ వద్ద పెరుగుతున్న వరద ఉధృతి



విజయవాడ ప్రకాశం బ్యారేజి వద్ద పారుతున్న వరద నీరు

సాక్షి, అమరావతి: కాస్త ఆలస్యంగానైనా పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా నదిలో ఎగువున వరద ప్రవాహం వేగం పుంజుకుంది. మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి తెలుగు రాష్ట్రాలకు కృష్ణమ్మ బిరబిరా కదలివస్తోంది. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలో విద్యుదుత్పత్తి చేస్తూ బుధవారం రాత్రి 9 గంటలకు దిగువకు వరద జలాలను విడుదల చేస్తున్నారు. ఆల్మట్టి డ్యామ్‌లోకి 1.83 లక్షల క్యూసెక్కుల ప్రవాహం చేరుతోంది. నీటి నిల్వ 88 టీఎంసీలకు చేరుకోవడం.. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండంతో బ్యాక్ వాటర్ ప్రభావం వల్ల మహారాష్ట్రలో ముంపు సమస్యను నివారించడానికి ఆల్మట్టిలో పూర్తి స్థాయిలో విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు 91 వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. దాంతో నారాయణపూర్ డ్యామ్‌లోనూ విద్యుదుత్పత్తిని 20 వేల క్యూసెక్కులతో ప్రారంభించి.. గంట గంటకూ పెంచుతున్నారు. గురువారం ఆ రెండు డ్యామ్‌ల గేట్లు ఎత్తేసే అవకాశం ఉంది. దాంతో జూరాల వైపు కృష్ణమ్మ పరుగు పరుగున వస్తోంది. రెండ్రోజుల్లో శ్రీశైలానికి చేరుకోనుంది. ఇక ప్రధాన ఉపనది అయిన తుంగభద్రలో వరద ప్రవాహం మరింత పెరిగింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 1.13 లక్షల క్యూసెక్కులు చేరుతోంది. ఇక తెలంగాణలోని ఖమ్మం, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, గుంటూరు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దాంతో మున్నేరు, కట్టలేరు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వీటికి తోడు వాగులు, వంకల నుంచి చేరుతున్న నీటితో పులిచింతలకు దిగువన కృష్ణాలో వరద ప్రవాహం గంట గంటకూ పెరుగుతోంది. ప్రకాశం బ్యారేజ్‌లోకి 91,864 క్యూసెక్కులు చేరుతుండగా అధికారులు గేట్లను ఎత్తేసి అంతే స్థాయిలో సముద్రంలోకి వదిలేస్తున్నారు. గురువారం అర్ధరాత్రికి ప్రకాశం బ్యారేజ్‌లోకి 1.20 లక్షల క్యూసెక్కుల ప్రవాహం చేరుతుందని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. కాగా, ఆగస్టు, సెప్టెంబర్‌లలో బేసిన్‌లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో గత నాలుగేళ్ల తరహాలోనే ఈ ఏడాది కూడా కృష్ణాలో నీటి లభ్యత మెరుగ్గా ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

మళ్లీ పెరిగిన గోదావరి వరద

పరీవాహక ప్రాంతంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు

- పొంగి ప్రవహిస్తున్న ఉపనదులు, వాగులు, వంకలు
- దాంతో గోదావరిలో గంట గంటకూ పెరుగుతున్న వరద ఉధృతి
- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- పోలవరం వద్ద నిరంతరం వరద పరిస్థితిని సమీక్షిస్తున్న అధికారులు
- లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలింపు
- ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి 8.33 లక్షల క్యూసెక్కులు కడలిలోకి



చింతూరు మండలంలో ఆంధ్రా, ఒడిశా జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వరదనీరు



పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి దిగువకు చేరుతున్న వరదనీరు

సాక్షి, అమరావతి/పోలవరం రూరల్/చింతూరు/ధవళేశ్వరం: రెండు రోజులుగా తగ్గుతూ వచ్చిన గోదావరి వరద ప్రవాహం మళ్లీ పెరుగుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పరీవాహక ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ఉపనదులు, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, తాలిపేరు, కిన్నెరసాని వంటి ఉపనదుల నుంచి భారీగా వస్తున్న నీటితో గోదావరిలో గంట గంటకూ వరద ఉధృతి పెరుగుతోంది. తెలంగాణలోని కాళేశ్వరంలో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజ్ నుంచి 5,11,080 క్యూసెక్కులు, తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క బ్యారేజ్ నుంచి 7,54,470 క్యూసెక్కులు, దుమ్ముగూడెం వద్ద ఉన్న సీతమ్మసాగర్ నుంచి 10,49,351 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. భద్రాచలం వద్ద బుధవారం రాత్రి 9.28 గంటలకు నీటిమట్టం 48 అడుగులకు చేరింది. దీంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నీటి మట్టం 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. పోలవరం ప్రాజెక్టు వద్ద వరద పరిస్థితిని అధికారులు నిరంతరం సమీక్షిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు 48 గేట్లను పూర్తిగా ఎత్తి వచ్చిన వరదను వచ్చినట్టుగా దిగువకు వదులుతున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు పునరావాస శిబిరాలకు తరలిస్తున్నారు. వరద ఉధృతి పెరగటంతో పట్టిసం శివక్షేత్రం చుట్టూ వరద నీరు చేరింది. ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి బుధవారం రాత్రి 8 గంటలకు 8,37,850 క్యూసెక్కులు చేరుతుండగా.. నాలుగువేల క్యూసెక్కులను గోదావరి డెల్టాకు విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 8,33,850 క్యూసెక్కులను 175 గేట్లను పూర్తిగా ఎత్తేసి సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఇక్కడ నీటిమట్టం 10.70 అడుగులకు చేరింది. ధవళేశ్వరం ఫ్లడ్ కంట్రోల్‌రూమ్ నుంచి ఇరిగేషన్ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. గురువారం ఉదయం 10 లేదా 11 గంటలకు ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి వస్తున్న ప్రవాహం 12 లక్షల క్యూసెక్కులను దాటే అవకాశం ఉందని అధికారవర్గాలు వెల్లడించాయి. మరో రెండ్రోజులు బేసిన్‌లో విస్తారంగా వర్షాలు కురుస్తాయన్న అంచనాల నేపథ్యంలో గోదావరి వరద మరింత ఉధృతమయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

విలీన మండలాల్లో నిలిచిన రాకపోకలు..

గోదావరి వరదతో విలీన మండలాలైన చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాకల్లో పలు గ్రామాలు జలదిగ్బంధ మయ్యాయి. భద్రాచలం, కూనవరం ప్రధాన రహదారిపై వరదనీరు చేరింది. కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో 40 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు శబరినది పొంగి రహదారులపైకి వరద నీరు చేరడంతో చింతూరు మండలంలోని 25 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

2వ తేదీ నాటికి మరో అల్పపీడనం

అల్పపీడనం కేంద్రీకృతమైన బంగాళాఖాతం నుంచి కోస్తా జిల్లాల వైపు నిరంతరాయంగా మేఘాలు వస్తూనే ఉండడం వల్ల భారీ వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. అల్పపీడనానికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది. దీంతో తీవ్ర అల్పపీడనం ఉత్తరాంధ్ర–దక్షిణ ఒడిశా తీరాల మీదుగా వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతోంది. మరోవైపు నైరుతి రుతుపవనాలు కూడా చురుగ్గా ఉన్నాయి. కాగా, బంగాళాఖాతంలో వచ్చే నెల 2వ తేదీ నాటికి మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఇది ఉత్తరాంధ్ర, ఒడిశా తీరం మధ్య కేంద్రీకృతమయ్యే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న అల్పపీడనం బలహీనపడిన తర్వాత ఈ అల్పపీడనంపై స్పష్టత వస్తుందని ఏపీఎస్‌డీపీఎస్ అధికారులు చెబుతున్నారు.

రాష్ట్రమంతా కుండపోత

▶ మొదటి పేజీ తరువాయి

అత్యధికంగా 7.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. విశాఖ జిల్లాలో 6.9, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో 6.8, అనకాపల్లి జిల్లాల్లో 6.4 సెంటీమీటర్ల సగటు వర్షం కురిసింది. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి, కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాల్లోనూ సగటున 3 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది.

10 జిల్లాలకు రెడ్.. 7 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

అల్పపీడన ప్రభావం గురువారం వరకు ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో 10 జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాలు ఈ జాబితాలో ఉన్నందున, అక్కడి ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉండడంతో ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మిగిలిన జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. గంటకు 40–50 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. శనివారం వరకు వర్షాలు కురిసే అవకాశం ఉంది. సముద్రం అలజడిగా ఉన్నందున రానున్న మూడు రోజులు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం హెచ్చరించింది.

జిల్లా కలెక్టర్లు అప్రమత్తం

భారీ వర్షాల నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ ఆయా జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేసింది. కలెక్టరేట్లలో 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్‌లు తెరవాలని సూచించింది. వలంటీర్ల ద్వారా స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుని సహాయ కార్యక్రమాలు చేపట్టాలని తెలిపింది.

రాయలసీమలో జడివాన

రాయలసీమ జిల్లాల్లో బుధవారం జడివాన కురిసింది. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రంలో ఐదు సెంటీమీటర్ల వర్షం పడింది. కర్నూలు జిల్లాలో సగటున 18.8, నంద్యాల జిల్లాలో 22.9 మి.మీ వర్షం కురిసింది. ఉమ్మడి చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసింది. గుంటూరు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. లాం వద్ద కొండవీటి వాగు, పెదపరిమి వద్ద గల కోటెళ్ల వాగు పొంగి ప్రవహిస్తున్నాయి. కొల్లిపర మండలంలో 80.2 మి.మీ వర్షం పడింది.



ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులో కాజ్‌వేకు ఆనుకుని ప్రవహిస్తున్న మున్నేరు



ఆర్.కె.బీచ్‌లో కురుస్తున్న వర్షం

బుధవారం అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు

(ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు)

జిల్లా	మండలం	గ్రామం	వర్షపాతం (సెంటీమీటర్లలో)
శ్రీకాకుళం	లావేరు	తామడ	21.8
విజయనగరం	పూసపాటిరేగ	గోవిందపురం	14.1
శ్రీకాకుళం	ఎచ్చెర్ల	ఎచ్చెర్ల	12.7
శ్రీకాకుళం	ఆముదాలవలస	ఆముదాలవలస	12.4
శ్రీకాకుళం	నరసన్నపేట	నరసన్నపేట	11.7
విశాఖపట్నం	విశాఖ అర్బన్	సీతమ్మధార	11.1
శ్రీకాకుళం	కోటబొమ్మాళి	నిమ్మాడ	11.0
శ్రీకాకుళం	రణస్థలం	పైడి భీమవరం	10.9

కట్టలేరు, వైరాయేరు, మున్నేరు ఉగ్రరూపం

ఉమ్మడి కృష్ణా జిల్లాను వాన ముంచెత్తుతోంది. కట్టలేరు, వైరాయేరు, మున్నేరు ఉగ్రరూపం దాల్చాయి. బుడమేరుకు వరద పోటెత్తింది. కంకిపాడు మండలం నెప్పల్లిలో అధిక వర్షాలకు గోడలు నానిపోయి రేకుల షెడ్డు కూలిపోవడంతో మేరి అనే మహిళ గాయపడింది. వత్సవాయి మండలం లింగాల వద్ద మున్నేరు వంతెన పై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. పెనుగంచిప్రోలు, ముచ్చింతల గ్రామాల మధ్య వంతెనపైకి నీరు చేరింది. వీరులపాడు మండలం పల్లంపల్లి, నందిగామ మండలం దాములూరు మధ్య కూడలి వద్ద కట్టలేరుపై కాజ్‌వే పూర్తిగా మునిగిపోయింది. వీరులపాడు మండలం దొడ్డదేవర పాడు వద్ద కట్టలేరుపై ఉన్న వంతెనను తాకుతూ వరద వెళుతోంది. జి కొండూరు మండలం జి కొండూరు, కందులపాడు గ్రామాల మధ్య ముత్యాలంపాడు వద్ద బుడమేరుపై తాత్కాలికంగా నిర్మించిన కాజ్‌వేపై వరద ఉధృతంగా ప్రవహిస్తోంది.

వెనుదిరిగిన బోట్లు

ఉభయ గోదావరి జిల్లాల్లో ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తున్నాయి. ట్యూనా చేపల కోసం వెళ్లిన బోట్లు వెనుదిరిగాయి. ఏలూరు జిల్లాలో మూడు రోడ్లు కొట్టుకుపోయాయి. దీంతో ఏజెన్సీ ప్రాంతాల నుంచి రాకపోకలు స్తంభించిపోయాయి. శ్రీనివాసపురం సమీపంలో రేల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. విశాఖ ఆర్కే బీచ్‌లోని సముద్రతీరం భారీగా కోతకు గురైంది.


ప్రత్యేక బృందాలు రంగ ప్రవేశం

రాష్ట్రంలో భారీ వర్షాలతో ఉత్పన్నమయ్యే పరిస్థితిని ఎదుర్కొనేందుకు రాష్ట్ర విపత్తుల స్పందన బలగాలు(ఎస్‌డీఆర్‌ఎఫ్) సర్వసన్నద్ధంగా ఉన్నాయి. కృష్ణా, గోదావరి నదులకు వరద ముప్పు పొంచి ఉండటంతో ఇప్పటికే రెడ్ అలర్ట్ జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు సహాయక చర్యల కోసం ఎస్‌డీఆర్‌ఎఫ్ ముందుగానే సన్నద్ధమైంది. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల్లో నాలుగేసి సహాయక బృందాల చొప్పున మొత్తం 8 బృందాలను నియోగించారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మామిడికుదురు, ఐనవల్లి, ఏలూరు జిల్లాలోని వేలూరుపాడు, కుక్కునూరులలో రెండేసి బృందాల చొప్పున సహాయక చర్యల కోసం సిద్ధంగా ఉన్నాయి. జిల్లా రెవెన్యూ, పోలీసు అధికారులతో కలసి లోతట్టు ప్రాంతాల ప్రజలతో మాట్లాడుతున్నాయి. అత్యవసర పరిస్థితి ఏర్పడితే వెంటనే తమను సంప్రదించాలని ఫోన్ నంబర్లు ఇస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా కృష్ణా నది తీరంలో పదేసి మంది సభ్యులతో కూడిన మూడు బృందాలను నియోగించారు. కర్నూలు, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరంలలో మూడేసి ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచింది. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాల్లోని గజ ఈతగాళ్లతోపాటు మత్స్యకార ప్రాంతాల్లోని ఈతగాళ్లను కూడా అందుబాటులో ఉంచారు.

---

198 సాగునీటి ప్రాజెక్టులను ప్రీక్లోజర్ చేశారు

రాయలసీమ ద్రోహి సీఎం జగన్: చంద్రబాబు



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని 198 ప్రాజెక్టులను ప్రీక్లోజర్ చేసిందని ప్రతిపక్ష నేత చంద్రబాబు విమర్శించారు. అందులో రాయలసీమలోనే 102 ప్రాజెక్టులు ఉన్నాయన్నారు. వాటి పనులు ఆపేసి కాంట్రాక్టు సంస్థలకు బ్యాంకు గ్యారంటీలు వెనక్కు ఇచ్చేశారని తెలిపారు. ఆయన బుధవారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి జగన్ ప్రీ క్లోజర్ చేసిన 102 ప్రాజెక్టుల్ని తిరిగి ప్రారంభిస్తామని తెలిపారు. సీమ ప్రాజెక్టుల పనులు ఆపేసిన సీఎం రాయలసీమ ద్రోహిగా మారాడని విమర్శించారు. అవసరమైన ప్రాజెక్టులు పూర్తి చేయలేదని, కమిషన్లు ఇచ్చే కాంట్రాక్టర్లకు మాత్రం అవసరం లేకపోయినా పనులు అప్పగించారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే గోదావరి నీటిని వివిధ మార్గాల్లో ఇచ్ఛాపురం వరకు అందించేలా ప్రణాళికలు వేశామన్నారు. తాగు నీటి ప్రాజెక్టులకు టీడీపీ ఐదేళ్లలో రూ.68,293 కోట్లు ఖర్చు పెడితే, వైఎస్సార్‌సీపీ నాలుగేళ్లలో రూ.22,165 కోట్లు మాత్రమే వెచ్చించిందని తెలిపారు. రాయలసీమలోని 4 జిల్లాలకు 2014–19లో తాము రూ.8,291 కోట్లు ఖర్చు పెట్టామని, నీరు – ప్రగతి కార్యక్రమం కింద రూ.4,150 కోట్లు, మొత్తం 5 ఏళ్లలో రూ.12,441 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019–23 మధ్య కేవలం రూ.2,011కోట్లు మాత్రమే ఖర్చు పెట్టిందని ఆయన చెప్పారు.

బాబూ.. సీమ ప్రాజెక్టులపై చర్చించే దమ్ముందా?

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి సవాల్



సాక్షి, అమరావతి: రాయలసీమ అభివృద్ధిపై టీడీపీ, చంద్రబాబు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన బాబు రాయలసీమకు చేసింది ఏమీ లేదని, ఆయన సొంతంగా ప్రారంభించి పూర్తి చేసిన ప్రాజెక్టు ఒక్కటంటే ఒక్కటి కూడా లేదన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాంతాన్ని కూడా చంద్రబాబు పట్టించుకోలేదని, కమీషన్ల కోసం ప్రాజెక్టుల వద్ద భూమి పూజ, శంకుస్థాపనలు చేసి దోచుకున్నారని విమర్శించారు. చంద్రబాబు లైవ్ షో ద్వారా ప్రభుత్వంపై చేసిన విమర్శలను బుధవారం గడికోట శ్రీకాంత్‌రెడ్డి హైదరాబాద్‌లో మీడియా ఎదుట తిప్పికొట్టారు. దమ్ముంటే సీమ ప్రాజెక్టులపై చర్చిద్దాం రండంటూ చంద్రబాబుకు సవాల్ విసిరారు. సీమ అభివృద్ధికి వైఎస్ జగన్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. సీమ అభివృద్ధిపై నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతూ.. ప్రజల గొంతు కోయాలని చూసిన దుర్మార్గుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు. హంద్రీ–నీవాను పూర్తి చేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. సీమ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా చంద్రబాబు ధర్నాలు చేయించారని గుర్తుచేశారు. రాయలసీమకు గుండెలాంటి గండికోట ప్రాజెక్టులో 27 టీఎంసీలు నిల్వ చేయించిన ఘనత వైఎస్ జగన్‌దేనని పేర్కొన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ గురించి బాబుకు కనీస అవగాహన లేదని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రంలో కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్‌తో మంచి ఫలితాలు

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో అదుపులో శాంతిభద్రతలు
- సూపర్ న్యూమరీ డీఎస్పీలను రెగ్యులర్ చేస్తూ పదోన్నతి
- త్వరలో ఎస్‌ఐలకు పదోన్నతులు
- ఏపీ డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి



కర్నూలు: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా గత సంవత్సరం కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ ఏర్పాటు చేశామని, దీనివల్ల మంచి ఫలితాలు వచ్చాయని ఏపీ డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లాల పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. నేర నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై ఉమ్మడి జిల్లా అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలకు తగు సూచనలు, సలహాలు ఇచ్చి దిశా నిర్దేశం చేశారు. అనంతరం కర్నూలు, నంద్యాల జిల్లాల ఎస్పీలు కృష్ణకాంత్, రఘువీర్ రెడ్డితో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, గత మూడు సంవత్సరాలతో పోలిస్తే గడిచిన ఆరు నెలల కాలంలో నేరాలు గణనీయంగా తగ్గాయన్నారు. బాడీలీ అఫెన్స్, మర్డర్, డౌరీ డెత్, హత్యా ప్రయత్నాలు తదితర గ్రేవ్ క్రైం కర్నూలు జిల్లాలో 27 శాతం, నంద్యాల జిల్లాలో 25 శాతం తగ్గాయని వివరించారు. దిశ యాప్ అందుబాటులోకి రావడంతో మహిళలపై నేరాలు భారీగా తగ్గాయన్నారు. కర్నూలు జిల్లాలో 65 శాతం, నంద్యాల జిల్లాలో 46 శాతం మహిళా నేరాలు తగ్గాయన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలు కర్నూలులో 39 శాతం, నంద్యాలలో 36 శాతం, ఎస్సీ, ఎస్టీ నేరాలు 27 శాతం తగ్గాయన్నారు. నేరాలు తగ్గించడమే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. రౌడీ మూకలపై గట్టి నిఘా ఉంచామన్నారు. గత సంవత్సరం అక్రమ మద్యం రవాణా చేసే గ్యాంగ్‌లపై పీడీ యాక్ట్ కింద 35 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ సంవత్సరం కూడా పీడీ యాక్ట్ సిద్ధం చేశామన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా 13వేల కేసులు అందజేస్తే 1400 కేసులు ట్రయల్ పూర్తయి 62 శాతం రికార్డు స్థాయిలో శిక్షలు పడ్డాయన్నారు. త్వరలో ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి కల్పిస్తున్నట్లు వెల్లడించారు. సూపర్ న్యూమరీ డీఎస్పీలను రెగ్యులర్ డీఎస్పీలుగా పదోన్నతి కల్పించినట్లు వెల్లడించారు.



"తొలి ప్రేమ అనేది ఒక రకమైన టీకా లాంటిది. మరోసారి అలాంటిది జరగకుండా అది కాపాడుతుంది.
- హానోరే డె బాల్జాక్

సాక్షి
గురువారం, 27 జూలై 2023

మార్పులన్నీ మంచికేనా?

జీవితంలో శాశ్వతమైన ఒకే ఒక్కటి ఏమిటీ అంటే మార్పు అంటాడు ఓ గ్రీకు తత్త్వవేత్త. వ్యాపార దిగ్గజం ఎలాన్ మస్క్, ఏడాది క్రితం అతని చేజిక్కిన ట్విట్టర్ విషయంలో శాశ్వతమైనది ఏమిటంటే, 'అతి మార్పులు, తరచూ మార్పులు'. సోషల్ మీడియా మెసేజింగ్ వేదిక ట్విట్టర్ పేరును ఎక్స్ డాట్ కామ్‌గా, పిట్ట లోగోను ఎక్స్‌గా జూలై 24న మస్క్ మార్చాక విశ్లేషకుల వ్యాఖ్య ఇది. ప్రపంచ పటంలోని అనేక చిన్నదేశాల స్థూల జాతీయోత్పత్తి కన్నా ఎక్కువగా, దాదాపు 4400 కోట్ల డాలర్లు పెట్టి ట్విట్టర్‌ను కొన్నప్పటి నుంచి వేల ఉద్యోగుల తొలగింపు, బ్లూ టిక్ నిబంధనల్లో మార్పు, ట్వీట్‌లో అక్షరాల పరిమితి పెంపు, ఆ పైన రోజులో ఒక యూజర్ చూసే ట్వీట్ల సంఖ్యపై పరిమితి విధింపు... ఇలా మస్క్ శైలి మార్పులు అనేకం. గత 16 ఏళ్ళలో జరిగిన మార్పుల కన్నా 6 నెలల్లో మస్క్ చేసిన మార్పులే ఎక్కువ. దానికి కొనసాగింపే ప్రకటించిన 24 గంటల్లోనే ఆచరణలో పెట్టిన తాజా పేరు, రూపు మార్పులు. సోషల్ నెట్‌వర్కింగ్ యాప్‌కు మించి ట్విట్టర్‌ను విస్తరించాలనే వ్యూహం దీని వెనకుందట! కొత్త పేరు, రూపుతో బ్యాంకింగ్, షిప్పింగ్ సహా సమస్తం చేసే విస్తృత వ్యాపారంలో ట్వీట్లు ఇక ఓ చిన్న భాగం మాత్రమేనట! ఇప్పటి దాకా అనేక పరిమితుల మధ్య కూడా ఎంతో కొంత స్వేచ్ఛాస్వరానికి వేదికైన ట్విట్టర్ ఇక మరో ఫక్తు మస్క్ వ్యాపార శాఖగా మారిపోనుంది.

అమెరికా టెక్ వ్యాపారవేత్తలు నలుగురు కలసి చిన్న బృందాల మధ్య సమాచార వినిమయానికి ఎస్ఎంఎస్ సేవ అనే ఆలోచనగా మొదలై, ట్విట్టర్ ఇంతటి విశ్వరూపం దాల్చడం అనూహ్యం. పేరులోని అక్షరాల్లో, లోగోలో అనేక మార్పుల తర్వాత 2006లో పిట్ట బొమ్మ ఆలోచనొచ్చింది. 2010లో ట్రేడ్‌మార్క్ పొంది, 2012లో ఇప్పటి లోగో ఖరారైంది. పదేళ్ళ పైగా లేత నీలం, తెలుపు రంగుల్లో ఈ పాపులర్ వేదిక ప్రపంచ కమ్యూనికేషన్‌లో విడదీయలేని భాగమైంది. పేర్లను మర్చిపోవచ్చు కానీ, లోగోల్ని మాత్రం మనిషి మెదడు మర్చిపోదన్నది శాస్త్రీయ సత్యం. దాన్ని కూడా మస్క్ పక్కన పెట్టారు. యాపిల్, నైక్ సంస్థల లానే లోగోతోనే ఠక్కున తెలిసిపోతున్న ట్విట్టర్ పేరు, బొమ్మ అన్నీ మార్చడం పైకి అర్థరహితమే! అయితే, అందులోని వ్యాపారతర్కం సదరు పక్కా వ్యాపారికే ఎరుక.

పేరులో ఏముందనేవారికి మస్క్ భిన్నం. వ్యాపారంలో, వ్యక్తిగత జీవితంలో తనకు కలిసొస్తుందని నమ్మే 'ఎక్స్' అక్షరం ఈ సంస్థ భవితవ్యాన్నీ మలుపు తిప్పుతుందని ఆయన భావన. ఎక్స్ అక్షరంపై ఆయన వ్యామోహం ఇవాళ్టిది కాదు. 1999లోనే ఆయన ఎక్స్ డాట్‌కామ్ పేరిట ఓ ఆన్‌లైన్ బ్యాంక్‌కు సహ వ్యవస్థాపకుడు. అనంతరం ఆ సంస్థే 'పే పాల్'గా మారింది. మస్క్ తాలూకు రాకెట్ కంపెనీ పేరు 'స్పేస్ ఎక్స్'. ఆయన సారథ్యంలోని టెస్లా సంస్థ విడుదల చేసిన తొలి స్పోర్ట్ యుటిలిటీ వెహికల్ మోడల్ పేరూ ఎక్సే! చివరకు మూడేళ్ళ క్రితం పుట్టిన తన కుమారుడి పేరు కూడా ఎక్స్ అని వచ్చేలా పెట్టారు. అయితే, ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా 45 కోట్ల మంది నెలవారీ ఖాతాదార్లున్న ట్విట్టర్ పేరు, లోగో మార్పులకు ప్రాథమిక ప్రతిస్పందన అంత ఆశాజనకంగా లేదు.

ట్విట్టర్ పాపులర్ సంస్కృతిలోనే కాదు భాషలోనూ భాగమైంది. ట్వీట్ చేయడమనేది క్రియా పదమైంది. సమాచారం పంచుకొనేవారు ట్వీపుల్ పేర సర్వనామమయ్యారు. ట్విట్టర్ వచ్చాక జనం వార్తలు చదివే తీరు, స్పందించే తీరు అన్నీ మారిపోయాయి. తీరా మస్క్ వచ్చాక ట్విట్టర్ స్వరూపమే కాదు... స్వభావమూ మారిపోయింది. ట్విట్టర్‌ను కొన్నప్పుడు తనంతట తానుగా సందేశాలు పంపే కంప్యూటర్ ప్రోగ్రామైన బోట్ సమస్యను పరిష్కరిస్తాననీ, తిరుగులేని వాక్ స్వాతంత్ర్యానికి దీన్ని వేదికగా మారుస్తాననీ మస్క్ మాటిచ్చారు. అవన్నీ నీటి మూటలయ్యాయి. పైపెచ్చు, మస్క్ హయాంలోనే ట్విట్టర్‌లో బోట్స్ సంఖ్య, వాటిలో రకాలు, విషం కక్కే సందేశాలు... అన్నీ పెరిగాయి. అదీ చాలదన్నట్టు మనోడు వచ్చాక ట్విట్టర్‌లో పారదర్శకత తగ్గింది. మీడియాపై ధ్వజమెత్తే మస్క్ అందుకు తగ్గట్టే ట్విట్టర్‌కు జర్నలిస్టులు మెయిల్ చేస్తే జవాబిచ్చే సంప్రదాయానికీ తిలోదకాలిచ్చారు.

ఒకప్పుడు సంపూర్ణ వాక్ స్వాతంత్ర్య వీరుడిననీ, ప్రజాస్వామ్యానికి వాక్ స్వాతంత్ర్యమే పునాది అనీ, ట్విట్టరనేది మానవాళి భవితవ్యానికి సంబంధించిన అంశాలను చర్చించే రచ్చబండ అనీ బీరాలు పలికిన మస్క్ తీరా ఏడాది తిరిగేసరికల్లా బోర్డు తిప్పేశారు. ఆ యా దేశాల్లోని చట్టాలను గౌరవించేవాడినని ప్రకటించుకుంటూ, జర్నలిస్టులతో సహా పలువురి ట్విట్టర్ ఖాతాల్ని సస్పెండ్ చేసే స్థితికి వచ్చారు. ఇప్పుడాయన ధ్యేయమల్లా అర్జెంటుగా చేతిలోని పిట్టను ప్రపంచంలో అతి పెద్ద డిజిటల్ ఉత్పత్తుల్లో ఒకటైన చైనా 'ఉయ్‌ఛాట్' పద్ధతిలో సమస్త సర్వీసుల యాప్‌గా మార్చేయడం!

మెసేజింగ్, ట్యాక్సీ సేవల ఆర్డరింగ్, డిజిటల్ చెల్లింపులు అన్నీ చేయడానికి వీలుండే ఉయ్ ఛాట్ ఘన విజయానికి చైనాలో మరో పోటీ లేకపోవడమూ ఒక కారణం. అది మర్చిపోయి, వాక్ స్వాతంత్ర్యంతో మొదలైన ఓ వేదిక ఇలా వాక్ స్వాతంత్ర్యమే లేని నిరంకుశ దేశంలోని అంశాలతో ప్రేరణ పొందే స్థితికి రావడమే విషాదం. మార్పు మంచికేనని అతిగా నమ్మినట్టున్న మస్క్ ట్విట్టర్‌లో ఏడాదిలో మరీ ఇన్ని మార్పులు చేయడమే విడ్డూరం. ఏమైనా, ఉత్సాహం ఉరకలేస్తూ, స్నేహంగా, స్వేచ్ఛగా తలెత్తి చూస్తున్న నీలిరంగు బుర్రుపిట్ట తుర్రుమంది. నిగూఢతకూ, అపరిమితత్వానికీ ప్రతీకైన నల్లరంగు ఎక్స్ ముందుకొచ్చింది. మిగిలిన వ్యాపారాల మాటేమో కానీ సామాజిక మాధ్యమ వేదికగా ఇది నిలుస్తుందా? సరైన మరో స్వేచ్ఛా వేదిక అవసరమనే సందు తానే సృష్టించినందున భవిష్యత్తులో ఆ రంగంలో వచ్చే పోటీలో గెలుస్తుందా? ఇప్పటికే థ్రెడ్స్ లాంటివి తల ఎగరేస్తున్నాయి. మార్పు మంచికే అయినా, అన్ని మార్పులూ మంచివేనా అంటే ఏమో చెప్పలేం!

తెస్తున్నా ఏడుపేనా?



రూ.పది వేల కోట్లకుపైగా రెవెన్యూ లోటు నిధులను రాబట్టింది ఎవరు?

చేతులెత్తేసిన చంద్రబాబు.. ఉడుంపట్టుతో కేంద్రం నుంచి సాధించిన సీఎం జగన్

రాష్ట్ర విభజన హామీలకు సంబంధించి కీలకమైన రెవెన్యూ లోటు భర్తీ, పోలవరం విషయంలో కేంద్రం సానుకూలంగా స్పందించి రూ.వేల కోట్ల నిధులను విడుదల చేయటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధి, పట్టుదలే కారణమన్నది నిర్వివాదాంశం. ఆలస్యంగానైనా కేంద్రం నుంచి విడుదలవుతున్న నిధులే ఇందుకు నిదర్శనం! కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా కొనసాగి కూడా చంద్రబాబు సాధించలేని విభజన అంశాలను సీఎం జగన్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా చిక్కు ముడులను తొలగిస్తూ రాబడుతోంది. అవకాశం లభించిన ప్రతి సందర్భంలోనూ ఏపీకి ప్రత్యేక హోదా ఆవశ్యకతను వివరిస్తూ సజీవంగా ఉంచుతోంది. సీఎం జగన్ కృషితో రాష్ట్రానికి నిధులు వస్తుంటే ఇప్పుడెందుకు ఇస్తున్నారనే తరహాలో రామోజీ కుళ్లు బుద్ధి చాటుకుంటున్నారు!!

– సాక్షి, అమరావతి

నాడు ఇచ్చిందే పది వేలు..!!

రాష్ట్ర విభజన నేపథ్యంలో 2014–15లో ఏర్పడిన రెవెన్యూ లోటును భర్తీ చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినా పూర్తి స్థాయిలో రాబట్టడంలో నాడు అధికారంలో ఉన్న చంద్రబాబు దారుణంగా విఫలమయ్యారు. కాగ్ అకౌంట్స్ ప్రకారం రెవెన్యూ లోటు రూ.16,000 కోట్లు కాగా ఇక అది ముగిసిన అంశమని కేంద్ర ఆర్థిక శాఖ పేర్కొన్నా చంద్రబాబు నోరెత్తలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక పట్టు వదలకుండా ప్రధానితోపాటు నీతి ఆయోగ్‌తో దీనిపై పలు దఫాలు సంప్రదింపులు జరిపారు. ఈ మేరకు గణాంకాలతో కూడిన పత్రాలను అందచేయడంతో విభజన అంశాల సత్వర పరిష్కారానికి కేంద్రం ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ క్రమంలో రెవెన్యూ లోటు భర్తీని పునఃపరిశీలించిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.10,461 కోట్లను మంజూరు చేసింది. మరి ఈ విషయం రామోజీకి తెలుసా? తెలిసీ నటిస్తున్నారా?

బకాయిలపై బాబు గజగజ..

ఓటుకు కోట్లు కేసు భయంతో అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి పరారై కరకట్టకు చేరుకున్న చంద్రబాబు తెలంగాణ నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిలు, పలు సంస్థల విభజన గురించి మాట్లాడితే ఒట్టు!! 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకు తెలంగాణకు సరఫరా చేసిన విద్యుత్ బకాయిల ఊసెత్తేందుకే గజగజలాడారు! సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక పలుదఫాలు ఒత్తిడి తెచ్చి బకాయిలు చెల్లించేలా కేంద్ర ప్రభుత్వంతో ఆదేశాలు జారీ చేయించారు. ఆంధ్రప్రదేశ్‌కు విద్యుత్ సరఫరా బకాయిల కింద రూ.7,230.14 కోట్లను చెల్లించాలని కేంద్రం తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించినందున ఇవాళ కాకపోతే రేపైనా చెల్లించక తప్పదు!!

జీవనాడికి నిధుల కళ..

పోలవరంపై 2013–14 పాత ధరలను పక్కన పెట్టి తాజా ధరల మేరకు నిధులిచ్చేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పట్టుదలగా సీఎం జగన్ చేసిన ప్రయత్నాలతో పోలవరం తొలి దశ పూర్తికి రూ.12,911.15 కోట్లు మంజూరుకు అంగీకారం

ఏది నిజం?

తెలిపింది. బిల్లుల చెల్లింపులో విభాగాల వారీగా విధించిన పరిమితులను తొలగించేందుకు కూడా సమ్మతించింది. నిధులు మంజూరును కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆమోదించారు. పోలవరాన్ని వేగంగా పూర్తి చేసేందుకు అడ్‌హాక్‌గా నిధులు మంజూరు చేయాలని ప్రధాని మోదీని సీఎం జగన్ పలు సందర్భాల్లో కోరారు. ఈ నెల మొదటి వారంలోనే ఢిల్లీ పర్యటన సందర్భంగా పోలవరం నిర్మాణ వ్యయం రూ.55,656.87 కోట్లకు ఆమోదం తెలపాలని ప్రధాని మోదీని సీఎం జగన్ కోరారు. మరో 36 గ్రామాల్లో నిర్వాసితులకు సహాయ పునరావాసం ప్యాకేజీ అందిస్తే తొలిదశ పూర్తవుతుందని నివేదించారు. ఈ క్రమంలో పోలవరం తొలిదశ నిర్మాణానికి మొత్తంగా రూ.17,144 కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన రూ.1,310.15 కోట్ల సొంత నిధులను వెంటనే రీయింబర్స్ చేయాలని అభ్యర్థించారు.

పోర్టులు.. కడప స్టీల్ ప్లాంట్

దుగరాజపట్నం పోర్టు సాధనలో గత సర్కారు వైఫల్యాలు రామోజీ కంటికి కనపడలేదు. ఇప్పుడు దానికి బదులు రామాయపట్నం పోర్టు నిర్మాణానికి సీఎం జగన్ ప్రభుత్వం ఒకపక్క కేంద్రంపై ఒత్తిడి తెస్తూనే మరో పక్క సొంతంగా నిర్మాణానికి చర్యలు చేపట్టింది. రామాయపట్నం తొలి దశ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. తొలి బెర్త్ నిర్మాణం జరుగుతుండటం రామోజీకి కనిపించలేదా? కడప స్టీల్ ప్లాంట్ గురించి విభజన చట్టంలోనే ఉన్నా చంద్రబాబు ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు.

సత్వరమే పెండింగ్ హామీలు పరిష్కరించండి

ఈ నెల తొలి వారంలో ఢిల్లీ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీతో జరిగిన సమావేశంలో రాష్ట్ర విభజన పెండింగ్ హామీల గురించి సీఎం జగన్ మరోసారి ప్రస్తావించారు. ప్రత్యేక హోదా సహా పార్లమెంట్ సాక్షిగా ఏపీకి ఇచ్చిన హామీలను వేగంగా నెరవేర్చాలని కోరారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక హోదా ఎంతో దోహదపడుతుందని, రాష్ట్రం స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగుతుందని, దీనిపై సత్వరమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇప్పుడు కేంద్రంపై ఒత్తిడి తెస్తూనే కడప స్టీల్ ప్లాంట్‌ను రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టింది. ముడి ఖనిజం కోసం మూడు గనులను ఏపీ ఎండీసీకి కేటాయించాలని ఇటీవల ఢిల్లీ పర్యటనలో సీఎం జగన్ ప్రధానిని కోరారు. ఇది కేంద్రంపై ఒత్తిడి తేవడం కాదా? ఇక ఢిల్లీలో ఏపీ భవన్‌తో పాటు విభజన చట్టంలో పేర్కొన్న సంస్థల విభజన, ఆస్తుల పంపిణీపై కేంద్రంతో పాటు తెలంగాణపై కూడా సీఎం జగన్ ప్రభుత్వం ఒత్తిడి తెస్తూనే ఉంది.

విశాఖ రైల్వే జోన్..

విశాఖ రైల్వే జోన్‌ను ఇప్పటికే ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. ఈ ప్రకటన వెలువడింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలోనే. గిరిజన విశ్వవిద్యాలయంపై ప్రకటన కూడా మన ఎంపీల ఒత్తిడితోనే సాధ్యమైంది. నాడు ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయాన్నే కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంగా ప్రకటించాలని చంద్రబాబు కోరడంతో కేంద్రం అందుకు నిరాకరించింది.

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నిజమైన సంతోషం



చాలా ఉదారమైన అనులేఖనానికి నేను అర్హురాలిని కాక పోయిన ప్పటికీ, గాల్‌బ్రెయిత్ అవార్డ్–2023 తీసుకోవడం నాకు నిజంగా సంతోషం కలిగించింది. ('ఆర్థిక శాస్త్రంలో విలువైన ఆవిష్కరణలు: నాయకత్వం, పరిశోధన, సేవ ద్వారా మానవాళికి విశిష్ట తోడ్పాటుకు గుర్తింపుగా' ఇచ్చారు.) – జయతీ ఘోష్, ఆర్థికవేత్త

సెల్యూట్!



కార్గిల్ పోరాటంలో తమ జీవితాలను త్యాగం చేసిన సాహస సైనికుల గౌరవార్థం సెల్యూట్ చేయడానికి ఒక క్షణం తీసుకుందాం. మన దేశాన్ని రక్షించడంలో వారి చెదరని ధైర్యం, పట్టుదల అనేవి మన అపార గౌరవం, కృతజ్ఞతలకు అర్హమైనవి. (జూలై 26న కార్గిల్ విజయ్ దివస్.)
– తాహిర్ అన్వర్, రేషనల్ ముస్లిం

జాగ్రత్తలు



కళ్లకలక కేసులు పెరుగుతున్నాయి. కళ్లను తాకడం, రుద్దుకోవడం చేయవద్దు. కళ్లను తాకేట్టయితే చేతుల్ని శుభ్రంగా కడు క్కోవాలి. ఇది వైరల్ ఇన్‌ఫెక్షన్ కాబట్టి యాంటీ బయాటిక్స్ అక్కర్లేదు. ప్యారసిటమాల్ మాత్ర, చన్నీటి కాపడం ఉపశమనం కలిగిస్తాయి. – జోయీతా, ఫిజీషియన్

తప్పు మాట



మాంసాహారం తక్కువ కులానికి సంబంధించినదనే మాట తప్పు. ఇరు పక్షాలూ ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేసిన అతి పెద్ద భ్రమ ఇది. – అమిత్ పాండీలియా, కాలమిస్ట్

ఏమైనట్టు?



కొన్నేళ్ల క్రితం 'క్లింటన్‌ల' వ్యక్తిగత షెఫ్ మునిగి పోయినట్టుగానే హాస్సేన్ ఒబామా (అమెరికా మాజీ అధ్యక్షుడు) వ్యక్తిగత షెఫ్ వాళ్ల ఇంటి దగ్గరి కొలనులో మునిగి పోయాడు. వీళ్ళా, స్వేచ్ఛా ప్రపంచపు నాయకులు! – అజిత్ దత్తా, రచయిత

ప్రత్యామ్నాయ యోధుడు

సందర్భం



డా॥ కోయి కోటేశ్వర రావు

'రాత్రి తోడేళ్ళ దాడిలో అమాయకపు గొర్రె పిల్లలు బలవుతాయి. ఆ గొర్రె పిల్లలు చిందించిన నెత్తుటి ధారలు లోయల్లోని రాతి గుట్టల మీద పడి ఉంటాయి. ఉదయించిన సూర్యుడు ఈ ఘోరాన్ని సమాజానికి చాటి చెబుతాడు.' – ఖలీల్ జీబ్రాన్

కారంచేడు పొలాలను ముంచెత్తిన దళితుల నెత్తుటి గాయాల్లోనుండి కనీ వినీ ఎరుగని ఆత్మగౌరవ పోరాటాన్ని నిర్మించిన అసమాన సామాజిక, సాహిత్య వైతాళికుడు డా॥ కత్తి పద్మారావు. పీడిత ప్రజలపై జరుగుతున్న మారణ కాండనూ, అందుకు కారణమైన కుల వ్యవస్థ కుటిల నీతినీ, దీనిని అంతం చేయడానికి అవసరమైన బృహత్తర చైతన్యాన్నీ తెలుగు నేల మీద రగిలించిన ఉద్యమ భాస్కరుడాయన.

అసాధారణమైన వక్తృత్వంతో, ప్రగాఢమైన, కర్తృత్వంతో, నిబద్ధత కలిగిన నేతృత్వంతో డా॥ బాబాసాహెబ్ అంబేడ్కర్ అందించిన కుల నిర్మూలనా పోరాట రథాన్ని పద్మారావు ముందుకు తీసుకుపోతున్నారు. డెబ్బై ఏళ్ళ ప్రాయంలో కూడా వేయి చేతులతో స్ఫూర్తిదాయకమైన సృజన చేస్తున్నారు. కవిత్వం, విమర్శ, చరిత్ర, సంస్కృతి, తత్వశాస్త్రం, కులం, మతం, పితృస్వామ్య రాజకీయం, తులనాత్మక వివేచన, సాహిత్య చరిత్ర, వ్యక్తిత్వవికాసం లాంటి అనేక అంశాల్లో ఎనభైకి పైగా బృహత్ గ్రంథాలను వెలువరించారు.

పొట్ట పొడిస్తే ఆకలి పేగులు తప్ప, అక్షరం ముక్కరాని నిరుపేద దళిత కుటుంబంలో పద్మారావు జన్మించారు. వైస్ ప్రిన్సిపాల్ ఉద్యోగాన్ని విడనాడి, దళిత ఉద్యమంలోకి దూకారు.

ప్రత్యామ్నాయ సాహిత్య, సాంస్కృతిక విజ్ఞాన సర్వస్వంలా పద్మారావు ప్రతి నిత్యం ప్రజ్వలిస్తుంటారు. తన పదమూడు కవితా సంకలనాలలో సమకాలీన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను ప్రతిభావంతంగా అక్షరబద్ధం చేశారు. 'మనిషే ఓ మహా కావ్యం', 'ఈ యుగం మాది' వంటి దళిత మహా కావ్యాలతో పద్మారావు బుద్ధుని నైతిక ప్రబోధాన్నీ, అంబేడ్కర్ సైద్ధాంతిక దృష్టినీ కవిత్వీకరించారు.

అస్తిత్వ ఉద్యమాల వెలుగుల్లో పద్మారావు తెలుగు సాహిత్య చరిత్రను పునర్నిర్మించారు. దళిత బహుజనుల చరిత్ర మూలాలను తవ్వి పోశారు. దళిత కోణం నుండి భారత దేశ చరిత్రను వ్యాఖ్యానించారు. 'భారతీయ సంస్కృతిలో స్త్రీ', 'పితృస్వామ్య సంస్కృతిలో స్త్రీ' అనే పరిశోధన గ్రంథాల ద్వారా అనాదిగా స్త్రీలపై జరుగుతున్న అణచివేతను సాధికారికంగా నిరూపించి, మహిళా విముక్తికి మార్గం చూపారు. అత్యంత సంక్లిష్టమైన చార్వాక, బౌద్ధ దర్శనాలను రచించి, భారతదేశ తత్త్వశాస్త్రంపై పద్మారావు కొత్త వెలుగులు ప్రసరింపజేశారు.

భారత దేశంలో సాంఘిక ఉగ్రవాదం, ఆర్థిక తీవ్రవాదం విజృంభిస్తున్న ప్రమాదకరమైన సందర్భంలో అంబేడ్కర్ బహుముఖీన భావ జాల ఔన్నత్యాన్నీ, ఆ విశ్వ విజ్ఞాన మూర్తి ప్రాసంగికతనూ తన రచనల్లో అద్భుతంగా చాటి చెప్పారు.

'నా జీవిత చరిత్ర అంటే, నేను జీవించిన కాలంలో తెలుగు వారి జీవిత చరిత్ర' అనే ఎరుకతో పద్మారావు తన ఏడు దశాబ్దాల జీవన ప్రస్థానాన్ని కళ్ళకు కట్టినట్లుగా విశదీకరిస్తూ రాసిన 'ఒక అస్పృశ్యుని యుద్ధ గాథ' పెను సంచలనం. ఈ యుద్ధగాథను చదివితే, అంటరానితనాన్నీ, పేదరికాన్నీ ఎదుర్కొని వర్గ, కుల, మత వివక్షనూ, రాజ్య హింసనూ తట్టుకొని విజేతగా ఎదగటానికి అవసరమైన మెథడాలజీ అర్థమవుతుంది. 'నాది తరతరాల పాట, విశ్వంలో చీకటి నిడివెంతో నా పాట జీవితమంత' అని కలమెత్తి, గళమెత్తి గర్జిస్తున్న పద్మారావు ఈనాటి తరానికి విలువైన జ్ఞానాన్ని నేర్పుతున్నారు.

వ్యాసకర్త మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు। 94404 80274

దళితోద్యమ దీపశిఖ



నేడు డా॥ కత్తి పద్మారావు 70వ జన్మదినం

'చరిత్ర ప్రతి మలుపులో ఓ ఉద్యమం. ఉద్యమం ఆగిన ప్రతి మజిలీలో ఒక నాయకుడు పుడతాడు' అని ఓ చైనా సామెత. కులం, ఆ కులానికి ఆధారమైన మతం, మత విశ్వాసాలు వాటికి పునాదులైన పురాణాలు, స్మృతులు వంటివాటిపై ఈ దేశ జనానికి సరైన అవగాహన లేకపోవడం వల్ల కీలవేన్మణి, కారంచేడు, చుండూరు, నేటి మణిపూర్ మతోన్మాద హింసాకాండ వంటివి దేశాన్ని కాల్చుకు తింటున్నాయి. అంతర్జాతీయ యవనిక మీద తల దించుకొనేలా చేస్తున్నాయి. అలాంటి అత్యంత దుర్మార్గమైన చరిత్ర మలుపుల్లో బుద్ధుడు, పూలే, అంబేడ్కర్, అయ్యంకాళీల వరుసలో ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యమమే తయారు చేసుకొన్న నాయకుడు డా॥ కత్తి పద్మారావు. మాల, మాదిగ అంటరాని పల్లెల వెతల్నీ, ఆక్రందనల్నీ, ఆవేదనల్నీ నిలువెల్లా నింపుకొన్న మహోన్నతమైన సాహితీ ఉద్యమ స్ఫూర్తి పద్మారావు. ఆయన స్థాపించిన 'దళిత మహాసభ' తెలుగు నేలపై దళితోద్యమానికి దీపశిఖ అయ్యింది.

కారంచేడు దుర్మార్గపు హత్యాకాండతో చలించిపోయి ఉద్యోగాన్ని వదిలి ఉద్యమంలోకి దూకారు కత్తి. చుండూరులో అమరులైన దళితుల శవాల్ని ఊరి నడిబొడ్డున రక్త క్షేత్రంలో ఖననం చేయించి ఢిల్లీ బోట్‌క్లబ్ దాకా ఉద్యమాన్ని నడిపిన ధీశాలి ఆయన. ఆయన కవిత్వం, ఉపన్యాసం, చరిత్ర రచన, ఉద్యమ నిర్మాణం ... దేనికదే తమదైన ప్రత్యేకతతో కనిపిస్తాయి.

ఆంధ్రప్రదేశ్‌లో స్వామి అచుతానంద్ శిష్యులుగా భాగ్యరెడ్డివర్మ, కుసుమ ధర్మన్నలు నిర్మించిన 'ఆది హిందూ' ఉద్యమం కొంతమేరకు దళిత మహాసభకు మార్గదర్శకంగా ఉంది. నేడు దళిత చైతన్యం... సామాజిక అవలక్షణాల నుంచీ, సాంస్కృతిక బానిసత్వం నుంచీ విముక్తిని పొందే దిశలో ముందుకు కదులుతోంది. ఆ చైతన్య స్థాయిని మనం పద్మారావు కవిత్వంలో చూడవచ్చు. తెలుగు దళిత కవిత్వంలో ఆయన కవిత్వానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. 'జైలు గంటలు' మోగించుకొంటూ మాల, మాదిగ పల్లెల్లో నీలి కేకలు సృష్టిస్తూ, అంటరాని అణగారిన కులాల అవమానాగ్నుల్ని 'ముళ్ళ కిరీటంగా' ధరించి; అంటరాని వారి, 'భూమి భాష'నే మాట్లాడుతూ 'కట్టెల మోపుని' నెత్తికెత్తుకొని, 'ఆత్మ గౌరవస్వరం'తో, 'ఈ దేశం మాది' అంటూ దూసుకు వచ్చారు.

సందర్భం



డా॥ జి.వి.రత్నాకర్

ఆయన 'ఆమె పాదాల నెర్రెలు ఒక పునఃస్పష్ట సంకేతాలు' కవితలో: 'మీరు మానవ సంస్కృతి నుండి శిల్ప సంస్కృతికి/ పరిణమిస్తున్నారు/ అందుకే మీలో మానవతా స్పర్శ లేదు/ అందుకే మళ్ళీ ఆ దళిత తల్లి/ మానవతా పాఠశాల/ అందులో/ విద్యార్థులం అవుదాం! రండి/ అప్పుడే భారత దేశానికి/ పునరుజ్జీవం' అంటారు.

నేడు సమాజంలో వ్యాపిస్తున్న విష సంస్కృతిని, కుల హత్యలు, పరువు హత్యల్ని నిరసిస్తూ:

'వివాహానికి కులం అడ్డుందని/ ఏ దేవుడు చెప్పాడు?/ ప్రేమ ఒక సంపద/ సంపద కోసం/ ప్రేమను చంపడమెందుకు?/ఇక రాబోయేది/ సంకెళ్ళు తెంచే కాలం/ గోడలు కూల్చే కాలం/ ప్రేమదే విజయం/ ప్రేమదే విశ్వజనీన సూత్రం... అంటారు.

మరోచోట... 'జీవితం ఒక మహాయానం/ ఆ ప్రయాణంలో కడలి అలల్లోని/ స్వరం మనకు వినిపిస్తోంది./ ఏవో ఉక్కు సౌధాలు/ కూలుతున్న శబ్దాలు/ మనకు వినిపిస్తాయి/ బౌద్ధ రాజ్య ఆవిర్భావం కోసం/ ఆత్మ గౌరవంతో ప్రజ్వలించాలి/ అంబేడ్కర్ పునరుజ్జీవన/ ఆయుధకర్త' అంటారు.

భారతీయ దళిత కవిత్వంలో డా॥ కత్తి పద్మారావు కవిత్వం ప్రత్యేక శైలిలో కనిపిస్తుంది. అది దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను కళ్లకు గట్టింది. నా చిన్నప్పటి నుండి ఆయన ఉపన్యాసాలు వింటూ, కవిత్వం చదువుతూ పెరిగాను. కత్తి నాయకత్వం ఎప్పటికీ నాకు ఓ మహోన్నత శిఖరాం లానే కనిపిస్తుంది.

వ్యాసకర్త హెడ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిందీ, ఎమ్ఏఎన్‌యూ యూనివర్సిటీ । 70135 07228

ప్రతి క్షణం మెలకువగా...

1. స్వర్గం తలుపులు

నొబుషిగె అనే పేరు గల సైన్యాధికారి, జెన్ గురువు హకు ఇన్‌ను అడిగాడు: ''నిజంగా స్వర్గం, నరకం ఉన్నాయా?''

''ఎవరు నువ్వు?'' అని అడిగాడు హకు ఇన్.

''నేను సైన్యాధికారిని.'' చెప్పాడు నొబుషిగె.

''నువ్వా సైన్యాధికారివా! రక్షణ కొరకు నిన్నే ప్రభువు తన కొలువులో పెట్టుకుంటాడు? అడుక్కు తినేవాడి మొహంలా ఉంది నీ మొహం'' అన్నాడు హకు ఇన్.

నొబుషిగె అరికాలిమంట నెత్తికెక్కింది. ఒర నుండి కత్తి దూయబోయాడు. హకు ఇన్ తన ధోరణి ఆపకుండా కొనసాగించాడు: ''నా కంఠం ఉత్తరించేటంత పదును నీ కత్తికి లేదనుకొంటాను.''

నొబుషిగె కత్తిని ఒర నుండి బైటకు లాగినాక, హకు ఇన్ అన్నాడు: ''ఇప్పుడు నరకం తలుపులు తెరుచుకున్నాయి.''



ఈ మాటలు వినగానే సైన్యాధికారికి అర్థం అయ్యింది, గురువుగారు శిష్యులకు నేర్పే శిక్షా పద్ధతి ఇది అని! వెంటనే కత్తి ఒరలో దూర్చి, నమస్కారం చేశాడు. హకు ఇన్ అన్నాడు: ''ఇప్పుడు స్వర్గం తలుపులు తెరుచుకొన్నాయి.''

2. ప్రతిక్షణం జెన్

ఇతరులకు జెన్ బోధించే అర్హత సంపాదించటానికి ముందు ఎవరైనా కనీసం పది సంవత్సరాలు తమ గురువుల వద్ద శిష్యరికం నెరపవలసి ఉంటుంది. అలా నిర్ణీత కాలంలో జెన్ శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకొన్న టెన్నో అనే జెన్ గురువు, ఓ రోజు నాన్ ఇన్ అనే ఓ ప్రసిద్ధ జెన్ గురువును కలుసుకొనేటందుకు వచ్చాడు. ఆ రోజు వర్షం పడుతుండటం వల్ల టెన్నో కాళ్ళకు కొయ్యమడమలు గల పాదరక్షలు ధరించి, చేత్తో గొడుగు పుచ్చుకొని వచ్చాడు. అతణ్ణి మర్యాదపూర్వకంగా పలకరించటం అయ్యాక, నాన్ ఇన్ అతడితో అన్నాడు: ''నీవు నీ పాదరక్షల్ని వరండాలో విడిచిపెట్టి ఉంటావు. నీ గొడుగును పాదరక్షలకు కుడివైపున విడిచి పెట్టినావా? ఎడమవైపున విడిచిపెట్టినావా?''

టెన్నో గందరగోళంలో పడిపోయాడు. వెంటనే ఏం సమాధానం చెప్పాలో తెలియలేదు. అతడికి అర్థమయింది, తాను జెన్ తత్వాన్ని ప్రతి క్షణం అనుభవంలోకి తెచ్చుకోలేకపోయాను అని! అతడు నాన్ ఇన్‌కు శిష్యుడయి, మరో ఆరేళ్ళు అతడి దగ్గర జెన్ అభ్యసించి ప్రతి క్షణం జెన్‌ను జీవించటం ఎలాగో నేర్చుకొన్నాడు.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, తిథి: శు.నవమి ఉ.10.17 వరకు, తదుపరి దశమి, నక్షత్రం: విశాఖ రా.9.17 వరకు, తదుపరి అనూరాధ, వర్జ్యం: రా.1.15 నుండి 2.53 వరకు, దుర్ముహూర్తం: ఉ.9.56 నుండి 10.47 వరకు, తదుపరి ప.3.05 నుండి 3.56 వరకు, అమృతఘడియలు: ప.12.21 నుండి 1.56 వరకు; రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు, సూర్యోదయం: 5.40, సూర్యాస్తమయం: 6.32.

క్లుప్తంగా...

డిగ్రీ ఇంటర్న్‌షిప్ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో ఇటీవల నిర్వహించిన డిగ్రీ ఆరవ సెమిస్టర్ ఇంటర్న్‌షిప్ పరీక్ష ఫలితాలను వీసీ ఆచార్య పి.రాజశేఖర్ బుధవారం విడుదల చేశారు. ఫలితాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌యూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు. పరీక్షలకు మొత్తం 24,766 మంది విద్యార్థులు హాజరు కాగా, 24,657 మంది ఉత్తీర్ణులయ్యారని ఏసీఈ ఆర్.ప్రకాశరావు వెల్లడించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, యూజీ కో–ఆర్డినేటర్ ఆచార్య సంధ్యా కోల్ పాల్గొన్నారు.

కర్ణాటక ప్రభుత్వానికి ఢోకా లేదు

- కర్ణాటక దేవదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి



తిరుమల: కర్ణాటకలో ప్రభుత్వానికి వచ్చిన ఢోకా ఏమీ లేదని ఆ రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. కర్ణాటకలో 30 మంది ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారని బీజేపీ ప్రచారం కుట్ర మాత్రమేనన్నారు. నకిలీ ఫోర్జరీ లేఖను సోషల్ మీడియాలో ఆ పార్టీ నాయకులు వైరల్ చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వాన్ని కూల్చేందుకు సింగపూర్ కేంద్రంగా కుట్ర జరుగుతోందని.. ఇప్పటికే తమ ఉపముఖ్యమంత్రి డీకే చెప్పారన్నారు. 135 మంది ఎమ్మెల్యేలు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు సంవత్సరాలు అధికారంలో ఉంటుందని స్పష్టం చేశారు.

ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్‌పై రాకపోకలు బంద్

- వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు నిలిపివేత



కొండ చరియలు విరిగి పడటంతో మూసివేసిన ఘాట్ రోడ్డు

భవానీపురం (విజయవాడ పశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ దర్శనానికి ఘాట్ రోడ్ మీదుగా వెళ్లే భక్తుల రాకపోకలను నిలుపుదల చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొండపై ఉన్న రాళ్లు మెత్తబడటంతో మంగళవారం రాత్రి కొండపై నుంచి చిన్నపాటి రాళ్లు ఘాట్ రోడ్‌పై జారి పడ్డాయి. కొండ చరియలు విరిగి కింద పడకుండా ఘాట్ రోడ్‌లో కొండ చుట్టూ మెష్ ఏర్పాటు చేసినప్పటికీ భక్తుల రక్షణను దృష్టిలో పెట్టుకుని ముందస్తు జాగ్రత్త చర్యలుగా వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు ఘాట్ రోడ్‌లో వాహనాల రాకపోకలను బంద్ చేశారు. ఈ మేరకు ఆలయ ఈవో దర్బముళ్ల భ్రమరాంబ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

టీడీపీ నేత కుటుంబానికి రూ.4 లక్షల లబ్ధి



రామస్వామినాయుడుకు బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం: తిరుపతి జిల్లా కేవీబీ పురం మండలంలోని రాజులకండ్రిగకు చెందిన తొట్టంబేడు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, మండల టీడీపీ అధ్యక్షుడు దేశబత్తిన రామాంజుల నాయుడు, అతని కుటుంబీకులకు ప్రభుత్వ పథకాల ద్వారా రూ.4 లక్షల లబ్ధి చేకూరింది. ఈ విషయాన్ని 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా గ్రామానికి వచ్చిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు వలంటీర్ చెప్పారు. రామాంజుల నాయుడు తండ్రి రామస్వామి నాయుడుకు సంక్షేమ పథకాల లబ్ధిని ఎమ్మెల్యే వివరించి బుక్‌లెట్ అందించారు. ఆదిమూలం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలను పారదర్శకంగా ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు.

జస్టిస్ కన్నెగంటి లలితకు ఘనంగా వీడ్కోలు

తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నుంచి కర్ణాటక హైకోర్టుకు బదిలీ అయిన జస్టిస్ కన్నెగంటి లలితకు ఫుల్‌కోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. దాదాపు 7 వేల కేసుల్లో ఆమె తీర్పులు వెలువరించారని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరధే కొనియాడారు. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు మొదటి కోర్టు హాల్‌లో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. జస్టిస్ లలిత ఇచ్చిన పలు తీర్పులను అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ చదివి వినిపించారు. మోటార్ వెహికిల్ కేసులలో సత్వర న్యాయంతోనే బాధితులకు న్యాయం జరుగుతుందని, ఏళ్ల తర్వాత వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చినా అది ప్రయోజనం చేకూర్చదని జస్టిస్ లలిత ఈ సందర్భంగా పేర్కొన్నారు.

అరటి నార.. అందమైన చీర

- జాంధానీకి బనానా సోయగాలు
- నయా ట్రెండ్‌కు తగ్గట్టుగా చీరల తయారీ
- కాకినాడ జిల్లాలోని తాటిపర్తి, ప్రత్తిపాడులో శిక్షణ



కొత్త రకం డిజైన్లు నేసే విధానాన్ని వివరిస్తున్న సిబ్బంది




అరటి నారతో నేసిన చీర

పిఠాపురం: వస్త్ర ప్రపంచంలో కాకినాడ జిల్లా కొత్తపల్లి, గొల్లప్రోలు మండలంలోని చేనేత కార్మికులు చరిత్ర సృష్టించారు. వారు నేసిన జాంధానీ చీరలు మహిళా లోకం అందాన్ని మరింత ఇనుమడింపజేసి అంతర్జాతీయ ఖ్యాతిని అందుకుంటున్నాయి. రెండువైపులా ఒకే విధంగా కనిపించడమే జాంధానీ చీరల ప్రత్యేకత. చీర తయారయినప్పుడు ఎంత విలువుంటుందో.. అది కాస్త పాడయినపుడు కూడా ఎంతో కొంత ధర పలకడం దీని విశిష్టత. మిగిలిన ఏ రకం చీరలకూ ఈ అవకాశం లేకపోవడం గమనార్హం. కుటీర పరిశ్రమగా ప్రారంభమైన జాంధానీ చీరల తయారీ నేడు ప్రపంచస్థాయి గుర్తింపునకు నాంది పలుకుతున్నాయి. ప్రతీ ఏటా కోట్ల రూపాయల జాంధానీ చీరల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌లో స్థానం సంపాదించి విదేశీ ఆర్డర్లు సైతం సాధించింది. ఈ క్రమంలో జాంధానీకి నయా ట్రెండ్‌ను జోడించి మరింత సోయగాలు అద్దడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో 'జాంధాని' పేటెంట్ హక్కుతో పాటు ఉప్పాడ కాటన్, సిల్క్ మాదిరిగా ఇండియన్ హేండులూమ్స్‌లోనూ స్థానం సంపాదించింది. ఈ క్రమంలో జాంధానీకి నయా ట్రెండ్‌ను జోడించి మరింత సోయగాలు అద్దేలా చేనేతలకు ప్రోత్సాహం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని సహజసిద్ధంగా లభించే అరటి, అవిసె మొక్కల నారతో మంచి మంచి డిజైన్లతో వస్త్రాలను తయారు చేసేలా వారికి శిక్షణ ఇస్తుంది.

బనానా సిల్క్ నేతపై శిక్షణ..

మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా వృత్తిలో నైపుణ్యం సాధించే విధంగా భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ చేనేత అభివృద్ధి కమిషన్ ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు శిక్షణ ఇస్తుంది. ఇందుకోసం కాకినాడ జిల్లాలోని తాటిపర్తి, ప్రత్తిపాడులో రెండు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో 20 మందికి చొప్పున కొత్త కొత్త డిజైన్లతో బనానా, లినిన్ నేతపై అధికారులు శిక్షణ ఇస్తున్నారు.

బనానా దారంతో నేత



అరటి బెరడులో ఉండే పీచుతో తయారు చేసిన దారంతో జాంధానీ చీరలు తయారు చేస్తారు. జాంధానీ చీరల్లో ఉపయోగించే రంగులు కెమికల్స్‌కు స్వస్తి పలికి ఆర్గానిక్ పద్ధతిలో పకృతి సిద్ధమైన బనానా దారంను ఉపయోగించడానికి చర్యలు తీసుకుంటున్నారు. సిల్క్ దారం ఎక్కువ కాలం మట్టిలో కలవకుండా ఉండడం వల్ల కాలుష్యం పెరిగే అవకాశాలు ఉండడంతో బనానా దారానికి ప్రాధాన్యతనిస్తున్నారు. మూసా ఫైబర్‌గా పిలవబడే ఇది వేడి తట్టుకోవడంతో పాటు మంచి స్పిన్నింగ్ సామర్థ్యం కలిగి అత్యధిక నాణ్యతతో ఉంటుంది. ప్రస్తుతం దీనిని కేరళ నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. అయితే.. రానున్న కాలంలో అరటి గెలలు నరికేశాక.. చెత్తలో పడేసే అరటి బెరడులకు గిరాకీ పెరగనుంది.

బనానా దారం తయారీకి చర్యలు ..



అరటి, అవిసె మొక్కల కాండాల నుంచి తీసిన స్పిన్ ఫైబర్స్‌తో వస్త్రాల నేతపై ఇక్కడి కార్మికులకు శిక్షణ ఇస్తున్నాం. బనానా, లినిన్ దారాలను కేరళ, తమిళనాడు, చెన్నై నుంచి దిగుమతి చేసుకుని తయారు చేస్తున్నారు. త్వరలో బనానా, లినిన్ దారాల తయారీ పరిశ్రమలు స్థాపించే అవకాశాలున్నాయి. స్కీం ఫర్ కెపాసిటీ బిల్డింగ్ ఇన్ టెక్స్‌టైల్స్ సెక్టార్ ద్వారా విజయవాడలోని వీవర్స్ సర్వీస్ సెంటర్ ద్వారా నేత కార్మికులకు శిక్షణ ఇస్తున్నాం.

కె.పెద్దిరాజు, చేనేత జౌళి శాఖాధికారి , కాకినాడ

నేతలో కొత్త విధానానికి నాంది..



ఇప్పటి వరకు జరీ, సిల్క్ దారాలతో నేత నేసిన నేత కార్మికులకు మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా కొత్త రకం దారాలతో నేత నేసే విధానాలను నేర్పిస్తున్నాం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం 90 మంది వరకు శిక్షణ పొందుతున్నారు. ప్రత్యేకంగా మగ్గాలు ఏర్పాటు చేసి కొత్త డిజైన్లు నేయడం నేర్పుతున్నాం.

డి.రాంబాబు, ఏడీ, చేనేత జౌళి శాఖ, కాకినాడ

మహిళా డాక్టర్ దారుణ హత్య

- బంగారు ఆభరణాలు ఎత్తికెళ్లిన దుండగులు
- కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ఘటన



మాచర్ల రాధ (ఫైల్)

కోనేరుసెంటర్ (మచిలీపట్నం): ఓ మహిళా వైద్యురాలిని దారుణంగా హత్య చేసి ఆమె ఒంటిపై ఉన్న బంగారు నగలను దోచుకెళ్లిన ఘటన కృష్ణాజిల్లా మచిలీపట్నంలో కలకలం రేపింది. బందరు డీఎస్పీ మాధవరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మచిలీపట్నం జవ్వారుపేటకు చెందిన మాచర్ల లోక్‌నాథ్ ఉమామహేశ్వరరావు, భార్య రాధ (59) పిల్లల వైద్యులు. స్థానికంగా శ్రీ వెంకటేశ్వర తల్లీపిల్లల ఆస్పత్రిని నడుపుతున్నారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం కావడంతో హైదరాబాదులో ఉంటోంది. కుమారుడు వెంకట రవితేజకు ఇటీవలే వివాహం కావడంతో అతడు అత్తగారింటికి వెళ్లాడు. ఈ క్రమంలో వారం రోజులుగా ఇంట్లో దంపతులు ఇద్దరే ఉంటున్నారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు లోక్‌నాథ్ ఆస్పత్రిలో రోగులను చూసేందుకు కింది ఫ్లోర్‌లోని క్లినిక్‌కు వెళ్లాడు. రాత్రి సుమారు 10 గంటల సమయంలో భార్యకు ఫోన్ చేశాడు. ఆమె ఫోన్ తీయకపోవడంతో.. లోక్‌నాథ్ క్లినిక్ నుంచి పైఫ్లోర్‌లో ఉన్న ఇంటికి వెళ్లాడు. ముందు తలుపులు మూసి ఉండడంతో అనుమానం వచ్చిన ఆయన వెనుక వైపునకు వెళ్లి చూడగా వంట గది తలుపు తెరచి ఉంది. లోనికి వెళ్లి చూడగా రాధ రక్తపు మడుగులో శవమై కనిపించింది. హంతకులు ఆధారాలు చిక్కకుండా ఇంట్లో కారం చల్లడంతో పాటు ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు తెంచుకుని పరారయ్యారు. లోక్‌నాథ్ వెంటనే పోలీసులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. డీఎస్పీ మాధవరెడ్డి, ఇనగుదురుపేట సీఐ ఉమామహేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. లోక్‌నాథ్ నుంచి వివరాలు సేకరించారు. కాగా, అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇనగుదురుపేట పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది.. క్లూస్‌టీం హంతకుల వేలిముద్రలను సేకరించింది. జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ రవిప్రకాష్ బుధవారం హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు.

తెలంగాణ

ఎమ్మెల్యేగా గుర్తించండి: జలగం

- అసెంబ్లీ కార్యదర్శి, సీఈఓ వికాస్ రాజ్‌తో భేటీ

సాక్షి, హైదరాబాద్: కొత్తగూడెం శాసనసభ్యుడిగా తనను గుర్తించాలని కోరుతూ జలగం వెంకట్రావు బుధవారం తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శితో పాటు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారిని కలిశారు. కొత్తగూడెం ఎమ్మెల్యేగా వనమా వెంకటేశ్వర్‌రావు ఎన్నిక చెల్లదంటూ తీర్పునిచ్చిన హైకోర్టు, ఆయనపై పోటీ చేసిన జలగం వెంకట్రావును ఎమ్మెల్యేగా గుర్తించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జలగం వెంకట్రావు అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులను కలిసి కోర్టు తీర్పు కాపీని అందజేశారు. సాయంత్రం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌తో కూడా సమావేశమై కోర్టు తీర్పు కాపీతో పాటు తన విజ్ఞాపన అందజేశారు. కాగా, కోర్టు తీర్పును పరిశీలించి, నిపుణుల అభిప్రాయం తీసుకున్న తర్వాత సమాచారం ఇస్తామని అసెంబ్లీ కార్యదర్శి, చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ చెప్పినట్లు జలగం వెంకట్రావు వెల్లడించారు. ఈ అంశంపై తాను అసెంబ్లీ స్పీకర్‌తో ఫోన్‌లో మాట్లాడానని చెప్పారు.

'కొత్తగూడెం' తీర్పుపై స్టే ఇవ్వండి

- హైకోర్టులో వనమా వెంకటేశ్వరరావు పిటిషన్

సాక్షి, హైదరాబాద్: తన ఎన్నిక చెల్లదంటూ ఇచ్చిన తీర్పు అమలును నిలుపుదల చేస్తూ ఆదేశాలివ్వాలని తెలంగాణలోని కొత్తగూడెం శాసనసభ్యుడు వనమా వెంకటేశ్వరరావు హైకోర్టులో మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేశారు. తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయనున్నామని, దీనికోసం స్టే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి బుధవారం విచారణ చేపట్టారు. స్టే ఇవ్వడంతో మీకు వచ్చే ఇబ్బంది ఏమిటని జలగం తరఫు న్యాయవాదిని న్యాయమూర్తి ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి దాదాపు మరో 4 నెలల కాలం మాత్రమే ఉందని, ఇప్పుడు బాధ్యతలు చేపట్టకపోతే ఆ కొద్ది నెలల కాలం కాస్త పూర్తయ్యే అవకాశముందని న్యాయవాది బదులిచ్చారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. తీర్పును రిజర్వు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం శాసనసభ్యుడు వనమా వెంకటేశ్వరరావు ఎన్నికల చెల్లదని.. 2018, డిసెంబర్ 12 నుంచి జలగం వెంకట్రావునే ఎమ్మెల్యేగా ప్రకటించాలని అధికారులను ఆదేశిస్తూ హైకోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే.

నల్లమలలో విరిగిపడిన కొండచరియలు

- కర్నూల్ రోడ్డులో ఏడు గంటలు నిలిచిన రాకపోకలు
- రాళ్లను తొలగించి రాకపోకలు పునరుద్ధరించిన పోలీసులు



కొండపై నుండి జారిపడ్డ రాళ్లు

పెద్దదోర్నాల: నల్లమల అభయారణ్యంలో కొండ చరియలు విరిగి రోడ్డుపై పడటంతో ఏడు గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండల పరిధిలోని రోళ్లపెంటకు సమీపంలో నంద్యాల జిల్లా పరిధిలోకి వచ్చే నల్లమల అభయారణ్యంలో బుధవారం వేకువ జామున రెండు గంటల సమయంలో రోడ్డు పక్కనున్న కొండపై నుంచి రాళ్లు జారి పోవటంతో రోడ్డు మార్గం మూసుకుపోయింది. కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు పూర్తి స్థాయిలో ఇబ్బంది తలెత్తింది. ఉదయం 9 గంటల వరకు ఘటనా స్థలానికి ఇరువైపులా నాలుగు కిలోమీటర్ల మేర భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పెద్దదోర్నాల, నంద్యాల జిల్లా ఆత్మకూరు పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకున్నారు. ప్రత్యేకంగా క్రేన్‌లను రప్పించి రాళ్లను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి తోడు మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీగా కురుస్తున్న వర్షాల తీవ్రతకు చెట్లు సైతం రోడ్డుకు అడ్డంగా కూలిపోయాయి. కొండ రాళ్లు, చెట్లను పోలీసులు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

విద్యుత్ వైద్యం

విద్యుత్ సాయంతో దీర్ఘకాలిక గాయాలు నయం

మధుమేహం, క్యాన్సర్, వెన్నెముక గాయాలను సాధారణం కంటే మూడు రెట్లు వేగంగా తగ్గించగల సామర్థ్యం

కృత్రిమ చర్మ కణాలతో తయారు చేసిన బయోచిప్ సాయంతో ప్రయోగం





సాక్షి, అమరావతి: మానవాళి మనుగడకు అత్యంత ప్రధాన ఆధారంగా మారిన విద్యుత్‌తో అనేక అద్భుతాలు చేయవచ్చనేది ఇప్పటికే రుజువయ్యింది. కరెంటుతో ఇంకా ఏమేం చేయొచ్చనే అంశాలపై ప్రయోగాలు జరుగుతూనే ఉన్నాయి. ఆ క్రమంలోనే వైద్యంలోనూ విద్యుత్ వినియోగం మొదలైంది. ఇప్పటివరకు మానసిక రోగులకు చికిత్స అందించేందుకు మాత్రమే షాక్ ట్రీట్‌మెంట్ పేరిట నేరుగా విద్యుత్ వినియోగిస్తున్నారు. తాజాగా గాయాలను కూడా విద్యుత్ సాయంతో నయం చేయవచ్చని స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్తలు నిరూపించారు. ఇంజెక్షన్లు, టాబ్లెట్లు, ఆయింట్‌మెంట్లతో తగ్గని గాయాలను సైతం విద్యుత్‌తో మాయం చేయవచ్చని వారు అంటున్నారు. మధుమేహం, క్యాన్సర్, వెన్నెముక వంటి దీర్ఘకాలిక గాయాలతో బాధపడే వారికి, వృద్ధులకు ఇది నిజంగా శుభవార్తే.

బయో చిప్‌తో ప్రయోగం

విద్యుత్‌ను వైద్యం కోసం ఏవిధంగా వినియోగించుకోవచ్చనే దానిపై జరిగిన ఒక కొత్త అధ్యయనంలో.. శాస్త్రవేత్తలు విద్యుత్ ప్రవాహాన్ని ఉపయోగించి సాధారణ వైద్య విధానాలకంటే మూడు రెట్లు వేగంగా ఎలక్ట్రిక్ పద్ధతితో గాయాలను నయం చేసే విధానాన్ని కనుగొన్నారు. సున్నితంగా ఉంచే మన చర్మంలోని కణాలను విద్యుత్ క్షేత్రంలో ఉంచినప్పుడు, అవి కదలడం ప్రారంభిస్తాయి. ఫలితంగా దీర్ఘకాలిక గాయాలు ఊహించిన దానికంటే వేగంగా నయం చేసే శక్తి విద్యుత్‌కు ఉందని శాస్త్రవేత్తలు తమ అధ్యయనంలో తేల్చారు. దీర్ఘకాలిక గాయాలను నయం చేయడం కష్టం. అంతేకాదు.. అవి మరో కొత్త రోగానికి దారి తీస్తాయి. అలాంటి ప్రమాదం నుంచి ఎలక్ట్రిక్ విధానంలో వైద్యం కాపాడుతుంది. ఇందుకోసం ఒక ప్రయోగాన్ని శాస్త్రవేత్తలు నిర్వహించారు. మానవ చర్మ కణాలతో సమానమైన లక్షణాలున్న కృత్రిమ చర్మ కణాలుండే బయోచిప్‌ను రూపొందించారు. ఇందులో వారు రెండు కణాలను ఎంచుకుని, వాటిపై గాయాలను సృష్టించారు. వీటిలో ఒక దానిపై ఎలక్ట్రిక్ వైద్యాన్ని ప్రయోగించారు. మొదటి కణం రెండవ దానికంటే మూడు రెట్లు వేగంగా నయమైంది. విద్యుత్ క్షేత్రం చర్మ కణాలకు మార్గదర్శకంగా పనిచేసింది. విద్యుత్ సహాయంతో కణాలు సమానంగా కదిలి దెబ్బతిన్న ప్రదేశానికి నేరుగా వెళ్లి గాయం వేగంగా నయం చేయడంలో సహాయపడతాయని వారు గుర్తించారు. అంతేకాదు.. ఈ గాయపడిన కణాలపై విద్యుత్ ప్రయోగించడం వల్ల ఎటువంటి దుష్ప్రభావాలను వారు గమనించలేదు. సాధారణంగా ఇంగ్లిష్ మందులు వేగంగా ప్రభావం చూపించినప్పటికీ సైడ్ ఎఫెక్ట్‌సని కలిగిస్తాయని భావిస్తుంటాం. అందుకే.. ఆయుర్వేదం వైపు ఎక్కువగా మళ్లుతుంటాం. కానీ.. దీర్ఘకాలిక గాయాలను తగ్గించుకోవడానికి జరిగే ఆలస్యం మరిన్ని అనర్థాలకు దారితీస్తుంది. వాటితో బాధపడే వారికి ఎలక్ట్రిక్ వైద్యం సరిగ్గా సరిపోతుంది.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి సీఎం చేయూత

- ఊపిరితిత్తుల మార్పిడికి రూ.30 లక్షలు మంజూరు



చికిత్స పొందుతున్న బ్రహ్మం

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు జిల్లా సోమల మండలం బోనమండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ సదవుల బ్రహ్మం(40)కు అరుదైన ఊపిరితిత్తుల వ్యాధి సోకడంతో ఊపిరితిత్తులు దెబ్బతిన్నాయి. చికిత్స కోసం తమిళనాడు, కర్ణాటక, తెలుగు రాష్ట్రాల్లో పలు ఆసుపత్రులను సంప్రదించగా..హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఊపిరితిత్తుల మార్పిడి చేయించుకోవాలని వైద్యులు సూచించారు. అక్కడ ఆసుపత్రిలో 6 నెలలుగా చికిత్స పొందుతోన్న బ్రహ్మంకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం పైడిపాలెంకి చెందిన బ్రహ్మం ఇటీవల సీఎం జగన్ ఇడుపులపాయకు వచ్చినప్పుడు తన సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తప్పనిసరిగా న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన సీఎం జగన్..బ్రహ్మంకు మేలు కలిగేలా ఆర్థికసాయం మంజూరు చేశారు. లెటర్ ఆఫ్ క్రెడిట్ ప్రాతిపదికన అవయవ మార్పిడికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.30 లక్షలను మంజూరు చేశారని బ్రహ్మం 'సాక్షి'కి తెలిపారు. సీఎం చేసిన మేలును ఎన్నటికీ మరువలేనని చెప్పారు.తాను చికిత్స పొందుతున్నానని, రోజుకు 20 గంటల పాటు ఆక్సిజన్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎక్కడికి వెళ్లినా ఆక్సిజన్ పెట్టుకునే వెళ్లాల్సి ఉంటుందని, దాత దొరకగానే ఊపిరితిత్తుల మార్పిడి చేస్తారని చెప్పారు.

తప్పుడు కేసులేస్తున్న దళారులు

- 1,032వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



జోరువానలో సైతం రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాజధానిలో పేదలకు ఇళ్ల నిర్మిస్తుంటే ఓర్చుకోలేని బాబు అండ్ కో దళిత దళారులకు సూట్‌కేసులిచ్చి తప్పుడు కేసులు వేయించడం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,032వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. బాబు పంచన చేరిన దళిత జేఏసీ.. బాబు హయాంలో దళితులు, పేదలకు ఏమాత్రం సామాజిక న్యాయం జరిగిందో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. అధికారం కోసం బాబు కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతూ రాష్ట్రంలో అల్లర్లు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు అనుగుణంగా కేంద్రం నిధులిచ్చి సహకరిస్తుంటే ఏపీ బీజేపీ అధ్యక్షురాలు మాత్రం బాబుకు అనుకూలంగా మాట్లాడుతూ ప్రజలను రెచ్చగొట్టాలని చూడడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. నాయకులు పులి దాసు, మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా మలయప్ప పల్లవోత్సవం

తిరుమల: తిరుమలలో బుధవారం పల్లవోత్సవం ఘనంగా జరిగింది. మైసూరు మహారాజు జయంతిని పురస్కరించుకుని టీటీడీ పల్లవోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సహస్ర దీపాలంకారసేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు ఊరేగింపుగా కర్ణాటక సత్రానికి వేంచేశారు. మైసూర్ సంస్థానం ఆతిథ్యాన్ని స్వీకరించారు. అనంతరం కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, మైసూరు సంస్థానం ప్రతినిధులు స్వామి, అమ్మవార్లకు ఆహ్వానం పలికి ప్రత్యేక హారతి సమర్పించారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, బోర్డు సభ్యుడు విశ్వనాథ్ పాల్గొన్నారు.

తిరుమలలో 'కంటైనర్ వసతి'

తిరుమలలో శ్రీవారి ధర్మరథం నడిపే టీటీడీ డ్రైవర్లు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా టీటీడీ కంటైనర్ వసతి సముదాయాన్ని ఏర్పాటు చేస్తోంది. స్థానిక జీఎన్‌సీ వద్ద టీటీడీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో ఒకటి, రాంభగీచా అతిథిగృహాల వద్ద రెండు కంటైనర్ వసతి సముదాయాలను ఏర్పాటు చేసింది. వీటిని గురువారం టీటీడీ చైర్మన్, ఈవో ప్రారంభించనున్నారు.

బంగారు 'భవిత'కే విలీనం

- ప్రశస్థ యాప్‌తో చిన్నారుల్లో లోపాల గుర్తింపు
- పాఠశాలల్లో సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు
- యాప్ ఇన్‌స్టాలేషన్ 90 శాతం పూర్తి

రాయవరం: ప్రత్యేక అవసరాలు గల (శారీరక, మానసిక దివ్యాంగులు) పిల్లలను సాధారణ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, బ్రెయిలీ నైపుణ్యాలు పెంపొందించడం, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడం, క్రమశిక్షణ వంటి సేవలందిస్తున్నారు. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు మిగిలిన విద్యార్థులతో కలిసి చదివేలా భవిత కేంద్రాలను సమీప పాఠశాలల్లో విలీనం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తద్వారా వారిలో ఆత్మన్యూనతా భావం పోవడంతో పాటు, సహచర విద్యార్థులతో సమాన అవకాశాలను అందిపుచ్చుకునే వీలుంటుంది. అందులో భాగంగా ప్రస్తుతం జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ(ఎన్‌సీఈఆర్‌టీ) రూపొందించిన ప్రీ అసెస్‌మెంట్ హోలిస్టిక్ స్క్రీనింగ్ టూల్ (ప్రశస్థ) యాప్ ద్వారా జిల్లాలోని పాఠశాలలో ప్రతి విద్యార్థిని స్క్రీనింగ్ చేస్తున్నారు. జిల్లాలో యాప్ ఇన్‌స్టాలేషన్ 90 శాతం పూర్తి చేశారు.

ఉపాధ్యాయుల సెల్‌లో ప్రశస్థ యాప్ ఇన్‌స్టాలేషన్

ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయుడితో సహా ప్రతి ఉపాధ్యాయుడు వారి వ్యక్తిగత సెల్‌ఫోన్‌లో ప్రశస్థ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. యాప్ సహాయంతో పాఠశాలల్లోని ప్రతి విద్యార్థిని స్క్రీనింగ్ చేస్తారు. ఈ స్క్రీనింగ్ ద్వారా ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల్లోని లోపాలను గుర్తిస్తారు. యాప్‌లో ప్రతి చిన్న వైకల్యాన్ని గుర్తించేందుకు వీలుగా 63 అంశాలతో ప్రశ్నావళి ఉంటుంది. పిల్లల నుంచి సమాధానాలు రాబట్టి యాప్‌లో పొందుపరిస్తే వారిలోని అభ్యసన సామర్థ్యాలు, ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటారు. అవసరమైన వారికి ఉపకరణాలు కూడా అందజేసి, రెమిడియల్ తరగతులు నిర్వహిస్తారు. మొదటి దశలో ఉపాధ్యాయులు, రెండవ దశలో ఐఈఆర్‌టీలు, ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక బోధకులు విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకుంటారు. అనంతరం దివ్యాంగ చిన్నారుల అభ్యసన సామర్థ్యాల ఆధారంగా బోధన చేస్తారు.

ప్రత్యేక సదుపాయాలు: ఇప్పటి వరకు భవిత కేంద్రాల ద్వారా ఐదు నుంచి 14 ఏళ్ల వయసు కలిగిన మానసిక, శారీరక దివ్యాంగుల పిల్లలకు 21 రకాల రుగ్మతలకు సంబంధించి వైద్య సేవలు అందజేసేవారు. కేంద్రాలకు రాలేని వారి ఇళ్లకు ఐఈఆర్‌టీలు వెళ్లి గృహ ఆధారిత విద్య(హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్)సేవలు అందిస్తున్నారు. శారీరక లోపాలతో బాధపడుతున్న దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలను, మాటలు రాని వారికి స్పీచ్ థెరపీ అందిస్తున్నారు. ఇప్పుడు భవిత కేంద్రాలను పాఠశాలల్లో విలీనం చేసిన తర్వాత పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నారు. వీరికి ఉదయం నుంచి సాయంత్రం వరకు బోధన చేయడంతో పాటుగా, మధ్యాహ్న భోజనాన్ని, రెగ్యులర్ విద్యార్థులకు ప్రభుత్వం అందించే అన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ పరికరాలు, మూడు చక్రాల సైకిళ్లు, చంక కర్రలు, వినికిడి యంత్రాలు, సీపీ చైర్స్ తదితర ఉపకరణాలను ఉచితంగా అందజేస్తున్నారు. ప్రతీ రోజు యోగా, వ్యాయామం, వారానికి ఒకసారి ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీతో పాటు ప్రతి విద్యార్థికి రవాణా భత్యంగా నెలకు రూ.300 చెల్లిస్తున్నారు.

ఎందుకు విలీనం చేశారంటే..

భవిత కేంద్రాలకు వచ్చే చిన్నారుల హాజరు, వారి వివరాలు సమీపంలోని పాఠశాలల్లో నమోదు చేయాలి. దివ్యాంగ చిన్నారులు భవిత కేంద్రానికి వస్తున్నారో.. లేదో పాఠశాల సిబ్బందికి తెలియని పరిస్థితి నెలకొంటోంది. సమీపంలోని పాఠశాల నుంచి దివ్యాంగ చిన్నారులకు భోజనం, గుడ్లు, చిక్కీ తదితరాలు అందజేయాలి. సరైన పర్యవేక్షణ కొరవడడంతో ఇవన్నీ జరుగుతున్నాయో..లేదో తెలియడం లేదు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని భవిత కేంద్రాలను సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలోని 22 భవిత కేంద్రాలను సమీప పాఠశాలల్లో విలీనం చేయాల్సి ఉండగా, ఇప్పటికే 21 పాఠశాలలను విలీనం చేశారు. జిల్లాలో ఉన్న 22 భవిత కేందాల్లో ఇప్పటికే 2,586 మంది విభిన్న ప్రతిభావంతులు ఉన్నారు.

క్లుప్తంగా...

ఈడీ డైరెక్టర్‌ను కొనసాగిస్తాం

సుప్రీంకోర్టును కోరిన కేంద్రం

న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) డైరెక్టర్ సంజయ్‌కుమార్ మిశ్రా పదవీ కాలాన్ని అక్టోబర్ 15 వరకూ పెంచేందుకు అనుమతి కోరుతూ కేంద్రం బుధవారం సుప్రీంకోర్టు తలుపు తట్టింది. 63 ఏళ్ల మిశ్రా పదవీకాలాన్ని పదేపదే పెంచడం చట్టవిరుద్ధమంటూ సుప్రీంకోర్టు ఇటీవలే తప్పుబట్టడం తెలిసిందే. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) సమీక్షకు సంజయ్ కుమార్ గైర్హాజరైతే భారత ప్రయోజనాలకు భంగకరమని కేంద్రం న్యాయస్థానానికి తెలిపింది. అందువల్ల తమ పిటిషన్‌పై జూలై 28లోగా విచారణ జరపాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనాన్ని కోరారు.

సీఐసీ వద్ద 19 వేల దరఖాస్తులు పెండింగ్

న్యూఢిల్లీ: కేంద్ర సమాచార హక్కు కమిషన్ (సీఐసీ) వద్ద గత ఏప్రిల్ నాటికి 19,233 దరఖాస్తులు, అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్రం బుధవారం లోక్‌సభకు తెలిపింది. పది మంది సభ్యులుండే సీఐసీలో నాలుగు ఖాళీలు ఉన్నాయని కేంద్ర సిబ్బంది వ్యవహారాల సహాయమంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. 2021–22లో 29,213 దరఖాస్తులు, 2020–21లో 35,178 , 2018–19లో 29,655 పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు.

27సార్లు.. ఒక్కటీ నెగ్గలేదు...!

విశ్వాస పరీక్షల్లో మాత్రం కేంద్రంలో మూడుసార్లు పడిపోయిన ప్రభుత్వాలు



స్వతంత్ర భారత చరిత్రలో లోక్‌సభలో ఇప్పటిదాకా ఏకంగా 27 సార్లు అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టగా వాటిలో ఒక్కటంటే ఒక్కటి కూడా నెగ్గలేదు. వాటి కారణంగా ఒక్కసారి కూడా కేంద్రంలో ప్రభుత్వం పడిపోలేదు. అయితే ప్రభుత్వమే కోరి తెచ్చుకునే విశ్వాస పరీక్షల్లో మాత్రం కనీసం మూడుసార్లు ప్రభుత్వాలు పడిపోయినట్టు పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ అనే అధ్యయన సంస్థ పేర్కొంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇందిరపై అత్యధికంగా 15 'అవిశ్వాసాలు'

దివంగత ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో ఏకంగా 15 సార్లు అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టారు. స్వతంత్ర భారత చరిత్రలో ఒక ప్రధాని హయాంలో ఇదే అత్యధికం!

- ఇందిరపై తొలి అవిశ్వాసాన్ని 1966లో ఆమె అధికారంలోకి రాగానే కమ్యూనిస్టు దిగ్గజం హీరేంద్రనాథ్ ముఖర్జీ ప్రవేశపెట్టారు. కేవలం 61 మంది ఎంపీలే మద్దతివ్వగా 270 మంది వ్యతిరేకించారు.1966లోనే ఆమెపై రెండో అవిశ్వాసమూ వచ్చింది. తర్వాత 1967, 1968 (రెండుసార్లు), 1969, 1970, 1973, 1974 (రెండుసార్లు), 1975 (రెండుసార్లు–రెండోసారి ఎమర్జెన్సీ విధింపుకు కేవలం నెల రోజుల ముందు), 1976, 1978, 1981 (రెండుసార్లు), 1982ల్లో ఇందిరపై అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టారు.
- 1976లో ఇందిర ప్రభుత్వంపై బీజేపీ (నాటి జనసంఘ్) మేరునగం అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రవేశపెట్టడం విశేషం! దానికి ఏకంగా 162 మంది ఎంపీలు మద్దతిచ్చారు! ఒక అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా వచ్చిన అత్యధిక ఓట్లు ఇవే. 257 మంది వ్యతిరేకంచడంతో తీర్మానం వీగిపోయింది.

ఇదీ చరిత్ర...

- స్వతంత్ర భారత చరిత్రలో తొట్టతొలి అవిశ్వాస తీర్మానం 1963లో లోక్‌సభ తలుపు తట్టింది. నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు వ్యతిరేకంగా ఆయన సొంత పార్టీ కాంగ్రెస్‌కే చెందిన ఆచార్య కృపాలనీ దీన్ని ప్రవేశపెట్టడం విశేషం. 1962లో చైనాతో యుద్ధంలో ఓటడిన వెంటనే కృపాలనీ ఈ చర్యకు దిగారు. దీనిపై ఏకంగా 4 రోజుల పాటు 20 గంటలకు పైగా చర్చ జరిగింది. కేవలం 62 మంది ఎంపీలు మాత్రమే దీన్ని సమర్థించారు. 347 మంది వ్యతిరేకించడంతో చివరికి తీర్మానం వీగిపోయింది.
- లాల్ బహదూర్ శాస్త్రి ప్రభుత్వంపై 1964లో ఎన్‌సీ ఛటర్జీ 1965లో ఎస్.ఎన్.ద్వివేదీ, స్వతంత్ర పార్టీ ఎంపీ ఎం.ఆర్.మసానీ ప్రవేశపెట్టారు.
- 1979లో లోక్‌సభలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నాటి ప్రధాని మొరార్జీ దేశాయ్ రాజీనామాకు దారితీసింది. తీర్మానంపై ఓటింగ్ జరగక చర్చ అసంపూర్తిగా మిగిలిపోయినా ఆయన స్వచ్ఛందంగా ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం!

పీవీపై మూడుసార్లు

తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు ప్రభుత్వం మూడుసార్లు అవిశ్వాస తీర్మానాలు ఎదుర్కొంది! తొలిసారి 1992లో బీజేపీ ఎంపీ జశ్వంత్‌సింగ్ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై అధికార, విపక్షాలపై లోక్‌సభ వేదికగా నువ్వా నేనా అన్నట్టుగా పోరాటం జరిగింది. ఏకంగా 225 మంది ఎంపీలు తీర్మానానికి మద్దతిచ్చారు. 271 మంది వ్యతిరేకించడంతో తీర్మానం వీగిపోయి పీవీ సర్కారు ఊపిరి పీల్చుకుంది! 1992లోనే పీవీ ప్రభుత్వంపై వాజ్‌పేయీ, 1993లో అజయ్ ముఖోపాధ్యాయ్ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు.

రాజీవ్ సర్కారుపై మన ఎంపీ మాధవరెడ్డి...

- 1987లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టింది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఆదిలాబాద్ టీడీపీ ఎంపీ సి.మాధవరెడ్డి కావడం విశేషం! అయితే అది మూజువాణి ఓటుతో వీగిపోయింది.

- 2003లో వాజ్‌పేయీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వంపై విపక్ష నేత హోదాలో నాటి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ అవిశ్వాస తీర్మానం పెట్టారు. కేవలం 189 మంది ఎంపీలు మద్దతివ్వగా, 314 మంది వ్యతిరేకించారు. దాంతో 21 గంటల చర్చ అనంతరం తీర్మానం వీగిపోయింది.
- 2018 మోదీ సర్కారుపై టీడీపీ ఎంపీ కేశినేని శ్రీనివాస్ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దానికి 135 మంది ఎంపీలు మద్దతివ్వగా 330 మంది వ్యతిరేకించారు.

అవిశ్వాసానికి అనుమతి

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు దాదాపు ఏడాది ఉండగానే అధికార బీజేపీ, కాంగ్రెస్ సారథ్యంలోని 'ఇండియా' కూటమి తదితర విపక్ష పార్టీల బాహాబాహీకి అనూహ్యంగా రంగం సిద్ధమైంది. అనూహ్యంగా లోక్‌సభే ఇందుకు వేదికగా మారనుంది! మణిపూర్ హింసాకాండ తదితరాలపై కేంద్రాన్ని ఇరుకున పెట్టే వ్యూహంతో పార్లమెంటు వర్షాకాల సమావేశాలు మొదలైన నాటినుంచీ విపక్షాలు ఉభయ సభలనూ స్తంభింపజేస్తుండటం తెలిసిందే. అందులో భాగంగా మరో అడుగు ముందుకేసి మోదీ సర్కారుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని అవి తాజాగా నిర్ణయించాయి. ఆ సవాలు స్వీకరించి విపక్షాల ఎత్తును చిత్తు చేసేలా మోదీ సర్కారు పై ఎత్తు వేయడం, అందులో భాగంగా కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పరిగణనలోకి తీసుకోవడం... ఇలా బుధవారం హస్తినలో అనూహ్య రాజకీయ పరిణామాలు ఒకదాని వెంట ఒకటి చకచకా చోటుచేసుకున్నాయి...! అన్ని పార్టీలతో సంప్రదించాక అవిశ్వాస తీర్మానంపై చర్చకు తేదీ, సమయం తదితరాలు వెల్లడిస్తానని స్పీకర్ ప్రకటించారు.

అదే రగడ...: మణిపూర్ హింసాకాండ తదితరాలపై లోక్‌సభలో బుధవారం కూడా రగడ జరిగింది. దాంతో సభ వాయిదా పడింది. మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి ప్రారంభం కాగానే, కేంద్ర మంత్రివర్గంపై విశ్వాసం లేదని పేర్కొంటూ గౌరవ్ గొగోయ్ (కాంగ్రెస్) ఇచ్చిన నోటీసును స్పీకర్ అనుమతించారు. దానికి ఎందరు మద్దతిస్తున్నారని ప్రశ్నించగా కాంగ్రెస్ ఎంపీ సోనియాగాంధీ, ఫరూక్ అబ్దుల్లా (ఎన్‌సీ), టీఆర్ బాలు (డీఎంకే), సుప్రియా సులే (ఎన్సీపీ) తదితర విపక్ష 'ఇండియా' కూటమి సభ్యులతో పాటు ప్రతిపక్ష సభ్యులంతా లేచి నిలబడ్డారు. దాంతో తీర్మానాన్ని అనుమతిస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. అంతకుముందు బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు నేతృత్వంలో ఎంపీలు శ్రీనివాసరెడ్డి, రాములు, దయాకర్ లోక్ సభ సెక్రటరీ జనరల్‌కు అవిశ్వాస నోటీసులిచ్చారు. బీఆర్ఎస్ ఎంపీలు బీబీ పాటిల్, రంజిత్‌రెడ్డితో పాటు మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కూడా దానిపై సంతకాలు చేశారు. 'ఇండియా' కూటమిలో బీఆర్ఎస్ భాగస్వామి కాని విషయం తెలిసిందే.

ఇప్పుడేమవుతుంది?

అవిశ్వాస తీర్మానంపై ఏ రోజు, ఎప్పుడు చర్చ మొదలు పెట్టాలో స్పీకర్ సారథ్యంలో జరిగే బీఏసీ సమావేశంలో నిర్ణయమవుతుంది.

- చర్చలో పాల్గొనేందుకు ఏయే పార్టీకి ఎంత సమయం ఇవ్వాలో స్పీకర్ నిర్ణయిస్తారు.
- చర్చ తర్వాత తీర్మానంపై ప్రధాని సమాధానమిస్తారు. తర్వాత ఓటింగ్ జరుగుతుంది.

మోదీ జోస్యమే నిజమైంది!

విపక్షాలు అవిశ్వాస తీర్మానం ఇవ్వడంతో ప్రధాని మోదీ నాడు చెప్పిన జోస్యమే నిజమైందంటూ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 2019 జూలై 20న మోదీ ప్రభుత్వంపై విపక్షాలు తొలిసారి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం తెలిసిందే. దానికి అనుకూలంగా 126 మంది ఓటేయగా 325 మంది ఎన్డీఏ సభ్యులు వ్యతిరేకించారు. దాంతో భారీ మెజార్టీతో మోదీ సర్కారు గట్టెక్కింది. ఆ సందర్భంగా అవిశ్వాస తీర్మానంపై చర్చకు మోదీ బదులిస్తూ విపక్షాలను ఎద్దేవా చేశారు. '2023లోనూ నా ప్రభుత్వంపై అవిశ్వాస పరీక్ష పెట్టేంతగా వాళ్లు సన్నద్ధం కావాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ చెణుకులు విసిరారు. అచ్చం ఆయన అన్నట్టుగానే ఇప్పుడు జరుగుతోందంటూ బుధవారం రోజంతా సోషల్ మీడియాలో వార్తలు చెక్కర్లు కొట్టాయి.

లోక్‌సభలో బలాబలాలివీ...

లోక్‌సభ మొత్తం బలం 543. ప్రస్తుతం 5 ఖాళీలున్నాయి. బీజేపీ సారథ్యంలోని అధికార ఎన్డీఏ పక్షానికి 330 మందికి పైగా, విపక్ష 'ఇండియా' కూటమికి 140కి పైగా ఎంపీల బలముంది. ఈ రెండు కూటముల్లోనూ లేని ఎంపీలు 60 మందికి పైగా ఉన్నారు.

ఏమిటీ తీర్మానం...?

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఏ ప్రభుత్వమైనా అది ప్రత్యక్షంగా ఎన్నికయ్యే చట్టసభలో (భారత్‌లో అయితే లోక్‌సభ) మెజారిటీ ఉన్నంత కాలమే మనుగడ సాగించగలదు. కేంద్ర మంత్రిమండలి లోక్‌సభకు ఉమ్మడిగా బాధ్యత వహిస్తుందని రాజ్యాంగంలో 75(3) ఆర్టికల్ నిర్దేశిస్తోంది.

ఏమిటీ అవిశ్వాస తీర్మానం?

- ప్రభుత్వం, అంటే మంత్రిమండలి లోక్‌సభ విశ్వాసం కోల్పోయిందని, మరోలా చెప్పాలంటే మెజారిటీ కోల్పోయిందని భావించినప్పుడు బలం నిరూపించుకోవాలని ఎవరైనా డిమాండ్ చేసేందుకు అవకాశముంది.
- సాధారణంగా విపక్షాలే ఈ పని చేస్తుంటాయి. ఇందుకోసం అవి లోక్‌సభలో ప్రవేశపెట్టే తీర్మానమే అవిశ్వాస తీర్మానం.
- అవిశ్వాస తీర్మానాన్ని లోక్‌సభలో మాత్రమే ప్రవేశపెట్టే వీలుంది.
- లోక్‌సభ రూల్స్ ఆఫ్ ప్రొసీజర్, కండక్ట్ ఆఫ్ బిజినెస్‌లోని 198వ నిబంధన మేరకు దీన్ని ప్రవేశపెడతారు.
- కనీసం 50 మంది సహచర ఎంపీల మద్దతు కూడగట్టగలిగిన ఏ లోక్‌సభ సభ్యుడైనా ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టవచ్చు.
- అనంతరం తీర్మానంపై చర్చ, అధికార–విపక్షాల మధ్య సంవాదం జరుగుతాయి. ప్రభుత్వ లోపాలు, తప్పిదాలు తదితరాలను విపక్షాలు ఎత్తిచూపుతాయి. వాటిని ఖండిస్తూ అధికార పక్షం తమ వాదన విన్పిస్తుంది.
- చర్చ అనంతరం అంతిమంగా తీర్మానంపై ఓటింగ్ జరుగుతుంది.
- లోక్‌సభకు హాజరైన ఎంపీల్లో మెజారిటీ, అంటే సగం మంది కంటే ఎక్కువ తీర్మానానికి మద్దతుగా ఓటేస్తే అది నెగ్గినట్టు. అంటే ప్రభుత్వం సభ విశ్వాసం కోల్పోయినట్టు. అప్పుడు మంత్రిమండలి రాజీనామా చేయాల్సి ఉంటుంది. అంటే ప్రభుత్వం పడిపోతుంది.

ప్రభుత్వమే పరీక్షకు నిలిస్తే... విశ్వాస తీర్మానం

ఒక్కోసారి కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ప్రభుత్వమే లోక్‌సభలో తన బలాన్ని నిరూపించుకునేందుకు ప్రవేశపెట్టేదే విశ్వాస తీర్మానం. ఇలా విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి మూడు ప్రభుత్వా లు బలం నిరూపించుకోలేక పడిపోయాయి...

- సాక్షి, నేషనల్ డెస్క్

- అలాగే 1997లో హెచ్‌డీ దేవెగౌడ ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చిన 10 నెలలకే బలపరీక్షకు వెళ్లింది. కేవలం 158 మంది ఎంపీలే దానికి మద్దతిచ్చారు. 292 మంది వ్యతిరేకంగా ఓటేయడంతో ప్రభుత్వం కుప్పకూలింది.
- ఇక 1999లో అటల్ బిహారీ వాజ్‌పేయీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానం చివరి క్షణంలో అన్నాడీఎంకే ప్లేటు ఫిరాయించి వ్యతిరేకంగా ఓటేయడంతో అనూహ్యంగా ఓడి ప్రభుత్వం పడిపోయింది.
- 1990లో రామమందిర అంశంపై బీజేపీ మద్దతు ఉపసంహరించుకోవడంతో లోక్‌సభలో బలం నిరూపించుకునేందుకు వీపీ సింగ్ ప్రభుత్వం విశ్వాస తీర్మానం పెట్టింది. తీర్మానానికి అనుకూలంగా కేవలం 142 ఓట్లు రాగా వ్యతిరేకంగా ఏకంగా 346 ఓట్లు రావడంతో ప్రభుత్వం పడిపోయింది.

'భారత మండపం' రెడీ



పూజలు చేస్తున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జీ–20 సదస్సుకి వేదిక సిద్ధమైంది. సెప్టెంబర్‌లో జరగనున్న ఈ సదస్సుకి అమెరికా, బ్రిటన్, చైనా సహా 20 దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ సదస్సుని నిర్వహించడానికి ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ కమ్ కన్వెన్షన్ సెంటర్ (ఐఈసీసీ)కు కొత్తగా హంగులు చేకూర్చారు. మరమ్మతులు నిర్వహించి ఆధునీకరించారు. ఈ సెంటర్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించి దానికి కొత్తగా భారత మండపం అని పేరు పెట్టారు. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయెల్, ఇతర మంత్రుల సమక్షంలో డ్రోన్ ద్వారా ఈ సెంటర్‌ని ప్రారంభించారు. ఐఈసీసీ కాంప్లెక్స్‌ని జాతీయ ప్రాజెక్టు కింద రూ.2,700 కోట్లతో అభివృద్ధి చేశారు. ప్రగతి మైదాన్‌లో ఇండియా ట్రేడ్ ప్రామోషన్ ఆర్గనైజేషన్ (ఐటీపీఓ) కాంప్లెక్స్‌లో ఇది భాగంగా ఉంది. అంతకు ముందు ప్రధాని మోదీ ఐటీపీఓలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కాంప్లెక్స్ మరమ్మతు పనుల్లో పాల్గొన్న కార్మికుల్ని ప్రధాని సత్కరించారు. ప్రగతి మైదాన్ దాదాపుగా 123 ఎకరాల్లో ఇది విస్తరించి ఉంది. భారత్‌లో అంతర్జాతీయ సదస్సులు , పారిశ్రామిక సమావేశాలు నిర్వహించే కాంప్లెక్స్‌లో అతి పెద్దది. ఎన్నో అత్యాధునిక సదుపాయాలు కలిగిన ఐఈసీసీ ప్రపంచ స్థాయి ప్రమాణాలు కలిగిన టాప్ –10 వేదికల్లో ఒకటి. మూడో అంతస్తులు ఏడువేల మంది పట్టే ఒక కాన్ఫరెన్స్ హాలు ఉంది. జీ–20 శిఖరాగ్ర సదస్సు నిర్వహించడానికి భారతీయత ఉట్టిపడేలా దీనిని నిర్మించడంతో భారత మండపం అని పేరు పెట్టారు.



ఢిల్లీలోని నూతన ఐటీపీఓ కాంప్లెక్స్

గవర్నర్‌కు డీఎంకే ఫైల్స్–2

- ట్రంక్ పెట్టెలో ఆధారాలు
- ఆర్ఎన్ రవికి సమర్పించిన అన్నామలై
- ట్రైలర్ అంటూ ఓ వీడియో విడుదల

సాక్షి, చెన్నై: డీఎంకే అవినీతి అక్రమాలు ఫైల్స్ –2 పేరుతో ఏకంగా ఓ ట్రంక్ పెట్టెలో ఆధారాలను పెట్టి మరీ రాజ్‌భవన్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై బుధవారం గవర్నర్‌కు సమర్పించడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇందులో తొమ్మిది మంది రాష్ట్ర మంత్రుల అవినీతికి సంబంధించిన వివరాలు, మూడు ప్రాజెక్టుల్లో చోటుచేసుకున్న అక్రమాలకు సంబంధించిన ఆధారాలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. వివరాలు.. అవినీతి అక్రమాలు.. పేరుతో సీఎం స్టాలిన్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన ఆస్తులు, డీఎంకే పార్టీకి సంబంధించిన ఆస్తులు, పలువురు ఎంపీల అక్రమార్జన వివరాలను డీఎంకే ఫైల్స్ –1 పేరుతో ఈ ఏడాది ఏప్రిల్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై విడుదల చేశారు. ఈ సమయంలో త్వరలో డీఎంకే ఫైల్స్– 2 కూడా బయటకు వస్తుందని వ్యాఖ్యానించారు. డీఎంకే ఫైల్స్ వ్యవహారంలో అన్నామలైపై డీఎంకే పార్టీ వర్గాలు పరువునష్టం దావా కూడా వేశాయి. ఈ పరిస్థితుల్లో ఇది వరకు మీడియా ముందు ఫైల్స్– 1ను విడుదల చేసిన అన్నామలై ఈసారి రూటు మార్చారు. డీఎంకే ఫైల్స్– 2 పేరుతో ఒక ట్రంక్ పెట్టెలో కొన్ని పత్రాలను పెట్టి పెట్టి మరీ రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు అందజేశారు. అలాగే ఇటీవల కాలంలో మూడు ప్రాజెక్టుల్లో రూ. 5,600 కోట్ల అవినీతి జరిగిందని పేర్కొంటూ, ఆ వివరాలను ఫిర్యాదులో పేర్కొన్నారు.

నెదర్లాండ్స్ నౌకలో భారీ అగ్నిప్రమాదం

3 వేల కార్లు దగ్ధం !

ది హేగ్: నెదర్లాండ్స్‌లోని ఉత్తర సముద్రంలో సరుకు రవాణా చేసే ఒక నౌకలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ మంటల్లో నౌకలో ఉన్న 3 వేల కార్లు దగ్ధమైనట్టు అంచనా. నౌక సిబ్బందిలో ఒకరు మంటల్లో చిక్కుకొని మరణించగా మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఇంకొందరు ప్రాణరక్షణ కోసం సముద్రంలో దూకారు. ఆ నౌకలో దట్టంగా పొగ అలుముకోవడంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తి 22 మంది నౌకా సిబ్బందిని ఆస్పత్రికి తరలించినట్టుగా డచ్ కోస్ట్‌గార్డ్ అధికార ప్రతినిధి ఒకరు వెల్లడించారు. నౌకలో ఉన్న 25 ఎలక్ట్రిక్ కారుల్లో ఒక దానిలో మంటలు చెలరేగడం వల్లే అగ్ని ప్రమాదం జరిగినట్టుగా తెలుస్తోంది. జర్మనీలోని బ్రెమర్‌హెవన్ పోర్టు నుంచి ఈజిప్టులో మరో పోర్టుకి ఈ నౌక వెళుతుండగా మంగళవారం రాత్రి అమెలాండ్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ నౌకలో మంటలు కొద్ది రోజుల పాటు కొనసాగుతాయని డచ్ కోస్ట్ గార్డ్ అంచనా వేస్తోంది. నౌకకి ఇరువైపులా నీళ్లు పోస్తూ మంటల్ని అదుపులోనికి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. కానీ లోపల నీళ్లు వేస్తే నౌక మునిగిపోయే ప్రమాదం ఉందన్న ఆందోళనలున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాలు తరలించడం కూడా ఒక ముప్పుగా మారిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.



మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండ

ఇళ్లు, బస్సులు, దుకాణాలు దగ్ధం

ఇంఫాల్: మణిపూర్‌లో హింసాకాండ ఇంకా కొనసాగుతోంది. మోరె జిల్లాలో బుధవారం నాడు అల్లరిమూక దాదాపుగా 30 ఇళ్లు, దుకాణాలు తగులబెట్టింది. మయన్మార్ సరిహద్దుల్లోని మోరే బజార్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. అల్లరి మూకను అదుపు చేయడానికి భద్రతా దళాలు కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఎంతమందికి గాయాలయ్యాయో వివరాలు ఇప్పటివరకు తెలియలేదు. కంగ్‌పోక్పి జిల్లాలో భద్రతా దళాలను తరలించడానికి ఉంచిన బస్సులకి కూడా దుండగులు నిప్పు పెట్టినట్టుగా అధికారులు తెలిపారు. సపోర్మినాలో మణిపూర్ రిజిస్ట్రేషన్ కలిగిన బస్సుల్ని స్థానికులు ఆపేసి ఇతర సామాజిక వర్గానికి చెందిన వారు ఎవరైనా ఉన్నారని తనిఖీ చేశారు. ఆ తర్వాత కొందరు ఆ బస్సుల్ని తగులబెట్టారు. మరోవైపు హింసాకాండలో ఇళ్లు కోల్పోయి సహాయ శిబిరాల్లో ఉంటున్న వారి కోసం తాత్కాలిక ఇళ్ల నిర్మాణం పూర్తి కావస్తోందని ముఖ్యమంత్రి ఎన్. బైరన్ సింగ్ చెప్పారు. ఇంఫాల్‌లోని సజీవా, తౌబల్ జిల్లాలోని యతిబి లౌకోల్‌లో ఇళ్లను నిర్మిస్తున్నారు. త్వరలోనే సహాయ శిబిరంలో ఉన్న వారందరినీ ఈ ఇళ్లకు తరలిస్తామని బైరన్ సింగ్ ట్వీట్ చేశారు.



ఘర్ మే ఘుస్ కే...

అవసరమైతే నియంత్రణ రేఖ దాటుతాం: రాజ్‌నాథ్

- ఆ పరిస్థితి వస్తే మన సైనికులకు సహకరించాలని ప్రజలకు పిలుపు
- ద్రాస్‌లో కార్గిల్ స్మారక స్థూపం వద్ద 'విజయ్ దివస్'లో రక్షణ మంత్రి

ద్రాస్ (లద్దాఖ్): భారత్ తన గౌరవ ప్రతిష్టలను కాపాడుకోవడానికి నియంత్రణ రేఖను దాటడానికి సిద్ధంగా ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. అలాంటి పరిస్థితి వస్తే సైనికులకు సహకారం అందించడానికి పౌరులందరూ సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్గిల్ యుద్ధంలో విజయం సాధించి 24 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం దేశమంతా విజయ్ దివస్ జరుపుకుంది. ద్రాస్‌లోని కార్గిల్ యుద్ధ స్మారకం వద్ద ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ రష్యా, ఉక్రెయిన్ మధ్య ఏడాది దాటినా ఇంకా యుద్ధం కొనసాగుతోందని అంటే పౌరులు భాగస్వాములు కావడం వల్లేనని అభిప్రాయపడ్డారు. పొరుగుదేశమైన పాకిస్తాన్ కవ్వింపు చర్యల్ని పరోక్షంగా ప్రస్తావించిన ఆయన మన దేశ గౌరవాన్ని, మర్యాదని కాపాడుకోవడానికి ఎంత తీవ్రమైన చర్యలకైనా దిగుతామని హెచ్చరించారు. పొరుగుదేశం రెచ్చగొట్టే చర్యలకి దిగితే నియంత్రణ రేఖ దాటుతామన్నారు. ''మన దేశంలో యుద్ధం పరిస్థితులు వస్తే సైనిక బలగాలకు ప్రజలు ఎప్పుడూ అండగా ఉంటారు. పరోక్షంగా తమ సహకారాన్ని అందిస్తారు. ఈ సారి అవసరమైతే ప్రత్యక్షంగా యుద్ధభూమిలో పాల్గొనాలని, దానికి తగ్గట్టు మానసికంగా సంసిద్ధులు కావాలని కోరుతున్నాను'' అని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. దేశ ప్రయోజనాలను కాపాడుకునే అంశంలో మన సైన్యం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కార్గిల్ యుద్ధం సమయంలో భారత ఆర్మీ పాకిస్తాన్‌కేకాక యావత్ ప్రపంచానికి సందేశం పంపించిందన్నారు. పాకిస్తాన్ మనకి వెన్నుపోటు పొడవడంతో కార్గిల్ యుద్ధం వచ్చిందన్నారు. అంతకు ముందు కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ల సమాధుల్ని సందర్శించి పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు.



కార్గిల్ అమరవీరుల కుటుంబీకులకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఓదార్పు

ప్రధాని నివాళులు

కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన సైనికులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ , కేంద్ర మంత్రులు, ఇతర నాయకులు నివాళులర్పించారు. విజయ్ దివస్ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ట్వీట్ చేశారు. ''మన దేశ సైనికుల అపూర్వమైన విజయాన్ని దేశం గుర్తు చేసుకుంటోంది. దేశం కోసం ప్రాణాలు కోల్పోయిన అమరులందరికీ నివాళులర్పిస్తున్నాను. దేశం కోసం త్యాగం చేసిన వారి గాథలన్నీ తరతరాలకు స్ఫూర్తి దాయకం'' అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. ప్రధాని మోదీ తన ట్వీట్‌లో కార్గిల్ విజయ్ దివస్ భారత వీరుల ధైర్య గాథల్ని గుర్తు చేస్తుందని, ప్రజలందరికీ వారు స్ఫూర్తిదాయకంగా నిలిచారని పేర్కొన్నారు. అమరులందరికీ హృదయపూర్వక నివాళులర్పిస్తున్నట్టుగా పేర్కొన్నారు. 1999లో కార్గిల్‌ను ఆక్రమించిన పాకిస్తాన్ సైన్యాన్ని తిప్పికొట్టి భారత్ విజయ దుందుభి మోగించింది.

రెండవ రోజూ పళని ఆలయంపై చక్కర్లు కొట్టిన సైనిక హెలికాప్టర్

తిరువొత్తియూరు: రెండవ రోజైన బుధవారం దిండుక్కల్ జిల్లా పళని ఆలయంపై సైనిక హెలికాప్టర్ చక్కర్లు కొట్టింది. పళని మురుగన్ ఆలయం, ఉద్యోగులు నివాసముంటున్న ప్రాంతంలో మంగళవారం ఉదయం సైనిక హెలికాప్టర్ సంచరించడం వివాదాస్పమైంది. అదే హెలికాప్టర్ రెండవ రోజు కూడా ఆకాశంలో తిరిగింది. భక్తులు ప్రజలు సైనిక హెలికాప్టర్ తమ సెల్‌ఫోన్లు వీడియో తీశారు. అలాగే సైనిక హెలికాప్టర్ పళని బస్ స్టేషన్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లోనూ ఆకాశంలో సంచరించినట్లు వెల్లడించారు.

న్యూస్‌రీల్

అధునాతన సాంకేతికత తప్పనిసరి


ప్రసంగిస్తున్న రాధాకృష్ణన్

సాక్షి, చెన్నై: కేన్సర్‌కు చికిత్స చేయడమే లక్ష్యంగా భారీ స్థాయిలో అధునాతన సాంకేతికతలు, మౌలిక సదుపాయాలు అవసరం అని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జె.రాధాకృష్ణన్ తెలిపారు. పెరుంబాక్కంలోని గ్లెనిగల్స్ గ్లోబెల్ హెల్త్ సిటీ ఆవరణలో బుధవారం దక్షిణ భారతదేశంలోనే తొలి సారిగా పొత్తి కడుపులో కేన్సర్ నివారణ, చికిత్స కోసం హైపర్ థెర్మిక్ ఇంట్రా పెరిటోనియల్ కెమోథెరపీ(హెచ్ఐపీఈసీ)కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని ప్రారంభించినానంతరం జరిగిన కార్యక్రమంలో రాధాకృష్ణన్ మాట్లాడుతూ, ఇటీవల కాలంగా అండాశయ కేన్సర్, కడుపులో కేన్సర్, కొలొరెక్టల్ క్యాన్సర్ వంటి కొత్త రుగ్మతలో బాధ పడుతున్న వారు అధికంగా ఉన్నట్లు వివరించారు. ఈ సమయంలో ఇంట్రాపెరిటోనియల్ అబ్డామినల్ కేన్సర్‌కు చికిత్స చేయడం లక్ష్యంగా అధికస్థాయిలో కచ్చితత్వం, అధునాతన సాంకేతికతలు, తాజా మౌలిక సదుపాయాలు అవసరం అని పేర్కొన్నారు. ఇక్కడ ప్రత్యేక సెంటర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని, కేన్సర్ నుంచి ప్రజలు రక్షించేందుకు అవగాహన విస్తృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కేన్సర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌సుందరం, గ్లెనిగల్స్ హెల్త్ సిటీ సీఈఓ డాక్టర్ అలోక్ ఖుల్లార్, ప్రతినిధులు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈఎంయూ సేవలకు ఆటంకం


ఎన్నూర్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు ఆందోళన

సాక్షి, చెన్నై : చెన్నై సెంట్రల్ – గుమ్మిడి పూండి – సూళూరు పేట మార్గంలో బుధవారం ఉదయం ఎలక్ట్రిక్ రైలు(ఈఎంయూ) సేవలకు తీవ్ర ఆటంకం ఎదురైంది. దీంతో ప్రయాణికులు ఆగ్రహంతో పలు చోట్ల ఆందోళనకు దిగారు. ఉదయాన్నే సూళ్లూరు పేట నుంచి చెన్నైకు వస్తున్న ఎలక్ట్రిక్ రైలు ఎన్నూరు రైల్వే స్టేషన్‌లో ఆగింది. బయలు దేరే సమయంలో సాంకేతిక సమస్య కారణంగా రైలును నిలిపి వేశారు. ఫలితంగా ఆ మార్గంలో వెళ్లే అనేక రైళ్లకు అంతరాయం ఏర్పడింది. ఉదయాన్నే చెన్నై వైపుగా కళాశాలలు , విధులకు, వివిధ పనులకు వచ్చిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ మార్గంలో ప్రయాణించాల్సిన అనేక ఎలక్ట్రిక్ రైళ్లు ఆయా స్టేషన్లలో నిలుపుదల చేశారు. వాటిని ఎప్పుడు పునరుద్ధరిస్తారో..? సమాచారం ఇవ్వక పోవడంతో ప్రయాణికుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. పలు రైల్వే స్టేషన్లలో ప్రయాణికులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. చివరకు రెండు గంటల అనంతరం సాంకేతిక సమస్యను సరి చేయడంతో రైళ్ల సేవలు పునఃప్రారంభమయ్యాయి.

డీఎండీకేకు అన్నామలై ఆహ్వానం

సాక్షి, చెన్నై: ఈనెల 28వ తేదీన నా మట్టి. నా ప్రజలు నినాదంతో అన్నామలై పాదయాత్రకు శ్రీకారం చుట్టనున్న విషయం తెలిసిందే. ఎన్‌డీఏ మిత్ర పక్షాలకు ఆయన ఆహ్వానం పలికారు. ఆయన పాదయాత్ర కోసం ప్రత్యేక వాహనం సిద్ధమైంది. ఈ పరిస్థితుల్లో ఎలాంటి కూటములతో సంబంధం లేకుండా దూరంగా ఉన్న డీఎండీకేను తమ వైపునకు తిప్పుకునేందుకు అన్నామలై ప్రయత్నాలు మొదలెట్టే విధంగా వ్యూహరచన చేస్తున్నారు. ఇందులో భాగంగా తన పాదయాత్ర ప్రారంభోత్సవానికి హాజరు కావాలని డీఎండీకే అధినేత విజయకాంత్‌కు తన ప్రతినిధి నాగరాజ్ ద్వారా లేఖ పంపించడం విశేషం. విజయకాంత్ అనారోగ్య కారణాలతో ఇంటికే పరిమితం కావడంతో ఈ ఆహ్వానాన్ని ఆయన సతీమణి, డీఎండీకే కోశాధికారి ప్రేమలత విజయకాంత్‌కు అందజేశారు. ఆమె హాజరయ్యే విషయంపై ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉండగా అన్నామలై యాత్రకు అనుమతి ఇవ్వకూడదని డీజీపీ కార్యాలయంలో దేశీయ మున్నేట్ర కళగం ఫిర్యాదు చేసింది. యాత్ర పేరిట తమిళనాడులో శాంతికి భంగం కలిగించే పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.

అన్నామలై మాటలను పట్టించుకోవడం వృథా

కొరుక్కుపేట: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలై మాటలపై స్పందించడం అంటే మన సమయం వృథా చేసుకున్నట్టే అని రాష్ట్ర మంత్రి ఎస్.ముత్తుస్వామి విమర్శించారు. ఈరోడ్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సమీపంలో లింక్ రోడ్డును నిర్మించే ప్రణాళికను ఇప్పటికే ప్రకటించారు. దీనికి సంబంధించిన పనులను చేపట్టేందుకు మంత్రి ఎస్.ముత్తుసామి బుధవారం ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ పలు సంక్షేమ పథకాలను చురుగ్గా అమలు చేస్తున్నారని. దాని ఆధారంగా ఈరోడ్ కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో చేపడుతున్న ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుపై సీఎం ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. అన్నాడీఎంకే హయాంలో సరిపడా లింక్ రోడ్డును నిర్మించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఈ సందర్భంగా హైవేస్ డిపార్ట్‌మెంట్ అధికారులు, కార్పొరేషన్, ప్రభుత్వ ఆసుపత్రి అధికారులతో రోడ్డు నిర్మాణ పనులపై చర్చించారు. అనంతరం అన్నామలై చర్యలపై విలేకరులు ప్రశ్నించగా అన్నామలై తన పని తాను చేసుకుపోతున్నారని, మాపని వదిలి సమాధానం చెప్పడం వృథా అని వ్యాఖ్యానించారు.


చెన్నైలో అమర వీరులకు సెల్యూట్ చేస్తున్న ఆర్మీ అధికారులు


పుదుచ్చేరిలో నివాళులర్పిస్తున్న లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై

త్యాగధనులకు వందనం

'సరిహద్దుల్లో దొంగదెబ్బ తియ్యాలనే శత్రుమూకను తరిమికొట్టి.. కార్గిల్‌లో మువ్వెన్నెల జెండాను సగర్వంగా ఎగురువేసి.. భారత మాత సేవలో పరమపదించిన సైనికులకు సలామ్' అంటూ తమిళ రాజకీయ నాయకులు, ఆర్మీ అధికారులు నివాళలర్పించారు. విజయ దివాస్ సందర్భంగా కార్గిల్ అమర వీరుల సేవలను స్మరించుకున్నారు.

- కార్గిల్‌లో అమరులైన సైనికులకు సలాం..
- చెన్నైలో ఆర్మీ అధికారుల ఘన నివాళి
- తిరుచ్చిలో పుష్పాంజలి ఘటించిన సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: కార్గిల్ అమర వీరులను త్యాగాలను స్మరిస్తూ చెన్నై, తిరుచ్చి, పుదుచ్చేరిలోని అమర వీరుల స్తూపం వద్ద బుధవారం ఆర్మీ అధికారులు, నాయకులు ఘన నివాళి అర్పించారు. వివరాలు.. 1999లో పాకిస్తాన్‌తో జరిగిన కార్గిల్ యుద్ధంలో భారత్ విజయం సాధించింది. ఈ యుద్ధంలో ఎందరో వీరులు అమరులయ్యారు. దీంతో విజయోత్సవంతో పాటు అమర వీరులకు నివాళులర్పించే విధంగా ఏటా జూలై 26వ తేదీన కార్గిల్ విజయ దివాస్ పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం చెన్నై మెరీనా తీరంలోని వార్ మెమోరియల్ వద్ద ఆర్మీ వర్గాలు పుష్పగుచ్ఛాలు ఉంచి గౌరవ వందనం సమర్పించాయి. దక్షిణ భారత ఏరియా ఆర్మీ అధికారి, లెఫ్టినెంట్ జనరల్ కేఎస్ బ్రార్ నేతృత్వంలో ఆర్మీ, నావికాదళం, వైమానికదళానికి చెందిన అధికారులు అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న దక్షిణ భారత ఏరియా చీఫ్ ఆఫ్ స్టాఫ్ మేజర్ జనరల్ ఎం. ఇంద్రబాలన్ తన అనుభవాలను పంచుకున్నారు. సైనికుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు.

తిరుచ్చిలో..

తిరుచ్చి పర్యటనలో ఉన్న సీఎం ఎంకే స్టాలిన్ కంట్రోన్మెంట్‌లోని మేజర్ శరవణన్ స్మారక స్తూపం వద్ద నివాళులర్పించారు. కార్గిల్ యుద్ధంలో అమరులైన వీరులకు అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దురై మురుగన్, నెహ్రూ, అన్బిల్ మహేశ్, ఎంపీ రాజ తదితరులు పాల్గొన్నారు. ఇక, పుదుచ్చేరిలో సముద్ర తీరంలో పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు. లెఫ్టినెంట్ గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ నేతృత్వంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆర్మీ వర్గాలు విజయోత్సవ స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలను ఉంచి నివాళులర్పించారు. పుదుచ్చేరి సీఎం రంగస్వామి, స్పీకర్ సెల్వం, మంత్రులు నమశ్శివాయం, లక్ష్మీనారాయణన్ పాల్గొన్నారు. అమరులను గుర్తు చేసుకుంటూ కొద్దిసేపు మౌనం పాటించారు.


మేజర్ శరవణన్ స్మారకం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

కావేరిలో జలకళ



- రైతుల్లో ఆనందం
- హొగ్నెకల్ తీరంలో అప్రమత్తం

సాక్షి, చెన్నై : కొన్ని నెలల తర్వాత కావేరి నదిలో నీటి పరవళ్లు బుధవారం పెరిగాయి. కర్ణాటక నుంచి కావేరి నీళ్లు మేట్టూరు జలాశయం వైపుగా చొచ్చుకు వస్తున్నాయి. నీటి ఉధృతి పెరిగే అవకాశాలతో హొగ్నెకల్ పరిసర గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వివరాలు.. కావేరి జలాలపై ఆధారపడి డెల్టా రైతుల వర ప్రదాయిని మేట్టూరు జలాశయం ఉన్న విషయం తెలిసిందే. గత ఏడాది ఈ జలాశయం పలుమార్లు పూర్తిగా నిండి ఉబరి నీరు డెల్టా జిల్లా వైపుగా ఉగ్రరూపం దాల్చి ప్రవహించింది. అయితే, ఈ ఏడాది కావేరిలో నీరు కరువైంది. ఇప్పటికే మేట్టూరు జలాశయం నుంచి డెల్టా సాగుకు నీటిని విడుదల చేస్తుండడంతో నీటి మట్టం క్రమంగా తగ్గుముఖం పట్టింది. దీంతో కర్ణాటక తమకు వాటాగా ఇవ్వాల్సిన నీటిని పంపిణీ చేయించుకునేందుకు రాష్ట్ర నీటి పారుదల శాఖ తీ వ్ర ప్రయత్నాలు చేపట్టింది. కేంద్ర జలశక్తి మంత్రిని పలుమార్లు రాష్ట్ర మంత్రి దురై మురుగన్ కలిశారు. కర్ణాటకపై ఒత్తిడికి పట్టుబట్టారు. ఈ పరిస్థితుల్లో గత రెండు రోజులుగా కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో అక్కడి కృష్ణరాజ సాగర్, కపిని జలాశయంలోకి నీటి ఉధృతి పెరిగింది. ఈ రెండు జలాశయాల నుంచి ముందు జాగ్రత్తగా నీటి విడుదలపై అక్కడి అధికారులు దృష్టి పెట్టారు. దీంతో కావేరిలోకి నీరు విడుదలైంది. మంగళవారం విడుదల చేసిన నీరు బుధవారం ఉదయం రాష్ట్ర సరిహద్దులలోని పిలిగుండులుకు చేరింది. ఉదయం సెకనుకు ఐదు వేల క్యూ సెక్కుల నీళ్లు రాగా, మధ్యాహ్నం పది వేలకు చేరింది. సాయంత్రం 17 వేలకు పెరిగింది. కర్ణాటకలోని జలాశయాల నుంచి సెకనుకు 25 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇది రాత్రి సమయానికి మరింతగా పెరిగే అవకాశం ఉంది. నీటి ఉధృతి పెరిగే అవకాశాలతో హొగ్నెకల్ జలపాతం వైపుగా సందర్శకుల రాకను నిషేధిస్తూ ధర్మపురి జిల్లా యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. అలాగే నదిలో నీటి ఉధృతి పెరిగే అవకాశం ఉందని, అటు వైపుగా వెళ్లొద్దని దండోరా వేయించారు. కావేరిలో నీటి రాకతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కర్ణాటకలో మరింతగా వర్షాలు పడాలని, మేట్టూరు జలాశయం పూర్తిగా నిండాలని ప్రార్థిస్తున్నారు.

మోత.. మోగింది..!

- చెన్నైలో వాహనదారుల భరతం పడుతున్న ట్రాఫిక్ పోలీసులు
- ఏడు నెలల్లో చలాన్లతో రూ. 60 కోట్లు వసూలు
- మందుబాబుల నుంచి రూ. 19 కోట్లు పిండుకున్న వైనం



సాక్షి, చెన్నై: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారి భరతం పట్టేవిధంగా చెన్నై పోలీసులు దూకుడు పెంచారు. గత ఏడు నెలల్లో రూ. 60 కోట్లను చలాన్ల రూపంలో వసూలు చేశారు. అలాగే మద్యం మత్తులో వాహనాలు నడిపిన మందుబాబులకు నుంచి ఏకంగా రూ. 19 కోట్లు రాబట్టారు. వివరాలు.. రాష్ట్ర రాజధాని నగరం చెన్నైలో ప్రమాదాల నివారణే లక్ష్యంగా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. నిబంధనల్ని ఉల్లంఘించే వారి భరతం పట్టే రీతిలో దూకుడు పెంచారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకుండా వాహనాలు నడిపే వారిని, ట్రిబుల్ రైడింగ్‌తో దూసుకెళ్లే ద్విచక్ర వాహనదారులను, సిగ్నల్స్‌లో ఆపకుండా ముందుకెళ్లే వారిపై గురి పెట్టి ఉదయం నుంచి సాయంత్రం వరకు సోదాలు విస్తృతంగా చేస్తున్నారు. అలాగే, రాత్రుల్లో మద్యం తాగి వాహనం నడిపే వారు , బైక్ రేసింగ్‌లలో పాల్గొనే వారికి జరిమానాల మోత మోగిస్తున్నారు.

జరిమానాల జోరు..

నగరంలో అనేక కూడళ్లను హెల్మెట్ జోన్లు, స్పీడ్ కంట్రోల్ చెకింగ్ జోన్లుగా ఇప్పటికే ట్రాఫిక్ పోలీసులు ప్రకటించారు. ఈ ప్రాంతాల్లో నిరంతరం దృష్టి సారిస్తూ అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారి భరతం పట్టే విధంగా జరిమానాల మోత మోగిస్తున్నారు. నిఘా నేత్రాల ద్వారా సైతం గురించి మొబైల్ ఫోన్లకు ఎస్ఎంఎస్ రూపంలో చలానా విధిస్తున్నారు. 32 రకాల నిబంధనలకు జరిమానాలు విధించాల్సి ఉన్నా, ప్రధానంగా ఏడు రకాల నిబంధనలు ఉల్లంఘించే వారిని నుంచి మాత్రమే ప్రసుత్తం ఫైన్ వసూలు చేస్తున్నారు. గత ఏడాది జరిమానాల రూపంలో ట్రాఫిక్ పోలీసు ఖాతాలో రూ. 149 కోట్లు చేరాయి. ఈ ఏడాది ఏడు నెలల్లో రూ. 60 కోట్లను దాటేశారు. ఇందులో మందు బాబుల నుంచి ఎక్కువ మొత్తమే వసూలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 19,765 మందిపై కేసు నమోదు చేసి రూ. 19.76 కోట్లు జరిమానాల రూపంలో వసూళ్లు చేసి ఉన్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపిన 3,61,655 మంది నుండి రూ. 36.16 కోట్లు, ట్రిబుల్స్ డ్రైవింగ్‌లో 8,593 కేసులు నమోదు చేసి రూ. 85.93 లక్షలు, అతి వేగానికి సంబంధించి 2,716 కేసుల్లో రూ. 27.16 లక్షలు, సీటు బెల్ట్ ధరించని 9,101 మంది నుంచి రూ. 91.01 లక్షలు, సిగ్నల్ వద్ద వాహనం ఆపకుండా వెళ్లిన 39,320 మంది నుంచి రూ. 1.96 కోట్లు, కార్లకు బ్లాక్ ఫిల్మ్ అంటించిన 4,284 మంది నుంచి రూ.21.42 లక్షలు వసూలు చేశారు. ఇదే కాకుండా సీసీ కెమెరాల ద్వారా గుర్తించిన వాహన నెంబర్లకు ఎస్ఎంఎస్‌ల ద్వారా చాలానా విధించారు. వీటి ద్వారా కోట్లాది రూపాయలు వసూలు కావాల్సి ఉంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్ ద్వారా లేదా, ట్రాఫిక్ జరిమాన వసూళ్ల కేంద్రాల ద్వారా వాహన దారులు త్వరితగతిన చెల్లిస్తే మంచిది. లేని పక్షంలో వారి వాహనాలు, లైసెన్స్‌లను సీజ్ చేసే విధంగా ట్రాఫిక్ పోలీసులు దూకుడు పెంచనున్నారు. ఇక వాహన దారులు నిబంధనలు సక్రమంగా పాటిస్తే, జరిమానాల మోత మోగించాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కాగా వాహన దారులకు మరింత అవగాహన కల్పించే విధంగా రోడ్ సేఫ్టీ కార్యక్రమాలను విస్తృతం చేస్తామని చెన్నై పోలీసుల కమిషనర్ సందీప్ రాయ్ రాథోర్ తెలిపారు.

ఓటర్లతో మమేకం కావాలి

- సైనికుల తరహాలో పోరాడాలి
- బీజేపీ వస్తే తమిళనాడుకు రక్షణ కరువే
- సీఎం స్టాలిన్ హెచ్చరిక
- బూత్ కమిటీ ఇన్‌చార్జ్‌లతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: రాష్ట్రంలోని ప్రతి ఓటరుతో మమేకమయ్యే విధంగా ముందుకెళ్లాలని, ఓటర్ల కుటుంబంలో ఒకరిగా మెలగాలని పార్టీ బూత్ కమిటీల ఇన్‌చార్జ్‌లను డీఎంకే అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్ ఆదేశించారు. పుదుచ్చేరితోపాటు తమిళనాడులో కూటమి గెలుపుతో పాటుగా దేశ వ్యాప్తంగా విజయకేతనం ఎగురవేయడమే లక్ష్యంగా శ్రమిద్దామని పిలుపు నిచ్చారు. వివరాలు.. లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతూ రాష్ట్రాన్ని పార్టీ పరంగా ఐదు జోన్లుగా డీఎంకే విభజించింది. ఆయా జోన్ల వారీగా పోలింగ్ బూత్‌ల ఇన్‌చార్జ్‌లతో సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలపై దృష్టి పెట్టింది. తొలి విడతగా డెల్టా జిల్లాలోని 12 వేల పోలింగ్ బూత్‌లకు ఇన్‌చార్జ్‌లుగా ఉన్న వారికి బుధవారం తిరుచ్చి వేదికగా శిక్షణ కార్యక్రమం జరిగింది. ప్రతి పక్షాల వ్యూహాలను ఎలా భగ్నం చేయాలి, సామాజిక మాధ్యమాలను ఎలా వాడుకోవాలి, ఓటరు జాబితా పరిశీలన తదితర అంశాలను ఈ శిక్షణలో వివరించారు.

ఉదాసీతన వద్దు..

సాయంత్రం జరిగిన సభలో బూత్ కమిటీల ఇన్‌చార్జ్‌లను ఉద్దేశించి స్టాలిన్ ప్రసంగించారు. వారికి ప్రధానంగా మూడు బాధ్యతలను అప్పగిస్తూ వ్యాఖ్యలు చేశారు. తిరుచ్చి డీఎంకే కోట అని, ఇక్కడున్న వారంతా డీఎంకే ధీరులు అని వివరించారు. ఇక్కడున్న ఇన్‌చార్జ్‌లను ఎంపిక చేయడానికి ముందుగా సమగ్ర పరిశీలన చేశామని, ఆ తర్వాతే గుర్తింపుకార్డులు ఇచ్చామని పేర్కొన్నారు. ఇన్‌చార్జ్‌లుగా ఉన్న వారంతా ప్రభుత్వ పథకాల గురించి సమగ్ర అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఓటర్ల జాబితా పరిశీలనకే పరిమితం కాకుండా ఓటర్ల కుటుంబంలో ఒకరిగా మెలిగే రీతిలో మమేకం కావాలని ఆదేశించారు. పోలింగ్ బూత్‌ల పరిధిలోని కుటుంబాల వద్దకు రోజూ వెళ్లాలని, వారి సమస్యలు తెలుసుకోవాలని, అతి పెద్ద సమస్యలుగా ఉంటే జిల్లాల కార్యదర్శులు, మంత్రులు, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు. బూత్ కమిటీ ఇన్‌చార్జ్‌లు తీసుకొచ్చే సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లాల కార్యదర్శులను ఆదేశించారు. ఓటర్లను ఆకర్షించే విధంగా, పోలింగ్ రోజున ఓటు హక్కు వినియోగించుకునే రీతిలో సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. తమ తమ పరిధిలోని కుటుంబాల గురించి ప్రతి బూత్ కమిటీ ఇన్‌చార్జ్ సమగ్ర సమాచారంతో, వారి కుటుంబంలో ఓ వ్యక్తిగా ముందుకెళ్లాలని తెలిపారు. ఇన్‌చార్జ్‌లు, సభ్యుల మధ్య సమన్వయం ముఖ్యమన్నారు. డీఎంకే పాలనపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని, దీనిని మరింతగా పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ శ్రమించాలని కోరారు. పుదుచ్చేరితో పాటుగా తమిళనాడులోని 40 లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకోవడమే కాదు, ఇండియా కూటమి దేశవ్యాప్తంగా విజయపతాకం ఎగుర వేసే విధంగా పనిచేద్దామన్నారు. ఎవరు అధికారంలోకి రావాలన్నది ముఖ్యం కాదని, ఎవరు రాకూడదో అన్నదే ముఖ్యం అన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే తమిళనాడుకే కాదు, దేశానికే రక్షణ కరువైనట్టు అని హెచ్చరించారు. దేశాన్ని చిన్నాభిన్నం చేస్తారని, తమిళనాడును రక్షించుకునేందుకు శ్రమించాల్సి ఉంటుందన్నారు. అందుకే లోక్‌సభ ఎన్నికలను ఓ సవాలుగా తీసుకుని ప్రతి ఒక్కరూ సైనికుల తరహాలో పని చేయాలని పిలుపు నిచ్చారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని చంపేశారు


నిందితులు శామ్యూల్, సంజయ్

కొరుక్కుపేట: కాశిమేడు ప్రాంతంలో ఆంధ్రా వ్యక్తిని హత్య చేసి సముద్రంలో పడేసిన ఇద్దరు యువకులను అరెస్టు చేసి జైలుకు పంపారు. వివరాలు.. చెన్నై కాసిమేడు పాత కాస్టింగ్ ప్రాంతంలో ఒడ్డుకు కొట్టుకొచ్చిన 45 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని కాశిమేడు ఫిషింగ్ పోర్ట్ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి ముఖంపై 21 తీవ్ర గాయాలున్నాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాకి చెందిన లోకేష్ (45) కాశిమేడు ప్రాంతంలో ఉంటూ చేపల వ్యాపారం చేస్తున్నాడని, అతడిని కొట్టి చంపినట్లు తేలింది. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా కాశిమేడు అన్నానగర్ కాటేజీకి చెందిన శామ్యూల్(21), సంజయ్ (21) సిమెంట్ టైల్స్, రాళ్లతో కొట్టి చంపినట్లు తేలింది. పోలీసులు వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించగా.. మద్యానికి డబ్బులు ఇవ్వకపోవడంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. దీంతో లోకేష్ మృతి చెందినట్లు తెలిపారు.

చెన్నై గురువారం । 27 । జూలై । 2023 సాక్షి

క్లుప్తంగా

అరుణాచలేశ్వరుని హుండీ ఆదాయం రూ.2.27 కోట్లు


హుండీ కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

వేలూరు: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయానికి హుండీ కానుకల ద్వారా రూ. 2.27 కోట్లు ఆదాయం వచ్చినట్లు ఆలయ జాయింట్ కమిషనర్ జ్యోతి తెలిపారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం హుండీ లెక్కింపు చేయడం ఆనవాయితీ. మంగళవారం ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆలయానికి చెందిన మొత్తం 22 హుండీల కానుకలను లెక్కించారు. ఇందులో రూ.2.27 కోట్ల నగదుతో పాటు 149 గ్రాముల బంగారం, 1,260 గ్రాముల వెండి వచ్చినట్లు జేసీ తెలిపారు. ఈ నగదును ప్రభుత్వ ఖాతాలో జమ చేయనున్నట్లు వెల్లడించారు. దేవదాయ శాఖ జిల్లా చైర్మన్ జీవానందం, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెరుకు లారీని అడ్డుకున్న ఏనుగు

కొరుక్కుపేట: ఈరోడ్ జిల్లా సత్యమంగళం టైగర్ రిజర్వ్ ఫారెస్టులో పెద్ద సంఖ్యలో ఏనుగులు సంచరిస్తున్నాయి. తమిళనాడు-కర్ణాటక రాష్ట్రాలను కలిపే సత్యమంగళం-మైసూర్ జాతీయ రహదారి ఈ అడవి గుండానే వెళుతుంది. మంగళవారం సాయంత్రం అసనూరు అటవీప్రాంతం నుంచి బయటకు వచ్చిన ఓ ఏనుగు సత్యమంగళం-మైసూరు జాతీయ రహదారిపై వీరంగం సష్టించింది. కర్ణాటకలోని సామ్‌రాజ్‌నగర్ నుంచి సత్యమాంగళానికి చెరుకు లోడ్‌తో వెళ్తున్న లారీని అడ్డుకుని చెరుకు గడలు తినడం ప్రారంభించింది. ఫలితంగా అర్ధగంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. తర్వాత ఏనుగు అడవిలోకి వెళ్లిపోవడంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు.

పల్లావరంలో మహిళా పోలీస్ స్టేషన్ ప్రారంభం

తిరువొత్తియూరు: పల్లావరంలోని పమ్మల్ శంకరనగర్‌లో బుధవారం ఉదయం మహిళా పోలీస్ స్టేషన్‌ను తాంబరం పోలీసు కమిషనర్ అమల్ రాజ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పోలీసుస్టేషన్‌లో మొదటి సంతకం చేశారు. ఈ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్, 9 మంది మహిళా పోలీసులు విధులు నిర్వహించనున్నారు. మహిళలు, చిన్నారుల సమస్యలను స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని పోలీసులు కోరారు.

రోడ్లపై నాట్లు వేసి నిరసన


రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలుపుతున్న కొట్టయూర్ గ్రామస్తులు

తిరువళ్లూరు: రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతూ బురదమయమైన రోడ్డులో వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేసిన ఘటన తిరువళ్లూరు జిల్లాలో చోటుచేసుకుంది. కొట్టయూర్ గ్రామంలోని ఇందిరానగర్‌లో సుమారు 200 కుటుంబాలు ఉంటున్నాయి. ఈ ప్రాంతంలోని ప్రజల రాకపోకల కోసం 15 ఏళ్ల క్రితం రోడ్డు నిర్మించారు. అయితే ప్రస్తుతం రోడ్డు కంకరతేలి రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి.వర్షం పడితే బురదమయంగా మారుతోంది. రోడ్లు వేయాలని కలెక్టర్ సహా ఉన్నత అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రోడ్లు బురదమయంగా మారడంతో స్థానికులు రోడ్డులోనే వరినాటు వేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. తమకు రోడ్లు నిర్మించాలని నినాదాలు చేశారు. పోలీసులు, అధికారులు గ్రామస్తులతో మాట్లాడి వారిని శాంతింపజేశారు.

రోడ్లు వేయండి మహాప్రభో

అన్నానగర్: అదియమాన్ కోటలో బురదతో నిండిన రోడ్లను బాగు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం ప్రజలు రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ధర్మపురి జిల్లా అదియమాన్ కోటలో 2000 ఇళ్లు, పంచాయతీ కౌన్సిల్ కార్యాలయం, ప్రభుత్వ ఉప ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. అదియమాన్ కోట బైపాస్ రోడ్డు జంక్షన్ నుంచి ఉడైయార్థేరు వరకు రోడ్డు గుంతలతో నిండిపోయింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదమయంగా మారి నీటితో నిండిపోయింది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు వినతి పత్రం ఇచ్చినా ఇంత వరకు చర్యలు తీసుకోలేదు. దీంతో బుధవారం ఉదయం రోడ్డు మరమ్మతులు చేయాలని కోరుతూ స్థానికులు బురదలో వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షురాలు మారియమ్మాళ్ మునిరాజ్, పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న ప్రజలతో చర్చలు జరిపారు. అనంతరం రోడ్డు నిర్మాణ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.


అదియమాన్ కోటలో..

దేవదాయశాఖ తీరుపై గ్రామస్తుల ఆందోళన


పెరుమానల్లూరు ఓసూరమ్మ ఆలయంలో బైటాయించిన మహిళలు


గ్రామస్తులతో చర్చలు జరుపుతున్న ఎస్ఐ

పళ్లిపట్టు: హుండీ కానుకలు లెక్కింపును అడ్డుకుని మహిళలు ఆలయంలో బైటాయించి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. పళ్లిపట్టు సమీపంలోని పెరుమానల్లూరులో హిందు దేవదాయశాఖకు చెందిన ఓసూరమ్మ ఆలయం ఉంది. నాలుగు నెలల క్రితం ఆలయ మహాకుంభాభిషేకం చేశారు. గ్రామస్తులు, ఉభయదారులు విరాళాలతో ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేపట్టి మహా కుంభాభిషేకం చేశారు. ఈ వేడుకలకు రూ. 13 లక్షలు ఖర్చు చేశారు. ఆ డబ్బును హిందూ దేవదాయ శాఖ తమకు చెల్లించాలని గ్రామీణులు కోరుతున్నారు. అయితే భక్తు లు ఆలయానికి చేసిన ఖర్చులకు సంబంధించి హిందూ దేవదాయశాఖ డబ్బులు చెల్లించదని అధికారులు తెలిపారు. దీంతో వారం క్రితం హుండీ కానుకల లెక్కింపునకు వచ్చిన ఆలయ ఇన్‌స్పెక్టర్ ఉష బృందాన్ని గ్రామీణులు అడ్డుకున్నారు. డబ్బు చెల్లించి కానుకలు లెక్కించుకోవచ్చని తెలపడంతో వెళ్లిపోయారు. బుధవారం పోలీసుల బందోబస్తుతో హుండీ కానుకలు లెక్కించేందుకు ఇన్‌స్పెక్టర్ ఉషా బృందం ఆలయం వద్దకు చేరుకుంది. దీంతో గ్రామానికి చెందిన మహిళలు వారిని అడ్డుకున్నా రు. ఆలయంలో బైటాయించి నిరసన తెలిపారు. హుండీ కానుకలుగా మాత్రం రూ. 10 లక్షలకు పై గా వస్తుందని అయితే ఆలయానికి దేవదాయశాఖ అధికారులు చేసింది శూన్యమని ఆరోపించారు. భక్తులు చెల్లించే కానుకలకు సంబంధించి ఎలాంటి లెక్కలు చూపడం లేదన్నారు. తమకు కుంభాభి షేకం ఖర్చులను ఇవ్వాలని హుండీ లెక్కింపును అడ్డుకున్నారు. దీంతో ఎస్ఐ సుబ్రహ్మణ్యం వారితో మాట్లాడారు. న్యాయం చేసే వరకు లెక్కింపు చేపట్టేది లేదని చెప్పడంతో ఆందోళన విరమించారు.

భవిష్యత్ కార్యాచరణే లక్ష్యంగా పెట్టుబడులు

సాక్షి, చెన్నై: భవిష్యత్ ట్రెండ్‌లలో, నిరంతర ఆవిష్కరణలకు పెట్టుబడులను విస్తృతం చేయనున్నామని పూనావల్లా ఫిన్‌కార్ప్ లిమిటెడ్ డైరెక్టర్ సీఏ అభయ్ భూతాడ తెలిపారు. క్యూ1ఎఫ్‌వై 24లో సాధించిన ఫలితాలను బుధవారం స్థానికంగా ఆయన ప్రకటించారు. వినియోగదారులు, ఎంఎస్‌ఎంఈ రుణాలు, నాన్ డిపాజిట్‌ల గురించి ఎన్‌బీఎఫ్‌సీ డైరెక్టర్ల బోర్డులో చర్చించామని వివరించారు. అత్యధికంగా త్రైమాసిక పీఏటీ రూ.200 కోట్లు సాధించామన్నారు. ఎఫ్‌వై 24లో అద్భుతమైన ప్రారంభంతో ముందుకెళ్తున్నామని పేర్కొంటూ, తమ ఫిన్‌టెక్ మోడల్, ఉత్పాదకత, సామర్థ్యం పెంపునకు ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. భవిష్యత్తు కార్యాచరణకు పెట్టుబడులు విస్తృతం చేయనున్నామని తెలిపారు.

వెంగల్ పోలీస్‌స్టేషన్ ముట్టడి

- ఆషాడ ఉత్సవాలకు భద్రత కల్పించాలని వినతి


ఆందోళన నిర్వహిస్తున్న గ్రామస్తులు

తిరువళ్లూరు: ఆషాడం ఉత్సవాలను అడ్డుకుని బెదిరింపులకు పాల్పడుతున్న పంచాయతీ అధ్యక్షుడి భర్తపై చర్యలు తీసుకోవడంతో పాటు ఉత్సవాలకు భద్రత కల్పించాలని కోరుతూ గ్రామస్తులు వెంగల్ పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన నిర్వహించారు. తిరువళ్లూరు జిల్లా ఎల్లాపురం యూనియన్ కొమక్కంబేడులో ప్రసిద్ధి చెందిన మారియమ్మన్ ఆలయం ఉంది. ఇక్కడ ఏటా ఆషాడమాసంలో ఆడిపురం, అమ్మవారి జాతర నిర్వాహకుడు మణి నేతృత్వంలో నిర్వహిస్తారు. ఆడిపురం ఉత్సవాలను గత శుక్రవారం నిర్వహించారు. ఆలయ ప్రత్యేక ఉత్సవాలు ఆదివారం జరగనుంది. ఈ నేపథ్యంలో అక్కడికి వచ్చిన పంచాయతీ అధ్యక్షురాలు వెంకటేశ్వరి భర్త తంగరాజన్ ఇకపై ఆలయంలో జరిగే ఉత్సవాల నిర్వాహణ బాధ్యతను తమకు అప్పగించాలని లేనిపక్షంలో జాతర నిర్వహించొద్దని బెదిరింపులకు దిగినట్లు తెలిపారు. అప్పట్లో గ్రామపెద్దలు తంగరాజన్‌ను సముదాయించి ఆడిపురం సజావుగా సాగడానికి చర్యలు తీసుకున్నారు. ఆదివారం జరిగే ఉత్సవాలకు గ్రామపెద్దలు, మణి కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో అక్కడికి వచ్చిన డీఎంకే నేత తంగరాజన్ ఏర్పాట్లను అడ్డుకుని నానాయాగీ చేశాడు. జాతర తానే చేస్తానని, తనను కాదంటే జాతర వద్దని బెదిరింపులకు దిగడంతో గ్రామస్తులు వెంగల్ పోలీసు స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన నిర్వహించారు. అనంతరం పోలీసులకు వినతి పత్రం సమర్పించారు. జాతర సజావుగా సాగడానికి బందోబస్తు కల్పించాలని కోరారు.

భవన నిర్మాణ పనులు చేస్తుండగా జారిపడి తాపీమేస్త్రి మృతి

తిరుత్తణి: భవన నిర్మాణ పనులు చేస్తుండగా జారి పడి తాపీమేస్త్రి ప్రాణాలు కోల్పోయిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. తిరుత్తణి యూనియన్ మద్దూరు గ్రామానికి చెందిన ఈశ్వరయ్య(45) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అదే గ్రామంలో వేలు అనే వ్యక్తి ఇంటి నిర్మాణపు పనులు చేస్తుండగా అకస్మాత్తుగా మెట్లపై నుంచి జారి పడ్డాడు. తీవ్ర గాయాలైన అతన్ని స్థానికులు కాపాడి తిరుత్తణి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం చెన్నైలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఈశ్వరయ్య మృతి చెందాడు. తిరుత్తణి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుల కోటా ఉద్యోగాల భర్తీకి చర్యలు

తిరువొత్తియూరు: ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దివ్యాంగుల కోటా 4 శాతం పోస్టులను ఏడాది లోగా భర్తీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పరీక్ష నిర్వహించి ఎంపిక చేయాలని పేర్కొంది. రెండేళ్లకు పైగా తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్న దివ్యాంగులకు ప్రత్యేక పరీక్ష నిర్వహించి తీసుకోవాలని ఆదేశించింది.

ధన్వంతరిలో గరుత్మంతునికి ప్రత్యేక పూజలు



యాగ పూజలు చేస్తున్న వేద పండితులు, గరుడు భగవాన్‌కు అభిషేకం చేస్తున్న అర్చకులు

వేలూరు: రాణిపేట జిల్లా వాలాజలోని శ్రీధన్వంతరి ఆరోగ్య పీఠంలో లోక క్షేమం కోసం ప్రత్యేక యాగ పూజలు నిర్వహించారు. ఆరోగ్య లక్ష్మి సమేత ధన్వంతరి భగవాన్‌తో పాటు శైవం, వైష్ణవ, సక్తం సౌరం, కౌమారం, కనపద్యం అనే ఆరు దేవతలతో పాటు 16 మందికి పైగా సాధువులు, పురోహితులు, రమణ మహావీరులు, బుద్ధుడు, రాఘవేంద్రుడితో పాటు 468 సిద్ధర్ లింగాలను ప్రతిష్టించి ప్రతి రోజూ యాగ పూజలు చేసి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. బుధవారం ఉదయం గరుడ భగవాన్ జయంతిని పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. పీఠాధిపతి మురళీధర స్వామిజీ ఆధ్వర్యంలో గరుడు హోమం, హనుమంత హోమం, మహా లక్ష్మీ హోమం, తిరుమంజనం, పుష్పాంజలి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గురువారం ఉదయం వాస్తు దినోత్సవం సందర్భంగా ఉదయం 7 నుంచి 9 గంటల వరకు తిరుమంజనం, వాస్తు భగవాన్‌కు ప్రత్యేక హోమ పూజలు జరగనున్నాయి.

కోలీవుడ్ టాక్స్

లేడీ ఓరియంటెడ్ కథా చిత్రంలో అతిథిరావ్


నటి అతిథి రావ్

తమిళ సినిమా: బహుభాషా నటి అతిథి రావు హైదరి. బాలీవుడ్‌లో నటిగా రంగ ప్రవేశం చేసిన తర్వాత అక్కడ పలు చిత్రాల్లో వివిధ పాత్రల్లో నటించారు. ఇక ఈ బ్యూటీని మణిరత్నం కోలీవుడ్‌కి పరిచయం చేశారు. అలా కార్తీకి జంటగా కాట్రు వెలియిడై వైవిధ్యభరిత ప్రేమ కథా చిత్రం ద్వారా పరిచయమై గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత మళ్లీ మణిరత్నమే సెక్క సెంవంద వానం చిత్రంలో అవకాశం కల్పించారు. ఆ మధ్య హే సినామికా చిత్రంలో దుల్కర్ సల్మాన్, కాజల్ అగర్వాల్ లతో కలిసి నటించిన ఈమె సముద్రం అనే చిత్రం ద్వారా టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఆ సమయంలోనే ఆ చిత్ర కథానాయకుడు సిద్ధార్థతో పరిచయం ప్రేమగా మారిందని ప్రచారం జోరు అందుకుంది. అదేవిధంగా వీరిద్దరూ సహజీవనం చేస్తున్నారని టాక్ వైరల్ అవుతోంది. ఇకపోతే మరాఠీ, ఆంగ్లం చిత్రాల్లోనూ నటిస్తున్న అతిథి రావ్ చిన్న గ్యాప్ తర్వాత తాజాగా తమిళం, తెలుగు భాషల్లో రూపొందనున్న లేడీ ఓరియంటెడ్ కథా చిత్రంలో నటించటానికి సిద్ధమవుతున్నట్లు తాజా సమాచారం. దీనికి రాజేష్ సెల్లా దశరథం వహించినట్లు సమాచారం. నాజర్ వసుంధర కలిసి నటించిన కాలైప్పణి చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అయిన ఈయన ఆ తరువాత విక్రమ్, త్రిష జంటగా నటించిన తూఙ్గావనం, విక్రమ్ కథానాయకుడు నటించిన కడారం కొండాన్ చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఇటీవల శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన. ఆరై అనే వెబ్‌సిరీస్‌కు దర్శకత్వం వహించారు. కాగా నటి అతిథి రావ్ ప్రధాన పాత్రలో నటించే చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెలబడే అవకాశం ఉంది.

రెహమాన్, భరత్ కాంబోలో 'సమరా'



తమిళ సినిమా: ధ్రువంగల్ పదినారు వంటి విజయవంతమైన చిత్రం తర్వాత నటుడు రెహమాన్ వైవిధ్యభరిత కథా చిత్రాలను ఎంపిక చేసుకొని నటిస్తున్నారు. ఇటీవల మణిరత్నం దర్శకత్వం వహించిన పొన్నియిన్ సెల్వన్ చిత్రంలో ముఖ్యపాత్రలో నటించి ప్రశంసలు అందుకున్నారు. కాగా తాజాగా ఈయన నటుడు భరత్‌తో కలిసి నటిస్తున్న చిత్రం సమరా. ఈ చిత్రాన్ని పీకాక్ ఆర్ట్ హౌస్ పతాకంపై ఎంకే శుభాకరన్, అనుజ్ వర్గీస్ కలిసి నిర్మిస్తున్నారు. తమిళం, మలయాళం, హిందీ భాషల్లో రూపొందిస్తున్న ఇందులో టామ్ క్యాట్, బిజాల్ ప్రసన్న, కెనస్ మాథ్యూ రాజ్, సోనాలి సుడాన్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. దీనితోపాటు హిందీలో భజరంగిభైజాన్, జాలి ఎల్‌ఎల్‌బీ- 2, తమిళంలో విశ్వరూపం- 2 తదితర చిత్రాల్లో నటించిన గుర్తింపు పొందిన హాలీవుడ్ నటుడు మిర్సర్వార్ ముఖ్యపాత్రను పోషించారు. కాగా చార్లెస్ జోసఫ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి శీను సిద్ధార్థ్ ఛాయాగ్రహణం, దీపక్ వారియర్ సంగీతాన్ని అందించారు. ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకొని త్వరలో విడుదల సిద్ధం అవుతోంది. ఈ సందర్భంగా చిత్ర వర్గాలు మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంటూ ఫ్యామిలీ సెంటిమెంట్ తో కూడిన సైంటిఫిక్ థ్రిల్లర్ కథాచిత్రంగా సమరా ఉంటోందన్నారు. ఆసక్తికరమైన అంశాలతో ఉత్కంఠహత భరితరితంగా చిత్ర కథ సాగుతుందన్నారు. నటుడు రెహమాన్, భరత్ ఈ చిత్రానికి పెద్దబలం అని పేర్కొన్నారు.

ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా


వెబ్ చిత్ర ఆడియో ఆవిష్కరణలో ఉదయ్‌కుమార్

తమిళ సినిమా: నటుడు నట్టి, శిల్పా మంజునాథ్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం వెబ్. మొట్టై రాజేంద్రన్ ముఖ్య పాత్ర పోషించిన ఈ చిత్రాన్ని వేలన్ ప్రొడక్షన్స్ పతాకంపై వీఎం.మునివేలన్ నిర్మిస్తున్నారు. హరూన్ దర్శకత్వం వహిస్తున్నారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా బుధవారం ఉదయం స్థానిక ప్రసాద్ ల్యాబ్‌లో ఈ చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఇందులో నటుడు, నిర్మాత కె.రాజన్, దర్శకుడు ఆర్‌వీ.ఉదయకుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌వీ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ.. పలు హిందీ, తమిళ చిత్రాల కెమెరామెన్‌గా పనిచేసిన నట్టి ఆ తర్వాత నటుడిగా అవతారం ఎత్తారన్నారు. అందుకే మంచి కంటెంట్ కలిగిన కథా చిత్రాలను ఎంపిక చేసుకుని నటిస్తున్నారన్నారు. ఈ వెబ్ చిత్రం అలాంటి విభిన్న కంటెంట్‌తో కూడిన కథా చిత్రమని దర్శకుడు ఈ వేదికపై చెప్పారన్నారు. ఆయన ఎంతో అనుభవం కలిగిన దర్శకుడిగా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ఆడియో, ట్రైలర్ చూస్తేనే అర్థమవుతుందన్నారు. ఇప్పుడు దర్శకుడిగా ఎలాంటి అనుభవం లేకపోయినా చిత్రాలు చేయవచ్చు అని, తమ కాలంలో తమను ఒక గ్రూపు సినిమాల్లోకి రాకుండా అడ్డుకున్నారని చెప్పారు. అలాంటి వారిలో ఆర్ సుందర్ రాజన్ ఒకరని.. తాను కథలు రాసుకొని ఆయన వద్దకు వెళ్లి అవకాశం కల్పించాల్సిందిగా కోరానన్నారు. అందుకు ఆయన మేమంతా కథలను రాసుకుని చిత్రాలను చేసేవారు కాదని షూటింగ్ స్పాట్లోనే కథలు రాసి తెరకెక్కిస్తామని పరిహాసం చేశారన్నారు. అలా ఎన్నో అవమానాలు భరించి ఈ స్థాయికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ వెబ్ చిత్రం మంచి విజయాన్ని సాధించి నిర్మాతకు లాభాలు తెచ్చి పెట్టాలన్నారు. అలా కాకపోయినా పెట్టిన పెట్టుబడి తిరిగి వస్తే ఆయన మళ్లీ చిత్రం చేస్తారని అన్నారు.

అత్తా కోడళ్ల సమస్య లోకమంతా ఉంది



ఎల్‌జీఎం చిత్ర యూనిట్

తమిళ సినిమా: ప్రఖ్యాత క్రికెట్ క్రీడాకారుడు ఎంఎస్ ధోని చిత్ర నిర్మాణ సంస్థను ప్రారంభించి తొలిసారిగా తమిళంలో నిర్మించిన చిత్రం ఎల్‌జీఎం. ధోనీ సతీమణి సాక్షి ధోని నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రం ద్వారా రమేష్ తమిళమణి దర్శకుడిగా, సంగీత దర్శకుడిగా పరిచయం అయ్యారు. హరీష్ కళ్యాణ్, ఇవనా జంటగా నటించిన ఇందులో నటి నదియా, యోగిబాబు, ఆర్‌జే. విజయ్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. విశ్వజిత్ ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని శుక్రవారం వారం తెరపైకి రానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ మంగళవారం సాయంత్రం చెన్నైలోని పలోజా థియేటర్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ వేదికపై దర్శకుడు మాట్లాడుతూ ఒక సాధారణ కథను బ్రహ్మాండంగా తెరకెక్కించే ప్రయత్నమే ఎల్‌జీఎం అని తెలిపారు. ధోనీ నిర్మించిన చిత్రంలో నటించడం అదృష్టం అని నటుడు హరీష్ కళ్యాణ్ పేర్కొన్నారు. తన వివాహానంతరం విడుదల అవుతున్న చిత్రం ఇదని,ఆ విధంగా తన భార్య లక్కీ ఛామ్ అని అన్నారు. చిత్ర నిర్మాత సాక్షి ధోని మాట్లాడుతూ తమకు, తమిళ ప్రేక్షకులకు మధ్య భాష సమస్యే కాదన్నారు. ధోనీని తమిళ ప్రజలు ఎప్పుడో ఆదరించారని, తమిళ చిత్రం చేయడానికి అదీ ఒక కారణం అని అన్నారు. సహజత్వంతో కూడిన మంచి జనరంజక కథా చిత్రం చేయాలని భావించానన్నారు. అదే ఎల్‌జీఎం అని చెప్పారు. తన స్నేహితుల జీవితాల్లో జరిగిన విషయాలను, తాను చూసిన ఘటనలతో రాసిన కథ ఇదన్నారు. అత్తా కోడళ్ల మధ్య సమస్య అనేది లోకమంతా ఉందన్నారు. దాన్నే సహజత్వానికి దగ్గరగా జనరంజకంగా తెరకెక్కించినట్లు చెప్పారు. చిత్రాన్ని చూసిన ధోనీ చాలా బాగుందని చెప్పారని సాక్షి పేర్కొన్నారు.

విజయ్ సేతుపతికి జత కుదిరింది



తమిళ సినిమా: మలయాళ నటి మంజు వారియర్‌కు కోలీవుడ్‌లో అవకాశాలు వరుస కడుతున్నాయి. ఆ మధ్య వెట్రిమారన్ దర్శకత్వంలో రూపొందిన అసురన్ చిత్రంలో ధనుష్‌కు భార్యగా ఈమె నటించిన విషయం తెలిసిందే. ఇకపోతే ఇటీవల అజిత్ సరసన తుణివు చిత్రంలో నటించారు. తాజాగా నటుడు విజయ్ సేతుపతికి జంటగా నటిస్తున్నారు. హాస్యనటుడు సూరిని కథానాయకుడిగా పరిచయం చేస్తూ వెట్రిమారన్ విడుదలై చిత్రాన్ని రూపొందించిన విషం తెలిసిందే. ఇందులో విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలో నటించారు. ఇళయరాజా సంగీతాన్ని అందించిన ఈ చిత్రం గత ఏడాది మార్చి 31వ తేదీన విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. విమర్శకుల ప్రశంసలను అందుకున్న ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా రూపొందిస్తున్నట్లు యూనిట్ వర్గాలు ముందుగానే వెల్లడించిన విషయం విదితమే. ఇప్పటికే రెండో భాగాన్ని చాలా వరకు చిత్రీకరించిన వెట్రిమారన్ ఇప్పుడు పలు మార్పులు, చేర్పులు చేసి మళ్లీ షూటింగ్‌ను నిర్వహిస్తున్నారు. రెండో భాగంలో నటుడు విజయ్ సేతుపతికి ఫెయిర్ చేర్చారు. ఆ పాత్రను నటి మంజు వారియర్ చేస్తున్నారు. వీరిద్దరికీ సంబంధించిన సన్నివేశాలను చిరుమలై ప్రాంతంలో చిత్రీకరిస్తున్నారు. విడుదలై- 2 చిత్రాన్ని త్వరలో తెరపైకి తీసుకు రావడానికి సన్నాహాలు చేస్తున్నారనేది తాజా సమాచారం.

క్లుప్తంగా

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్



అరెస్టయిన నిందితులు

అన్నానగర్: వాసుదేవనల్లూర్‌లోని ఓ వైద్యుడి ఇంట్లో 102 సవర్ల నగలు చోరీ కేసులో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. తెన్‌కాశి జిల్లా వాసుదేవనల్లూరు పుదుమనై 3వ వీధికి చెందిన సముద్రవేలు కుమారుడు మణివణ్ణన్ (38) హోమియోపతి వైద్యుడు. అదే ప్రాంతంలో క్లినిక్, సూపర్‌మార్కెట్ నడుపుతున్నాడు. ఈ నెల 19వ తేదీ అతని ఇంట్లో 102 సవర్ల నగలు, 263 గ్రాముల వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. ఈ ఘటనపై వాసుదేవనల్లూర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ షణ్ముగ సుందరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దొంగలను పట్టుకునేందుకు సబ్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ధర్మపురి జిల్లా అరూర్‌కు చెందిన అతని బంధువులు నటరాజన్ (50), ఇతని భార్య లలిత (45), కుమారుడు నవీన్ కుమార్ (27) చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. పోలీసులు మంగళవారం ముగ్గురుని అరెస్టు చేశారు. వారి నుంచి 165 గ్రాముల నగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

18 కిలోల సముద్రపు జలగలు స్వాధీనం



నిందితుడు ముబారక్

అన్నానగర్: రామనాథపురంలో అక్రమంగా తరలిస్తున్న 18 కిలోల సముద్రపు జలగలను మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యువకుడిని అరెస్టు చేశారు. రామనాథపురం పనైకులం, దేవీపట్నం బీచ్ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం రామనాథపురం అటవీ సిబ్బంది గస్తీలో ఉన్నారు. బైకుపై వచ్చిన వ్యక్తిని తనిఖీ చేయగా 18 కిలోల సముద్రపు జలగాలు ఉన్నట్లు గుర్తించారు. ద్విచక్ర వాహనంతో పాటు దాన్ని స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు దేవీపట్నానికి చెందిన అబీబుల్లా కుమారుడు ముబారక్ (37)ని అరెస్టు చేసి విచారణ చేస్తున్నారు.

విషం తాగి కుటుంబం ఆత్మహత్యాయత్నం

- తల్లి మృతి
- తండ్రీ–కుమారుడి పరిస్థితి విషమం

అన్నానగర్: పురుగు మందు తాగి ఓ కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తల్లి మృతిచెందగా తండ్రీ కుమారుడి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు.. పాండిచ్చేరికి చెందిన ఆర్ముగం (65)కు భార్య కలైసెల్వి (60), కుమారుడు మణికంఠన్ (27), ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చెన్నై సబ్ డిస్ట్రిక్ట్‌లోని తన 2వ కుమార్తెను చూసేందుకు పాండిచ్చేరి నుంచి శుక్రవారం తిరువాన్మియూర్ వర్క్‌షాప్‌లో బస్సులో భార్య, కొడుకుతో కలిసి కూర్చున్నాడు. టికెట్ తీసుకునేందుకు వచ్చిన కండక్టర్ ఆర్ముగం పరిస్థితిని చూసి ఆరా తీయగా.. భార్య, కొడుకుతో కలిసి పురుగుల మందు తాగినట్లు తెలిపాడు. దీంతో ముగ్గురినీ రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమారుడి మానసిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు విచారణలో తెలిసింది. పరిస్థితి విషమించడంతో కలైసెల్వి మృతి చెందింది. ఆర్ముగం, కుమారుడు మణికంఠన్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

తండ్రీకుమార్తెకు పాము కాటు

తిరుత్తణి: తిరుత్తణి యూనియన్ వీసీఆర్ కండ్రిగ గ్రామంలో తండ్రీకుమార్తెను పాము కాటు వేసింది. గ్రామానికి చెందిన బాలాజీ (30), ఆయన కుమార్తె యకిత (7) మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు వారిద్దరిని తిరుత్తణి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరువళ్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

అప్పీలు కేసులో నిందితుడికి ఏడాది జైలు

తిరుపతి లీగల్ : చోరీ అప్పీలు కేసులో తమిళనాడు వేలూరు జిల్లా గుడియాత్తం తాలూకా ఉప్పరపల్లికి చెందిన టి.ఆనందరాజ్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్ బుధవారం తీర్పు చెప్పారు. కోర్టు మానిటరింగ్ అధికారి జీఎం.నాయుడు కథనం మేరకు.. ముగ్గురు వ్యక్తులు 2021 జూన్ 18వ తేదీన వడమాలపేట గాంధ్ల వీధిలోని ఇంటి తలుపులు పగులగొట్టి రూ.60 వేల ద్విచక్ర వాహనాన్ని అపహరించి ఆనందరాజ్‌కు విక్రయించారు. వాహన యజమాని ఫిర్యాదు మేరకు వడమాలపేట పోలీసులు కేసు దర్యాప్తు చేసి చోరీకి పాల్పడిన ముగ్గురితో పాటు వాహనాన్ని కొన్న ఆనందరాజ్‌పై కేసు నమోదు చేసి పుత్తూరు మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి కేసు పూర్వాపరాలు పరిశీలించి నలుగురికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ 2021లో తీర్పు చెప్పారు. ఆ తీర్పుపై ఆనందరాజ్ తిరుపతి కోర్టులో అప్పీలు దాఖలు చేసుకున్నాడు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయమూర్తి కింది కోర్టు తీర్పును ఖరారు చేస్తూ తీర్పు చెప్పారు.

ఎన్‌ఎల్‌సీ దూకుడు



నైవేలి పరిసరాల్లో పోలీసుల భద్రత

- నిఘా నీడలో స్థలాల స్వాధీనం
- 30 ప్రొక్లయినర్ల ద్వారా పంటలపై దాడి
- సేత్తియాతోపులో ఉద్రిక్తత
- పీఎంకే, బీజేపీ, ఏఎంఎంకే ఖండన

సాక్షి, చెన్నై : ఎన్‌ఎల్‌సీ అధికారులు దూకుడు పెంచారు. స్థలాలను బలవంతంగా లాక్కునేందుకు బుధవారం యత్నించారు. పోలీసు భద్రత నడుమ 30 ప్రొక్లయినర్ల ద్వారా పంట పొలాలను నాశనం చేస్తూ దూసుకెళ్లడం సేత్తియాతోపు పరిసరాలలో ఉద్రిక్తతను రేపింది. వివరాలు.. కడలూరు జిల్లా నైవేలిలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ లిగ్నైట్ కార్పొరేషన్ ఉన్న విషయం తెలిసిందే. నేల బొగ్గు తవ్వకాలు, విద్యుత్ ఉత్పత్తిలో రాణిస్తున్న ఈ కార్పొరేషన్ విస్తరణ కోసం తరచూ స్థలాలను సేకరిస్తున్నారు. ఇప్పటికే విస్తరణ పేరిట 34 గ్రామాలలో 15 వేల ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ స్థలాలను స్వాధీనం చేసుకున్న సమయంలో ఇచ్చిన హామీలను ఇంత వరకు అమలు చేయలేదు. అదే సమయంలో ప్రస్తుతం 26 గ్రామాల్లో 12 వేల ఎకరాలను స్వాధీనం చేసుకునేందుకు ఎన్‌ఎల్‌సీ వర్గాలు చేసిన ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఉద్యమం బయలు దేరింది. దీంతో కాస్త తగ్గినట్టు కనిపించిన ఎన్‌ఎల్‌సీ అధికారులు బుధవారం ఒక్కసారిగా దూకుడు పెంచారు. నేల బొగ్గు కొరత కారణంగా విద్యుత్ ఉత్పత్తికి కలుగుతోన్న ఆటంకాన్ని అస్త్రంగా చేసుకుని రైతుల పొలాలను బలవంతంగా లాగేసుకునే రీతిలో దూసుకెళ్లారు.

రైతుల్లో ఆగ్రహం..

వందలాది మంది పోలీసులు భద్రత నడుమ ఉదయం వలయమాదేవి, సేత్తియాతోప్పు పరిసరాలలో 30 ప్రొక్లయినర్ వాహనాలతో ఎన్‌ఎల్‌సీ వర్గాలు దూకుడు ప్రదర్శించారు. ఏపుగా పెరిగిన వరి పంటను నాశనం చేశారు. పొలాలలో మార్కింగ్ వేసే విధంగా అక్కడక్కడ తవ్వి పడేశారు. కొన్ని చోట్ల కాలువల తరహాలో తవ్వకాలు జరపడం మొదలెట్టారు. ఈ సమాచారంతో రైతులు అక్కడకు చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ పనులను అడ్డుకునేందుకు పీఎంకే నాయకులు దూసుకొచ్చారు. వారిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఎన్‌ఎల్‌సీ దూకుడుకు వ్యతిరేకంగా పోరాటాలు ప్రారంభం కావడంతో ఆ పరిసరాలలో ఉద్రిక్తత నెలకొని ఉంది. అదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు సేత్తియాతోపులో ప్రభుత్వ బస్సుపై ప్రతాపం చూపించారు. ఈ సమాచారంతో పోలీసులు మరింత భద్రతను పెంచారు. ఈ విషయంపై కలెక్టర్ తంబురాజ్ మీడియాతో మాట్లాడుతూ, పంటలకు ఏదైనా నష్టం కలిగి ఉంటే, వారం రోజుల్లో సాయం అందిస్తామన్నారు. ఎన్‌ఎల్‌సీ నుంచి రావాల్సిన మొత్తాలను ఆగస్టు 16 నుంచి 26వ తేదీలోపు రైతులకు అందించే విధంగా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. చెక్కుల రూపంలో స్థల యజమానులకు నష్ట పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, ఎన్‌ఎల్‌సీ దూకుడు, వారికి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం పోలీసు భద్రతను కల్పించడాన్ని పీఎంకే నేత అన్బుమణి రాందాసు, బీజేపీ నేత అన్నామలై, అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం నేత దినకరన్‌లు తీవ్రంగా ఖండించారు. స్థలాలను కై వసం చేసుకునే ప్రయత్నాలను వీడాలని హెచ్చరించారు.

ఐర్లాండ్ మహిళ అనుమానాస్పద మృతి

- పాతిపెట్టిన మృతదేహాన్ని బయటకు తీసేందుకు చర్యలు

వేలూరు: తిరువణ్ణామలై జిల్లా సాత్తూరు సమీపంలోని నెడుంగావడి గ్రామంలో రష్యా దేశానికి చెందిన కుటుంబం ఐదేళ్ల క్రితం స్థలం కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకుని ఉన్నారు. కొద్ది నెలల క్రితం రష్యా దేశానికి వెళ్లిపోయారు. ఈ క్రమంలో ఇంటిని తిరువణ్ణామలైలో ఉంటున్న ఐర్లాండ్‌కు చెందిన వృద్ధురాలికి (80) అద్దెకు ఇచ్చారు. ఆమె ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఆమెను గ్రామస్తులు మీనాక్షి అమ్మాల్ అని పిలిచేవారు. మీనాక్షి అమ్మాల్‌కు తిరువణ్ణామలైకి చెందిన హరి అనే వ్యక్తి ప్రతి ఆదివారం కూరగాయలు కొనుగోలు చేసి ఇచ్చేవాడు. ఈ నేపథ్యంలో హరి ఈనెల 23వ తేదీ మీనాక్షి అమ్మాల్ ఇంటికి కూరగాయలతో వెళ్లాడు. ఆ సమయంలో ఆమె మృతి చెంది ఉండడంతో గ్రామస్తులతో కలిసి ఇంటి సమీపంలోనే పాతి పెట్టారు. ఇదిలా ఉండగా మంగళవారం ఉదయం హరి మీనాక్షి అమ్మాల్‌కు డెత్ సర్టిఫికెట్ కోసం గ్రామ పరిపాలన అధికారికి దరఖాస్తు చేసుకున్నాడు. మృతి చెందిన మహిళ ఐర్లాండ్ దేశానికి చెందిన వారు కావడంతో అనుమానించిన వీఏఓ సాత్తూరు పోలీసులకు, ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు గ్రామానికి చేరుకుని గ్రామస్తుల వద్ద విచారణ జరిపారు. దీనిపై పోలీసులు మాట్లాడుతూ.. మృతి చెందిన వృద్ధురాలి బంధువులకు సమాచారం అందజేశామని తెలిపారు. వారు వచ్చిన వెంటనే ఫిర్యాదు తీసుకుని పాతిపెట్టిన మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహిస్తామన్నారు. ఆమెది సహజ మరణమా లేక డబ్బు కోసం ఎవరైనా హత్య చేశారా అనే విషయాలు బయటకు వస్తాయన్నారు. బుధవారం ఉదయం రెవెన్యూ, పోలీసు అధికారులు గ్రామానికి వెళ్లి మరోసారి విచారణ జరిపారు. ఆమె పెంచుతున్న మూడు శునకాలను తిరువణ్ణామలైలోని ఆశ్రమంలో వదిలి పెట్టారు.

ప్రతిభ చూపే విద్యార్థులకు స్కాలర్‌షిప్



ఎగ్జామ్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కొరుక్కుపేట: ఆకాష్ బైజూస్ నేషనల్ టాలెంట్ హంట్ ఎగ్జామ్ (ఆంతే) – 2023 బ్రోచర్‌ను ఆ సంస్థ నిర్వాహకులు బుధవారం ఆవిష్కరించారు. 14వ ఎడిషన్ అయిన వార్షిక స్కాలర్‌షిప్ పరీక్ష ఏడవ తరగతి నుంచి ప్లస్–2 విద్యార్థులు 100 శాతం స్కాలర్‌షిప్, నగదు బహుమతులతో ప్రతిభను నిరూపించుకునేందుకు వీలు కల్పిస్తోందని ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఈఎస్ఎల్) సీఈఓ, అభిషేక్ మహేశ్వరి తెలిపారు. చెన్నైలో బుధవారం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడుతూ లక్షలాది మంది విద్యార్థుల కలలను సాకారం చేసుకునేందుకు ఆంతే వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. 2010లో ప్రారంభించినప్పటి నుంచి కోచింగ్ అవకాశాల ద్వారా దేశవ్యాప్తంగా అర్హులైన విద్యార్థులకు శిక్షణ అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఏ ప్రాంతంలో ఉన్నప్పటికీ నీట్, ఐఐటీ, జేఈఈ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు వీలున్నట్లు తెలిపారు. ఆంతే- 2023 అక్టోబర్ 7 తేదీ నుంచి 15వ తేదీ మధ్య ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మోడ్‌లో దేశంలోని 26 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

సరిహద్దులో అప్రమత్తంగా ఉండండి

●డీఐజీ ముత్తుస్వామి



ఆంధ్రా సరిహద్దులోని పరదరామి చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న డీఐజీ

వేలూరు: ఆంధ్రా సరిహద్దు నుంచి వచ్చే వాహన నంబర్‌లను నమోదు చేయాలని వేలూరు డీఐజీ ముత్తుస్వామి పోలీసులను ఆదేశించారు. సరిహద్దు ప్రాంతంలోని పరదరామి సమీపంలో ఉన్న కనికాపురం చెక్ పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. తమిళనాడు, ఆంధ్రా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం కావడంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హైటవర్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా అదనపు బారికెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి వాహనం నంబర్‌ను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అనుమానాస్పద వస్తువులు ఏదైనా ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందజేయాలన్నారు. రాత్రి సమయంలో వాహనాల్లో గుట్కా, గంజాయి వంటి మత్తుపదార్థాల అక్రమ రవాణా జరిగే అవకాశం ఉన్నందున ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ప్రతి చెక్ పోస్టులో నలుగురు పోలీసులతో పాటు ఒక ఎస్ఐని బందోబస్తులో ఉంచనున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు డీఎస్పీ రామమూర్తి, ఇన్‌స్పెక్టర్ సెంథిల్‌కుమారి ఉన్నారు.

తిరుత్తణి హుండీ ఆదాయం రూ. 1.20 కోట్లు



కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

తిరుత్తణి: తిరుత్తణి ఆలయానికి హుండీ కానుకల ద్వారా 39 రోజులకు సంబంధించి రూ.1.20 కోట్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయ సమక్షంలో కానుకలను బుధవారం లెక్కించారు. రూ.1.20 కోట్లతో పాటు, 768 గ్రాముల బంగారు, 11,705 గ్రాముల వెండి కానుకగా వచ్చినట్లు అధికారులు తెలిపారు.

పణిమయమాత ఉత్సవాలు ప్రారంభం



పణిమయమాత ఆలయ మహోత్సవంలో భక్తులు

కొరుక్కుపేట: తూత్తుకుడి పణిమయమాత ఆలయ ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యా యి. ఏటా జూలై 26 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు తూత్తుకుడి నెల్కు బీచ్ రోడ్డులోని పనిమయ మాత ఆలయంలో ఘనంగా నిర్వహిస్తారు. ఈ పండుగను చూసేందుకు తమిళనాడుతో పాటు కేరళ, శ్రీలంక నుంచి భక్తులు వస్తుంటారు. పణిమయమాత ఆలయానికి 441వ వార్షికోత్సవం సందర్భంగా తూత్తుకుడి చర్చి వద్ద తెల్లవారుజామున మానవహారం నిర్వహించారు. మధ్యాహ్నం బిషప్ స్టీఫెన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అయ్యర్ నజరేన్ అమ్మవారికి బంగారు కిరీటాన్ని అలంకరించారు.

వ్యాపారి దారుణ హత్య

అన్నానగర్: విరుదునగర్‌లో బుధవారం ఉదయం వ్యాపారి దారుణ హత్యకు గురయ్యాడు. విరుదునగర్ మేలరది వీధికి చెందిన కుమారవేల్ (47) మినరల్ వాటర్ వ్యాపారం చేస్తున్నాడు. అలాగే మున్సిపల్ కాంట్రాక్టర్‌గా కూడా వ్యవహరిస్తున్నాడు. మున్సిపల్ కాంట్రాక్టు విషయంలో ఇతనికి, మైటన్ పట్టి ప్రాంతానికి చెందిన కొంతమందికి విరోధం ఏర్పడిందిన. అందులో జ్ఞానశేఖర్ కూడా ఉన్నారు. జ్ఞానశేఖర్ కుమారుడు వినిత్ గత ఏడాది కారైకుడిలో హత్యకు గురయ్యాడు. ఈ హత్యలో కుమారావేల్‌కు ప్రమేయం ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. కానీ విచారణ తర్వాత అతని పేరు తొలగించారు. అయితే కుమారవేల్‌పై ప్రత్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం విరుదునగర్‌లోని మాంబలమ్‌పేట కమిషన్‌మండిలో కుమారవేలు, అతని బంధువులు రూబీ, రామ్ కుమార్ మాట్లాడుకుంటున్నారు. అప్పుడు ఆరుగురు యువకులు కత్తితో వచ్చి దాడి చేశారు. ఇందులో ముగ్గురికి గాయాలు కాగా.. వారందరినీ విరుదునగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో కుమారవేల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో మదురైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కుమారవేల్ మృతిచెందాడు. దీని గురించి పోలీసులు కేసు నమోదు చేసి హంతకుల కోసం గాలిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం


అన్నానగర్: కరూర్ జిల్లాలో వ్యాన్‌ను బైక్ ఢీకొనడంతో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. వివరాలు.. అరవకురిచ్చి తాలూకా లింగమనాయకన్‌పట్టి సమీపంలోని కుప్పక్కాడుకు చెందిన మహ్మద్ సలీమ్ కుమారుడు షబీర్ మహ్మద్ (19), అతని స్నేహితుడు సుకీల్ (17) మంగళవారం సాయంత్రం కరూర్ నుంచి పల్లపట్టికి బైకులో వెళ్లారు. అరవకురిచ్చి నాలుగురోడ్ల కూడలి పక్కనే ఉన్న టిన్ షెడ్ వద్దకు రాగానే గ్రామాల్లో దిండ్లు అమ్ముకుంటూ మలుపు తిరుగుతున్న మినీవ్యాన్‌ను బైకు ఢీకొట్టింది. షబీర్ మహ్మద్, సుకీల్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. అరవకురిచ్చి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ అధికారికి మూడేళ్ల జైలు

తిరువళ్లూరు: విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి రూ.4 వేలు లంచం తీసుకుంటూ విజిలెన్స్‌కు పట్టుబడిన విద్యుత్‌శాఖ జేఈకి మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ. 20 వేల జరిమానా విధిస్తూ తిరువళ్లూరు కోర్టు తీర్పు వెలువరించింది. తిరువళ్లూరు జిల్లా ఆవడి సమీపంలోని తిరుముల్లైవాయల్ కన్నడపాళ్యం అశ్విన్‌నగర్‌కు చెందిన జనార్దన్‌రావు. ఇతను తన ఖాళీ స్థలంలో షెడ్‌వేసి విద్యుత్ కనెక్షన్ కోసం అయ్యపాక్కం విద్యుత్‌శాఖ కార్యాలయంలో 2011 ఏప్రిల్ 8న దరఖాస్తు చేసుకున్నాడు. మూడునెలలైనా కనెక్షన్ రాకపోవడంతో జేఈ ధనశేఖర్‌ను ఆశ్రయించాడు. కనెక్షన్ ఇవ్వడానికి మొదట రూ. 6 వేలు లంచంగా ఇవ్వాలని కోరగా అందుకు జనార్దన్‌రావు తన వద్ద అంతలేదని.. రూ.4 వేలు ఇవ్వడానికి అంగీకరించాడు. దీనిపై విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వారి సూచన మేరకు జూలై 15న జేఈ ధనశేఖరన్‌కు నగదు ఇస్తుండగా విజిలెన్స్ అధికారులు అరెస్టు చేశారు. కేసు విచారణ తిరువళ్లూరు కోర్టులో సాగింది.

విచారణ ముగిసిన నేపథ్యంలో విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి లంచం డిమాండ్ చేసిన జేఈకి మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ. 20 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించారు. అపరాధం చెల్లించని పక్షంలో మరో 3 నెలలు అదనంగా జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించింది. జేఈని పుళల్ జైలుకు తరలించారు.

మహిళకు బెదిరింపులు.. ముగ్గురి అరెస్ట్



అరెస్టయిన నిందితులు

తిరుత్తణి: ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళను బెదిరించిన ముగ్గురిని బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుత్తణి నరసింహస్వామి ఆలయ వీధికి చెందిన మదురై, అములు (38) దంపతులకు అదే ప్రాంతానికి చెందిన శరవణన్ కుటుంబీకుల మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో మదురై బయటకు వెళ్లిన సమయంలో అములు ఇంటి వద్దకు శరవణన్ కుటుంబీకులు కత్తులు, కర్రలతో బెదిరింపులకు పాల్పడ్డారు. అసభ్య పదజాలంతో వేధించినట్లు ఫిర్యాదు మేరకు తిరుత్తణి ఎస్ఐ రాఖీకుమారి కేసు నమోదు చేశారు. బాలన్ (48), మోహన్‌కుమార్ (19), సంజయ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

స్పృహ తప్పిపడిన కళాశాల విద్యార్థిని మృతి

తిరువొత్తియూరు: చెన్నై పెరంబూరులో ఇంటిలో స్పృహ తప్పి పడిన కళాశాల విద్యార్థిని మృతి చెందింది. చెన్నై పెరంబూరు కామరాజనగర్‌కు చెందిన రామమూర్తి జౌళి దుకాణంలో పని చేస్తున్నారు. కుమార్తె కీర్తి (18) పెరంబూర్‌లో ఉన్న ప్రైవేటు కళాశాలలో బీకాం చదువుతోంది. నాలుగు రోజులుగా కడుపు నొప్పితో కారణంగా కళాశాలకు వెళ్లకుండా ఇంటిలో ఉంటోంది. ఈక్రమంలో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో హఠాత్తుగా కీర్తి స్పృహ తప్పి కింద పడింది. తల్లిదండ్రులు కీర్తిని స్టాండ్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమెను పరిశీలించిన డాక్టర్లు మార్గం మధ్యలో కీర్తి మరణించినట్లు పేర్కొన్నారు.

పోలీసుల విధులను అడ్డుకున్న నలుగురి అరెస్ట్

తిరువొత్తియూరు: కాశిమేడులో రౌడీని పట్టుకోవడానికి ప్రయత్నించిన సమయంలో పోలీసులను అడ్డుకుని వాగ్వాదానికి దిగిన రౌడీ తల్లి, మామ, అన్న తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనలో కిందపడిన పోలీసుకు గాయమైంది. చెన్నై కాశిమేడుకి చెందిన సంజయ్ (22)పై హత్య, చోరీ, దారిదోపిడి తదితర కేసులు ఉన్నాయి. కొద్ది నెలలుగా కనిపించకుండా తిరుగుతున్న ఇతన్ని పట్టుకోడానికి కాశిమేడు ఇన్‌స్పెక్టర్ రాజేష్ నేతృత్వంలో ప్రత్యేక బృందం ఏర్పాటైంది. కాశిమేడులో సంజయ్ దాగి ఉన్నట్లు పోలీసులకు రహస్య సమాచారం అందింది. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. పోలీసులను చూసిన సంజయ్ తప్పించుకోవడానికి ప్రయత్నించాడు. అతన్ని చుట్టుముట్టి పట్టుకున్నారు. అక్కడున్న సంజయ్ అన్న రాము అలియాస్ వెంకట్రామన్ (24), తల్లి అముదవల్లి, మామ నరేష్ (29) తదితరులు పోలీసులను అడ్డుకుని వారితో వాగ్వివాదానికి దిగారు. ఈ ఘటనలో కిందపడిన కానిస్టేబుల్ గోపినాథ్ కాలికి గాయం ఏర్పడింది. అతన్ని స్టాన్లీ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. పోలీసుల విధులను అడ్డుకున్న వారిపై కేసు నమోదు చేసి సంజయ్, రాము అలియాస్ వెంకట్రామన్, నరేష్, అముదవల్లిని అరెస్టు చేశారు. నలుగురిని కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు తరలించారు.

స్కూటీని ఢీకొన్న లారీ

– ఇద్దరు విద్యార్థినుల మృతి

కొరుక్కుపేట: లారీ స్కూటీని ఢీకొన్న ఘటనలో ఇద్దరు విద్యార్థినులు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. వివరాలు.. తిరుపూర్ పక్కనే ఊతికూలి సమీపంలోని పల్లకొండం పాళయం ప్రాంతానికి చెందిన భువనేశ్‌కుమార్. అతని భార్య సుమతి. వీరి కుమార్తెలు తనిష్క (11), శశ్విక (7). వీరిద్దరూ ఆ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. బుధవారం ఉదయం ఆమె బంధువు తంగరాజ్ (60) ఇద్దరు బాలికలను స్కూటీపై పాఠశాలకు తీసుకెళ్తున్నారు. పల్లకొండపాలయం సమీపంలోకి వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న లారీ అనూహ్యంగా స్కూటీని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఇద్దరు విద్యార్థినులు అక్కడికక్కడే మృతి చెందారు. తంగరాజ్‌ను స్థానికులు రక్షించి పెరుందురై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ద్దరు మృతదేహాలను ఉత్తుకూలి పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం పెరుందురై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

జిల్లాలో కలైంజర్ పథకానికి 23,856 దరఖాస్తులు



దరఖాస్తు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

వేలూరు: కలైంజర్ పథకం కింద మహిళలకు రూ. 1000 నగదును సెప్టెంబర్ 15వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అందజేయనున్నారు. ఇందుకోసం మహిళలకు వేలూరు జిల్లా వ్యాప్తంగా అన్ని రేషన్ దుకాణాల్లో టోకన్‌లు అందజేసి తేదీల వారిగా మహిళలకు దరఖాస్తులను అందజేస్తున్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నమోదు కేంద్రంలో అందజేసి నమోదు చేసుకోవాలి. వేలూరు జిల్లాలో మొదటి విడతగా 3,02,447 రేషన్‌కార్డు దారులకు రేషన్ దుకాణాల్లో అందజేశారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 24 నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు జిల్లాలోని 397 ప్రత్యేక కేంద్రాల్లో అందజేయాలి. గత 24వ తేదీ ఒక్క రోజు మాత్రం వేలూరు, కాట్పాడి, అనకట్టు, గుడియాత్తం, కేవీ కుప్పం, పేర్నంబట్టు వంటి తాలుకాల్లో మొత్తం 23,856 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా వేలూరు సమీపంలోని అరియూరు ప్రభుత్వ పాఠశాలలో నమోదు చేస్తున్న ప్రత్యేక కేంద్రాన్ని కలెక్టర్ కుమరవేల్ పాండియన్, అధికారులు బుధవారం పరిశీలించారు.

తిరుచ్చి విమానాశ్రయంలో బంగారం స్వాధీనం

అన్నానగర్: తిరుచ్చి విమానాశ్రయంలో బుధవారం వేకువజామున రూ.14 లక్షల విలువైన బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం షార్జా నుంచి ఎయిర్ ఇండియా విమానం తిరుచ్చికి వచ్చింది. ఓ ప్రయాణికుడి తీరు అనుమానాస్పదంగా ఉండడంతో అతన్ని తనిఖీ చేశారు. 145 గ్రాముల బంగారాన్ని పేస్ట్ రూపంలో, 90 గ్రాముల బంగారాన్ని గొలుసు రూపంలో అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. బంగారాన్ని స్వాధీనం చేసుకుని ప్రయాణికుడిని విచారిస్తున్నారు. పట్టుబడిన బంగారం విలువ రూ. 14.12 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

తెలంగాణలో వ్యవసాయ ప్రగతిని పరిశీలిస్తా..!

- మంత్రి నిరంజన్‌రెడ్డితో ఎంఎస్ స్వామినాథన్
- హరిత విప్లవ పితామహుడితో తెలంగాణ మంత్రి చెన్నైలో భేటీ



ఎంఎస్ స్వామినాథన్‌తో నిరంజన్‌రెడ్డి

సాక్షి, చెన్నై: తెలంగాణకు స్వయంగా వచ్చి వ్యవసాయ ప్రగతిని వీక్షిస్తానని, అక్కడి అభివృద్ధిని చూడాలని ఉన్నట్లు హరిత విప్లవ పితామహుడు ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్ వ్యాఖ్యానించారు. తన నివాసానికి బుధవారం వచ్చిన తెలంగాణ వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డితో హరిత విప్లవ పితామహుడుపై వ్యాఖ్యలు చేశారు. చెన్నై రత్న నగర్‌లోని నివాసంలో ఎంఎస్ స్వామినాథన్‌ను మంత్రి నిరంజన్ రెడ్డి నేతృత్వంలోని బృందం మర్యాదపూర్వకంగా ఈ సందర్భంగా సీఎం కేజీఆర్ నాయకత్వంలో 9 ఏళ్లుగా తెలంగాణలో జరిగిన వ్యవసాయ ప్రగతి, విజయాలను స్వామినాథన్ దృష్టికి మంత్రి తీసుకెళ్లారు. తమరి స్ఫూర్తితోనే రైతు అనుకూల విధానాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీరు, పంటల కొనుగోళ్లు, ప్రత్యామ్నాయ పంటల సాగు ఆవశ్యకత, రైతు వేదికలు తదితర పథకాలు, కార్యక్రమాలు విశదీకరించారు. అన్ని విషయాలను తనకు తెలుసునని, గతంలో ఎఫ్ఏఓ చైర్మన్‌గా తాను పనిచేసినట్టు హరిత విప్లవ పితామహుడు పేర్కొనడం విశేషం. అలాగే, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన రావును చూసి గతంలో చూసినట్లుదని వ్యాఖ్యలు చేశారు. అనంతరం ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను తెలంగాణ బృందం సందర్శించింది.

అదృష్టంగా భావిస్తున్నాను..

ఎంఎస్ స్వామినాథన్‌ను కలిసే అవకాశం రావడం తనకు కలిగిన అదృష్టంగా భావిస్తున్నట్టు మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ భేటీ గురించి ఆయన మాట్లాడుతూ 98 ఏళ్ల వయసులోనూ స్వామినాథన్ జ్ఞాపకశక్తి అమోఘం అని వ్యాఖ్యలు చేశారు. తన ఆరోగ్యం కుదుటపడగానే తెలంగాణకు వచ్చి వ్యవసాయ ప్రగతి, అభివృద్ధిని వీక్షిస్తాను, పరిశీలిస్తాను అని తెలిపినట్టు చెప్పారు. ఈ వయసులోనూ స్వయంగా తెలంగాణకు వస్తాను అని చెప్పడమే గొప్ప ఆశీర్వాదంగా భావిస్తున్నట్టు చెప్పారు. అలాగే, స్వామినాథన్ సేవలను కొనియాడారు. యూపీఏ హయాంలో వ్యవసాయ కమిషన్‌కు నాయకత్వం వహించిన స్వామినాథన్ ప్రపంచ అవసరాలను తీర్చే దేశం భారత్ అని, రైతుల ఆదాయం పెంపునకు అనేక సూచనలు చేశారని గుర్తు చేశారు. అయితే 2014లో ఎన్డీఏ అధికారంలోకి రాగానే, స్వామినాథన్ కమిటీపై అశోక్ దల్వాయితో మరో కమిటీ వేసి ప్రధాని నరేంద్రమోదీ అవమానించారని మండిపడ్డారు. రైతుల ఆదాయం పెంపునకు ఇచ్చిన ఒక్క హామీని కూడా మోదీ అమలు చేయలేదని ధ్వజమెత్తారు. మంత్రితో పాటు ఈ పర్యటనలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ కేశవులు, డిజిటల్ మీడియా డైరెక్టర్ దిలీప్ కొణతం ఈ పర్యటనలో ఉన్నారు.

క్లుప్తంగా...

గవర్నర్ పర్యటన వాయిదా



పెనమలూరు: గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పర్యటన వాయిదా పడింది. ఆయన బుధవారం కృష్ణా జిల్లా పెనమలూరు మండలం గంగూరులో రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించాల్సి ఉంది. అయితే వర్షాల కారణంగా పర్యటన రద్దయింది. ఆగస్ట్ 9న ఆయన పర్యటించే అవకాశముంది.

146 'తూనికల' కేసులు నమోదు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో తూనికలు, కొలతలు శాఖ అధికారులు బుధవారం పలు వ్యాపార దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. బియ్యం, కందిపప్పు, ఇతర నిత్యావసరాల విక్రయాల్లో పలు మోసాలను గుర్తించారు. తూనికలు, కొలతలు చట్టం ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేస్తున్న విక్రేతలపై తూకంలో మోసం, ప్యాకెట్లపై సరుకు వివరాలు, డిక్లరేషన్ ముద్రించకపోవడంతో 146 కేసులు నమోదు చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, భీమవరం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురం పట్టణాల్లో విస్తృతంగా దాడులు చేశారు. వ్యాపారుల మోసాలపై 1967కు, clm&ap@nic.in మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు సూచించారు.

మందుల కొరత రానివ్వద్దు
అధికారులకు పీడీ నివాస్ ఆదేశం



సాక్షి, అమరావతి: ఎయిడ్స్ బాధితులకు రాష్ట్రవ్యాప్తంగా మందుల కొరత రానివ్వకుండా, 3 నెలలకు సరిపడా ఇండెంట్‌లు పెట్టుకోవాలని ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపీ శ్యాక్స్) పీడీ జె.నివాస్ అధికారులను ఆదేశించారు. ముందుచూపు లేకుండా చివరి నిమిషంలో మందుల్లేవని చెబితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని శ్యాక్స్ ప్రధాన కార్యాలయంలో అధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. అత్యవసర సందర్భాల్లో స్థానికంగానే మందులు కొనుగోలు చేయాలని సూచించారు. సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో బ్లడ్ స్టోరేజీ యూనిట్‌లు కచ్చితంగా అందుబాటులో ఉండాలన్నారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

పకడ్బందీగా కామన్ వర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్

వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) ఎలాంటి లోపాలకు తావు లేకుండా అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తారని కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి సుభాశ్ సర్కార్ తెలిపారు. సీయూఈటీ తాత్కాలిక ఆన్సర్ కీలో పొందుపర్చిన అనేక సమాధానాలు తప్పులు తడకగా ఉన్న విషయం వాస్తవమేనా అని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు బుధవారం కేంద్ర మంత్రి సమాధానమిస్తూ.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈ పరీక్ష నిర్వహిస్తుందన్నారు. ఉమ్మడి యూనివర్సిటీ ప్రవేశ పరీక్షకు సంబంధించి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన తాత్కాలిక ఆన్సర్ కీలో 570 జవాబులను సబ్జెక్టు నిపుణులు పరిష్కరించి సవరించారన్నారు. కామన్ వర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్‌లో మొత్తం 61 సబ్జెక్టులకు సంబంధించి 2,305 ప్రశ్నపత్రాల్లో 1,48,520 ప్రశ్నలు ఉన్నట్టు మంత్రి తెలిపారు. ఈ ప్రశ్నలకు సంబంధించి విడుదల చేసిన తాత్కాలిక ఆన్సర్ కీలలో అభ్యర్థులు 3,886 ఆన్సర్ కీలను చాలెంజ్ చేశారన్నారు. తప్పు జవాబులపై అభ్యర్థులు చేసిన చాలెంజ్‌లను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నియమించిన సబ్జెక్ట్ నిపుణులు పరిష్కరించిన అనంతరం రూపొందించిన ఫైనల్ ఆన్సర్ కీ ఆధారంగా మాత్రమే ఫలితాల విడుదల జరుగుతుందని మంత్రి వివరించారు.

ఏపీలో 662 రైజింగ్ ఇండియా పాఠశాలలు



ఆంధ్రప్రదేశ్‌లో 662 పాఠశాలలను ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం ఎస్‌హెచ్‌ఆర్ఐ)లో భాగంగా గుర్తించినట్టు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి అన్నపూర్ణాదేవి తెలిపారు. వీటి కోసం 2023–24లో కేంద్ర, రాష్ట్ర వాటాలు కలిపి రూ.354.85 కోట్లు (212.91కోట్లు +141.94 కోట్లు) ప్రోగ్రామ్ అప్రూవల్ బోర్డు అనుమతించినట్టు వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

10,834 గ్రామాల్లో డ్రోన్ సర్వే



ఆంధ్రప్రదేశ్‌లోని 10,834 గ్రామాల్లో ఇప్పటివరకూ పీఎం స్వమిత్వలో భాగంగా డ్రోన్ సర్వే నిర్వహించినట్టు కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్ తెలిపారు. గ్రామాల్లో గృహ యజమానులు రికార్డ్ ఆఫ్ రైట్స్ అందించడానికి ఈ సర్వే చేస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ సభ్యుడు నిరంజన్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

2031 వరకూ నెల్లూరు హైవేకు రాయితీ



జాతీయ రహదారి–16లోని నెల్లూరు–తడ నాలుగు లేన్ల రహదారి నిర్మాణం, నిర్వహణ, బదిలీ(బీవోటీ) టోల్ పద్ధతిలో నిర్మించారని, దీని రాయితీ కాలం సెప్టెంబర్ 2031 వరకూ ఉంటుందని కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు బీద మస్తాన్‌రావు అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. టోల్ వసూలు ఏజెన్సీతో ధరల సవరణ ఎం వోయూ ఏదీ పరిశీలనలో లేదన్నారు.

లోక్‌సభ

ఏపీలో 4 సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ కేంద్రాలు



ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా కేంద్రాలు అమలులో ఉన్నట్టు కేంద్ర ఐటీ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు కోటగిరి శ్రీధర్ అడిగిన ప్రశ్నకు బుధవారం లిఖితపూర్వక సమాధానమిస్తూ.. కాకినాడ, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో ఇవి అమలులో ఉన్నాయని పేర్కొన్నారు.

ఆత్రేయపురం పూతరేకులకు జీఐ ట్యాగ్




ఆత్రేయపురం పూతరేకులకు జీఐ ట్యాగ్ మంజూరైందని కేంద్ర వాణిజ్యశాఖ సహాయ మంత్రి సోమ్‌ప్రకాశ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యులు మార్గాని భరత్‌రామ్, వంగా గీతా విశ్వనాథ్ అడిగిన ప్రశ్నకు లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిస్తూ.. సర్ ఆర్థర్ కాటన్ ఆత్రేయపురం పూతరేకుల ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి మేరకు జూన్ 14, 2023న జీఐ ట్యాగ్ మంజూరైనట్టు కేంద్ర మంత్రి వివరించారు.

3,841 కిలోమీటర్లు విద్యుదీకరణ

ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఏడాది జూన్ 30 వరకూ 3,841 కిలోమీటర్లు (బ్రాడ్‌గేజ్) విద్యుదీకరణ పూర్తయినట్టు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. వైఎస్సార్‌సీపీ సభ్యులు చింతా అనూరాధ, కోటగిరి శ్రీధర్ అడిగిన మరో ప్రశ్నకు సమాధానమిస్తూ.. ఏపీలో నాలుగు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సేవలు అందుతున్నట్టు రైల్వే మంత్రి తెలిపారు. కార్యాచరణ సాధ్యాసాధ్యాలు, ట్రాఫిక్ తదితర అంశాలకు లోబడి నూతన వందేభారత్ సేవలు నిర్వహిస్తున్నామని ఇది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు.




కడప-పెండ్లిమర్రి ప్రాజెక్ట్ ప్రారంభం



268 కిలోమీటర్ల మేర కడప–బెంగళూరు ప్రాజెక్ట్ ఏపీ ప్రభుత్వ వ్యయ భాగస్వామ్య ప్రాతిపదికన బడ్జెట్‌లో మంజూరు చేసినట్టు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. పూర్తి ప్రాజెక్టు ఖర్చు రూ.2705.98 కోట్లలో 50శాతం ఏపీ ప్రభుత్వం భరించాల్సి ఉందన్నారు. మార్చి 2023 వరకూ ఈ ప్రాజెక్ట్‌కు రూ.358.60 కోట్లు వ్యయం చేయగా.. 21.30 కి.మీ పొడవున కడప–పెండ్లిమర్రి సెక్షన్ ప్రారంభించినట్టు పేర్కొన్నారు. కడప–బెంగళూరు వయా మదనపల్లికి సంబంధించి ఏపీ ప్రభుత్వం కేవలం భూమి ఖర్చు మాత్రమే భరిస్తామని పేర్కొందని, అనంతరం పలు మార్పులు సూచించిందన్నారు. ముద్దనూరు–పులివెందుల–ముదిగుబ్బ–శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం రూట్‌ను అనుమతించామన్నారు. ఇది వైఎస్సార్ కడప జిల్లా మీదుగా వెళ్తుందని తెలిపారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలి

- రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య
- గిరిజనుల అభివృద్ధికి మా పార్టీ మద్దతు ఎప్పుడూ ఉంటుంది



సాక్షి, న్యూఢిల్లీ: జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాల్సిన ఆవశ్యకత ఉందని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా జనాభా ప్రకారం కులాలు కలుపుతున్నారు కానీ రిజర్వేషన్లు పెంచడం లేదన్నారు. అలాంటప్పుడు ఒక శాతం పెరిగితే ఆ మేరకు రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్రాలకు అధికారం ఇవ్వాలన్నారు. రాజ్యసభలో బుధవారం రాజ్యాంగ (గిరిజనులు) ఆర్డర్ (మూడో సవరణ), 2022 బిల్లుపై చర్చలో ఆయన మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ మద్దతు ఇస్తుందన్నారు. నాణ్యమైన విద్య అందినప్పుడే గిరిజనుల అభివృద్ధి సాధ్యమన్నారు. ఏకలవ్య పాఠశాలల్లో పర్మినెంట్ ఉపాధ్యాయులు ఉండేలా చూడాలన్నారు. ఏపీ ప్రభుత్వం అమ్మఒడి, రీయింబర్స్‌మెంట్ పథకాలతో చదువుకు ఏ విధంగా ప్రాధాన్యం ఇస్తోందో అదేవిధంగా గిరిజనుల కోసం కేంద్రం ప్రత్యేక పథకం తీసుకురావాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించాలంటే ప్రీమెట్రిక్ ఉపకారవేతనాలు కనీసం రూ. 10 వేలు ఉండేలా చూడాలన్నారు. పేదరికాన్ని అడ్డం పెట్టి మత మార్పిడులు పెరుగుతున్నాయని దీనిపై దృష్టి సారించాలన్నారు. భారతీయ సంస్కృతి నుంచి వారిని దారి మళ్లించడం బాధాకరమని అలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీ, తెలంగాణల నుంచి వాల్మీకి, బోయ, మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని దీనిపై కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఏపీ ప్రభుత్వం గిరిజన వర్సిటీ ఏర్పాటు చేయాలని పంపిన ప్రతిపాదనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాల్సిందే

- మహా ధర్నాలో ఎంపీలు ఆర్.కృష్ణయ్య, మస్తాన్‌రావు డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: కరెన్సీ నోట్లపై బీఆర్ అంబేడ్కర్ ఫొటోను ఎట్టిపరిస్థితుల్లో ముద్రించాల్సిందేనని వైఎస్సార్‌సీపీ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించకపోవడం చరిత్రను వక్రీకరించడమేనని పేర్కొన్నారు. కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ అధ్యక్షతన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బుధవారం ధర్నా జరిగింది. కృష్ణయ్య మాట్లాడుతూ.. అంబేడ్కర్ లేకపోతే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎక్కడ ఉండేదని.. ఇకనైనా పాలకులు చరిత్ర తెలుసుకుని వారి గౌరవాన్ని నిలబెట్టాలన్నారు. ఎంపీ బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ.. ఈ డిమాండ్ సాధనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుకూలంగా ఉందని తెలిపారు. వెంటనే ఈ అంశాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి లేఖ రాస్తామని హామీ ఇచ్చారు. డాక్టర్ జేరిపోతుల పరశురామ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం పట్ల, అంబేడ్కర్ పట్ల ఏ మాత్రం గౌరవం ఉన్నా రాజ్యాంగం మీద ప్రమాణం చేసి పరిపాలన చేస్తున్న ప్రజా ప్రతినిధులు అందరూ ఈ అంశంపై అసెంబ్లీల్లో, పార్లమెంట్‌లో మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. ధర్నాలో కంత వేణు, ఉదయభాస్కర్, పిడుగు ఆశీర్వాదం, మారేష్, బత్తుల వెంకటరమణ, నీలం భాస్కర్ పాల్గొన్నారు.

కేంద్ర అనుమతిపై పరిశీలించండి

- అటవీ భూముల సవరణ బిల్లుపై లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ చంద్రశేఖర్



సాక్షి, న్యూఢిల్లీ: ప్రైవేటు సంస్థకు అటవీ భూమి కేటాయించడానికి ముందు కేంద్రం అనుమతి రాష్ట్రాలు తప్పనిసరిగా తీసుకోవాలన్న నిబంధనను పరిశీలించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఫారెస్ట్ (కన్జర్వేషన్) అమెండ్‌మెంట్ బిల్లు, 2023పై బుధవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఎంపీ చంద్రశేఖర్ మాట్లాడారు. అటవీ భూమిలో సంస్థల కార్యకలాపాలకు, కేంద్ర నిబంధనలు, షరతులపై రాష్ట్రాలు ముందస్తు అనుమతి తీసుకోవాలని సవరణ బిల్లు ప్రతిపాదిస్తోందని తెలిపారు. ఈ సవరణ రాజ్యాంగ నైతిక ఉద్దేశానికి విరుద్ధమని చంద్రశేఖర్ పేర్కొన్నారు. వికేంద్రీకరణ, రాష్ట్రాలు– కేంద్రం మధ్య అధికారాలు పంచుకొనే సూత్రాలకు విరుద్ధంగా ఉందన్నారు. అడవులు, పరిరక్షణ ఉమ్మడి జాబితాలోకి వస్తాయని, ప్రస్తుతం కేంద్రం ఉల్లంఘనలపై చర్యలు తీసుకొనే అధికారం రాష్ట్రాలకు ఉందని గుర్తుచేశారు. ఈ అంశాన్ని పరిశీలించి సరిచేయాలని కేంద్రాన్ని కోరారు. ఆరావళి, పశ్చిమ కనుమలను ప్రత్యేక ప్రాంతాలుగా పరిగణించి రక్షణ పటిష్టం చేయాలన్నారు. 1980 నాటి చట్టం గందరగోళంగా ఉందన్నారు. అటవీ సంరక్షణ చట్టం, 1980ని సవరించడం ద్వారా పరిష్కారం వస్తుందని ఆశిస్తున్నట్లు ఎంపీ చంద్రశేఖర్ పేర్కొన్నారు.

ధాన్యం సొమ్ము చెల్లింపుల్లో ముందంజ

- పశ్చిమగోదావరి జిల్లాలో 2.19 లక్షల ఎకరాల్లో వరి సాగు
- దాళ్వాలో 6.43 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- 73,966 మంది రైతుల ఖాతాలకు రూ.1,310.82 కోట్లు
- ఆధార్ లింకేజీ కాక 117 మంది రైతులకు జమ కాని సొమ్ము

సాక్షి, భీమవరం: రైతుల నుంచి కొనుగోలు చేసిన పంటకు సొమ్ములు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం నూతన ఒరవడిని సృష్టించడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైతులు పండించిన ధాన్యం విక్రయించిన వారంలోగా సొమ్ములను వారి బ్యాంకు ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. పండించిన పంటను నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడం ద్వారా దళారుల కమీషన్ల బెడద లేకుండా రైతులకు మద్దతు ధర అందుతోంది. అంతేగాకుండా ధాన్యం సొమ్ములతోపాటు గోనె సంచులు, హమాలీలు, రవాణా చార్జీలను సైతం ప్రభుత్వమే చెల్లించడం రైతులకు వరంగా మారింది.

296 కేంద్రాల ద్వారా కొనుగోళ్లు

జిల్లాలోని 20 మండలాల పరిధిలో గడిచిన దాళ్వా సీజన్‌లో సుమారు 2.19 లక్షల ఎకరాల్లో రైతులు వరి పండించగా, పంట కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం 296 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ధాన్యాన్ని దళారులు, రైస్ మిల్లర్లకు విక్రయించకుండా నేరుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే ధాన్యం అమ్మకం చేసిన 21 రోజుల్లోగానే పంట సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాలకు జమచేస్తుందని వ్యవసాయ, రెవెన్యూ శాఖాధికారులు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. దీనితో దాళ్వా సీజన్‌లో జిల్లాలోని 74,083 మంది రైతుల నుంచి 6,43,128 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. వీరికి మొత్తం రూ.1,312.21 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.1,310.82 కోట్లు చెల్లించారు. అలాగే గోనె సంచులు, హమాలీ, రవాణా చార్జీలకు రైతులకు చెల్లించాల్సిన సుమారు రూ.41.55 కోట్లు దాదాపు జమ చేయగా కొద్దిమొత్తంలో ధాన్యం రవాణ చేసిన ఏజెన్సీలకు చెల్లించాల్సి ఉంది.

బ్యాంకు లింకేజీ సక్రమంగా లేకే జాప్యం

జిల్లాలోని ధాన్యం విక్రయాలు చేసిన రైతుల్లో కేవలం 117 మందికి రూ.1.39 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఆయా రైతులు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింకేజీ చేయకపోవడం, జన్‌ధన్ బ్యాంకు ఖాతాకు కేవలం రూ.50 వేలు మాత్రమే జమచేసే అవకాశం ఉండడం వంటి అవరోధాలు కారణంగా సొమ్ములు జమ కాలేదు. అలాగే గోనె సంచులు, రవాణా, హమాలీ చార్జీలకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన మొత్తం వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయగా ఏజెన్సీల ద్వారా ధాన్యం రవాణా చేసిన సుమారు రూ.1.58 కోట్ల సొమ్మును ఏజెన్సీలు క్లయిమ్స్ అందజేయకపోవడంతో చెల్లించలేదు. ధాన్యం సొమ్ములతోపాటు రైతులకు రవాణా, హమాలీ, గోనె సంచులకు సంబంధించిన సొమ్ములను త్వరితగతిన ప్రభుత్వం చెల్లిస్తుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఇతని పేరు ఆంజనేయులు. చిన్న తనంలోనే పారుమంచాల గ్రామం నుంచి కర్నూలు నగరంలో స్థిరపడ్డారు. చెక్‌పోస్టు వద్ద ఒకటి, జి.పుల్లారెడ్డి కళాశాల సమీపంలో మరో మొబైల్ క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. వీటితో ఇతను ఉపాధి పొందడంతో పాటు మరో పది మంది కూలీలను ఏర్పాటు చేసుకొని వారికీ ఉపాధి కల్పిస్తున్నారు. ఇద్దరు పిల్లలు సంతానం కాగా.. ఒకరు తొమ్మిదో తరగతి, మరొకరు 5వ తరగతి చదువుతున్నారు. కష్టాన్ని నమ్ముకుంటే జీవితం సాఫీగా సాగిపోతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఇతను హుస్సేన్‌రెడ్డి. దూరదర్శన్ కేంద్రం సమీపంలో వెంకటసాయి మొబైల్ క్యాంటీన్ నిర్వహిస్తున్నాడు. ఒక వంట మాస్టర్, మరో ముగ్గురు కూలీలను ఏర్పాటు చేసుకున్నాడు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వ్యాపారం చేస్తున్నాడు. ఇతర ప్రాంతాల నుంచి నగరంలోకి వెళ్లే వాళ్లు ఇక్కడే ఆగి టిఫిన్లు చేసి వెళ్తున్నారని చెబుతున్నాడు. ఈ కారణంగా వాళ్లకు తక్కువ ధరలో టిఫిన్ లభించడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుందని అంటున్నాడు.



నగర శివారులోని రింగురోడ్డు సమీపంలో మొబైల్ క్యాంటీన్

మొబైల్ ఘుమఘుమలు

నగర శివారులో అల్పాహార ఆహ్వానం

- ఆకట్టుకుంటున్న మొబైల్ క్యాంటీన్లు
- తక్కువ ధరతో రుచికరమైన టిఫిన్లు
- సొంత వ్యాపారంతో మరికొందరికి ఉపాధి
- వంట మాస్టర్లకు పెరిగిన డిమాండ్
- నగరంలో 80కి పైగా వాహనాలు

ఇప్పుడు ప్రతి విషయాన్ని కరోనాకు ముందు, కరోనా తరువాత అని చెప్పుకోవాలి. ఇప్పుడు ప్రతి ఒక్కరూ డబ్బుకు అత్యంత విలువ ఇస్తున్నారు. అంతేకాదు.. నాణ్యమైన భోజనంపైనే ఆసక్తి చూపుతున్నారు. ఇరుకు సందుల్లో, జనం గుమికూడిన ప్రాంతాలకు దూరంగానే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో మొబైల్ క్యాంటీన్లు ప్రత్యామ్నాయంగా నిలుస్తున్నాయి. నగర శివారులోకి వెళితే ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు నాణ్యమైన అల్పాహారం తక్కువ ధరలోనే లభిస్తుండటంతో ప్రతి ఒక్కరూ ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. చెట్ల నీడన.. అప్పటికప్పుడు తయారు చేస్తున్న అల్పాహారం తినేందుకు ఇష్టపడుతున్నారు.

– సాక్షి, కర్నూలు డెస్క్



జొన్న ఇడ్లీ



జొన్న దోశ

మిల్లెట్స్ స్పెషల్

శివారులోని మొబైల్ వాహనాలు ఒక ఎత్తయితే.. నగరంలోని మిల్లెట్స్ మొబైల్ వాహనాలు మరో ఎత్తు. ఒక్కో రోజు ఒక మిల్లెట్‌తో ఇక్కడ తయారు చేస్తున్న టిఫిన్లు నగర వాసులకు నోరూరిస్తున్నాయి. బీపీ, షుగర్, ఊబకాయం.. ఇతరత్రా వ్యాధులు భయపెడుతున్న నేపథ్యంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో భాగంగా చాలా మంది ఈ మిల్లెట్స్ టిఫిన్‌కు క్యూకడుతున్నారు. ధర కూడా అందుబాటులోనే ఉండటంతో ఎంచక్కా లాగించేస్తున్నారు.



జొన్న పొంగలి



పాలకూర పూరి



చిన్నారికి టిఫిన్ తినిపిస్తున్న తల్లి

డబ్బుంటే పెద్ద హోటళ్లకు వెళ్లి తింటారనుకోవడం పొరపాటు. బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వాళ్లు ఇప్పుడు మంచి హోటల్ ఎక్కడుందని వెతుక్కోవడం మాని శివారు ప్రాంతాల్లో మొబైల్ క్యాంటీన్లు ఎక్కడ ఉన్నాయని చూస్తున్నారు. ఉదయాన్నే గుత్తి పెట్రోల్ బంకు, నంద్యాల చెక్‌పోస్టు, రింగ్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా మొబైల్ క్యాంటీన్ల చుట్టూ గుమికూడిన కార్లు, ఇతర వాహనాలే కనిపిస్తాయి. ఆయా పనుల నిమిత్తం వచ్చిన వాళ్లు నగరంలోకి వెళ్లే ముందే టిఫిన్ కానిచ్చేస్తే ఆ తర్వాత వ్యవహారాలు చక్కబెట్టుకోవచ్చని అక్కడే ఆగిపోతున్నారు. ఏదైనా పని మీద వచ్చినా, లేదా కుటుంబంతో వచ్చినా సుమారు ఐదారుగురు వెంట ఉంటుండటంతో మొబైల్ క్యాంటీన్ ఎంచక్కా వీరి ఆకలి తీరుస్తోంది. నగరంలోని ఏ హోటల్‌కు వెళ్లినా నలుగురు సభ్యులతో కూడిన కుటుంబం టిఫిన్ చేయాలంటే సుమారు రూ.500 పైమాటే అవుతుంది. ఇక కూర్చొని తినే హోటళ్ల



మొబైల్ క్యాంటీన్‌లో డబల్ ఎగ్ దోశ వేస్తూ..

అయితే.. ఆర్డర్ ఇచ్చిన ఏ అరగంటకో కానీ టిఫిన్ టేబుల్ మీదకు రాని పరిస్థితి. చివరగా టిప్ ఇవ్వకపోతే వెయిటర్ అదో రకంగా చూడటం షరామామూలే. అదే మొబైల్ క్యాంటీన్ల వద్ద టిఫిన్ చేస్తే అప్పటికప్పుడు రుచికరమైన అల్పాహారం క్షణాల్లో రెడీ అయిపోతుంది. అందునా ఏ టిఫిన్ చేసినా రూ.30 మాత్రమే తీసుకుంటున్నారు. శివారు ప్రాంతాలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో మొబైల్ క్యాంటీన్ల వద్ద రద్దీ కూడా అధికంగానే ఉంటోంది.

రోజుకు రూ.5లక్షల పైనే వ్యాపారం

నగరంలోని ప్రధాన కూడళ్లలో దుకాణం అద్దెకు తీసుకోవాలంటే వేల రూపాయలతో కూడుకున్న వ్యవహారం. డిపాజిట్ లక్షల్లో చెల్లించడం సరేసరి. ఈ నేపథ్యంలో మొబైల్ క్యాంటీన్లు సరికొత్త ఆలోచనతో రోడ్డెక్కుతున్నాయి. కావాల్సిన విధంగా మార్పులు చేసుకొని సొంతంగా వ్యాపారం చేస్తున్నారు. ఒక కూడలిలో వ్యాపారం జరగకపోతే కొంతకాలానికి మరోచోటుకు మార్చుకునే అవకాశం ఉండటం కూడా మొబైల్ క్యాంటీన్లపై ఆసక్తి పెంచుతోంది. ఇకపోతే ప్రస్తుతం నగరంలో వీటి సంఖ్య 80కి పైగానే ఉండటం విశేషం. ప్రతిరోజూ వీరి వ్యాపారం రూ.5లక్షలకు పైగానే ఉంటోందంటే భోజన ప్రియులను ఏస్థాయిలో ఆకట్టుకుంటున్నారో అర్థమవుతుంది.


వంట మాస్టర్లకు గిరాకీ

హోటల్ వ్యాపారంలో వంట మాస్టర్లు కీలకం. వీళ్లు ఒక్కరోజు సెలవు పెట్టినా యజమాని ఉక్కిరిబిక్కిరి కాక తప్పదు. అందువల్లే మరొకరిని కూడా అందుబాటులో ఉంచుకుంటారు. అయితే మొబైల్ క్యాంటీన్లను ఉదయం మాత్రమే నిర్వహిస్తుండటం వల్ల ఆ మేరకు కూలీ ఇస్తున్నారు. చేస్తున్న టిఫిన్ల ఆధారంగా కూడా కూలీ నిర్ణయిస్తున్నారు. నైపుణ్యం ఆధారంగా రోజుకు రూ.500 నుంచి రూ.1000 వరకు కూడా డిమాండ్ చేస్తున్నారు. కొన్ని మొబైల్ క్యాంటీన్లు సాయంత్రం కూడా నిర్వహిస్తుండటంతో మాస్టర్లు నెల వారీ జీతం తీసుకుంటున్నారు.

వ్యాపారానికి అనువుగా వాహనాలు

మొబైల్ క్యాంటీన్ నిర్వాహకులు తమ స్థోమతకు అనువుగా వాహనాలను తీర్చిదిద్దుకుంటున్నారు. సాధారణంగా వాహనాల ధర రూ.6లక్షల నుంచి రూ.7లక్షల వరకు ఉంటుంది. వీటిని వ్యాపారానికి అనుకూలంగా మార్చుకోవాలంటే రూ.2.50లక్షల నుంచి రూ.3లక్షల వరకు అదనంగా వెచ్చించాల్సి ఉంటుంది. అయితే కొందరు వ్యాపారులు సెకండ్ హ్యాండ్ వాహనాలను రూ.3లక్షల్లోపు కొనుగోలు చేసి మొబైల్ క్యాంటీన్‌గా అదనపు డబ్బుతో తీర్చిదిద్దుకుంటున్నారు.

తక్కువ ధరలో అల్పాహారం



నగరంలోని హోటళ్లతో పోలిస్తే శివారు ప్రాంతాల్లో టిఫిన్ చేస్తే చాలా ప్రశాంతంగా ఉంటుంది. చెట్ల కింద ఆహ్లాదకరంగా తినే వీలుంటుంది. కళ్లెదుటే చేస్తుండటంతో నాణ్యత విషయంలోనూ అనుమానం అక్కర్లేదు. రుచికరమైన అల్పాహారం చాలా తక్కువ ధరతో అందిస్తున్నారు.

– వెంకటేశ్వర్లు, మెడికల్ రెప్, కర్నూలు

కళ్లెదుటే వేడివేడిగా..



మేము కర్నూలులో ఓ పెళ్లికి వెళ్లాల్సి ఉంది. ఆ తర్వాత కాలేజీలో కాస్త పని చూసుకోవాలి. నగరంలోని హోటళ్లకు వెళితే అక్కడ ఆర్డరు చెప్పడం, తీసుకొచ్చే లోపు చాలా సమయం పడుతుంది. అదే మొబైల్ క్యాంటీన్ల వద్ద కళ్లెదుటే వేడివేడి టిఫిన్లు హాయిగా తినొచ్చు. ధర కూడా చాలా తక్కువగా ఉంటుంది. ఇలాంటి వ్యాపారాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి.

– హుస్సేన్‌వలి, నంద్యాల

చాలా రుచిగా ఉంటాయి



నేను హమాలీ పని చేస్తుంటా. ఉదయాన్నే పని మీద బయటకు వస్తాం. హోటళ్లలో టిఫిన్ చేయాలంటే మాకు వచ్చే కూలీ సరిపోదు. అందుకే మొబైల్ క్యాంటీన్లలో తింటాం. ఇక్కడ ఎంతో రుచికరంగా, పరిశుభ్రత పాటించి వివిధ రకాల టిఫిన్లను అప్పటికప్పుడు అందిస్తారు. ధరలు కూడా చాలా తక్కువ.

– రాజశేఖర్, దూపాడు, కర్నూలు



ఎక్స్‌పీరియన్స్ ఉందా?

...ఆ గృహిణిగా బోలెడంత!

ఒక ఉద్యోగంలో ఎవరైనా ఎన్ని గంటలు పని చేస్తారు?
8 గంటలు.
మరి గృహిణి?
24 గంటలు.
ఆ అనుభవం ఎక్కువా? ఈ అనుభవం ఎక్కువా?

సీట్లో కూచుని చేసే ఉద్యోగం అనుకోండి... గృహిణికి ఇల్లే కదా సీటు. ఆ సీటు వదులుతుందా ఆమె. అందులోనే కూచుని అన్ని పనులూ చక్కబెడుతుంది. పిల్లలూ, వంట, బట్టలుతకడం, అత్తామామలను చూసుకోవడం, బంధువులొస్తే చేసి పెట్టడం.... సరే. బయట తిరిగి చేయాల్సిన ఉద్యోగం అనుకోండి. గృహిణి ఏమన్నా ఇంట్లో కూచుంటుందా ఏం? బయటే కదా తిరగాలి. పిల్లల్ని స్కూల్లో వదలడానికి, కూరగాయలు తేవడానికి, కరెంటు బిల్లు కట్టడానికి, సరుకుల కోసం, ఇంట్లో ఉండే పెద్దవాళ్లను ఆస్పత్రికి తీసుకెళ్లడానికి, మందులకూ మాకులకూ... తిరగాల్సిందే కదా.

ఉద్యోగంలో నీకు అనుభవం ఉందా అనంటే ఆఫీసులో చేసిన ఉద్యోగానిది మాత్రమే అనుభవమా... గృహిణిగా ఉండి చేసింది అనుభవం కాదా? ఈ ప్రశ్నే వేసింది ఒక గృహిణి.

అసలేం జరిగింది

సాధారణంగా కొత్త జాబ్ వెతుక్కోవాలంటే సి.వి (రెజ్యూమె)ని పక్కాగా రెడీ చేసుకోవాలి. విద్యార్హతలు, నైపుణ్యాలతోపాటు అనుభవం తప్పనిసరిగా చెప్పాలి. ఉద్యోగం మానేసి మధ్యలో గ్యాప్ ఉంటే ఆ సమయంలో ఏం చేశామో కూడా సదరు కంపెనీకి వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. దీనికోసం చాలామంది రకరకాల కారణాలను చూపిస్తుంటారు. కానీ ఇప్పుడు మనం చెప్పుకుంటోన్న ఓ మహిళ మాత్రం గతంలో ఉద్యోగం చేసి మానేసి తిరిగి ఉద్యోగానికి అప్లయి చేస్తూ గ్యాప్‌లో 13 ఏళ్లపాటు గృహిణిగా పని చేసానని రెజ్యూమెను అప్‌లోడ్ చేసింది. గ్రౌతిక్ అనే కంటెంట్ కంపెనీ వ్యవస్థాపకుడు యుగన్ష్ చోప్రా ఆమె సి.వి.ని చూసి మురిసిపోయాడు. ఈమె ఎంతో నిజాయితీగా గృహిణిగా పని చేశానని చెబుతోంది అని ప్రశంసిస్తూ సి.వి.ని లింక్డ్ ఇన్‌లో పోస్టు చేశారు.

ఈ పోస్టుప్రకారం...

ఓ మహిళ గతంలో ఉద్యోగం చేసి 2009లో ఇంటి అవసరాల నిమిత్తం మానేసింది. ఇప్పుడు కాస్త వెసులుబాటు దొరకడంలో మళ్లీ చేసేందుకు రెడీ అయ్యింది. తన రెజ్యూమెని తయారు చేసింది. అందులో గ్యాప్‌లో ఏం చేశావ్? అనే ప్రశ్నకు పదమూడేళ్లపాటు గృహిణిగా చేశానని చెప్పింది. 'గృహిణి అంటే ఫుల్‌టైమ్ జాబ్. సి.వి.లో దానిని ప్రత్యేకంగా చెప్పడం చాలా మంచి విషయం. ఎంతో మంది గ్యాప్‌లో ఏం చేశారంటే అక్కడ ఇక్కడ ఉద్యోగాలు చేశామని ఫేక్ ఎక్స్‌పీరియన్స్‌లు పెడుతుంటారు. కానీ ఈమె చాలా నిజాయితీగా చెప్పి తన వ్యక్తిత్వమేమిటో చెప్పకనే చెప్పింది' అని చోప్రా ప్రశంసించారు. ఈ పోస్టును చూసిన నెటిజన్లు ఆమెను అభినందనల్లో ముంచెత్తుతున్నారు.

ఇదో మేలుకొలుపు

ఈ పోస్టు ఎంతో మంది మహిళలకు, కంపెనీలకు మేలుకొలుపులాంటిది. నిజానికి గృహిణిగా ఉండటానికి ఏ ఉద్యోగి అయినా గ్యాప్ తీసుకుంటే ఆమెకు అదొక ప్రత్యేక అర్హతగా భావించి ప్రత్యేక రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగం ఇచ్చే విషయాన్ని కూడా పరిశీలిస్తే తప్పు లేదు. కారణం? గృహిణిగా స్త్రీ ఇంటిని, తద్వారా సమాజాన్ని నిలబెడుతుంది. పిల్లలను ఆరోగ్యకరంగా పెంచి మంచి పౌరులుగా సమాజానికి ఇస్తుంది. భర్త ఇంటి టెన్షన్లలో మునగకుండా పని మీద శ్రద్ధ పెట్టి మంచిగా పని చేసి వ్యవస్థ ముందుకెళ్లడంలో సాయపడుతుంది. ఇన్ని చేసిన స్త్రీ– తనకు వెసులుబాటు దొరికి ఉద్యోగం చేస్తానంటే పిలిచి ఉద్యోగం ఇవ్వాల్సిన బాధ్యత కంపెనీలకు ఉంటుంది. అలాంటి స్త్రీలను ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజానికుంటుంది. హోం మేకర్‌గా ఇక జీవితం అయిపోయింది అనుకోకుండా అదే ఒక అర్హతగా ఉద్యోగం వెతుక్కోవచ్చని ఈ పోస్టు భరోసా ఇస్తోంది. ఇంకెందుకు ఆలస్యం... గృహిణి అని చెప్పుకోవడానికి సిగ్గుపడకుండా ధైర్యంగా ఉద్యోగాలు వెతుక్కోండి మహిళలూ.

ప్లాస్టిక్ మనీ!





ఈ హోటల్‌లో ఏదైనా ఆర్డర్ ఇవ్వండి.. కడుపు నిండా తినండి. ఒక్క రూపాయి కూడా ఇవ్వద్దు! అవును మీరు కరెక్ట్‌గానే చదివారు. తిన్నంత తిని డబ్బులు వద్దు అంటున్నారు అని సంతోషపడిపోకండి! ఎందుకంటే డబ్బులకు బదులు ప్లాస్టిక్ ఇవ్వాలండోయ్.

ప్లాస్టిక్‌పై నిషేధం విధించినప్పటికీ... ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు ప్రభుత్వ అధికారులు వివిధ రకాలుగా ప్రయత్నిస్తున్నారు. అయినా ప్లాస్టిక్ వ్యర్థాలు తగ్గడంలేదు. ఈ సమస్యను అధిగమించేందుకు... గుజరాత్‌లోని జునాఘడ్‌కు కలెక్టర్‌గా పనిచేస్తోన్న రచిత్ రాజ్ 'ప్రకృతి' పేరిట సరికొత్త కాన్సెప్ట్‌తో ప్లాస్టిక్ కేఫ్‌ను గతేడాది జూన్ ముప్పైన ప్రారంభించారు. ఈ కేఫ్‌ను ఓం శాంతి అనే సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్‌నకు చెందిన రేఖా బెన్ నడిపిస్తోంది. ఇది సోంపు, నిమ్మకాయ షర్బత్, ఇడ్లీ, పోహా, డోక్లా, మేథీ థెప్లా, గుజరాతీ థాళీలను అందిస్తోంది. వీటిలో ద్రవాహారం కావాలంటే అరకేజీ, ఆహార పదార్థాలు కావాలంటే కేజీ ప్లాస్టిక్ ఇస్తే సరిపోతుంది. పర్యావరణాన్ని కాపాడుకోవాలన్న ఆకాంక్ష ఉన్న కస్టమర్లు ఈ కేఫ్‌కు ఎగబడి వస్తున్నారు. తరచు వచ్చే కస్టమర్లతోపాటు, పబ్లిక్ హాలిడేస్‌లో కస్టమర్ల తాకిడి ఎక్కువగా ఉంటుంది. కేఫ్‌లోనేగాక ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్‌లలో సైతం కేఫ్ ఆర్డర్లు అందిస్తోంది.



ప్లాస్టిక్ తీసుకుంటున్న సిబ్బంది

ప్లాస్టిక్ మనీతో...

ప్లాస్టిక్‌ను ఎన్నిసార్లు నిషేధించినప్పటికీ... ప్లాస్టిక్ వ్యర్థాలు తగ్గడంలేదు. దీనిని కచ్చితంగా అమలు చేసేందుకు రచిత్ రాజ్ టీమ్ ప్లాస్టిక్ మనీ కేఫ్‌ను ప్రారంభించింది. ప్లాస్టిక్ వాడకంపై ఆసక్తి తగ్గించి, ప్లాస్టిక్ వ్యర్థాలను నిరోధించడం, రసాయన ఎరువులు వాడకుండా పండించిన ఆహారాన్నే ప్రజలకు అందించడం , సెల్ఫ్‌హెల్ప్ గ్రూపు మహిళలతో వీటిని నిర్వహించడమే లక్ష్యంతో ప్లాస్టిక్‌మనీతో ఈ కేఫ్‌ను నడిపిస్తున్నారు.

ఆదాయం... ఆరోగ్యం....

డబ్బులకు బదులుగా తీసుకునే ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్‌కు పంపించి కాలుష్యాన్ని తగ్గిస్తున్నారు. సహజసిద్ధ ఎరువులతో పండించిన ఆహారం అందించి ఆరోగ్యం కాపాడుతూ, రసాయనాలు లేని పంటలు పండించేలా రైతులను ప్రోత్సహిస్తున్నారు. సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల ద్వారా ఈ కేఫ్‌లను నడిపించి వారికి ఉపాధి కల్పిస్తున్నారు. కేఫ్‌లో ఆహార పదార్థాలను మట్టి పాత్రల్లో వడ్డిస్తూ ఇటు ప్రజల ఆరోగ్యంతోపాటు, అటు పర్యావరణాన్నీ పరిరక్షిస్తున్నారు.

ఇలాంటి కేఫ్‌లు మరిన్ని ఏర్పాటైతే ప్లాస్టిక్ భూతాన్ని సులభంగా వదిలించుకోవచ్చు అంటున్నారు ఈ కేఫ్‌ను ప్రశంసిస్తున్నవారు.

బ్యూటిప్స్

బొట్టు మచ్చ ఉందా?



బొట్టుబిళ్ల పెట్టుకునే ప్రదేశంలో కొన్నిసార్లు దురద, దద్దుర్లు, వాపు, మచ్చలు ఏర్పడుతుంటాయి. బొట్టుపెట్టుకునే ప్రదేశంలో చర్మం పొడిబారడం వల్ల ఇటువంటి సమస్యలు తలెత్తుతాయి. వీటిని అధిగమించేందుకు ఇలా చేయండి చాలు...

మాయిశ్చరైజర్ : బొట్టుబిళ్ల తీయకుండా అదేపనిగా ఉంచడం వల్ల చర్మం పొడిబారి దురద వస్తుంటుంది. ఇలాంటప్పుడు రాత్రి పడుకునే ముందు బొట్టుబిళ్లను తీసి మాయిశ్చరైజర్ రాసి మర్దన చేయాలి. ఇది పొడిబారిన చర్మానికి తేమనందించి దురదను తగ్గిస్తుంది.



నూనె: రోజూ రెండు నిమిషాలపాటు కొబ్బరి లేదా నువ్వుల నూనె రాసి మర్దన చేయాలి. దీనివల్ల చర్మానికి తేమ అంది మచ్చ పడకుండా ఉంటుంది.



జెల్ : అలోవెరా జెల్‌ను రాసి మర్దన చేయడం వల్ల అక్కడ ఏర్పడే దద్దుర్లు, మొటిమలు పోతాయి. అలోవెరా జెల్‌లోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ సెప్టిక్ గుణాలు చర్మాన్ని దురద, దద్దుర్ల నుంచి రక్షణ కల్పిస్తాయి.

గ్లూ తక్కువగా : బొట్టు బిళ్లలను ఎంపిక చేసేటప్పుడు గ్లూ, గమ్ తక్కువగా ఉండే వాటినే ఎంచుకోవాలి. రాత్రి పడుకునే ముందు బొట్టుబిళ్లను తీసేసి మాయిశ్చర్ రాసుకుని పడుకోవాలి. ఉదయం బొట్టు బిళ్ల పెట్టుకుంటే ఏ సమస్యా ఉండదు.

ఇంగువతో నిగారింపు

రెండు స్పూన్ల ముల్తానీ మట్టిలో స్పూను తేనె, చిటికెడు ఇంగువ, స్పూను రోజ్‌వాటర్ వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పూతలా వేసి ఇరవై నిమిషాలపాటు ఆరబెట్టాలి. తరువాత చల్లని నీటితో కడిగేయాలి. ఈ ప్యాక్‌ను వారంలో రెండుసార్లు వేయడం వల్ల మొటిమలు, నల్లమచ్చలు, ముడతలు పోతాయి. చర్మం పొడిబారడం తగ్గి ముఖం కాంతిమంతమవుతుంది.



సేవాపథం

కోటి కలల కొండ బడి

మెరుపు మెరిస్తే, వాన కురిస్తే, హరివిల్లు విరిస్తే పిల్లల్లో ఒకరిగా మారి ఆనందించేవాడు. పేదపిల్లల కోసం ఏదైనా చేయాలనేది ఆయన కల. ఆ కల సాకారం కాకుండానే ఈ లోకాన్ని విడిచి వెళ్లాడు. తండ్రి కలను నెరవేర్చడానికి సేవాపథంలోకి వచ్చింది పోర్షియా పుటతుండ...





స్కూలు పిల్లలతో పోర్షియా

ఝార్ఖండ్‌లోని రాంచీలో పుట్టిన పోర్షియా పుటతుండ కోల్‌కతా, ఢిల్లీ, నోయిడా, ముంబైలలో పెరిగింది. పోర్షియా తండ్రికి పిల్లలంటే ఎంతో ఇష్టం. పిల్లలతో కలిసి నర్సరీ రైమ్స్ పాడడం ఇష్టం. ఆటలు ఆడుతూ పాఠాలు చెప్పడం ఇష్టం.

గ్రామీణ ప్రాంతాలలోని పేదపిల్లలకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంచేవాడు.

పేద పిల్లల కోసం తనవంతుగా ఏదైనా చేయాలని నిరంతరం తపించేవాడు.

తన కలలు సాకారం కాకుండానే ఆయన చనిపోయారు. తండ్రి జ్ఞాపకాల స్ఫూర్తితో ఆయన ఆశయాలను నెరవేర్చే క్రమంలో హిమాచల్‌ప్రదేశ్‌లోని కోమిక్ అనే గ్రామంలో అక్కడి అట్టడుగు వర్గాల పిల్లల కోసం ఫ్రీబోర్డింగ్ స్కూల్ ప్రారంభించింది పోర్షియా.

'హైయెస్ట్ విలేజ్ ఆఫ్ ఇండియా'గా పేరున్న కోమిక్‌లోని ఎంతోమంది పేద పిల్లలకు పోర్షియా ఇప్పుడు తల్లి, గురువు, సంరక్షకురాలు. జర్నలిజంలో డిగ్రీ చేసిన పోర్షియా ఒక ప్రముఖ ఆంగ్ల పత్రికలో పనిచేసింది. ఆ తరువాత 'సీఎస్ఎస్'లో న్యూస్ ప్రొడ్యూసర్‌గా బాధ్యతలు నిర్వహించింది. కొంతకాలం తరువాత జర్నలిజాన్ని వదులుకొని సేవాదారిలోకి వచ్చింది.

పోర్షియా ఈ గ్రామాన్ని ఎంచుకోవడానికి కారణం?

ఆమెకు ప్రయాణాలు అంటే చాలా ఇష్టం. తొలిసారిగా హిమాచల్‌ప్రదేశ్‌లోని స్పితి లోయకు వచ్చినప్పుడు తనకు ఎంతో మనశ్శాంతిగా అనుభూతి చెందింది. ఆ ప్రాంతంతో ఏదో అనుబంధం ఉన్నట్లు అనిపించింది. తండ్రి చనిపోయిన తరువాత పోర్షియాపై కుంగుబాటు నీడలు కమ్ముకున్నాయి.

చీకట్లో నుంచి వెలుగులోకి రావడానికి తనకు ఇష్టమైన ప్రదేశం గురించి పోర్షియా ఆలోచిస్తున్నప్పుడు స్పితి గుర్తుకు వచ్చింది.

అక్కడి పేదపిల్లలతో మాట్లాడుతున్నప్పుడు స్వయంగా తండ్రితో మాట్లాడినట్లే అనిపించింది. వారి కోసం ఏదైనా చేయాలనే ఆలోచన వచ్చింది. స్కూల్ ప్రారంభానికి ముందు కజా ప్రాంతంలోని ఒక స్థానిక కుటుంబంతో నెలరోజులు గడిపింది. ఆ కుటుంబంలోని పిల్లలకు పాఠాలు చెప్పింది.

ప్రకృతి సోయగాలను ఆస్వాదించడం కోసం ఊళ్ల వెంట తిరుగుతున్నప్పుడు చదువుకు దూరమైన, సరైన చదువు లేని ఎంతోమంది పేదపిల్లలు కనిపించారు. వారిని విద్యావంతులను చేయాల్సిన అవసరం కనిపించింది.



బోర్డింగ్ స్కూలులో పిల్లలు

'ఉద్యోగాన్ని, ముంబైని విడిచి ఇక్కడకు రావడం అనేది సాహసంతో కూడుకున్న పని. కాని నేను ఇష్టంతో ఇక్కడకు వచ్చాను. ముంబైని విడిచి రావాలనే ఆలోచన నా స్నేహితులు, సన్నిహితులు ఎవరికీ నచ్చలేదు. తెలివి తక్కువ నిర్ణయం తీసుకున్నావు అని ముఖం మీదే చెప్పారు. గోడకు కొట్టిన బంతిలా తిరిగి వస్తావు అని కూడా అన్నారు. అయితే అవేమీ నా నిర్ణయాన్ని మార్చలేకపోయాయి. ఇక్కడికి వచ్చిన తరువాత నా జీవితానికి ఒక పరమార్థం దొరికినట్లు అనిపించింది' అంటుంది పోర్షియా.

తొలి అడుగులో భాగంగా....

పిల్లలు ఆడుకునే చోటుకు వెళ్లేది. 'మీకు బొమ్మలు ఎలా వేయాలో నేర్పిస్తాను' 'కొత్త ఆటలు నేర్పిస్తాను' 'ఇంగ్లీష్‌లో మాట్లాడడం నేర్పిస్తాను' అంటూ వారితో స్నేహం చేసేది. చెట్టు కింద కూర్చొని బొమ్మలు గీయడం, రైమ్స్ పాడడం నేర్పేది. ఒక్కరొక్కరుగా నలభై మంది పిల్లల వరకు ఆమెకు దగ్గరయ్యారు.

ఆ సమయంలో తనకు ఫ్రీ బోర్డింగ్ స్కూల్ ఆలోచన వచ్చింది. కోమిక్‌లో ఒక ప్రదేశాన్ని అద్దెకు తీసుకొని ఫ్రీ బోర్డింగ్ స్కూల్ ప్రారంభించింది.

ఇల్లు అలకగానే పండగ కాదు అన్నట్లు పెద్ద సమస్య వచ్చింది. 'ఇప్పుడు మా పిల్లలు చదువుకొని ఏం చేయాలి? చిన్నాచితకా పనులు చేసుకుంటే ఏదో విధంగా బతుకుతారు' అంటూ పిల్లలను బడికి పంపడానికి తల్లిదండ్రులు నిరాకరించేవారు. వారి ఆలోచన ధోరణిలో మార్పు తీసుకురావడానికి పోర్షియా చాలా కష్టపడాల్సి వచ్చింది.

పాఠాలతో పాటు తోటపని నుంచి నృత్యం వరకు పిల్లలకు ఎన్నో నేర్పుతోంది పోర్షియా.

'నా కల సాకారం అవుతుందా, లేదా అనుకునేదాన్ని. స్కూల్ ప్రారంభించిన తరువాత నా మీద నాకు, నా పై పిల్లల పేరెంట్స్‌కు నమ్మకం వచ్చింది. ఇది తొలి అడుగు మాత్రమే' అంటుంది పోర్షియా పుటతుండ.

సైబర్ టాక్



ఏఐ స్కామ్స్

ఏది నిజం.. ఏది మాయ!

చెక్ చేసుకోండి

ఇటీవల మనం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా వార్తలు చదివే యాంకర్లను చూసి ఆశ్చర్యపోయాం. ఇది టెక్నాలజీపరంగా మనం చూస్తున్న మార్పులు. అంత వరకు బాగానే ఉంది కానీ, సోషల్ మీడియాలో మన ఫొటోలు, వీడియోలు దొంగిలించి, ఏఐ టెక్నాలజీ ద్వారా తక్కువ నిడివి గల మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలుగా రూపొందించి, వాటిద్వారా మనల్ని బెదిరించే, సన్నిహితులను డబ్బు అభ్యర్థించే నేరస్థులు పుట్టుకొస్తున్నారు జాగ్రత్త!!

లేనిది ఉన్నట్లుగా సృష్టించి, భ్రమించేలా చేసే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత డీప్ ఫేక్ స్కామ్స్ కొత్తగా వెలుగు చూస్తున్నాయి. స్కామర్లు ఈ ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి మోసాలకు పాల్పడుతున్నారు.

■ దీనివల్ల జరిగే హాని..

- ఒక వ్యక్తిని వేధించడం లేదా అవమానించడం. సమాజంలో వారి ఇమేజ్‌ను, అలాగే విశ్వసనీయతను నాశనం చేయడం.
- ఈ విధానం ద్వారా డబ్బులను డిమాండ్ చేయడం లేదా వ్యక్తిగత సమాచారాన్ని బహిర్గతం చేయడం, బెదిరించడం.
- కస్టమర్ కేవైసీ మెకానిజమ్‌ను కూడా మోసం చేయడం.
- క్రిమినల్ న్యాయ పరిశోధనల కోసం ఎలక్ట్రానిక్ సాక్ష్యాలను మార్చడం.
- తప్పుడు సమాచార ప్రచారాలకు మద్దతు ఇవ్వడం.
- వినియోగదారుల పాస్‌వర్డ్‌లను తెలుసుకోవడానికి ఏఐ టెక్నాలజీని ఉపయోగించడం.

■ బాధితులను మోసగించడానికి స్కామర్లు ఉపయోగించే సాకులు

ఉదాహరణకు: మనకు లైవ్ వీడియో కాల్ వస్తుంది. ఆ వీడియోలో మనకు బాగా తెలిసిన సన్నిహిత వ్యక్తే ఉంటారు. 'మా ఇంట్లో దొంగతనం జరిగింది. నా దగ్గర అవసరానికి డబ్బేమీ లేదు. సహాయం చెయ్ ప్లీజ్' అని అడుగుతారు. లేదంటే.. సడెన్‌గా జబ్బు పడ్డాను, అత్యవసర పరిస్థితుల కోసం నాకు డబ్బు కావాలి ●యాక్సిడెంట్ అయ్యింది, డబ్బు కావాలి' అని అంటారు. ఆ సమయంలో 'అయ్యో, మనకు తెలిసిన వారికే, ఎంతటి కష్టం వచ్చింది అనుకుంటాం. డబ్బు సాయానికి ఆన్‌లైన్ బదిలీలు చేస్తాం. ఆ తర్వాత కానీ, జరిగిన నష్టం అర్థం కాదు.

■ డీప్ ఫేక్ స్కామ్ నమూనా..

ఏఐ ఆధారిత ఫోన్ వీడియో కాల్ మోసాలు అవతలివారిని ఒప్పించేవిగా, నమ్మించేవిగా ఉండవచ్చు.

- నేరగాళ్లు బాధితులను యాదృచ్ఛికంగా ఎంచుకుంటారు. మన సోషల్ మీడియా ప్రొఫైల్ ఇందుకు ఉపయోగపడుతుంది. ఆ తర్వాత స్కామర్లు బాధితులతో సోషల్ నెట్‌వర్క్‌లతో కమ్యూనికేట్ చేయడం ప్రారంభిస్తారు.
- స్కామర్ మనకు తెలిసిన వ్యక్తిలా నటిస్తాడు. తప్పుడు కథనాలను పునరావృతం చేయడం ద్వారా (ఏఐ-ఆధారిత డీప్ ఫేక్‌లను ఉపయోగించడం) బాధితులను పెద్ద మొత్తంలో డబ్బును ట్రాన్స్‌ఫర్ చేసేలా ఒప్పించడం, లేదా తియ్యగా మాట్లాడుతూ ఆర్థిక సహాయాన్ని అభ్యర్థించడం వంటి మోసాలకు పాల్పడతారు.



ఒరిజినల్ | ఏఐ కల్పితం

■ దుర్వినియోగం ఇలా అవుతోంది..

- డీప్ ఫేక్‌లను (వీడియోలు, ఫేక్‌వర్చువల్ ఐడెంటిటీలు) రూపొందించడంలో ఏఐ సహాయపడుతుంది. ఇది చాలా వాస్తవికంగా కనిపిస్తుంది. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడానికీ, అసలు వ్యక్తుల్లా నటించడానికీ ఉపయోగపడుతుంది.
- మోడర్న్ స్టైల్‌లో వాయిస్ ఫిషింగ్ దాడులను నిర్వహించడానికి సైబర్ నేరస్తులు సోషల్ మీడియా అకౌంట్లనుంచి మన ఆడియోలను క్లోన్ చేయవచ్చు. (ఎమర్జెన్సీ సాకుతో డబ్బును బదిలీ చేయడానికి బాధితుల్లా నటించవచ్చు)
- ఏఐ టెక్నిక్స్ ఉపయోగించి సైబర్ నేరస్తులు మీ ఇమెయిల్‌ను పోలినటువంటి మెయిల్స్‌నే క్రియేట్ చేయవచ్చు.
- ఇప్పటికే ఉన్న ఆన్‌లైన్ సేఫ్టీని తప్పించి హైటెక్ మాల్వేర్‌ను రూపొందించడానికి ఏఐ ఉపయోగపడుతుంది.
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో నడిచే డిజిటల్ ల్యాండ్ స్కేప్‌లు మనుషుల ప్రవర్తనకు తగినట్టుగా అనుకరిస్తాయి. అందుకే, ఏఐ సాధనాలను ఉపయోగించి మరింత నమ్మదగిన సోషల్ దాడులకు పాల్పడవచ్చు.

■ నేరాల బారిన పడకుండా చిట్కాలు

- కోడ్ వర్డ్ తప్పనిసరి చేయాలి. మీ పిల్లలు, కుటుంబసభ్యులు, సన్నిహితులకు సంబంధించి ఒక కోడ్‌వర్డ్‌ను సెట్ చేయండి. ఏదైనా వీడియో, లైవ్ ద్వారా ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన చర్చ వచ్చినప్పుడు కోడ్‌వర్డ్ చెప్పమని అడిగి, నిర్ధారించుకోవచ్చు.
- లైవ్‌లో అయితే 'ఒకసారి వెనక్కి తిరగమని చెప్పండి. ఏఐ టెక్నాలజీ అయితే అలా తిరగడం అనేది సాధ్యం కాదు.
- సైబర్ నేరస్థులు మీ సన్నిహితుల ఫోన్ నంబర్ల మాదిరే కనిపించే యాక్సెస్‌ను కూడా కలిగి ఉంటారు. అందుకని, మీకు తెలిసిన నంబర్ నుండి వాయిస్ మెయిల్ లేదా టెక్ట్స్ వచ్చినా వెంటనే స్పందించకుండా కొంత సమయం తీసుకొని, లోతైన కారణాన్ని కనుక్కోండి.
- మీ సోషల్ మీడియా, ఇ-మెయిల్ అకౌంట్స్‌కు రెండు రకాల ప్రామాణీకరణను పాటించండి. దీని వల్ల మీరు అనధికార విషయాలకు దూరంగా ఉండవచ్చు.
- అంకెలు, ప్రత్యేక అక్షరాలతో బలమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించండి.
- ఇ-మెయిల్స్, ఎస్సెమ్మెస్‌లలో వచ్చే షార్ట్ లింక్స్‌పై క్లిక్ చేసేటప్పుడు జాగ్రత్త అవసరం. ధ్రువీకరించినవాటిని మాత్రమే ఓపెన్ చేయండి.

ఇప్పుడిప్పుడే వెలుగు చూస్తున్న ఏఐ మోసాల నుండి మనల్ని మనం కాపాడుకోవాలంటే 'ఏది నిజం – ఏది మాయ' అని తెలుసుకోవడం ముఖ్యం. ఆధునిక పద్ధతుల్లో జరిగే ఏ మోసాలైనా మానవ మేధస్సును ఉపయోగించి అడ్డుకోవడం సులువే. అందుకు కావల్సింది కొంత జాగరూకత మాత్రమే అని గుర్తించాలి.

ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్





ఆసియా క్రీడలకు భారత ఫుట్‌బాల్ జట్లు

ఆసియాలో టాప్-8లో లేకపోయినా భారత పురుషుల, మహిళల ఫుట్‌బాల్ జట్లను ఆసియా క్రీడలకు పంపించాలని కేంద్ర క్రీడా శాఖ నిర్ణయం తీసుకుంది. ఆసియా క్రీడల్లో ఆయా జట్లలో ముగ్గురు మినహా మిగతా సభ్యులు అండర్-23 ఆటగాళ్లే ఉండాలి. సీనియర్ ఆటగాళ్ల హోదాలో కెప్టెన్ సునీల్ ఛెత్రి, గోల్‌కీపర్ గుర్‌ప్రీత్, డిఫెండర్ సందీప్ జింగాన్ ఆసియా క్రీడల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు. మరోవైపు భారత మహిళల సాఫ్ట్‌బాల్, పురుషుల వాటర్‌పోలో, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్ 5x5 జట్లను ఆసియా క్రీడలకు పంపించకూడదని భారత ఒలింపిక్ సంఘం నిర్ణయం తీసుకుంది.

భారత చెస్ 83వ గ్రాండ్‌మాస్టర్‌గా ఆదిత్య

మహారాష్ట్రకు చెందిన ఆదిత్య సామంత్ భారత చెస్‌లో 83వ గ్రాండ్‌మాస్టర్ (జీఎం)గా అవతరించాడు. స్విట్జర్లాండ్‌లో జరుగుతున్న బీల్ చెస్ ఫెస్టివల్‌లో ఆదిత్య జీఎం హోదా ఖరారు కావడానికి అవసరమైన 2500 ఎలో రేటింగ్‌ను అధిగమించడంతోపాటు చివరిదైన మూడో జీఎం నార్మ్‌ను సాధించాడు. 20 ఏళ్ల ఆదిత్య అబుదాబి మాస్టర్స్‌లో తొలి జీఎం నార్మ్, ఎల్ లోబ్రెగట్ ఓపెన్‌లో రెండో జీఎం నార్మ్ సాధించాడు.



వరల్డ్‌కప్ దిశగా వన్డేల సన్నాహకం

దాదాపు రెండు నెలల తర్వాత జరిగే వన్డే వరల్డ్‌కప్‌కు సన్నాహాలు షురూ చేస్తున్న జట్టు ఒకవైపు... వరల్డ్‌కప్‌కు అర్హత సాధించకుండా దూరంగా ఉండిపోయిన జట్టు మరోవైపు... తుది జట్టు కూర్పు ప్రయత్నాల్లో, కీలక ఆటగాళ్ల ఫామ్‌లోకి వచ్చే ప్రయత్నంలో ఒక జట్టు... అసలు గెలుపు, ఓటముల ప్రభావమే లేకుండా, గెలిస్తే కనీసం వరల్డ్‌కప్ సూపర్ లీగ్ పాయింట్లు కూడా అందుబాటులో లేని స్థితిలో మరో జట్టు... ఈ నేపథ్యంలో భారత్, వెస్టిండీస్ మధ్య వన్డే సిరీస్‌కు రంగం సిద్ధమైంది. అగ్రశ్రేణి ఆటగాళ్లతో టీమిండియా సహజంగానే ఫేవరెట్ కాగా, విండీస్ ఈ ఫార్మాట్‌లోనైనా పోటీ ఇస్తుందా అనేది చూడాలి.

- నేడు భారత్, విండీస్ తొలి వన్డే
- జోరు మీదున్న టీమిండియా
- రాత్రి గం. 7 నుంచి డీడీ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

బ్రిడ్జ్‌టౌన్ (బార్బడోస్): తొలి టెస్టు గెలిచి, రెండో టెస్టులో వాన కారణంగా విజయావకాశం చేజార్చుకున్న భారత జట్టు ఇప్పుడు వన్డేల్లో చెలరేగేందుకు సిద్ధమైంది. భారత్, విండీస్ మధ్య మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా నేడు కెన్సింగ్టన్ ఓవల్ మైదానంలో తొలి పోరు జరుగుతుంది. వరల్డ్‌కప్‌నకు ముందు సాధనగా ఉపయోగపడగల ఈ సిరీస్‌లో రోహిత్ బృందం పూర్తి స్థాయిలో సత్తా చాటాలని భావిస్తుండగా... సీనియర్ల గైర్హాజరుతో పలువురు యువ ఆటగాళ్లను పరీక్షించేందుకు విండీస్ ప్రయత్నిస్తోంది.

సూర్యకుమార్‌పై దృష్టి...

23 మ్యాచ్‌లలో 433 పరుగులు... వన్డేల్లో సూర్యకుమార్ యాదవ్ గణాంకాలు ఇవి. టి20ల్లో విధ్వంసక ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకున్నా, వన్డేల్లో అతను ఇంకా తడబడుతూనే ఉన్నాడు. ఆసీస్‌తో గత మూడు వన్డేల్లో తొలి బంతికి డకౌట్ అరుదైన రికార్డు సాధించిన అతను తన సత్తాను ప్రదర్శించేందుకు ఇది సరైన వేదిక. వికెట్ కీపర్ స్థానం కోసం ఇషాన్ కిషన్, సంజూ సామ్సన్ మధ్య గట్టి పోటీ ఉంది. అప్పుడప్పుడు మాత్రమే అవకాశాలు దక్కించుకున్న సామ్సన్ ఈసారి చాన్స్ వృథా చేసుకోకూడదని పట్టుదలగా ఉన్నాడు. ఆల్‌రౌండర్లుగా హార్దిక్, జడేజాలతో పాటు పిచ్‌ను బట్టి అక్షర్, శార్దుల్‌లలో ఒకరికి అవకాశం దక్కవచ్చు. టెస్టుల్లో సత్తా చాటిన సిరాజ్ ఇక్కడా పేస్ బౌలింగ్ దళానికి సారథి. రెండో పేసర్‌గా ఉమ్రాన్ తనకు దక్కిన అవకాశాన్ని వాడుకోవాల్సి ఉంది. చహల్‌కంటే కూడా ఈ ఏడాది భారత్ ఆడిన 9 వన్డేల్లో 8 మ్యాచ్‌లలో బరిలోకి దిగిన కుల్దీప్ యాదవ్‌కే ప్రధాన స్పిన్నర్‌గా అవకాశం ఉంది. భారత టాప్-3 రోహిత్, గిల్, కోహ్లి తమ స్థాయి మేరకు ఆడితే జట్టుకు తిరుగుండదు.



రోహిత్

పిచ్, వాతావరణం

దాదాపు ఏడాది క్రితం ఇక్కడ జరిగిన వన్డే సిరీస్‌లో బౌలర్లు బాగా ప్రభావం చూపడంతో తక్కువ స్కోర్లే నమోదయ్యాయి. అయితే ఈసారి కొంత బ్యాటింగ్‌కు అనుకూలం. మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించవచ్చు.

హెట్‌మైర్ పునరాగమనం...



హెట్‌మైర్, షై హోప్

సమీప భవిష్యత్తు గురించి ఎలాంటి స్పష్టత లేకపోయినా పరువు దక్కించుకునే ప్రయత్నంలో వెస్టిండీస్ పోరాడనుంది. వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్‌లో పేలవ ప్రదర్శన వారి వన్డే జట్టు స్థాయిని చూపిస్తోంది. హోల్డర్, పూరన్, కీమో పాల్‌లాంటి కాస్త పేరున్న ఆటగాళ్లు ఈ సిరీస్‌కు దూరమయ్యారు. టీమ్ మేనేజ్‌మెంట్ కూడా ఫలితంతో సంబంధం లేకుండా కొత్తగా ప్రయత్నించేందుకు సిద్ధమైంది. గుడకేశ్ మోతీ, యానిక్ కారియా, జేడెన్ సీల్స్‌లాంటి ఆటగాళ్లు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఇది సరైన అవకాశం. 47 వన్డేల్లో 100కు పైగా స్ట్రయిక్‌రేట్‌తో పాటు భారత్‌పైనే రెండు సెంచరీలు సాధించిన హెట్‌మైర్‌పైనే ప్రధానంగా అందరి దృష్టి నిలిచింది. కింగ్, కెప్టెన్ షై హోప్ బ్యాటింగ్‌లో ఇతర కీలక ఆటగాళ్లు.

8 ఇరుజట్ల మధ్య జరిగిన గత 8 వన్డేల్లో భారతే విజయం సాధించింది. 2019 డిసెంబర్‌లో భారత్‌ను ఆఖరిసారిగా విండీస్ ఓడించింది.

6 వెస్టిండీస్‌లో వెస్టిండీస్‌తో భారత జట్టు ఇప్పటి వరకు పది ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లు ఆడింది. ఇందులో ఆరుసార్లు భారత్, నాలుగుసార్లు వెస్టిండీస్ సిరీస్‌లు గెల్చుకున్నాయి. గత ఐదు సిరీస్‌లలో భారతే పైచేయి సాధించింది. 2006లో చివరిసారి విండీస్ సొంతగడ్డపై భారత్‌పై సిరీస్ నెగ్గింది.

అభిమానులకు షాక్!

భారత్, పాక్ వరల్డ్‌కప్ మ్యాచ్ తేదీ మారే అవకాశం



న్యూఢిల్లీ: వన్డే వరల్డ్‌కప్‌లో అత్యంత ప్రతిష్టాత్మక పోరు... అభిమానుల కోణంలో అయితే మరీ భావోద్వేగాల సమరం... అందుకే ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ ఫ్యాన్స్ భారత్, పాకిస్తాన్ మధ్య జరిగే మ్యాచ్ కోసం ఎదురు చూశారు. విమాన టికెట్లతో పాటు పెద్ద మొత్తంలో ఖర్చు చేసి భారీగా పెరిగిన రేట్‌లతో హోటల్ గదులు కూడా బుక్ చేసుకున్నారు. ఎన్ని వ్యయప్రయాసలెదురైనా నరేంద్ర మోదీ స్టేడియంలో మ్యాచ్ చూసేందుకు అక్టోబర్ 15 కోసం ప్రణాళిక రూపొందించుకున్నారు. అయితే ఇప్పుడు వీరందరి ప్లాన్ తలకిందులయ్యే అవకాశమూ కనిపిస్తోంది! అహ్మదాబాద్‌లో అదే రోజు నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. గుజరాత్‌లో అత్యంత వైభవంగా జరిగే నవరాత్రి ఉత్సవాల మొదటి రోజు మ్యాచ్ జరపడం చాలా సమస్యగా మారుతుందని అక్కడి భద్రతా వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఆ రోజు సెక్యూరిటీ కల్పించడం తమ వల్ల సాధ్యం కాదని చేతులెత్తేసిన పోలీసులు, మ్యాచ్‌ను మరో రోజుకు మార్చాలని బీసీసీఐ అధికారులకు సూచించారు. ప్రకటించిన తేదీకంటే ఒక రోజు ముందు అక్టోబర్ 14కు మ్యాచ్ మారే అవకాశం ఉంది. అయితే ఒక రోజు మారినా ఫ్యాన్స్‌కు ఇది పెద్ద సమస్యగా మారడం మాత్రం ఖాయం. అసలు షెడ్యూల్ ప్రకటించడమే చాలా ఆలస్యం కాగా... గుజరాత్‌లో నవరాత్రి గురించి బోర్డు కార్యదర్శి జై షాకు తెలియకపోవడం ఆశ్చర్యకరం! దీనిపై నేడు జరిగే బీసీసీఐ సమావేశం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు వరల్డ్ కప్ నిర్వహణకు సంబంధించి నేడు వివిధ సబ్ కమిటీలతో నేడు బోర్డు చర్చించనుంది.

8 పరుగులిచ్చి 7 వికెట్లు

- అంతర్జాతీయ టి20ల్లో కొత్త ప్రపంచ రికార్డు
- మలేసియా పేసర్ ఇద్రూస్ ఘనత
- 11.2 ఓవర్లలో చైనా 23 ఆలౌట్



ఇద్రూస్

కౌలాలంపూర్: అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో సంచలన బౌలింగ్ ప్రదర్శన నమోదైంది. మలేసియా పేస్ బౌలర్ స్యాజ్‌రుల్ ఇద్రూస్ 4 ఓవర్లలో 8 పరుగులే ఇచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. అంతర్జాతీయ టి20ల్లో ఇదే ఒక బౌలర్ అత్యుత్తమ ప్రదర్శన. ఇప్పటి వరకు ఎవరూ 7 వికెట్లు తీయలేదు. గతంలో అత్యుత్తమ బౌలింగ్ రికార్డు పీటర్ అహో (నైజీరియా; 6/5, సియెరా లియోన్) పేరిట ఉంది. ఐసీసీ పూర్తి స్థాయి సభ్యత్వం ఉన్న జట్లలో దీపక్ చహర్ (6/7,బంగ్లాదేశ్‌పై)దే బెస్ట్ బౌలింగ్. ఓవరాల్‌గా టి20 క్రికెట్‌లో కొలిన్ అకర్‌మన్ (7/18) పేరిట ఉన్న రికార్డును కూడా ఇద్రూస్ సవరించాడు. టి20 ప్రపంచకప్ ఆసియా 'బి' క్వాలిఫయర్ టోర్నీలో భాగంగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఇద్రూస్ ధాటికి చైనా 11.2 ఓవర్లలో 23 పరుగులకే కుప్పకూలింది. ఇద్రూస్ వికెట్లన్నీ క్లీన్‌బౌల్డ్ కావడం విశేషం. చైనా తరఫున బరిలోకి దిగిన 11 మందికీ ఇది తొలి అంతర్జాతీయ టి20 మ్యాచ్ మాత్రమే కాదు...ఓవరాల్‌గా కూడా ఇదే తొలి టి20 మ్యాచ్. అనంతరం మలేసియా 4.5 ఓవర్లలో 2 వికెట్లకు 24 పరుగులు చేసి విజయాన్నందుకుంది.

సింధు ఏడో 'సారీ'

మళ్లీ తొలి రౌండ్‌లోనే ఓడిన భారత స్టార్



టోక్యో: ఈ ఏడాది తన నిరాశాజనక ప్రదర్శన కొనసాగిస్తూ... భారత బ్యాడ్మింటన్ స్టార్ ప్లేయర్ పీవీ సింధు జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీ నుంచి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 17వ ర్యాంకర్ సింధు కేవలం 32 నిమిషాల్లో 12-21, 13-21తో ప్రపంచ 18వ ర్యాంకర్ జాంగ్ యి మన్ (చైనా) చేతిలో ఓడిపోయింది. ఈ ఏడాది సింధు 13 వరల్డ్ టూర్ సూపర్ టోర్నీల్లో ఆడగా ఏడు టోర్నీల్లో ఆమె తొలి రౌండ్‌లోనే ఓడిపోయింది. మహిళల సింగిల్స్‌లో బరిలో ఉన్న మరో భారత క్రీడాకారిణి మాళవిక బన్సోద్ కూడా తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. అయా ఒహోరి (జపాన్)తో జరిగిన మ్యాచ్‌లో మాళవిక 7-21, 15-21తో ఓటమి పాలైంది.

సాత్విక్-చిరాగ్ జోడీ శుభారంభం

ఈ సంవత్సరం నాలుగు టైటిల్స్ నెగ్గిన జోరు మీదున్న సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. తొలి రౌండ్‌లో ప్రపంచ రెండో ర్యాంక్ జంట సాత్విక్-చిరాగ్ 21-16, 11-21, 21-13తో లియో కర్నాండో-డానియల్ మార్టిన్ (ఇండోనేసియా) ద్వయంపై గెలిచింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్య సేన్ (భారత్) 21-15, 12-21, 24-22తో సహచరుడు ప్రియాన్షు రజావత్‌పై గెలుపొందగా... మిథున్ 21-13, 22-24, 18-21తో వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా) చేతిలో ఓడిపోయాడు.

పాకిస్తాన్ 563/5



షఫీఖ్

కొలంబో: శ్రీలంక జట్టుతో జరుగుతున్న రెండో టెస్టులో మూడో రోజు ఆట ముగిసే సమయానికి పాకిస్తాన్ 132 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 563 పరుగులు సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 178/2తో ఆట కొనసాగించిన పాకిస్తాన్ మూడు వికెట్లు చేజార్చుకొని 385 పరుగులు చేసింది. ఓపెనర్ అబ్దుల్లా షఫీఖ్ (201; 19 ఫోర్లు, 4 సిక్స్‌లు) డబుల్ సెంచరీ చేయగా... ఆగా సల్మాన్ (132 బ్యాటింగ్; 15 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీ సాధించాడు. ప్రస్తుతం పాక్ 397 పరుగుల ఆధిక్యంలో ఉంది.

సౌత్ జోన్‌కు రెండో గెలుపు



మయాంక్

పుదుచ్చేరి: దేవధర్ ట్రోఫీ దేశవాళీ జోనల్ వన్డే క్రికెట్ టోర్నీలో సౌత్ జోన్ జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. వెస్ట్ జోన్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో సౌత్ జోన్ 12 పరుగుల తేడాతో గెలిచింది. ముందుగా సౌత్ జట్టు 46.4 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (115 బంతుల్లో 98; 9 ఫోర్లు) రెండు పరుగుల తేడాతో సెంచరీని కోల్పోయాడు. వెస్ట్ బౌలర్లలో పార్థ్ మూడు వికెట్లు తీయగా, రాజ్‌వర్ధన్, షమ్స్ ములానీలకు రెండు వికెట్ల చొప్పున లభించాయి. 207 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్ట్ జట్టు 36.2 ఓవర్లలో 194 పరుగులకు ఆలౌటైంది. సర్ఫరాజ్ ఖాన్ (42; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), అతీత్ షేథ్ (40; 6 ఫోర్లు) రాణించారు. సౌత్ జోన్ స్పిన్నర్లు సాయికిశోర్ (3/44), వాషింగ్టన్ సుందర్ (2/34) వెస్ట్ జోన్ జట్టును దెబ్బ తీశారు. ఇతర మ్యాచ్‌ల్లో నార్త్ జోన్ 48 పరుగులతో సెంట్రల్ జోన్‌పై, ఈస్ట్ జోన్ ఎనిమిది వికెట్లతో నార్త్ ఈస్ట్‌జోన్‌పై గెలిచాయి.

ఇంగ్లండ్‌తో భారత్ మ్యాచ్ 'డ్రా'

బార్సిలోనా: స్పెయిన్ హాకీ సమాఖ్య శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న నాలుగు దేశాల అంతర్జాతీయ హాకీ టోర్నీని భారత మహిళల జట్టు 'డ్రా'తో ప్రారంభించింది. ఇంగ్లండ్ జట్టుతో బుధవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌ను భారత్ 1-1తో 'డ్రా'గా ముగించింది. ఇంగ్లండ్ తరఫున హోలీ హంట్ ఏడో నిమిషంలో గోల్ చేయగా... భారత జట్టుకు లాల్‌రెమ్‌సియామి 41వ నిమిషంలో గోల్ సాధించి స్కోరును సమం చేసింది. చివరి క్వార్టర్‌లో రెండు జట్లకు రెండు చొప్పున పెనాల్టీ కార్నర్‌లు లభించినా ఫలితం లేకపోయింది. మరోవైపు ఇదే టోర్నీలో పోటీపడుతున్న భారత పురుషుల జట్టు తొలి మ్యాచ్‌లో స్పెయిన్ జట్టు చేతిలో 1-2తో ఓడిపోగా... నెదర్లాండ్స్ జట్టుతో జరిగిన రెండో మ్యాచ్‌ను 1-1తో 'డ్రా' చేసుకుంది.

సినిమా



రజనీకాంత్, తమన్నా

రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహించిన 'జైలర్' ఆగస్టు 10న రిలీజ్ కానుంది. ఈ చిత్రంలోని తమిళ పాట 'కావాలయ్యా' తెలుగు వెర్షన్ 'కావాలి...'ని హీరో రానా షేర్ చేశారు. శ్రీ సాయి కిరణ్ రాసిన ఈ పాటను సింధూజ శ్రీనివాసన్‌తో కలిసి ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ పాడారు. అలాగే 'జైలర్' నుంచి తమిళ 'జుజుబి' పాట లిరికల్ వీడియోను బుధవారం రిలీజ్ చేశారు.

విహారం.. వినోదం

స్టోరీ సిట్టింగ్స్, సినిమా షూటింగ్స్, ప్రమోషన్స్... ఇలా ఎప్పుడూ బిజీ బిజీగా ఉంటుంటారు సినిమా స్టార్స్. అందుకే అప్పుడప్పుడూ కాస్త రిలాక్స్ అవ్వాలనుకుంటారు. విహారం.. వినోదం కోసం కొంత టైమ్ కేటాయిస్తారు. ప్రస్తుతం అలా వెకేషన్ మోడ్‌లో ఏ స్టార్స్ ఎక్కడున్నారో తెలుసుకుందాం.



అజిత్



మహేశ్ బాబు



విజయ్



సమంత



రకుల్

మాల్దీవుల్లో మస్తీ

వెకేషన్ స్పాట్ కోసం మాల్దీవులను ఎంచుకున్నారు రజనీకాంత్. వారం రోజుల క్రితం ఆయన మాల్దీవులకు వెళ్లిన సంగతి గుర్తుండే ఉంటుంది. అక్కడి బీచ్‌లో రజనీ నడుస్తున్న ఫొటోలు కూడా నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ఇక వెకేషన్ నుంచి తిరిగొచ్చిన తర్వాత 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలోని సినిమా, లోకేశ్ కనగరాజ్ డైరెక్షన్‌లోని సినిమాలతో రజనీకాంత్ బిజీ అవుతారు.

విదేశాల్లో బర్త్ డే

ఇటీవలి కాలంలో సినిమా షెడ్యూల్స్‌కి కాస్త గ్యాప్ రావడంతో మహేశ్‌బాబు హాలిడే మోడ్‌లో ఉంటున్నారు. ప్రస్తుతం ఫ్యామిలీతో కలిసి దుబాయ్ వెకేషన్‌లో ఉన్నారు మహేశ్‌బాబు. రెండు వారాలకు పైగానే ఈ వెకేషన్‌ను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఆగస్టు 9న మహేశ్ బర్త్ డే. ఈ పుట్టినరోజుని విదేశాల్లోనే ఫ్యామిలీతో కలిసి జరుపుకుంటారని తెలుస్తోంది. ఇక ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో మహేశ్‌బాబు 'గుంటూరు కారం' సినిమా చేస్తున్నారు.

వెకేషన్ కంటిన్యూ

ఈ ఏడాది సంక్రాంతి సమయంలో విడుదలైన అజిత్ తమిళ చిత్రం 'తునివు' (తెలుగులో 'తెగింపు'). ఆ సినిమా తర్వాత దాదాపు హాలిడే మూడ్‌లోనే ఉన్నారు అజిత్. తనకు ఇష్టమైన బైక్స్‌పై విదేశాల్లోని బ్యూటిఫుల్ లొకేషన్స్‌ను సందర్శించారు. కాగా అజిత్ తర్వాతి చిత్రం 'విడా ముయర్చి' ప్రకటన వచ్చిన సంగతి తెలిసిందే. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలు కావడానికి మరికొంత సమయం ఉందట. దీంతో మరోసారి అజిత్ విదేశాలకు ప్రయాణమయ్యారని టాక్.

షార్ట్ గ్యాప్

విజయ్ హీరోగా నటించిన 'లియో' చిత్రం ఈ దసరాకు విడుదల కానుంది. అలాగే విజయ్ నెక్ట్స్ ఫిల్మ్ వెంకట్ ప్రభు దర్శకత్వంలో ఉంటుంది. ఈ చిత్రం ఆరంభం కావడానికి కాస్త టైమ్ ఉందట. ఈ షార్ట్ గ్యాప్‌లో విజయ్ విదేశాలకు వెళ్లారని కోలీవుడ్ సమాచారం.

బాలీలో జాలీగా..

ఆరోగ్య, వ్యక్తిగత కారణాల దృష్ట్యా సినిమా చిత్రీకరణలకు కాస్త దూరంగా ఉండాలని సమంత నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా సమంత వెకేషన్ కోసం బాలీ వెళ్లారు. అక్కడ ఐస్ బాత్ చేశారు సమంత (మెరుగైన ఆరోగ్యం కోసం ఓ ప్రక్రియ). మైనస్ 4 డిగ్రీల చలిలో ఆరు నిమిషాల పాటు ఐస్ బాత్ చేసినట్లుగా సోషల్ మీడియాలో షేర్ చేశారీ బ్యూటీ. ఇక సమంత హీరోయిన్‌గా నటించిన 'ఖుషీ' చిత్రం సెప్టెంబరు 1న విడుదల కానుంది. ఇందులో విజయ్ దేవరకొండ హీరో. అలాగే వరుణ్ ధావన్, సమంత లీడ్ రోల్స్‌లో నటించిన 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ తేదీపై త్వరలోనే ఓ స్పష్టత రానుంది.

దుబాయిలో హాయి హాయి..

గత నెల మాల్దీవుల్లో రకుల్ ప్రీత్ సింగ్ చాలా జోష్‌గా గడిపారు. ఈ హాలిడేని ఫుల్లుగా ఎంజాయ్ చేశారు. తాజాగా ఫ్యామిలీతో కలిసి దుబాయ్ రిసార్ట్స్‌లో ఫుల్ జోష్‌లో ఉన్నారు రకుల్. తన తల్లి బర్త్ డేను దుబాయ్‌లో గ్రాండ్‌గా సెలబ్రేట్ చేశారామె. ఇందుకోసమే రకుల్ అండ్ ఫ్యామిలీ దుబాయ్ వెళ్లారు.

'భోళా శంకర్' షూటింగ్‌ను పూర్తి చేసిన తర్వాత వెకేషన్‌కు వెళ్లొచ్చారు చిరంజీవి. ఇటీవలే హైదరాబాద్ తిరిగొచ్చిన చిరంజీవి ఆగస్టు 11న విడుదల కానున్న 'భోళా శంకర్' ప్రమోషన్స్‌తో బిజీ అవుతారని తెలుస్తోంది. ఇక ఇటీవలే ఆస్ట్రియా వెళ్లొచ్చారు వెంకటేశ్. అక్కడ కొంత క్వాలిటీ హాలి డే టైమ్‌ను స్పెండ్ చేసొచ్చారు. ప్రస్తుతం 'సైంధవ్' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు వెంకటేశ్. ఈ చిత్రం డిసెంబరు 22న విడుదల కానుంది. మరోవైపు యాభై రోజులు యూఎస్‌లో స్పెండ్ చేసిన ప్రభాస్ హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలోని 'సలార్', మారుతి దర్శకత్వంలోని 'రాజా డీలక్స్' (ప్రచారంలో ఉన్న ఓ టైటిల్) చిత్రాలతో ప్రభాస్ బిజీ అవుతారని తెలుస్తోంది. ఇటు దర్శకుల విషయానికి వస్తే... రాజమౌళి తమిళనాడులోని ఆధ్యాత్మిక లొకేషన్స్‌లో ఎక్కువ టైమ్ స్పెండ్ చేశారు. ఇలా వెకేషన్‌కి వెళ్లొచ్చిన హీరో హీరోయిన్లు, దర్శకులు మరికొందరు ఉన్నారు.


అద్దం ముందు డైలాగ్స్ చెప్పేదాన్ని



ప్రణవి

''స్లమ్ డాగ్ హజ్బెండ్' కథ కొత్తగా ఉంటుంది. ఇందులో నేను చేసిన మౌనిక పాత్ర కూడా కొత్తగా ఉంటుంది'' అన్నారు ప్రణవి మానుకొండ. ఏఆర్ శ్రీధర్ దర్శకత్వంలో సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా నటించిన చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ సినిమాని రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ ఈ నెల 29న రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా ప్రణవి మాట్లాడుతూ– ''నాకు చిన్నప్పటి నుంచి నటనంటే ఇష్టం. బాల నటిగా మంచి ఆఫర్లు వచ్చాయి. అనుష్కగారి 'అరుంధతి' సినిమా డైలాగ్స్‌ను అద్దం ముందు నిలబడి చెప్పేదాన్ని. 'రొటీన్ లవ్ స్టోరీ, ఉయ్యాలా జంపాలా, అమిగోస్' సినిమాల్లో మంచి పాత్రలు చేశాను. సీరియల్స్‌లోనూ లీడ్‌గా చేశాను. హీరోయిన్‌గా 'స్లమ్ డాగ్ హజ్బెండ్' ఫస్ట్ మూవీ. నేను తెలుగమ్మాయిని కావడం ప్లస్‌గా భావిస్తున్నా. ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నప్పటికీ నా ఫోకస్ సినిమాలపైనే'' అన్నారు.

కృష్ణగాడంటే ఓ రేంజ్



దిల్ రాజు

రిష్వి తిమ్మరాజు, విస్మయ శ్రీ జంటగా రాజేశ్ దొండపాటి దర్శకత్వం వహించిన చిన్న చిత్రం 'కృష్ణగాడు అంటే ఒక రేంజ్'. పెట్లా కృష్ణమూర్తి, పెట్లా వెంకట సుబ్బమ్మ, పీఎన్‌కే శ్రీలత నిర్మించిన ఈ సినిమా ఆగస్ట్ 4న రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ని నిర్మాత 'దిల్' రాజు రిలీజ్ చేసి, సినిమా పెద్ద హిట్టవ్వాలన్నారు. ''కృష్ణ అనే కుర్రాడి లైఫ్‌లోకి ఓ అమ్మాయి వచ్చాక, ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయి? అనేది ఈ చిత్రం ప్రధానాంశం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

ముగ్గురు మహిళల కథ

సంధ్య బాయిరెడ్డి, కిరణ్ కస్తూరి, రచన యాదనపూడి, అభిషేక్ సబ్బే, వరుణ్ వేగినాటి, కార్తీక్ కందాళ కీలక పాత్రల్లో సంధ్య బాయిరెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'మేక్ ఎ విష్'. కిరణ్ కస్తూరి నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాతలు ప్రసన్న కుమార్, రామసత్యనారాయణ, ఈ చిత్రనిర్మాణ నిర్వహణ భాగస్వామి భవాని శ్రీను (ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్) విడుదల చేశారు. ''ముగ్గురు మహిళల ప్రేమ కథలు, వారి సమస్యల చుట్టూ ఈ కథ ఉంటుంది'' అన్నారు సంధ్య బాయిరెడ్డి.



'మేక్ ఎ విష్' ఫస్ట్ లుక్

రీల్స్

ఇండియన్ 3.. ఆన్ ది వే!



కమల్‌హాసన్

హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన సూపర్ హిట్ ఫిల్మ్ 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') సినిమాకు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. కాగా శంకర్ మూడో భాగాన్ని కూడా ప్లాన్ చేశారనే టాక్ బలంగా వినిపిస్తోంది. 'ఇండియన్ 2' షూటింగ్ పూర్తయిందని, 'ఇండియన్ 3' షూటింగ్ కూడా 70 శాతం పూర్తయిందనే వార్తలు తెరపైకి వచ్చాయి. 'ఇండియన్ 2' విడుదలైన ఏడాది తర్వాత 'ఇండియన్ 3' రిలీజ్ అవుతుందని భోగట్టా.

టిక్కెట్టే కొనకుండా...



సిద్ధు జొన్నలగడ్డ

'డీజే టిల్లు' సినిమాతో హీరోగా సూపర్ హిట్ అందుకున్న సిద్ధు జొన్నలగడ్డ ఆ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతోన్న 'టిల్లు స్క్వేర్'లో నటిస్తున్నారు. మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి 'టిక్కెట్టే కొనకుండా లాటరీ కొట్టిన సిన్నోడా...' అంటూ సాగే తొలి మాస్ సాంగ్‌ను బుధవారం విడుదల చేశారు. రామ్ మిరియాల స్వరపరచి, పాడిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించారు. ఈ చిత్రానికి సంగీతం: రామ్ మిరియాల, శ్రీ చరణ్ పాకాల.

మంచి చేయడానికే పోటీ చేస్తున్నా

- నిర్మాత సి. కల్యాణ్



''చలనచిత్ర వాణిజ్య మండలి (తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్) ఎన్నికల్లో అధ్యక్షునిగా, ప్యానల్ సభ్యులుగా నిజాయతీగా సేవ చేసేవాళ్లను ఎన్నుకోండి'' అని నిర్మాత సి. కల్యాణ్ అన్నారు. ఈ నెల 30న చలన చిత్ర వాణిజ్య మండలి ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షునిగా పోటీ చేస్తున్న సి. కల్యాణ్ తన ప్యానల్ సభ్యులతో కలిసి మాట్లాడుతూ– ''గతంలో నేను పోటీ చేయాలనుకున్నప్పుడు కొందరు నిర్మాతలు 'యూఎఫ్ఓ, క్యూబ్' వంటి డిజిటల్ ఛార్జీల విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటామని చెబితే విరమించుకున్నాను. కానీ, వాళ్లు సభ్యుల శ్రేయస్సు కోసం కృషి చేయలేదు. అందుకే.. అందరికీ మంచి చేయాలనే ఆశయంతో పోటీ చేస్తున్నాను'' అన్నారు.

రుద్రంకోటలో...



జయలలిత

సీనియర్ నటి జయలలిత సమర్పించి, ఓ కీలక పాత్ర చేసిన చిత్రం 'రుద్రంకోట'. రాము కోన దర్శకత్వంలో అనిల్ ఆర్కా కండవల్లి నిర్మించిన ఈ చిత్రంలో అనిల్ ఆర్కా, విభీష, రియా హీరో హీరోయిన్లు. ఈ చిత్రం ఆగస్టులో స్కైన్ మాక్స్ సంస్థ ద్వారా విడుదల కానుంది. ''శ్మశాన వాటికలో పెరిగిన ఓ యువకుడి ప్రేమకథా చిత్రమిది. భద్రాచలం దగ్గర రుద్రంకోట అనే ఊరి నేపథ్యంలో కథ నడుస్తుంది'' అన్నారు అనిల్ ఆర్కా కండవల్లి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	351	66,707
నిఫ్టీ ▲	98	19,778

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,110	▽	34
డోజోన్స్	35,464	▲	26
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,677	▽	15
డాక్స్	16,131	▽	80
షాంఘై	3,223	▽	8
నికాయ్	32,668	▽	14

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై			
బంగారం (24 క్యారట్)	59,692	▲	549
బంగారం (22 క్యారట్)	59,453	▲	547
వెండి (కేజీ)	74,520	▲	581

ఫెడ్ మళ్లీ వడ్డీ పెంపు బాట



వాషింగ్టన్: ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్లను ప్రభావితం చేయగల యూఎస్ కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ తాజాగా వడ్డీ రేటును 0.25 శాతం పెంచింది. దీంతో ఫెడ్ ఫండ్స్ రేట్లు 2001 తదుపరి 5.25–5.5 శాతానికి చేరాయి. వెరసి ఫండ్స్ రేట్లు 22ఏళ్ల గరిష్టాన్ని తాకాయి. వడ్డీ రేటును పావు శాతం పెంచేందుకు ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌వోఎంసీ) ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఫెడ్ భవిష్యత్‌లోనూ వడ్డీ రేట్ల పెంపు ఉండవచ్చన్న సంకేతాలు ఇవ్వడం గమనార్హం! కాగా.. ధరల కట్టడికి 2022 మార్చి నుంచి వరుసగా 10 సమావేశాలలో వడ్డీ రేట్లను పెంచుతూ వచ్చిన ఫెడ్ గత సమావేశంలో తొలిసారి యథాతథ పాలసీ అమలుకు కట్టుబడింది.

తనిష్క్ నుంచి కొత్త ఆభరణాల కలెక్షన్



హైదరాబాద్: జ్యూవెలరీ రిటైల్ బ్రాండ్ తనిష్క్ 'ది ఆటమ్ ఎడిట్' పేరిట కొత్త ఆభరణాల కలెక్షన్‌ను తీసుకొచ్చింది. ఉంగరాలు, చెవిపోగులు, పెండెంట్‌లు, నెక్లెస్‌లు, బ్రాస్‌లెట్‌లు, బ్యాంగిల్స్ వంటివి ఇందులో ఉన్నాయి. కలెక్షన్ విడుదల సందర్భంగా డైమండ్ ఆభరణాలపై 20% వరకు తగ్గింపు అందిస్తోంది. పాత బంగారాన్ని మార్పిడి ద్వారా వజ్రాభరణాలుగా మార్చుకోవచ్చు. అలాగే 22 క్యారెట్ల కంటే ఎక్కువ ఉన్న పాత బంగారు ఆభరణాలకు 100% మార్పిడి విలువ పొందవచ్చు. పరిమిత కాలానికి మాత్రమే అందుబాటులో ఉండే ఈ ఆఫర్ దేశంలోని అన్ని తనిష్క్ స్టోర్లలో చెల్లుబాటు అవుతుంది.

రష్యాలో అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ రంగ దిగ్గజం అరబిందో ఫార్మా తాజాగా 'ఆరో ఫార్మా ఎల్‌ఎల్‌సీ' పేరిట రష్యాలో తమ అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. రష్యాలో ఫార్మా వ్యాపార కార్యకలాపాలకు ఇది ఉపయోగపడనున్నట్లు సంస్థ తెలిపింది. ఇందులో ప్రాథమికంగా 10 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వివరించింది. కంపెనీ అనుబంధ సంస్థ అయిన ఆరో యాక్టివ్ ఫార్మాకు ఆరో ఫార్మాలో 100% వాటాలు ఉంటాయి.

రిలయన్స్ రిటైల్‌లో 'ఖతార్' పెట్టుబడి!

- ఒక శాతం వాటా కొనుగోలుకు ఆసక్తి
- డీల్ విలువ సుమారు రూ.8,200 కోట్లు



న్యూఢిల్లీ: ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో భాగమైన రిటైల్ రంగ దిగ్గజం రిలయన్స్ రిటైల్ వెంచర్స్‌లో (ఆర్‌ఆర్‌వీఎల్) వాటా కొనుగోలు చేసేందుకు ఖతార్ సావరిన్ వెల్త్ ఫండ్ అయిన ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ ఆసక్తి చూపుతోంది. ఈ మేరకు ఇరు సంస్థల మధ్య చర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయి. మాతృ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ బోర్డులోని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నేతృత్వంలో చర్చలు జరుగుతున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. రిలయన్స్ రిటైల్ వెంచర్స్‌లో సుమారు 1% వాటాను దక్కించుకోవడానికి ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ రూ.8,200 కోట్లు పెట్టుబడి చేసేందుకు సిద్ధమైంది. ఈ డీల్ ద్వారా రిలయన్స్ రిటైల్ వెంచర్స్‌ను 100 బిలియన్ డాలర్లుగా (రూ.8,20,000) విలువ కట్టినట్టు తెలుస్తోంది.

పోటీపడుతున్న ఇన్వెస్టర్లు..

గల్ఫ్ దేశాల నుంచి ఇప్పటికే మూడు సావరిన్ వెల్త్ ఫండ్స్ రిలయన్స్ రిటైల్‌లో 2020లో పెట్టుబడి పెట్టాయి. వీటిలో సౌదీ అరేబియాకు చెందిన పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ 2.04 శాతం వాటా కోసం రూ.16,400 కోట్లు పెట్టుబడి చేసింది. అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ 1.2 శాతం వాటా కోసం రూ.5,513 కోట్లు, యూఏఈ సంస్థ ముబదాల 1.4 శాతం వాటాకై రూ.6,248 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి. రిలయన్స్ రిటైల్‌లో రెండు నెలల వ్యవధిలో 10.09 శాతం వాటాలను కొనుగోలు చేసేందుకు రూ. 47,265 కోట్లను కుమ్మరించిన ప్రపంచ పెట్టుబడి సంస్థల జాబితాలో ఈ మూడు కూడా ఉన్నాయి. వీటితోపాటు కేకేఆర్, సిల్వర్ లేక్ పార్ట్‌నర్స్, జనరల్ అట్లాంటిక్, జీఐసీతోపాటు టీపీజీ సైతం పెట్టుబడి పెట్టాయి.

దూకుడు మీదున్న రిలయన్స్..

కంపెనీ నియమించిన ఇద్దరు గ్లోబల్ కన్సల్టెంట్లు రిలయన్స్ రిటైల్ వెంచర్స్‌ను 92–96 బిలియన్ డాలర్లుగా విలువ కట్టినట్టు ఈ నెల ప్రారంభంలో వార్తలు వెలువడ్డాయి. కంపెనీలను కొనుగోలు చేయడం, భారతీయ మార్కెట్ కోసం ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్ల ఫ్రాంచైజీ హక్కులను పొందడం ద్వారా రిలయన్స్ రిటైల్ తన వ్యాపారాన్ని దూకుడుగా విస్తరిస్తోంది.

జియో ఫైనాన్షియల్, బ్లాక్‌రాక్ జట్టు

- అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఏర్పాటు
- రూ. 2,460 కోట్ల పెట్టుబడులకు రెడీ

డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి విడివడిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్.. ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం బ్లాక్‌రాక్‌తో చేతులు కలిపింది. ఇందుకు సమాన వాటా (50:50)తో భాగస్వామ్య సంస్థ(జేవీ)ను ఏర్పాటు చేయనున్నట్లు జియో ఫైనాన్షియల్ తాజాగా పేర్కొంది. తద్వారా దేశీయంగా అసెట్ మేనేజ్‌మెంట్ నిర్వహణకు తెరతీయనున్నట్లు తెలియజేసింది. దీనిలో భాగంగా రెండు సంస్థలూ 15 కోట్ల డాలర్ల (రూ. 1,230 కోట్లు) చొప్పున ఇన్వెస్ట్ చేయనున్నట్లు తాజాగా వెల్లడించింది. జియో ఫైనాన్షియల్ వనరులు, బ్లాక్‌రాక్ పెట్టుబడుల నైపుణ్యం కలసి జియో బ్లాక్‌రాక్ ద్వారా లక్షలాది ఇన్వెస్టర్లకు కొత్త సొల్యూషన్లు అందించనున్నట్లు వివరించింది. ఈ భాగస్వామ్యంతో దేశీ అసెట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమలో డిజిటల్ ఫస్ట్ ఆఫరింగ్స్ ద్వారా మార్పులకు శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొంది.

డాక్టర్ రెడ్డీస్ లాభం 18% అప్

- క్యూ1లో రూ. 1,402 కోట్లు
- ఆదాయం రూ. 6,738 కోట్లు; 29 శాతం వృద్ధి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీ ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ (డీఆర్‌ఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ. 1,402 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో నమోదైన రూ.1,188 కోట్లతో పోలిస్తే ఇది 18% అధికం. ఇక ఆదాయం రూ.5,215 కోట్ల నుంచి సుమారు 29% వృద్ధి చెంది రూ.6,738 కోట్లకు చేరింది. సమీక్షాకాలంలో కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టడం, కీలకమైన అమెరికా మార్కెట్లో ఉత్పత్తుల ధరల క్షీణత ధోరణి కాస్త తగ్గడం తదితర అంశాలు క్యూ1లో మెరుగైన పనితీరుకు దోహదపడ్డాయని బుధవారం ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ సీఈవో ఎరెజ్ ఇజ్రేలీ, సీఎఫ్‌వో పరాగ్ అగర్వాల్, బ్రాండెడ్ జనరిక్స్ విభాగం సీఈవో ఎంవీ రమణ తెలిపారు. నగదు నిల్వలను కొత్త బ్రాండ్లు.. సంస్థల కొనుగోళ్లు, పరిశోధన.. అభివృద్ధి కార్యకలాపాలపై పెట్టుబడులు మొదలైన అవసరాల కోసం వెచ్చించనున్నట్లు ఇజ్రేలీ వివరించారు. అమెరికాలో జనరిక్స్ విభాగంలో కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణ, రష్యాలో పుంజుకోవడం వంటి అంశాల తోడ్పాటుతో అమ్మకాలపరంగా పటిష్టమైన వృద్ధి సాధించగలిగామని సంస్థ సహ–చైర్మన్ జీవీ ప్రసాద్ వివరించారు. భవిష్యత్ వృద్ధి చోదకాలపై పెట్టుబడులు పెట్టడం, ఆవిష్కరణలను కొనసాగిస్తూనే.. అధిక వృద్ధిని కూడా సాధించాలనే తమ వ్యూహానికి అనుగుణంగా ముందుకు సాగుతున్నామని ఆయన పేర్కొన్నారు.

క్యూ1లో మరిన్ని విశేషాలు..

- విభాగాల వారీగా, గ్లోబల్ జనరిక్స్ (జీజీ) ఆదాయం 36% వృద్ధి చెంది రూ. 5,426 కోట్ల నుంచి రూ. 6,008 కోట్లకు చేరింది. ఫార్మా సర్వీసెస్, యాక్టివ్ ఇంగ్రీడియంట్స్ (పీఎస్‌ఏఐ) ఆదాయం 5% క్షీణించి రూ. 671 కోట్లకు తగ్గింది.
- ప్రాంతాలవారీగా.. కీలకమైన ఉత్తర అమెరికా మార్కెట్లో జీజీ ఆదాయం 79% పెరిగి రూ. 3,198 కోట్లుగా నమోదైంది. క్యూ1లో అమెరికాలో 6, కెనడాలో రెండు కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టారు.
- భారత మార్కెట్లో ఆదాయం 14 శాతం తగ్గి రూ. 1,148 కోట్లకు పరిమితమైంది.
- యూరప్ మార్కెట్లో ఆదాయం 22 శాతం పెరిగి రూ. 507 కోట్లకు చేరింది.
- వర్ధమాన మార్కెట్లను చూస్తే..ఆదాయం 28 శాతం వృద్ధి చెంది రూ. 1,155 కోట్లకు పెరిగింది.

బుధవారం బీఎస్ఈలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ షేరు 1 శాతం పెరిగి రూ. 5,476 వద్ద ముగిసింది.

టెక్ మహీంద్రా లాభం 38% డౌన్

తొలి త్రైమాసికంలో రూ. 692 కోట్లు



ముంబై: మార్జిన్లు గణనీయంగా కుదించుకుపోవడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఐటీ సేవల దిగ్గజం టెక్ మహీంద్రా నికర లాభం 38 శాతం క్షీణించి రూ. 692 కోట్లకు పరిమితమైంది. గత క్యూ1లో ఇది రూ. 1,132 కోట్లు. ఇక ఆదాయం రూ. 13,159 కోట్ల నుంచి స్వల్పంగా 3.5 శాతం వృద్ధి చెంది రూ. 13,718 కోట్లకు చేరింది. గత అయిదేళ్లలో చూసిన అత్యంత కఠినమైన క్వార్టర్లలో ఈ త్రైమాసికం ఒకటని సీఈవో, ఎండీ బాధ్యతల నుంచి తప్పుకుంటున్న సీపీ గుర్నానీ తెలిపారు. కీలకమైన కమ్యూనికేషన్స్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ (సీఎంఈ) విభాగం పనితీరు .. ఆర్థిక ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపినట్లు పేర్కొన్నారు. అయితే, వచ్చే త్రైమాసికంలో పరిస్థితులు మెరుగుపడగలవని ఆయన అభిప్రాయపడ్డారు. మధ్యకాలికం నుంచి దీర్ఘకాలికంగా కంపెనీ వ్యాపార వృద్ధి అవకాశాలు ఆశావహంగా ఉన్నాయని కొత్త సీఈవో, ఎండీగా చేరిన మోహిత్ జోషీ ధీమా వ్యక్తం చేశారు. క్యూ1లో టెక్ మహీంద్రా ఐటీ సేవల పరిశ్రమలోనే అత్యంత తక్కువగా 6.8 శాతం నిర్వహణ లాభాన్ని నమోదు చేసింది. గత క్యూ1లో ఇది 11 శాతంగా ఉండగా, క్రితం త్రైమాసికంలో 11.2 శాతంగా ఉంది.

క్యూ1లో మరిన్ని కీలకాంశాలు..

- సీఎంఈ విభాగం ఆదాయం 8.2% క్షీణించింది. బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా), రిటైల్, రవాణా విభాగాలూ మందగించాయి.
- నికర కొత్త డీల్స్ పరిమాణం 802 మిలియన్ డాలర్ల నుంచి 359 మిలియన్ డాలర్లకు తగ్గింది.
- మొత్తం ఉద్యోగుల సంఖ్య 6 శాతం తగ్గి 1.48 లక్షలకు పరిమితమైంది. అయితే అట్రిషన్ రేటు (ఉద్యోగుల వలసలు) 23 శాతం నుంచి 13 శాతానికి దిగి వచ్చింది.

బీఎస్ఈలో టెక్ మహీంద్రా షేరు సుమారు 1 శాతం క్షీణించి రూ. 1,144 వద్ద క్లోజయ్యింది.

బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో కొనుగోళ్లు

- మూడు రోజుల తర్వాత లాభాలు
- అధిక వెయిటేజీ షేర్ల అండ
- సెన్సెక్స్ లాభం 351 పాయింట్లు
- మళ్లీ 19,750 పైకి నిఫ్టీ



ముంబై: బ్యాంకింగ్, ఇంధన, క్యాపిటల్ గూడ్స్ షేర్లకు బలమైన కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు మూడు రోజుల నష్టాల నుంచి గట్టెక్కాయి. ఇండెక్సుల్లోని అధిక వెయిటేజీ రిలయన్స్, ఎల్‌అండ్‌టీ, ఐటీసీ, ఇన్ఫోసిస్ షేర్లు రాణించడం కలిసొచ్చింది. ఉదయం సెన్సెక్స్ 79 పాయింట్ల లాభంతో 66,435 వద్ద, నిఫ్టీ 52 పాయింట్లు పెరిగి 19,733 వద్ద మొదలయ్యాయి. ఆటో మినహా అన్ని రంగాల షేర్లకు డిమాండ్ నెలకొనడంతో సూచీలు స్థిరంగా ముందుకు కదిలాయి. ఒక దశలో సెన్సెక్స్ 541 పాయింట్లు దూసుకెళ్లి 66,897 వద్ద, నిఫ్టీ 145 పాయింట్లు ర్యాలీ చేసి 19,826 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని నమోదు చేసాయి. ట్రేడింగ్ చివర్లో కొంత అమ్మకాల ఒత్తిడి నెలకొనడంతో సూచీల లాభాలు కొంతమేర తగ్గాయి. చివరికి సెన్సెక్స్ 351 పాయింట్లు పెరిగి 66,707 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 98 పాయింట్లు ఎగసి 19,778 వద్ద నిలిచింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.923 కోట్ల షేర్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.470 కోట్ల షేర్లను కొన్నారు. అమెరికా ఫెడ్ రిజర్వ్ ద్రవ్య విధాన వైఖరికి ముందు ఆసియా, యూరప్ మార్కెట్లు బలహీనంగా ట్రేడయ్యాయి. అమెరికా స్టాక్ ఫ్యూచర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ 13 పైసలు పతనమై 82.01 స్థాయి వద్ద స్థిరపడింది. క్రూడాయిల్ ధరలు పెరగడం, నెలాఖరు నేపథ్యంలో దిగుమతిదారులను డాలర్‌కు డిమాండ్ నెలకొనడం దేశీయ కరెన్సీ బలహీనతకు కారణమయ్యాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- ప్రోత్సాహకరమైన ఫలితాల నేపథ్యంలో ఎల్‌అండ్‌టీ షేరు 3.5% లాభపడి రూ.2646 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో నాలుగుశాతానికి పైగా ఎగిసి రూ.2,674 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- టాటా మోటార్స్ షేరు ట్రేడింగ్‌లో 4% ర్యాలీ చేసి రూ.665 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. చివర్లో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో 0.18% లాభంతో రూ.641 వద్ద స్థిరపడింది.
- తొలి త్రైమాసికంలో లాభం 4 రెట్లు వృద్ధి చెందడంతో పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) 4% పెరిగి రూ.63 వద్ద ముగిసింది. ట్రేడింగ్ లో 5% పెరిగి రూ.64 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.

అభిరుచితో.. అవకాశాలు!

ఉజ్వల కెరీర్ సొంతం చేసుకోవాలంటే.. డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు కావడం మినహా మరో మార్గం లేదని భావించే రోజులు పోయాయి. మెడిసిన్, ఇంజనీరింగ్ రంగాలకు దీటుగా ఆఫ్‌బీట్ కెరీర్స్ అందుబాటులోకొచ్చాయి. ఈవెంట్ ప్లానర్, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్, వీడియో గేమ్ డిజైనర్, పర్సనల్ ఫిట్‌నెస్ ట్రైనర్, టీ టేస్టర్ వంటి వినూత్న కెరీర్‌లు యువతకు ఆహ్వానం పలుకుతున్నాయి. హాబీతోనే అద్భుత అవకాశాన్ని అందిస్తున్న పలు ఆఫ్‌బీట్ కెరీర్స్ గురించి తెలుసుకుందాం...

ఆఫ్‌బీట్ కెరీర్స్

ఈవెంట్ ప్లానర్

సృజనాత్మకత, నిర్వహణ నైపుణ్యాలున్నవారు ఈవెంట్ ప్లానర్ కెరీర్‌ను ఎంచుకోవచ్చు. వీరు క్లయింట్ బడ్జెట్, ప్రాధాన్యత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని వివాహాలు, పుట్టినరోజు పార్టీలు, కార్పొరేట్ ఈవెంట్‌లను నిర్వహిస్తారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీలో ఫుల్‌టైమ్ ప్లానర్‌గా లేదా క్లయింట్‌ల కోసం ఫ్రీలాన్స్ ఈవెంట్ ప్లానర్‌గా పని చేయవచ్చు.

- **విద్యార్హతలు:** ఈవెంట్ మేనేజ్‌మెంట్, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, పబ్లిక్ రిలేషన్స్ లేదా సంబంధిత రంగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉండాలి.
- **కావాల్సిన నైపుణ్యాలు:** ఆర్గనైజింగ్, నెట్‌వర్కింగ్, సహనం, సమస్య పరిష్కారం, కమ్యూనికేషన్, సృజనాత్మకత తదితర స్కిల్స్ తప్పనిసరి.

టీ టేస్టర్

చాలామంది టీ తాగుతారు. కానీ టీ రుచి చూడటాన్ని కూడా కెరీర్‌గా మలచుకోవచ్చని చాలా తక్కువ మందికే తెలుసు. పేరులో ఉన్నట్లుగానే టీ టేస్టర్‌లు వివిధ రకాల టీలను రుచి చూడటం, నాణ్యతను అంచనా వేయడం, నమూనాలు తీసుకుని టీలను వేరు చేయడంలో నైపుణ్యం కలిగి ఉంటారు. తయారీ కంపెనీలు,ఫైవ్ స్టార్ ప్రాపర్టీలు, టీ బోర్డ్ ఆఫ్ ఇండియాల్లో వీరికి మంచి అవకాశాలుంటాయి.టీ మిశ్రమాలను రూపొందించడంలో, కొత్త రకాలను ఉత్పత్తి చేయడంలో అనుభవం ద్వారా టీ టేస్టింగ్ కన్సల్టెన్సీ సేవలు సైతం అందించొచ్చు.

- **విద్యార్హతలు:** ఫుడ్ సైన్స్, అగ్రికల్చర్, హార్టికల్చర్‌లో బ్యాచిలర్ డిగ్రీ. లేదా టీ రుచి,నాణ్యత, రకాలు, మార్కెటింగ్‌లో డిప్లొమా కోర్సు ఉండాలి.
- **కావాల్సిన నైపుణ్యాలు:** కచ్చితంగా అంచనా వేయగల సామర్థ్యం, విశేషమైన రుచిని పసిగట్టే నైపుణ్యాలు, అద్భుతమైన కమ్యూనికేషన్ స్కిల్స్, టీ పరిశ్రమపై పరిజ్ఞానం ఉండాలి.

పర్సనల్ ఫిట్‌నెస్ ట్రైనర్

ఫిట్‌నెస్, ఆరోగ్యం పట్ల మక్కువ ఉన్నవారికి ఈ కెరీర్ నిస్సందేహంగా సరైనదే. ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంభించాలనుకునే వ్యక్తులకు పర్సనల్ ఫిట్‌నెస్ ట్రైనర్‌లు.. వ్యాయామం, ఆహార ప్రణాళికలను రూపొందిస్తారు. ఇవి వారి ఫిట్‌నెస్ లక్ష్యాలను సాధించేందుకు తోడ్పడతాయి. జిమ్‌లు, ఆరోగ్య కేంద్రాలు, కార్పొరేట్ సెటప్‌లు, ప్రైవేట్ గృహాల్లో ఫిట్‌నెస్ ట్రైనర్‌లకు విస్తృత అవకాశాలున్నాయి. ఆన్‌లైన్ వ్యాయామ పాఠాలు, పోషకాహార సూచనలు అందిస్తూ.. ఇంటి నుంచే నచ్చిన వేళల్లో పనిచేయొచ్చు.

- **విద్యార్హతలు:** న్యూట్రిషన్, ఫిట్‌నెస్‌లో డిప్లొమా లేదా సంబంధిత విభాగంలో సర్టిఫికేషన్ కోర్సు ఉండాలి.
- **నైపుణ్యాలు:** కమ్యూనికేషన్, ఆరోగ్యకరమైన జీవనశైలి, ఫిట్‌నెస్, న్యూట్రిషన్‌పై పరిజ్ఞానం, మోటివేషన్ తదితర నైపుణ్యాలు తప్పనిసరి.

వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్

ట్రావెలింగ్, ఫొటోగ్రఫీలపై ఆసక్తి ఉన్నవారు వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా కెరీర్ ఎంచుకోవచ్చు. ఈ ఫొటోగ్రఫీలో భాగంగా వివిధ దేశాల్లో మొక్కలు, జంతువులు, ప్రకృతి దృశ్యాలను కెమెరాతో చిత్రీకరించడానికి అనేక ప్రదేశాలకు ప్రయాణించాల్సి ఉంటుంది. కెమెరా లెన్స్ ద్వారా తీసిన చిత్రాలతో వీక్షకుల్లో అనేక రకాల భావోద్వేగాలను రేకెత్తించగలుగుతారు. చాలామంది వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రాఫర్‌లు ఫ్రీలాన్సర్‌లుగా పని చేస్తారు. వన్యప్రాణుల కంటెంట్‌ను ప్రచురించే/ప్రసారం చేసే మీడియాలో ఫుల్‌టైమ్ ఉద్యోగిగా కూడా అవకాశాలు అందుకోవచ్చు.

- **విద్యార్హతలు:** ఫొటోగ్రఫీ, మెరైన్, నేచురల్ ఫొటోగ్రఫీలో బ్యాచిలర్ డిగ్రీ లేదా ప్రొఫెషనల్ ఫొటోగ్రఫీ, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీలో సర్టిఫికేషన్ కోర్సు ఉండాలి.
- **నైపుణ్యాలు:** వైల్డ్‌లైఫ్, ప్రకృతి పట్ల మక్కువ, ఫొటోగ్రఫీలో బలమైన సాంకేతిక నైపుణ్యాలు, అత్యంత సహనం ఉండాలి.

వీడియో గేమింగ్

ఎక్కువగా వీడియో గేమ్‌లు ఆడేవారు, వీడియోగేముల్లోని సృజనాత్మకతకు ముగ్ధులై, వాటిపట్ల ఆసక్తి పెంచుకునేవారు వీడియోగేమర్‌గా తమ కెరీర్‌ను మలచుకోవచ్చు. అధునాతన గేమింగ్ టెక్నాలజీలతో కథ చెప్పే కళను మిళితం చేయగలిగితే గేమింగ్ ప్రపంచంలో దూసుకెళ్లొచ్చు. నిరంతరం నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా గేమింగ్ పోటీ ప్రపంచంలో అవకాశాలను మెరుగుపరచుకోవచ్చు.

- **విద్యార్హతలు:** కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ లేదా గేమ్ డిజైనింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ లేదా డిప్లొమా ఉండాలి.
- **నైపుణ్యాలు:** సృజనాత్మకత, సమస్య–పరిష్కార నైపుణ్యాలు, సహకరణ సామర్థ్యం, సమయ నిర్వహణ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ప్రోగ్రామింగ్ నైపుణ్యాలు.

మేనేజ్‌మెంట్ పీజీకి మార్గం.. మ్యాట్!

మేనేజ్‌మెంట్ అప్టిట్యూడ్ టెస్ట్.. సంక్షిప్తంగా మ్యాట్! మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి చక్కటి మార్గంగా నిలుస్తోంది.. మ్యాట్!! ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ) నిర్వహించే ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగా.. జాతీయ స్థాయిలోని ప్రముఖ బిజినెస్ స్కూల్స్‌లో.. మేనేజ్‌మెంట్ పీజీ ప్రోగ్రామ్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు! ఏఐఎంఏ-మ్యాట్‌ను ఏటా నాలుగుసార్లు.. ఫిబ్రవరి, మే, సెప్టెంబర్, డిసెంబర్ నెలల్లో నిర్వహిస్తుంది. 2023, సెప్టెంబర్ సెషన్‌కు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. మ్యాట్‌తో ప్రయోజనాలు, రాత పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, విజయానికి ప్రిపరేషన్ టిప్స్...



ఎంబీఏ స్పెషల్

- మ్యాట్ స్కోర్‌తో మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలు
- ఏఐఎంఏ ఆధ్వర్యంలో మ్యాట్ పరీక్ష నిర్వహణ
- సెప్టెంబర్ 2023 సెషన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
- అందుబాటులో వందకు పైగా బి–స్కూల్స్

ఎంబీఏ లేదా మేనేజ్‌మెంట్ పీజీ అనగానే విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఐసెట్, జాతీయ స్థాయిలో క్యాట్‌పైనే దృష్టి పెడతారు. కాని మేనేజ్‌మెంట్ కోర్సుల అభ్యర్థులకు అందుబాటులో ఉన్న మరో చక్కటి అవకాశం.. మ్యాట్. ఐసెట్, క్యాట్ ప్రిపరేషన్‌లతోనే మ్యాట్‌కు కూడా హాజరయ్యే అవకాశం ఉంది.తద్వారా జాతీయ స్థాయిలో ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశాలకు మార్గం సుగమం చేసుకోవచ్చు.

ఏఐఎంఏ

ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ).. మేనేజ్‌మెంట్ విభాగానికి సంబంధించి నైపుణ్య శిక్షణ కార్యకలాపాలను నిర్వహించే సంస్థ. భవిష్యత్తు మేనేజ్‌మెంట్ లీడర్లను తీర్చిదిద్దాలనే సంకల్పంతో 1998లో మేనేజ్‌మెంట్ అప్టిట్యూడ్ టెస్ట్‌కు శ్రీకారం చుట్టింది. ఈ పరీక్ష విధానంలో పాటిస్తున్న ప్రమాణాలను పరిగణనలోకి తీసుకున్న పలు బిజినెస్ స్కూల్స్.. మ్యాట్ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పించేందుకు సిద్ధమయ్యాయి. తాజా ప్రకటనలో 94 ఇన్‌స్టిట్యూట్స్‌నే పేర్కొన్నప్పటికీ.. ఈ స్కోర్‌తో మరెన్నో విద్యాసంస్థలు ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

అర్హత

- బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

మూడు విధానాల్లో పరీక్ష

- మ్యాట్ సెప్టెంబర్ సెషన్‌ను మూడు విధానాల్లో నిర్వహించనున్నారు. అవి..
- **పేపర్ బేస్డ్ టెస్ట్:** అభ్యర్థులు నిర్దేశిత తేదీలో పరీక్ష కేంద్రంలో ఓఎంఆర్ షీట్ పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుంది.
- **ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్:** నిర్దేశిత తేదీల్లో.. పరీక్ష కేంద్రాల్లో ఆన్‌లైన్ టెస్ట్‌కు హాజరవ్వాల్సి ఉంటుంది.
- **ఇంటర్నెట్ బేస్డ్ టెస్ట్:** ఈ విధానంలో అభ్యర్థులు నిర్దేశిత తేదీల్లో ఇంటర్నెట్ ఆధారంగా.. తమకు అనుకూలమైన చోటు నుంచే పరీక్షకు హాజరుకావచ్చు.
- ఈ మూడు విధానాల్లో ఏ విధానంలో పరీక్షకు హాజరవ్వాలనుకుంటున్నారో అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే పేర్కొనాల్సి ఉంటుంది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఇంటర్నెట్ బేస్డ్ టెస్ట్‌లకు నిర్దిష్టంగా ఏఐఎంఏ తేదీలను ప్రకటిస్తుంది. వాటిని పరిశీలించి తమకు అనుకూలమైన తేదీ, స్లాట్‌ను కూడా దరఖాస్తు సమయంలోనే పేర్కొనాల్సి ఉంటుంది. సెప్టెంబర్ సెషన్‌కు సంబంధించి ఆయా తేదీలను కూడా ప్రకటించారు.

అయిదు విభాగాలు.. 200 మార్కులు

మ్యాట్ పరీక్ష మొత్తం అయిదు విభాగాల్లో 200 మార్కులకు నిర్వహిస్తారు. లాంగ్వేజ్ కాంప్రహెన్షన్ 40 ప్రశ్నలు–40 మార్కులు, ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, మ్యాథమెటికల్ స్కిల్స్ 40 ప్రశ్నలు–40 మార్కులు, డేటాఅనాలిసిస్ అండ్ సఫిషియన్సీ 40 ప్రశ్నలు–40 మార్కులు, ఇండియన్ అండ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ 40 ప్రశ్నలు–40 మార్కులు.. ఇలా మొత్తం 200 ప్రశ్నలు–200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం 150 నిమిషాలు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. ప్రతి తప్పు సమాధానానికి నాలుగో వంతు మార్కును తగ్గిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **పేపర్ బేస్డ్ టెస్ట్ దరఖాస్తు చివరి తేదీ:** 29.08.2023
- **పేపర్ బేస్డ్ టెస్ట్ తేదీ:** 03.09.2023
- **కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ దరఖాస్తు చివరి తేదీ:** 12.09.2023
- **కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ తేదీలు:** 17.09.2023
- **ఇంటర్నెట్ బేస్డ్ టెస్ట్ దరఖాస్తు చివరి తేదీ:** 17.08.2023
- **ఇంటర్నెట్ బేస్డ్ టెస్ట్ పరీక్ష తేదీ:** 20.08.2023
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://mat.aima.in

మెరుగైన స్కోర్ ఇలా

మ్యాట్‌లో మెరుగైన స్కోర్‌కు అభ్యర్థులు విభాగాల వారీగా దృష్టి పెట్టాల్సిన అంశాలు..

లాంగ్వేజ్ కాంప్రహెన్షన్

ఈ విభాగంలో రాణించేందుకు అభ్యర్థులు ఇంగ్లిష్ నైపుణ్యాలపై దృష్టి పెట్టాలి. స్పీడ్ రీడింగ్‌తో పాటు ఒక అంశాన్ని చదువుతున్నప్పుడే.. అందులోని కీలక అంశాలను గుర్తించే నైపుణ్యం సొంతం చేసుకోవాలి. పంక్చుయేషన్స్ నుంచి ప్యాసేజ్ మెయిన్ కాన్సెప్ట్ వరకూ.. అన్నింటిపై అవగాహన ఏర్పరచుకోవాలి.

అర్థాలు, సమానార్థాలు, ఫ్రేజెస్, వర్డ్ యూసేజ్, సెంటెన్స్ ఫార్మేషన్స్‌లపై ప్రధానంగా దృష్టి పెట్టాలి. వీటితోపాటు వొకాబ్యులరీపైనా పట్టు సాధించాలి. ఫలితంగా ఆయా ప్యాసేజ్‌ల్లోని పదజాలాన్ని వేగంగా అర్థం చేసుకుని నిర్దేశిత సమయంలో సమాధానాలిచ్చే నైపుణ్యం లభిస్తుంది. దీంతోపాటు ఒక అంశాన్ని విశ్లేషణాత్మకంగా చదవడం అలవర్చుకోవాలి. చదివేటప్పుడు అందులోని ముఖ్య సమాచారం, ప్రశ్నార్థమైన అంశాలు, కీలక పదాలు గుర్తించే నేర్పు సొంతం చేసుకోవాలి. అందుకోసం ఇంగ్లిష్ దినపత్రికల్లోని ఎడిటోరియల్స్, ఇతర వ్యాసాలు చదవాలి.

ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్

ఈ విభాగంలో ప్రశ్నలు స్వీయ విశ్లేషణ, సూక్ష్మ పరిశీలన ఆధారంగా సమాధానం రాబట్టేవిగా ఉంటాయి. కాబట్టి సమాచారాన్ని సునిశితంగా పరిశీలించడం, పోలికలు, భేదాలు వంటి వాటిని గుర్తించే నైపుణ్యం ఉండాలి.

మ్యాథమెటికల్ స్కిల్స్

దీనికి సంబంధించి అభ్యర్థులు పదో తరగతి స్థాయి మ్యాథమెటిక్స్ టాపిక్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ప్రాబబిలిటీ, పెర్ముటేషన్స్/కాంబినేషన్స్, నెంబర్స్, అల్‌జీబ్రా, జామెట్రీ విభాగాలపై దృష్టి పెట్టాలి. ఫార్ములా బేస్డ్ ప్రశ్నల సాధనకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రస్తుత సమయంలో సబ్జెక్ట్ ప్రిపరేషన్‌తోపాటు ఆయా సెక్షన్లలో ప్రీవియస్ ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి.

డేటా అనాలిసిస్ అండ్ సఫిషియన్సీ

ఈ విభాగంలోని ప్రశ్నలు.. గ్రాఫ్‌లు, ప్యాసేజ్‌లను పేర్కొని అందులో సమాచారం, గణాంకాల ఆధారంగా విశ్లేషించాల్సినవిగా ఉంటాయి. కాబట్టి ఆయా కాన్సెప్ట్‌లపై అవగాహన పెంచుకోవాలి. పర్సంటేజెస్, యావరేజెస్‌పై పట్టు సాధించాలి. ఇందుకోసం ఏదైనా ప్రామాణిక మెటీరియల్ లేదా ఆన్‌లైన్ టెస్ట్‌లోని ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇక్కడ కేవలం ఒకే తరహా ప్రశ్నలు కాకుండా.. విభిన్న క్లిష్టతతో కూడిన సమస్యలను సాధించడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అదే విధంగా ఫ్లో చార్ట్‌లు, డయాగ్రమ్ ఆధారిత ప్రాబ్లమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.

ఇండియన్ అండ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్

ఈ విభాగంలో మంచి స్కోర్ కోసం సమకాలీన అంశాలపై దృష్టి సారించాలి. అదే విధంగా స్టాక్ జీకేపైనా పట్టు సాధించాలి. సమకాలీనంగా ప్రాధాన్యం సంతరించుకున్న జాతీయ, అంతర్జాతీయ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా ఆర్థిక, వ్యాపార, వాణిజ్య రంగాలకు సంబంధించిన తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.

క్లుప్తంగా...

ఎంబీబీఎస్ ప్రవేశాలకు నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు



సాక్షి, అమరావతి: 2023–24 విద్యా సంవత్సరానికి కన్వీనర్ కోటా ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తు గడువును నేటి (27న) సాయంత్రం 6 గంటల వరకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ పొడిగించింది. ఈ నెల 20 నుంచి దరఖాస్తుల స్వీకరణను ప్రారంభమైంది. అప్లికేషన్ కోసం https:// ugcq. ysuhs. com ను సందర్శించాలని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి బుధవారం తెలిపారు.

'ఆయుష్' అభ్యర్థుల తుది జాబితా విడుదల

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆయుష్ శాఖలో లెక్చరర్/అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఆయుర్వేదం) పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్టు ఏపీపీఎస్సీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించగా తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థులకు జూన్, జూలైలో సర్టిఫికెట్ల ధ్రువీకరణ నిర్వహించారు. తాజాగా ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను విడుదల చేశారు.

27 నుంచి ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు



సాక్షి, అమరావతి: ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ కేవీ శ్రీనివాసులు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 27 నుంచి ఆగస్ట్ 31లోగా www. apopenschool. ap. gov. in లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28న ఏపీలోని అన్ని జిల్లాల్లో ఏపీవోఎస్ఎస్ అడ్మిషన్ల ప్రక్రియపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 31 నుంచి ఆగస్ట్ 5 వరకు ప్రవేశాలపై జిల్లా అధికారులు, అధ్యయన కేంద్రాల నిర్వాహకులతో విస్తృత అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డీఈవోలను ఆదేశించారు.

విశాఖ పోర్టులో ట్రైనీ ఐఏఎస్‌ల బృందం



ట్రైనీ ఐఏఎస్‌ల బృందంతో పోర్టు డిప్యూటీ చైర్మన్ దూబే

సాక్షి, విశాఖపట్నం: స్టడీ టూర్‌లో భాగంగా పది మంది సభ్యులతో కూడిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందం విశాఖపట్నంలో పర్యటించింది. బుధవారం విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ)ని సందర్శించిన బృందానికి పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోర్టులో జరుగుతున్న ఎగుమతి, దిగుమతి కార్యకలాపాలు, అభివృద్ధి పనులు, యాంత్రీకరణ, ఆధునీకీకరణ, పర్యావరణ పరిరక్షణ కోసం చేపడుతున్న కార్యకలాపాలు, కవర్డ్ స్టోరేజీ యార్డు నిర్మాణం పనులను పరిశీలించారు. అదేవిధంగా సోలార్ పవర్, క్రూయిజ్ టెర్మినల్ నిర్మాణం తదితర పనుల గురించి డిప్యూటీ చైర్మన్ దూబే ట్రైనీ ఐఏఎస్‌ల బృందానికి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

కార్గిల్ వీర జవాన్లకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న వైస్ అడ్మిరల్ సంజయ్ వాత్సయన్

బీచ్‌రోడ్డు: కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్లకు తూర్పు నావికాదళం ఘనంగా నివాళులర్పించింది. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఆర్.కె.బీచ్‌లో ఉన్న విక్టరీ ఎట్ సీ మెమోరియల్ వద్ద చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ వాత్సయన్ బుధవారం అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి అంజలి ఘటించారు. ముందుగా నేవీ సిబ్బంది కవాతు నిర్వహించారు. అనంతరం సైనిక కవాతుతో పుష్పాంజలి ఘటించారు. నేవీ ఫౌండేషన్ అధ్యక్షుడు వీకే నంబాళ్లు, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి సత్యానందం పాల్గొన్నారు.


ఈడీ విచారణకు ఎంపీ మాగుంట

సాక్షి న్యూఢిల్లీ:ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) విచారణకు హాజరయ్యారు. బుధవారం ఢిల్లీలోని ఈడీ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు మూడు గంటలపాటు జరిగిన విచారణలో ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించి ఈడీ అధికారులు పలు ప్రశ్నలు అడిగినట్టు సమాచారం.

అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ విద్యుత్ సబ్సిడీ

ఎస్సీ, ఎస్టీ గృహ విద్యుత్ వినియోగదారులకు రాయితీల్లో ఏ తగ్గింపూ లేదు

- ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ ప్రయోజనాన్ని రెట్టింపు చేసిన సీఎం వైఎస్ జగన్
- సబ్సిడీ పరిమితి 100 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంపు
- విద్యుత్ సబ్సిడీలో మూడింతలు పెరుగుదల
- అయినా నిజాలు దాచి 'ఈనాడు' తప్పుడు కథనం



పాడిందే పాడరా.. అన్నట్టు పాసిపోయినా అబద్ధమైతే చాలు ఈనాడుకు మహా ఇష్టం. అదే అబద్ధాన్ని ప్రచారం చేస్తే నిజమైపోతుందనే భ్రమలో ఉన్నారు రామోజీ. 'ఎస్సీ ఎస్టీల బతుకుల్లో జగనన్న కారు చీకట్లు' అంటూ అలవాటు ప్రకారం గతంలో అనేకసార్లు రాసిన అసత్యాల కథనాన్నే మరోసారి అచ్చేసింది. పాసిపోయిన తప్పుడు సమాచారాన్నే మళ్లీ వడ్డించింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే ఎస్సీ, ఎస్టీల జీవితాల్లో విద్యుత్ వెలుగులు ప్రసరిస్తున్నాయని విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు స్పష్టం చేశాయి. ఈనాడు రాసిన అసత్య కథనంలోని వాస్తవాలను వెల్లడించాయి. డిస్కంలు తెలిపిన వివరాల ప్రకారం..

గతం కంటే 3 రెట్లు ఎక్కువ

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సీ కాలనీల్లో, ఎస్టీ ప్రాంతాల్లో నివసిస్తున్న అర్హులైన వారందరికీ ఉచిత గృహ విద్యుత్ పరిమితిని 100 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంచింది. గత ప్రభుత్వం ఇస్తున్న ఉచిత విద్యుత్తుకంటే రెట్టింపు యూనిట్లు అధికంగా అందిస్తోంది. అర్హతనే ప్రామాణికంగా తీసుకుని వినియోగదారులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తోంది. వినియోగదారుల ధ్రువీకరణ పత్రాలను డిస్కంల క్షేత్రస్థాయి సిబ్బంది పరిశీలించి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఈ ప్రయోజనాన్ని అందిస్తున్నారు. అర్హత ఉన్న ఒక్కరికి కూడా తిరస్కరించలేదు. ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న విద్యుత్ సబ్సిడీ కూడా గత ప్రభుత్వంతో పోలిస్తే దాదాపు మూడు రెట్లు పెరిగింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018–19లో దీని కోసం రూ.235 కోట్లు ఖర్చు చేస్తే, ఈ ప్రభుత్వం రూ.637 కోట్లు ఖర్చు చేస్తుండటమే దీనికి నిదర్శనం. అర్హత కలిగిన ఎవరికీ ఈ విద్యుత్ రాయితీ ఎత్తివేయలేదు. సాంకేతిక తప్పిదాలు, క్షేత్రస్థాయి వాస్తవాలలో తేడాలేమైనా ఉంటే డిస్కంల స్థానిక అధికారుల దృష్టికి తీసుకు వస్తే తప్పకుండా సరిదిద్ది అర్హత కలిగిన వారికి లబ్ధి చేకూర్చడం జరుగుతోంది. ఎవరికైనా రాయితీ అందకపోతే గ్రామ, వార్డు సచివాలయాలను సంప్రదించాలి. అక్కడున్న సిబ్బంది అర్హులకు దరఖాస్తు నింపడంలో, అవసరమైన ధ్రువపత్రాల జారీలోనూ సహాయపడతారు. వాస్తవాలు ఇలా ఉంటే.. వైఎస్ జగన్ ప్రభుత్వంపై బురద జల్లేలా, ప్రజలను పక్కదోవ పట్టించేలా నిజాలను దాచి ఈనాడు పత్రిక అబద్ధాలను అచ్చేసింది.



– సాక్షి, అమరావతి

ఎన్‌ఈపీ అమలులో అగ్రస్థానంలో ఏపీ

- కేంద్రీయ గిరిజన వర్సిటీ వైస్ చాన్సలర్ కట్టిమని
- ఉద్యోగ అవకాశాలు లక్ష్యంగా బోధన



మాట్లాడుతున్న కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ కట్టిమని

విశాఖ విద్య: జాతీయ విద్యా విధానం(ఎన్‌ఈపీ) అమలులో ఆంధ్రప్రదేశ్.. దేశంలోనే అగ్రస్థానంలో ఉందని కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ టీవీ కట్టిమని అన్నారు. విశాఖపట్నంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ(శ్రీకాకుళం) వీసీ నిమ్మ వెంకటరావు, జేఎన్‌టీయూ(విజయనగరం) వీసీ బి.వెంకట సుబ్బయ్య, ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ డైరెక్టర్ శాలివాహన్, ఐఐఎం ప్రతినిధి ఆచార్య షమీమ్ జావేద్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో పాలసీలు తీసుకువచ్చేది కేంద్ర ప్రభుత్వమే అయినప్పటికీ.. భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని వాటిని విజయవంతంగా అమలు చేసేది రాష్ట్ర ప్రభుత్వాలే అని చెప్పారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఆ దిశగా ముందుకు అడుగులు వేస్తోందన్నారు. జాతీయ విద్యా విధానం వల్ల విద్యార్థులు తమ అభిరుచి మేరకు కోర్సులను ఎంపిక చేసుకునే స్వేచ్ఛ లభించిందన్నారు. యువతలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేలా చదువులు సాగుతున్నాయని వివరించారు. పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానిక యువతకు కేటాయించడం, విద్యాలయాలను పరిశ్రమలకు అనుసంధానం చేయడం వంటి చర్యలు విద్యార్థులకు భరోసాగా నిలుస్తున్నాయని చెప్పారు. ఉన్నత విద్యకు పాఠశాల స్థాయిలోనే పటిష్ట పునాది వేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. ఉద్యోగ అవకాశాలు లక్ష్యంగా బోధన సాగుతోందన్నారు. గిరిజన యూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం 561 ఎకరాల భూమి కేటాయించిందని.. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా నిర్మాణాలు పూర్తి చేసిన అనంతరం నూతన క్యాంపస్‌కు వెళ్తామని వీసీ కట్టిమని తెలిపారు. అనంతరం జాతీయ విద్యావిధానం ప్రయోజనాలపై గిరిజన వర్సిటీ రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

సన్నద్ధతను తెలియజేయండి

- నాడు–నేడు రెండో దశ స్కూళ్లకు విద్యా శాఖ ఆదేశం

సాక్షి, అమరావతి: మన బడి నాడు–నేడు రెండో దశ స్కూళ్ల మరమ్మతుల పనులన్నీ పూర్తయ్యి పెయింటింగ్‌కు, తాగునీటి పరికరాలు, స్మార్ట్ టీవీలు అమర్చడానికి సిద్ధంగా ఉన్న స్కూళ్ల ఫొటోలను వెంటనే అప్‌లోడ్ చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారులు, అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్లకు పాఠశాల విద్యా శాఖ స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిషనర్ కాటంనేని భాస్కర్ ఆదేశాలు జారీ చేశారు. కొందరు ప్రధానోపాధ్యాయులు స్కూళ్ల సన్నద్ధతను సరిగ్గా పట్టించుకోవడం లేదని.. దీని వల్ల కంపెనీలు తమ మెటీరియల్స్‌తో వచ్చే సమయానికి ఆ స్కూళ్ల వద్ద ఇబ్బంది ఏర్పడుతోందని చెప్పారు. పరికరాలు అమర్చడానికి వచ్చిన సిబ్బంది.. పని పూర్తవ్వకుండా వెనుతిరుగుతున్నారని చెప్పారు. దీనివల్ల అదనపు చార్జీలు డిమాండ్ చేస్తున్నారని వివరించారు. ఈ పరిస్థితిని నివారించడానికి పెయింటింగ్ వేయడానికి, తాగునీటి పరికరాలు అమర్చడానికి, సీలింగ్ రిపేర్లు, స్మార్ట్ టీవీలు అమర్చడానికి వీలుగా పనులు పూర్తయిన స్కూళ్ల వివరాలను ఫొటోలతో సహా అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. స్కూళ్ల సన్నద్ధతపై సరిగ్గా ఫొటోలు అప్‌లోడ్ చేయని ప్రధానోపాధ్యాయుల నుంచి అదనపు చార్జీలను రికవరీ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాంటి పరిస్థితి తెచ్చుకోవద్దని హితవు పలికారు. అలాగే రూఫ్, సీలింగ్ ట్రీట్‌మెంట్‌కు సంబంధించిన ఫొటోలను ఐదు స్థాయిల్లో తీసి అప్‌లోడ్ చేయాలని ఆదేశాలిచ్చినా.. కొన్ని స్కూళ్లు ఫొటోలు అప్‌లోడ్ చేయడం లేదన్నారు. ఈ నెలాఖరులోగా ఆ ఫొటోలు అప్‌లోడ్ చేయకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాన్ని నాడు–నేడు రెండో దశలోని స్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు తెలియజేయాలని స్పష్టం చేశారు.

చిన్నారిపై లైంగిక దాడి కేసులో 20 ఏళ్లు జైలు

- తీర్పు చెప్పిన విశాఖలోని పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి
- ఏడాదిలోపే బాధిత కుటుంబానికి న్యాయం

విశాఖ లీగల్: ముక్కుపచ్చలారని చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.20,000 జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి జి.ఆనంది బుధవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. అలాగే బాధితురాలికి రూ.5 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు డి.సూరిబాబు (28) అల్లూరి జిల్లా చింతపల్లి మండలం రోలి తండా గ్రామ నివాసి. స్థానికంగా వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. బాధితురాలు (11) అదే ప్రాంతంలోని తోటమావిడి వీధిలో ఉంటున్నారు. బాధితురాలు తండ్రికి ఆరుగురు పిల్లలు. ఈ చిన్నారి రెండో కుమార్తె. గత ఏడాది జూలై 30వ తేదీన రాత్రి 9 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిందితుడు సూరిబాబు బాలిక ఇంటికి వచ్చాడు. ఆమె నోట్లో గుడ్డలు కుక్కి సమీపంలోని పనస తోటలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. తీవ్ర రక్తస్రావం, కడుపునొప్పితో బాధపడుతూ బాలిక ఇంటికి వచ్చింది. ఇదే విషయాన్ని ఆమె తన తండ్రికి చెప్పింది. జరిగిన దారుణాన్ని చూసిన తండ్రి తమ గ్రామానికి చెందిన ఆశ వర్కర్‌కి తెలియజేశారు. ఆశ వర్కర్ సమీప ప్రభుత్వ వైద్య కేంద్రానికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన పోలీసులు నిందితునిపై ఐపీసీ 376(1) 506 చట్టం కింద కేసు నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ 14 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు. చింతపల్లి డీఎస్పీ నేర అభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. ప్రభుత్వం బాధిత బాలికకు అన్ని విధాలా చేయూతనిచ్చి సహకారం అందించింది.

పోక్సో కోర్టు తీర్పు చరిత్రాత్మకం: జయశ్రీ

సాక్షి, అమరావతి: చిన్నారిపై లైంగికదాడి కేసులో విశాఖ పోక్సో కోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కర్రి జయశ్రీ తెలిపారు. దిశ స్ఫూర్తితో ఈ కేసు దర్యాప్తులో సమర్థవంతంగా వ్యవహరించిన పోలీసులను, ప్రాసిక్యూషన్ న్యాయవాదిని అభినందించారు. మహిళల రక్షణ, భద్రత పట్ల రాష్ట్ర ప్రభుత్వ సంకల్పాన్ని ఈ కేసు చాటిచెప్పిందని వివరించారు.

'సచివాలయ' పోలీసులకు విధులు అప్పగించం

- డీజీపీ ఇప్పటికే అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనర్లకు ఆదేశాలిచ్చారు
- హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం
- తదుపరి విచారణ ఆగస్టు 2కి వాయిదా

సాక్షి, అమరావతి :గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే మహిళా పోలీసులను పోలీసు శాఖలో సాధారణ విధులైన బందోబస్తు, శాంతిభద్రతల పరిరక్షణ తదితర వాటికి వినియోగించవద్దంటూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, డీఐజీలు, పోలీసు కమిషనర్లకు డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఇప్పటికే ఆదేశాలిచ్చారని, ఆ మేర ఓ మెమో కూడా జారీచేశారని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. మహిళా పోలీసులను పోలీసు విధులకు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని డీజీపీ ఆ మెమోలో పేర్కొన్నారని వివరించింది. చిన్నారులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం నిమిత్తం ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవడమే మహిళా పోలీసుల ప్రధాన బాధ్యత అని వివరించింది. అలాగే, ఆయా కేసుల దర్యాప్తు విషయంలో మహిళా పోలీసులు సహాయకారిగా ఉండాలన్న భాగాన్ని సంబంధిత జీఓ నుంచి తొలగించేందుకు సైతం నిర్ణయించామని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వం తరఫున హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ గుప్తా కౌంటర్ దాఖలు చేశారు. ఈ కౌంటర్‌ను పరిశీలించిన హైకోర్టు దీనికి తిరుగు సమాధానం ఇచ్చేందుకు పిటిషనర్లకు గడువునిచ్చింది. తదుపరి విచారణను ఆగస్టు 2కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గా ప్రసాదరావు, జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

జీఓ–2లో ఆ భాగం తొలగింపు

మహిళా సంరక్షణ కార్యదర్శులను మహిళా పోలీసులుగా పరిగణించడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలైన విషయం తెలిసిందే. వీటిపై విచారణ జరిపిన జస్టిస్ దుర్గాప్రసాదరావు ధర్మాసనం ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందులో భాగంగా హరీష్‌కుమార్ గుప్తా కౌంటర్ దాఖలు చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే మహిళా సంరక్షణ కార్యదర్శులను మహిళా పోలీసులుగా పరిగణించి, వారికి సాధారణ పోలీసులు నిర్వర్తించే బాధ్యత అప్పగిస్తారన్నది పిటిషనర్ల ఆందోళన మాత్రమేనని గుప్తా అందులో పేర్కొన్నారు. ఆయా కేసుల దర్యాప్తులో వారిని భాగస్వాములు చేయబోమని, వారికి ఆ విధులు అప్పగించే ఉద్దేశమేదీ ప్రభుత్వానికి లేదని తెలిపారు.

'మార్గదర్శి'పై బదిలీ పిటిషన్లు అన్నీ కలిపి విచారిస్తాం: సుప్రీం



సాక్షి, న్యూఢిల్లీ: మార్గదర్శి చిట్ ఫండ్స్‌పై దాఖలైన బదిలీ పిటిషన్లన్నింటినీ కలిపి విచారిస్తామని సుప్రీం కోర్టు పేర్కొంది. ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన బదిలీ పిటిషన్ బుధవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం ముందుకొచ్చింది. ఏపీ ప్రభుత్వం తరఫున ఏవోఆర్ మెహఫూజ్ నజ్కీ, మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి హాజరయ్యారు. పలు పిటిషన్లు వేరే ధర్మాసనం వద్ద ఉన్నాయని నజ్కీ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఆగస్టు 4న విచారించనున్నట్లు తెలిపారు. ఆయా పిటిషన్లు అన్నీ ఈ పిటిషన్‌తో జత చేయాలని మరో ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చిందని సింఘ్వి తెలిపారు. ఈ దశలో పిటిషన్లు అన్నీ ప్రస్తుత పిటిషన్‌తో జత చేస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణ ఆగస్టు 4కు వాయిదా వేసింది.

మళ్లీ వాయిదా కోరిన బాబు, నారాయణ

- తీవ్ర అభ్యంతరం తెలిపిన అదనపు ఏజీ
- అసైన్డ్ భూముల కేసులో విచారణ ఆగస్టు 2కి వాయిదా



సాక్షి, అమరావతి : రాజధాని అసైన్డ్ భూముల కొనుగోలు, బదలాయింపు వ్యవహారంలో నమోదైన కేసులను కొట్టేయాలంటూ తాము దాఖలు చేసిన వ్యాజ్యాల్లో విచారణ జరగకుండా వాయిదాల మీద వాయిదాలు కోరుతూ వస్తున్న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మాజీమంత్రి పొంగూరు నారాయణలు మరోసారి అదే పంథాను ఎంచుకున్నారు. తాము దాఖలు చేసిన వ్యాజ్యాలు బుధవారం విచారణకు రాగా, వాయిదా వేయాలని వారిరువురి తరఫు న్యాయవాదులు హైకోర్టును కోరారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి బాబు, నారాయణ లాయర్ల తీరుపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇప్పటికే పలుమార్లు వాయిదాలు కోరారన్నారు. దీంతో హైకోర్టు ఒకింత అసంతృప్తిగానే విచారణను ఆగస్టు 2కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. కాగా, రాజధాని అసైన్డ్ భూముల కొనుగోలు, బదలాయింపు వ్యవహారంలో మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా చంద్రబాబు, నారాయణలపై సీఐడీ అధికారులు 2021లో కేసు నమోదుచేశారు.

టీవీ ప్రసారాలకు సెన్సార్ లేకపోతే ఎలా?

- బిగ్ బాస్ షోపై విచారణలో హైకోర్టు స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: టీవీల్లో అసభ్య, అభ్యంతరకర రీతిలో రియాల్టీ షోలు, ఇతర కార్యక్రమాల ప్రసారానికి ముందు సెన్సార్ చేయకపోతే ఎలా అని హైకోర్టు ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై లోతుగా విచారణ జరుపుతామని, కేంద్రానికి తగిన సూచనలు చేసే విషయాన్ని పరిశీలిస్తామని తెలిపింది. టీవీ కార్యక్రమాల పర్యవేక్షణకు ఓ యంత్రాంగం లేకపోవడం సరికాదని వ్యాఖ్యానించింది. యువతను పెడదోవ పట్టిస్తున్న బిగ్‌బాస్ షో నిలిపివేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ సామాజిక కార్యకర్త, నిర్మాత కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఈ కేసులో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్, స్టార్ మా టీవీ ప్రైవేట్ లిమిటెడ్, ఎండేమోల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, బిగ్‌బాస్ షో వ్యాఖ్యాత, సినీ నటుడు అక్కినేని నాగార్జునకు నోటీసులు జారీ చేసింది. స్టార్ మా టీవీ తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి, బిగ్‌బాస్ షోను అభివృద్ధి చేసిన ఎండేమోల్ ఇండియా లిమిటెడ్ తరఫున సీనియర్ న్యాయవాది చిత్తరవు రఘు, పిటిషనర్ తరఫున గుండాల శివప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపించారు.

విశాఖకే బీసీసీఐ తొలి ప్రాధాన్యత

- ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి వెల్లడి




మాట్లాడుతున్న గోపీనాథ్ రెడ్డి

విశాఖ స్పోర్ట్స్: భారత్ హోం సిరీస్‌లో విశాఖకే బీసీసీఐ తొలి ప్రాధాన్యతనిచ్చిందని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథ్ రెడ్డి చెప్పారు. దీనిలో భాగంగానే వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లు భారత్‌తో తలపడనున్నాయని తెలిపారు. ఆయన బుధవారం విశాఖలో విలేకరులతో మాట్లాడారు. వరల్డ్ కప్ మ్యాచ్‌లు ముగియగానే ఆస్ట్రేలియా ఆడనున్న టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్ నవంబర్ 23న, ఫిబ్రవరి 2 నుంచి భారత్–ఇంగ్లండ్ జట్ల మధ్య టెస్ట్ మ్యాచ్‌ను విశాఖలో నిర్వహించేందుకు బీసీసీఐ షెడ్యూల్ ఖరారు చేసిందని వివరించారు. విశాఖలోని వైఎస్సార్ స్టేడియం ఇప్పటికే అన్ని ఫార్మాట్ మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిందని, ఇటీవల సీఎం జగన్ విశాఖలో మరో స్టేడియం నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా క్రికెట్‌తో పాటు అన్ని క్రీడలు ఆడుకునే విధంగా ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను 25 ఎకరాల్లో నిర్మించాలన్నారు. దీనిపై ఏసీఏ ప్రణాళిక సిద్ధం చేస్తుందని, స్థల కేటాయింపునకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు గోపీనాథ్ రెడ్డి తెలిపారు.

5 ప్రాధాన్య ప్రాజెక్టులు ఈ ఏడాది పూర్తికావాలి

- జలవనరుల శాఖ అధికారులకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశాలు
- పోలవరం సహా ఇతర ప్రాధాన్య ప్రాజెక్టులపై సమీక్ష



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పోలవరం ప్రాజెక్టు సహా ఇతర ప్రాధాన్య ప్రాజెక్టుల నిర్మాణాల ప్రగతిపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి జలవనరుల శాఖ అధికారులతో సమీక్షించారు. ప్రాజెక్టుల వారీ ఇప్పటి వరకు విడుదలైన, ఖర్చు చేసిన నిధులు.. చేసిన, చేయాల్సిన పనులు.. నిర్వాసితులకు అమలు చేయాల్సిన పునరావాస ప్రాజెక్టులు తదితర అంశాలపై ఆయన చర్చించారు. ముందు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన పనులు, పునరావాస ప్యాకేజీకి సంబంధించి ఇప్పటి వరకు చేపట్టిన పనులను సమీక్షించిన ఆయన గడువు ప్రకారం పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు అవుకు టన్నెల్, గొట్టా బ్యారేజి నుంచి హిర మండలం ఇరిగేషన్ ప్రాజెక్టు, వంశధార–నాగావళి నదుల అనుసంధానం, గొట్టా బ్యారేజి రిజర్వాయర్ ప్రాజెక్టు, హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్–2 ప్రాజెక్టుల ప్రగతిని సమీక్షించారు. ఈ ఐదు ప్రాజెక్టులను ఈ ఏడాదిలో పూర్తిచేసి ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

చుక్కల భూముల తొలగింపు పనులు వేగవంతం

22–ఎ జాబితా నుంచి చుక్కల భూములను తొలగింపు పనులను వేగవంతం చేయాలని సీఎస్ జవహర్‌రెడ్డి రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం రాష్ట్ర సచివాలయంలో సి.సి.ఎల్.ఎ., ఐ.టి.ఇ.– సి, జి.ఎస్.డబ్ల్యు.ఎస్ అధికారులతో సమావేశమయ్యారు. 22–ఎ జాబితా నుంచి చుక్కలు, అనాధీనం, బ్లాంక్, హెల్డు ఓవర్ భూముల తొలగింపు, జగనన్న సురక్ష కింద ధ్రువీకరణపత్రాల జారీ పనుల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22–ఎ జాబితా నుంచి ఇంకా దాదాపు 7,558 ఎకరాల చుక్కల భూములను తొలగించాల్సి ఉందని చెప్పారు. ఆ పనులను వేగవంతం చేయాలని రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్, సి.సి.ఎల్.ఎ. సాయిప్రసాద్‌ను ఆదేశించారు. అనాధీనం, బ్లాంక్, హెల్డు ఓవర్ భూముల తొలగింపు పనులపైన కూడా ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. గ్రామ సేవా ఈనామ్ భూముల విషయంలో దేవదాయ శాఖ క్లియరెన్సు పొందాలని సూచించారు. 20 సంవత్సరాలకు పైబడి అసైన్డు భూములను అనుభవిస్తున్న వారికి ఆ భూమిపై పూర్తి హక్కు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా అసైన్డు భూములను, ఒరిజనల్ అసైనీలను, వారి వారసులను ధ్రువీకరించే పనులనుపైన కూడా ప్రత్యేకదృష్టి సారించాలని చెప్పారు.

రసాయన పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు

ఏపీలోని రసాయన పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇటీవల అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని సాహితీ ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదం అనంతరం తీసుకున్న చర్యలపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో పలు శాఖల అధికారులతో సీఎస్ సమీక్షించారు. ప్రమాదకర రసాయన పరిశ్రమలను వెంటనే మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. పరిశ్రమలు, ఫైర్ తదితర విభాగాల అధికారులతో ప్రతిఏటా తప్పకుండా ఆయా పరిశ్రమలను తనిఖీ చేయాలన్నారు. ప్రతి ఏటా ఫైర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించి ఎక్కడైనా లోపాలుంటే వెంటనే నోటీసులిచ్చి వాటిని సరిదిద్దాలని ఆదేశించారు. సాల్వెంట్ పరిశ్రమలను నిర్వహించే వ్యక్తుల సామర్థ్యాన్ని, భద్రతకు తీసుకుంటున్న చర్యలను పూర్తిగా పరిశీలించాకే లైసెన్స్‌లు జారీ చేయాలన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943